సోమవారం 29-5-2023

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 67

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'గ్రామం ప్రగతిపథంలో ఉంటే ఎవ్వరూ మురా కక్షల జోలికి వెళ్లరు'



ప్రణయ్ నిరీక్షణ ముగిసె...

ఆరేళ్ల తర్వాత అంతర్జాతీయ టైటిల్ నెగ్గిన భారత షట్లర్ -12లో



నామినీ నమోదు చేశారా?

లేదంటే వారసులకు కష్టాలు. నామినేషన్ ఉంటే క్లెయిమ్ వేగం, సులభం -13లో



నేడు అమెరికాకు రాహుల్

కోర్టు ఆదేశాల మేరకు సాధారణ పాస్ పోర్టును అందుకున్న రాహుల్ 3 రోజుల పర్యటనకోసం అమెరికాకు వెళ్లనున్నారు.

వివరాలు 6లో ▸



ఐపీఎల్ ఫైనల్ నేటికి వాయిదా

చెన్నై, గుజరాత్‌ల మధ్య అహ్మదాబాద్‌లో జరగాల్సిన ఐపీఎల్ ఫైనల్ మ్యాచ్ వర్షం వల్ల సోమవారానికి వాయిదా పడింది.

వివరాలు 12లో ▸



మణిపూర్‌లో మళ్లీ ఘర్షణలు

మణిపూర్‌లో మళ్లీ హింసాత్మక ఘర్షణలు మొదలయ్యాయి. కుకి మిలిటెంట్ల దాడుల్లో ఇద్దరు చనిపోగా, 10 మంది గాయపడ్డారు.

వివరాలు 6లో ▸



శవపేటికలా పార్లమెంట్ భవనం

పార్లమెంట్ కొత్త భవనం శవపేటిక మాదిరిగా ఉందంటూ బిహార్ అధికార ఆర్జేడీ చేసిన ట్వీట్‌పై బీజేపీ ఆగ్రహం వ్యక్తం చేసింది.

వివరాలు 6లో ▸

న్యూస్‌రీల్

మధ్యప్రదేశ్‌లో తెలంగాణ ఆవిర్భావ వేడుకలు



తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది వేడుకలను మధ్యప్రదేశ్ ప్రభుత్వం అధికారికంగా నిర్వహించనుంది. మధ్యప్రదేశ్ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ, ఉమ్మడి కరీంనగర్‌కు చెందిన పి.నరహరి ట్విట్టర్ ద్వారా ఈ విషయాన్ని వెల్లడించారు.

- వివరాలు 2లో▶

ఇది మానవత్వం లేని ప్రభుత్వం: భట్టి



పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు వట్టెం రిజర్వాయర్‌లో ముంపునకు గురైన నిర్వాసితుల పట్ల ప్రభుత్వం మానవత్వం లేకుండా వ్యవహరించిందని భట్టి విక్రమార్క ఆరోపించారు.

- వివరాలు 3లో▶

సినీ, రాజకీయాల్లో ఎన్టీఆర్‌ది చెరగని ముద్ర



సినీ, రాజకీయాల్లో తన అద్భుత ప్రతిభతో చెరగని ముద్రవేసిన గొప్ప వ్యక్తి ఎన్.టి. రామారావు అని ప్రధాని మోదీ కొనియాడారు. కోట్లాది మంది ప్రజల హృదయాల్లో ఆయన సుస్థిర స్థానం సంపాదించుకున్నారని కీర్తించారు. 101వ 'మన్ కీ బాత్'లో ప్రసంగించిన మోదీ... ఎన్టీఆర్ శత జయంతిని పురస్కరించుకొని ఆయనకు నివాళులు ఘటించారు.

- వివరాలు 2లో▶





ఇదండీ జగత్





కొత్త పార్లమెంట్ భవనం ప్రారంభోత్సవంలో 'సెంగోల్'తో ప్రధాని మోదీ





ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రసంగిస్తున్న ప్రధాని. చిత్రంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తదితరులు

స్వేచ్ఛా మాతృభూమికి
కొంగొత్త విలువలు కావాలి
కొత్త పండుగకు కొత్త ఆత్మ కావాలి
స్వేచ్ఛా గీతాలాపనకు కొత్త రాగం కావాలి
కొత్త పండుగకు కొత్త ఆత్మ కావాలి

– అందుకే భారత్‌కు ఉజ్వల భవిష్యత్తునివ్వనున్న ఈ సమున్నత ప్రాంగణమూ కొత్తగా ఉండాలి. ఆధునిక హంగులతో సర్వోన్నతంగా ఉండాలి.

పార్లమెంట్ భవన ప్రారంభోత్సవంతో మన హృదయాలు, మనసులు గర్వం, ఆశ, వాగ్దానంతో నిండిపోయాయి. ఈ అద్భుత భవనం ప్రజల సాధికారతకు, వారి కలలను ప్రేరేపించడానికి, వాస్తవ రూపం దాల్చడానికి వేదిక కావాలి. మన మహోన్నత దేశాన్ని అభివృద్ధి పథంలో ఉన్నత శిఖరాల దిశగా నడిపించాలి.

ప్రధాని నరేంద్ర మోదీ

ఇది నవోదయం

నూతన పార్లమెంట్‌లో ప్రధాని మోదీ ఉద్ఘాటన

- పార్లమెంట్ కొత్త భవనం ప్రపంచ దేశాల ప్రగతికి స్ఫూర్తి
- అణగారిన వర్గాల సాధికారతకు ఇక్కడే ముందడుగు
- పార్లమెంట్‌లో మరికొంత మంది ఎంపీలు చేరుతారు
- ఇక్కడ తీసుకొనే ప్రతి నిర్ణయం దేశ ఉజ్వల భవిష్యత్తుకు పునాది వేస్తుంది

6 లో

- కొత్త భవనంలోని ప్రతి ఇటుక, ప్రతి గోడ పేదల సంక్షేమానికే అంకితం
- 2026 తర్వాత ఎంపీ స్థానాలు పెరుగుతాయి

ప్రారంభోత్సవం సాగింది ఇలా..!

దేశానికి గర్వకారణం
రాష్ట్రపతి ముర్ము

ప్రారంభోత్సవమా? పట్టాభిషేకమా?
రాహుల్‌గాంధీ

- వివరాలు 6లో▶



ఎంపిక ఎమ్మెల్యేలకే?

పేదల సొంత జాగాల్లో ఇళ్ల పథకం 'గృహలక్ష్మి'పై కదలిక

- జూలైలో పథకానికి శ్రీకారం చుట్టేలా సర్కారు ఏర్పాట్లు
- ఆర్థిక సాయం చెక్కుల పంపిణీ ఎమ్మెల్యేల ఆధ్వర్యంలోనే!
- ప్రతి నియోజకవర్గంలో ప్రత్యేక కార్యక్రమాల నిర్వహణ
- ప్రజలకు మరింత దగ్గరయ్యేందుకు వీలుగా కార్యాచరణ
- కనీస నిర్మాణ స్థలం పరిమితిని మినహాయించే యోచన
- ఆగస్టు నాటికి తొలి విడత ఇళ్ల నిర్మాణానికి నిధులు!

సాక్షి, హైదరాబాద్: సొంతంగా స్థలాలున్న పేదలు వాటిలో ఇళ్లు నిర్మించుకునేందుకు ఆర్థిక సాయం చేసే 'గృహలక్ష్మి' పథకానికి జూలైలో శ్రీకారం చుట్టాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఇల్లు కట్టుకునేందుకు ఒక్కో లబ్ధిదారుకు రూ.3 లక్షలు ఇస్తామని ఇప్పటికే ప్రకటించింది. అయితే త్వరలో అసెంబ్లీ ఎన్నికలు ఉన్న నేపథ్యంలో.. ఈ పథకానికి లబ్ధిదారుల ఎంపిక, జాబితాల రూపకల్పన బాధ్యతను ఎమ్మెల్యేలకు అప్పగించనున్నట్టు సమాచారం. రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో ఈ పథకాన్ని అమలు చేయడం, లబ్ధిదారుల ఎంపిక, ఆర్థిక సాయం చెక్కుల పంపిణీ కోసం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా.. ప్రజలకు మరింత దగ్గరయ్యేందుకు చాన్స్ ఉంటుందని భావిస్తున్నట్టు తెలిసింది.

బడ్జెట్‌లో కేటాయింపులు చేసినా..

'పేదలు ఇళ్లు కట్టుకునేందుకు ఆర్థిక సాయం' పేరిట రాష్ట్ర ప్రభుత్వం గత ఆర్థిక సంవత్సర బడ్జెట్‌లోనే ఈ పథకానికి రూ.12 వేల కోట్లను కేటాయించింది. కానీ పథకానికి పూర్తిస్థాయిలో రూపకల్పన చేయకపోవటంతో అమల్లోకి రాలేదు. ఈ క్రమంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సర బడ్జెట్‌లో ప్రభుత్వం తిరిగి రూ.12 వేల కోట్లను కేటాయించింది. అయితే ఇప్పటివరకు మార్గదర్శకాలు సిద్ధం కాలేదు. ఈ పథకం కింద ఒక్కో ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం

మిగతా 2వ పేజీలో ▶



మరో రెండ్రోజులు ఉక్కపోతే..

- రాష్ట్రం మీదుగా కొనసాగుతున్న ఉపరితలద్రోణి
- అక్కడక్కడా తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం

సాక్షి, హైదరాబాద్: రానున్న రెండ్రోజులపాటు రాష్ట్రంలో సాధారణం కంటే ఒకటి నుంచి రెండు డిగ్రీల అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముందని హైదరాబాద్ వాతావరణశాఖ వెల్లడించింది. పలు జిల్లాల్లో 40 నుంచి 44 డిగ్రీల సెల్సియస్ మధ్య, గ్రేటర్ హైదరాబాద్ సమీప జిల్లాల్లో మాత్రం 38 నుంచి 41 డిగ్రీల సెల్సియస్ మధ్య గరిష్ట ఉష్ణోగ్రతలు

మిగతా 2వ పేజీలో ▶

పింఛన్ కోసం రెండు కిలోమీటర్లు నడిచి..

పింఛన్ డబ్బుల కోసం ఎండలో రెండు కిలోమీటర్లు నడిచి వెళ్లిన ఓ వృద్ధుడు వడదెబ్బతో మృతి చెందాడు. సూర్యాపేట జిల్లా కోదాడ మండల పరిధిలోని బీక్యాతండాలో ఆదివారం ఈ సంఘటన చోటుచేసుకుంది.

- వివరాలు 5లో▶

100 కిలోవాట్ ఉంటే 'ఓపెన్' కరెంట్!



- ఓపెన్ యాక్సెస్‌లో గ్రీన్ ఎనర్జీ కొనుగోళ్లను సరళతరం చేసిన కేంద్రం
- ఇప్పటివరకు మెగావాట్ విద్యుత్ లోడ్ దాటితేనే ఓపెన్ యాక్సెస్‌కు అనుమతి
- ఇకపై 100 కిలోవాట్లు ఉన్నా ఓకే.. తక్కువ ధరకు దొరికినప్పుడు ప్రయోజనం.. దేశంలో ఎక్కడి నుంచైనా కొనుగోలు చేసుకునే చాన్స్

సాక్షి, హైదరాబాద్: బహిరంగ విపణి (ఓపెన్ యాక్సెస్) నుంచి నేరుగా గ్రీన్ ఎనర్జీ కొనుగోళ్లకు ఉన్న నిబంధనలను కేంద్ర ప్రభుత్వం మరింత సరళతరం చేసింది. ఒకే విద్యుత్ సబ్ డివిజన్ (రెవెన్యూ డివిజన్‌తో సమానం) పరిధిలో ఒకటి/అంతకు మించిన సంఖ్యలో విద్యుత్ కనెక్షన్లు కలిగిన సాధారణ విద్యుత్ వినియోగదారులు ఎవరైనా ఇకపై ఓపెన్ యాక్సెస్ విధానంలో సౌర/పవన/పంప్డ్ స్టోరేజీ విద్యుత్ వంటి గ్రీన్ ఎనర్జీని కొనుగోలు చేసుకోవచ్చు. అయితే సదరు వినియోగదారుకు విద్యుత్ కనెక్షన్ల కాంట్రాక్ట్ లోడ్/శాంక్షన్డ్ లోడ్ కలిపి కనీసం 100 కిలోవాట్లు, ఆపైన ఉండాలి. సొంత విద్యుత్ ప్లాంట్లు కలిగిన భారీ పరిశ్రమల వంటి కాప్టివ్ విద్యుత్ వినియోగదారులైతే.. ఓపెన్ యాక్సెస్‌లో ఎలాంటి పరిమితులు లేకుండా గ్రీన్ ఎనర్జీని

మిగతా 2వ పేజీలో ▶

భర్తపై డీజిల్ పోసి.. నిప్పంటించి..

తల్లిని రోకలితో బాది

ఆస్తి కోసం తండ్రిపై తనయుడి దాడి

నాడు అన్నను.. నేడు తమ్ముడిని..

ఇవేం 'రక్త' సంబంధాలు

- వివరాలు 5లో▶




సివిల్స్ విజేతల సరికొత్త ఫ్యాక్టరీ!

హైదరాబాద్ అడ్డాగా ర్యాంకులు సాధిస్తున్న అభ్యర్థులు

అమెరికా, ఐటీ మోజు నుంచి సివిల్ సర్వీసెస్ వైపు యువత

- ఉత్తరాదిని ఢీ కొడుతూ..ఒక్కో మెట్టు పైకి..
- 2021–22లోనూ 46 మందికి ర్యాంకులు
- ఇదో కొత్త చరిత్ర అంటున్న నిపుణులు
- పెరిగిన అవగాహన, మంచి కోచింగ్ కేంద్రాలే కారణమంటున్న 2017 టాపర్

2 లో





రెజ్లర్లపై పోలీసుల ప్రతాపం

నిరసన దీక్ష భగ్నం.. శిబిరాన్ని ఖాళీ చేయించిన పోలీసులు

న్యాయం కోసం రోడ్డెక్కిన భారత రెజ్లర్ల పోరాటం రోడ్డుపైనే అర్ధంతరంగా ముగిసింది. నెలరోజులకుపైగా నోరెత్తి నినదించిన మల్లయోధులకు ఊరట లేకుండా పోయింది. రెజ్లర్ల డిమాండ్లలో ఏ ఒక్కటీ నెరవేరకుండానే నిరసన దీక్ష శిబిరాన్ని ఢిల్లీ పోలీసులు ఎత్తేశారు. బాసటగా నిలిచిన రాజకీయ నేతల బలగానికి, మద్దతు తెలిపిన క్రీడాకారుల దళానికి, ప్రజాస్వామ్యవాదుల గళానికి నిరాశ తప్పలేదు.

- వివరాలు 12లో▶

క్లుప్తంగా...

మధ్యప్రదేశ్‌లో తెలంగాణ ఆవిర్భావ వేడుకలు



సాక్షి ప్రతినిధి, కరీంనగర్: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది వేడుకలను మధ్యప్రదేశ్ ప్రభుత్వం అధికారికంగా నిర్వహించనుంది. మధ్యప్రదేశ్ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ, ఉమ్మడి కరీంనగర్ జిల్లావాసి అయిన పి.నరహరి ట్విట్టర్ ద్వారా ఈ విషయాన్ని వెల్లడించారు. తెలంగాణ దశాబ్ది వేడుకలను జూన్ 2న మహాకాల్ ఉజ్జయిన్ నగరంలో ఆ రాష్ట్ర గవర్నర్ మంగుబాయి పటేల్ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ వేడుకలకు ప్రిన్సిపల్ సెక్రటరీగా తనకు ఆహ్వానం అందించారని పేర్కొన్నారు. రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను మధ్యప్రదేశ్ ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం తెలంగాణ బిడ్డగా తనకు గర్వంగా ఉందని నరహరి 'సాక్షి'తో అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగువారందరూ పాల్గొని వేడుకలను జయప్రదం చేయాలని ఆయన కోరారు.

నటనకే నడక నేర్పిన మహనీయుడు ఎన్టీఆర్

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్



సాక్షి, హైదరాబాద్: విశ్వవిఖ్యాత నటసార్వభౌముడు నందమూరి తారకరామారావు శతజయంతి సందర్భంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ నివాళులర్పించారు. నటనకే నడక నేర్పిన మహనీయుడు ఎన్టీఆర్ అని, తెలుగు చలనచిత్ర రంగానికి ఆయన ఎన్టీఆర్ మార్గదర్శకులని అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని సంజయ్ ట్విట్టర్ వేదికగా వ్యాఖ్యానించారు.

నేడు జీఎస్ఎల్‌వీ ఎఫ్-12 ప్రయోగం

సూళ్లూరుపేట/తిరుమల: భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) స్థానిక సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ (షార్)లోని రెండో ప్రయోగవేదిక నుంచి సోమవారం ఉదయం 10.42 గంటలకు జియో సింక్రోనస్ లాంచింగ్ శాటిలైట్ వెహికల్ (జీఎస్ఎల్‌వీ-ఎఫ్12)ను ప్రయోగించేందుకు సర్వం సిద్ధం చేసింది. ఈ మేరకు ఆదివారం ఉదయం 7.12 గంటలకు కౌంట్‌డౌన్‌ను శాస్త్రవేత్తలు ప్రారంభించారు. మొత్తం 27.30 గంటల కౌంట్‌డౌన్ అనంతరం జీఎస్ఎల్‌వీ ఎఫ్-12 రాకెట్ ద్వారా 2,232 కిలోల బరువు కలిగిన నావిక్-01 ఉపగ్రహాన్ని రోదసిలోకి ప్రవేశపెట్టనున్నారు. ఈ ప్రయోగ పనులను ఇస్రో చైర్మన్ డాక్టర్ ఎస్.సోమనాథ్ పర్యవేక్షిస్తున్నారు.

నావిగేషన్ శాటిలైట్ సిస్టం బలోపేతం కోసం

భారత ప్రాంతీయ దిక్సూచి ఉపగ్రహ వ్యవస్థను బలోపేతం చేసేందుకు నావిక్-01 పేరుతో నావిగేషన్ ఉపగ్రహ ప్రయోగాన్ని నిర్వహిస్తున్నారు. నావిక్-01 ఉపగ్రహం సరికొత్తగా ఎల్-5, ఎస్-బాండ్‌ల సిగ్నల్స్‌తో పనిచేసేలా రూపొందించారు. దీనివల్లభూమి, జల, వాయు మార్గాల స్థితిగతులు, దిక్కులు తెలియజేయడం, ఆపద సమయాల్లో భూగోళానికి సంబంధించిన సమాచారం అందించడం, వాహనచోదకులకు దిశానిర్దేశం చేయడం , ఇంటర్నెట్‌తో అనుసంధానం లాంటి ఎన్నో సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయి.

కేసీఆర్ సంజాయిషీ చెప్పాలి



సాక్షి, న్యూఢిల్లీ: పార్లమెంటు నూతన భవన ప్రారంభోత్సవానికి ఎందుకు రాలేదో తెలంగాణ ప్రజలకు సీఎం కేసీఆర్ సంజాయిషీ చెప్పాలని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ డిమాండ్ చేశారు. ఆయన ఆదివారం ఢిల్లీలో విలేకరులతో మాట్లాడుతూ.. కేసీఆర్, కేజ్రీవాల్ దోస్తీ వెనక మద్యం కేసు ఉందని ఎద్దేవా చేశారు. నదులకు నడక నేర్పారో లేదో కానీ.. కేసీఆర్ మద్యానికి పరుగులు నేర్పారని ఆరోపించారు. నూతన పార్లమెంటు శవపేటికలా ఉందన్న ఆర్జేడీ వ్యాఖ్యలను లక్ష్మణ్ ఖండించారు. 2026లో నియోజకవర్గాల పునర్విభజన జరుగుతుందని లక్ష్మణ్ వెల్లడించారు.

నేటి భవితలో..

- సీడీఎస్ఈ(2)-2023: డిగ్రీతో.. డిఫెన్స్ ఆఫీసర్: బ్యాచిలర్ డిగ్రీ అభ్యర్థులకు సువర్ణావకాశం. భద్రతా దళాల్లో కెరీర్‌కు బంగారు బాట వేసే కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్ ఎగ్జామినేషన్(సీడీఎస్ఈ)కు యూపీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఎంపిక ప్రక్రియలో విజేతగా నిలిస్తే.. ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్‌ల్లో పర్మనెంట్ కమిషన్ ర్యాంకుతో ఆఫీసర్‌గా కొలువుదీరొచ్చు. ఇటీవల సీడీఎస్ఈ(2)-2023 దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో.. సీడీఎస్ఈ ఎంపిక ప్రక్రియ, పరీక్ష విధానం, సిలబస్ అంశాలు, ప్రిపరేషన్ తదితర వివరాలు..
- గ్రూప్స్ ప్రత్యేకం-కరెంట్ అఫైర్స్: పోటీ పరీక్షల అభ్యర్థులకు ఉపయోగపడేలా.. అంతర్జాతీయం, జాతీయం, రాష్ట్రీయం, వార్తల్లో వ్యక్తులు, క్రీడలు తదితర ముఖ్యాంశాలతో వీక్లీ కరెంట్ అఫైర్స్ రౌండప్
- విద్య, ఉద్యోగ సమాచారం

నేటి భవిత పేజీ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

సివిల్స్ విజేతల సరికొత్త ఫ్యాక్టరీ!



హైదరాబాద్ అడ్డాగా ర్యాంకులు సాధిస్తున్న అభ్యర్థులు

అమెరికా, ఐటీ మోజు నుంచి సివిల్ సర్వీసెస్ వైపు యువత

- ఉత్తరాదిని ఢీ కొడుతూ..ఒక్కో మెట్టు పైకి..
- 2021-2022లోనూ 46 మందికి ర్యాంకులు
- ఇదో కొత్త చరిత్ర అంటున్న నిపుణులు
- పెరిగిన అవగాహన, మంచి కోచింగ్ కేంద్రాలే కారణమంటున్న 2017 టాపర్

సాక్షి ప్రత్యేక ప్రతినిధి: సివిల్ సర్వీసెస్..దేశంలో కోట్లాది మంది యువత మదిలో మెదిలే అత్యున్నత ఉద్యోగం. అన్ని పరీక్షల కంటే అత్యంత క్లిష్టంగా, అనేక వడపోతలతో సాగే ఈ ప్రక్రియ గురించి వింటేనే..వామ్మో మనకెలా సాధ్యం..? అని అన్పిస్తుంది. ఐఏఎస్, ఐఎఫ్ఎస్, ఐపీఎస్, ఐఆర్ఎస్, ఐఐఎస్, ఐడీఈఎస్.. ఇలా 24 అఖిల భారత సర్వీసులకు ఎంపికయ్యేందుకు జాతీయ స్థాయిలో నిర్వహించే పరీక్షల కోసం ఒకప్పుడు ఢిల్లీకి వెళ్లి మరీ సన్నద్ధులైన తెలుగు రాష్ట్రాల వారిని పరిశీలిస్తే ఫెయిల్యూర్ స్టోరీలే ఎక్కువ. కానీ ఇప్పుడు పరిస్థితి మారింది. ఈ ప్రాంతం క్రమంగా పట్టు బిగిస్తోంది..ర్యాంకుల సాధనలో సక్సెస్ అవుతోంది. 2021-2022 సివిల్స్ ఫలితాలే అందుకు నిదర్శనం అని నిపుణులు అంటున్నారు. తాజాగా ర్యాంకులు సాధించినవారిలో 46 మంది ఇక్కడివారే కావటం కొత్త చరిత్రగా పేర్కొంటున్నారు. హైదరాబాద్ సివిల్స్ విజేతల ఫ్యాక్టరీగా రూపుదిద్దుకున్న ఫలితమే గడిచిన నాలుగేళ్లుగా తెలుగింటి బిడ్డల జైత్రయాత్ర అని చెబుతున్నారు. సివిల్ సర్వీస్ ఉద్యోగాల్లో ఎప్పుడూ టాప్‌లో ఉండే ఉత్తరప్రదేశ్, బిహార్, రాజస్తాన్ రాష్ట్రాల సరసన ఇప్పుడు తెలంగాణ కూడా చేరుతోంది.

అమెరికా, ఐటీలొద్దంటూ..

ఇంజనీరింగ్, మెడికల్ ఇతర ప్రొఫెషనల్ చదువుల అనంతరం ఉన్నత ఉద్యోగం, అమెరికా లేదా ఇండియాలో ఐటీ ఉద్యోగాల్లో చేరేందుకు ఉత్సాహం చూపే ప్రతిభావంతుల్లో ఎక్కువమంది దృష్టి ఇప్పుడు సివిల్స్ వైపు మళ్లుతోంది. సమాజం నుంచి తీసుకున్న దాంట్లో కొంతైనా సేవా రూపంలో తిరిగి సమాజానికి ఇవ్వాలనే లక్ష్యంతో కొందరు సివిల్స్ వైపు అడుగులేస్తున్నారు. ఢిల్లీ ఐఐటీలో గోల్డ్‌మెడల్ సాధించిన ఆదిలాబాద్ జిల్లాకు చెందిన అజ్మీరా సంకేత్ జపాన్‌లో మంచి ప్యాకేజీతో ఉన్నత ఉద్యోగం సంపాదించాడు. అయితే తన స్నేహితుడు కట్టా రవితేజ సివిల్స్‌కు ఎంపికై సమాజానికి చేస్తున్న సేవ, అందులోని సంతృప్తిని గమనించి తానూ సివిల్స్ రాసి 35వ ర్యాంకు సాధించాడు. తనకు మిత్రుడు రవితేజ రోల్‌మోడల్ అని సంకేత్ సాక్షికి చెప్పారు.

అవగాహన పెరిగింది



గతంలో ఐఏఎస్, ఐపీఎస్ ఆఫీసర్లు ఏం చేస్తారు? వారి విధులు ఎలా ఉంటాయి? సమాజంలో వారు తీసుకొచ్చే మార్పు ఎలా ఉంటుందనే అంశాలపై పెద్దగా అవగాహన ఉండేది కాదు. చాలామందికి డాక్టర్లు, ఇంజనీర్లే ఎక్కువ అనే భావన ఉండేది. మరోవైపు సివిల్స్ పరీక్షలకు కోచింగ్ సెంటర్లు చాలావరకు ఢిల్లీ కేంద్రంగానే ఉండేవి. దీంతో ఢిల్లీతో ఎక్కువ అనుసంధానమై ఉండే ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన వారే ఎక్కువ ఎంపిక అయ్యేవారు. అయితే ఇంటర్నెట్ అందుబాటులోకి వచ్చిన తర్వాత పరిస్థితిలో మార్పు వచ్చింది. సివిల్స్‌కి ఎలా ప్రిపేర్ అవ్వాలో ఈజీగా తెలిసిపోతోంది. హైదరాబాద్ కేంద్రంగానూ మంచి కోచింగ్ సెంటర్లు వచ్చాయి. అలాగే అఖిల భారత సర్వీసులకు సంబంధించిన అవగాహన పెరిగింది. ఫలితంగా మనవారు ఇప్పుడు సివిల్స్‌పై ఎక్కువగా దృష్టి సారిస్తున్నారు. విజయం సాధిస్తున్నారు.

– దురిశెట్టి అనుదీప్ (సివిల్స్-2017 ఆలిండియా టాపర్, మెట్‌పల్లి, ఉమ్మడి కరీంనగర్ జిల్లా), (భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్)

మాధోపట్టి..సివిల్స్ విజేతల పుట్టినిల్లు!

యూపీ రాజధాని లక్నోకు 300 కి.మీ. దూరంలో ఉన్న మాధోపట్టి గ్రామంలో మొత్తం 75 ఇళ్లు. అందులో సివిల్స్ సాధించిన వారు ఏకంగా నలభై మంది ఉండటం అబ్బురపరిచే విషయం. ఇక్కడ ఉపాధికి సరిపోయే భూమి లేక అందరూ ఉన్నత చదువులనే ఆధారం చేసుకున్నారు. ఇలా 1952లో డాక్టర్ ఇందుప్రకాష్ తొలిసారి యూపీఎస్సీ పరీక్షల్లో రెండో ర్యాంకు సాధించి ఐఏఎస్‌కు ఎంపికయ్యారు. ఆయన్ను స్ఫూర్తిగా తీసుకున్న ఆయన నలుగురు సోదరులు ఐఏఎస్ ను సాధించారు. అందులో వినయ్‌సింగ్, ఛత్రసల్‌సింగ్‌లు బిహార్, తమిళనాడు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులుగా పనిచేశారు. ఇలా మాధోపట్టి మేధావులకు నిలయంగా మారింది. పురుషులతో పాటు మహిళలు కూడా ఐఏఎస్, ఐపీఎస్‌లకు ఎంపికయ్యారు. అలా మాధోపట్టి ఐఏఎస్‌ల ఫ్యాక్టరీగా మారింది.

గడిచిన పదేళ్లలో సివిల్స్ టాప్ ర్యాంకర్లు..

ఏడాది	టాపర్	రాష్ట్రం
2013	గౌరవ అగర్వాల్	రాజస్తాన్
2014	ఇరా సింఘాల్	ఢిల్లీ
2015	టీనా డి.	ఢిల్లీ
2016	నందిని కేఆర్	కర్ణాటక
2017	అనుదీప్ దురుశెట్టి	తెలంగాణ
2018	కనిష్కా కటారియా	రాజస్తాన్
2019	ప్రదీప్‌సింగ్	హరియాణా
2020	శుభమ్‌కుమార్	బిహార్
2021	శృతిశర్మ	యూపీ
2022	ఇషితా కిషోర్	యూపీ

ఫ్యామిలీ సపోర్ట్ చేస్తే సాధించొచ్చు



నాన్న వెంకటేశ్వర్లు పోలీస్ శాఖలో వివిధ హోదాల్లో పనిచేశారు. నేను బీటెక్‌లో ఉన్నప్పుడే మా కలెక్టర్ అలా అన్నారు. ఎస్పీ ఇలా అన్నారు అంటూ వారి గురించి గొప్పగా చెబుతుండేవారు. అప్పుడే నేనూ నిర్ణయించుకున్నా కలెక్టర్ కావాలని. అందుకోసం ఐదేళ్లు కష్టపడ్డా. కుటుంబసభ్యులు అందించిన సహకారంతో చివరకు జాతీయ స్థాయిలో 3వ ర్యాంక్ సాధించా. నాలా అందరికీ ఫ్యామిలీ సపోర్ట్ దొరికితే రాష్ట్రం నుంచి అనేకమంది ఐఏఎస్, ఐపీఎస్‌లు వస్తారు.

– ఉమా హారతి, సివిల్స్ 3వ ర్యాంకర్

కుటుంబ సభ్యులతో రేవయ్య



నాలాంటి వాళ్లకు సాయం చేయాలని..

నాన్న చిన్నప్పుడే చనిపోయాడు. అమ్మ మధ్యాహ్న భోజన కార్మికురాలిగా పనిచేస్తూ నన్ను, అన్న, చెల్లెల్ని చదివించింది. మా కోసం ఆమెపడే కష్టం ఎప్పుడూ కళ్ల ముందే ఉండేది. అందుకే సాంఘిక సంక్షేమ హాస్టల్లో ఉంటూ ఇంటర్ వరకు చదివా. ఐఐటీ చెన్నైలో సీటు వచ్చినప్పుడు కనీస ఫీజు సరే అక్కడికి వెళ్లేందుకు, ఇతర ఖర్చులకు కూడా డబ్బుల్లేవు. అయితే కొందరు దాతలు ముందుకొచ్చి సహాయం చేయడంతో ఐఐటీ పూర్తి చేశా. ఆపై ఓఎన్‌జీసీలో ఉన్నత ఉద్యోగం సంపాదించా. కానీ ఏదో వెలితిగా అనిపించేంది. నేను కూడా కొంత మందికి సహాయం చేయాలంటే మరింత ఉన్నత స్థితిలో ఉండాలనుకుని ఉద్యోగానికి రాజీనామా చేసి రెండవ ప్రయత్నంలోనే సివిల్స్‌లో 410 ర్యాంకు సాధించా.

– డొంగ్రి రేవయ్య, ఆసిఫాబాద్ జిల్లా

ఇప్పుడు అన్నీ హైదరాబాద్‌లోనే..



ఒకప్పుడు సివిల్స్ రాయాలంటే ఢిల్లీ వెళ్లాలి. అక్కడ ఉండి కోచింగ్ తీసుకోవాలి. అక్కడి వాతావరణం, ఆహారం, భాష అన్నీ మనకు కొత్తగా అనిపించేవి. దాంతో ఎక్కువగా ఢిల్లీ చుట్టుపక్కల రాష్ట్రాల వారే సివిల్స్‌లో రాణించేవారు. కానీ ఇప్పుడు అన్నింటికీ హైదరాబాద్ అడ్డా అయ్యింది. నిపుణుల కొరత లేదు. దీంతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు, అమెరికా లాంటి దేశాలపై మోజు తగ్గించుకుని మరీ సివిల్స్ వైపు వస్తున్నారు. గడిచిన కొన్నేళ్లుగా తెలుగు రాష్ట్రాల నుంచి భారీగా ఎంపికవుతుండటంతో, ఇతరులు వారిని ఆదర్శంగా తీసుకుని విజేతలవుతున్నారు.

– ఎం.బాలలత, సివిల్స్ ట్రైనర్

నేటి నుంచి సీఎం కప్ రాష్ట్రస్థాయి పోటీలు

హాజరుకానున్న మంత్రులు కేటీఆర్, శ్రీనివాస్ గౌడ్



మాట్లాడుతున్న శాట్స్ చైర్మన్ ఆంజనేయ గౌడ్

గన్‌ఫౌండ్రీ (హైదరాబాద్): తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాట్స్) ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సీఎం కప్-2023 ఏర్పాట్లు పూర్తయ్యాయి. మండల, జిల్లాస్థాయిలో ఇప్పటికే క్రీడలు ముగియగా రాష్ట్రస్థాయికి ఎంపికైన క్రీడాకారులు నగరానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా శాట్ చైర్మన్ ఆంజనేయగౌడ్ మాట్లాడుతూ... ఈ నెల 29న ఎల్బీస్టేడియంలో ప్రారంభ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నట్లు చెప్పారు. ఈ వేడుకలకు మంత్రులు కేటీఆర్, శ్రీనివాస్ గౌడ్, గాయకుడు రాహుల్ సిప్లిగంజ్‌లతోపాటు పలువురు ప్రముఖులు హాజరు కానున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా పర్యాటక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డే, పర్యాటక శాఖ ఎండీ మనోహర్‌రావులతోపాటు వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రారంభ, ముగింపు వేడుకల్లో ఎటువంటి లోటుపాట్లు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నగరంలోని గచ్చిబౌలి, ఎల్బీస్టేడియం, కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియం, బాలయోగి స్టేడియం, జింఖానా గ్రౌండ్ తదితర చోట్ల 18 అంశాల్లో ఈ పోటీలు జరగనున్నాయి. క్రీడాకారుల వసతి కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తును ఏర్పాటుచేశారు.

..'ఓపెన్' కరెంట్!

▶ మొదటి పేజీ తరువాయి

కొనుగోలు చేసుకోవచ్చు. ఈ మేరకు 'ది ఎలక్ట్రిసిటీ (ప్రమోటింగ్ గ్రీన్ ఎనర్జీ త్రూ గ్రీన్ ఎనర్జీ ఓపెన్ యాక్సెస్) రెండో సవరణ నిబంధనలు-2023'ను అమల్లోకి తెస్తూ కేంద్ర విద్యుత్ శాఖ తాజాగా గెజిట్ నోటిఫికేషన్ వెలువరించింది. ఇప్పటివరకు 1000 కిలోవాట్స్ (ఒక మెగావాట్‌తో సమానం), ఆపై లోడ్ కలిగినవారు మాత్రమే ఓపెన్ యాక్సెస్‌లో విద్యుత్ కొనుగోలు చేసుకోవడానికి అవకాశం ఉంది. డిస్కంల టారిఫ్‌తో పోల్చితే ఓపెన్ యాక్సెస్‌లో తక్కువ ధరకు విద్యుత్ లభ్యత ఉన్నప్పుడు.. భారీ పరిశ్రమలు ఆ విద్యుత్‌ను కొంటూ బిల్లుల భారం తగ్గించుకుంటున్నాయి. ఇకపై ఈ అవకాశం 100 కిలోవాట్ల లోడ్ కలిగిన వినియోగదారులకు సైతం లభించనుంది.

చిన్న పరిశ్రమలకు ప్రయోజనం!

ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వ రంగ దక్షిణ/ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థల (ఎస్పీడీసీఎల్ / ఎన్పీడీసీఎల్) నుంచే చాలావరకు వినియోగదారులకు విద్యుత్ సరఫరా అవుతోంది. హెచ్‌టీ విద్యుత్ కనెక్షన్లు కలిగిన భారీ పరిశ్రమలు మాత్రమే ఇప్పటివరకు ఓపెన్ యాక్సెస్‌లో బయటి నుంచి విద్యుత్ కొనుక్కుంటున్నాయి. ఇలా ఓపెన్ యాక్సెస్ కొనుగోళ్లకు సంబంధించి డిస్కంలు ప్రతి యూనిట్‌పై 50 పైసల వరకు అదనపు సర్‌చార్జి వసూలు చేస్తున్నాయి. ఇకపై 100 కిలోవాట్లు, ఆపై లోడ్ కలిగిన వినియోగదారులు దేశంలో ఎక్కడి నుంచైనా గ్రీన్ ఎనర్జీని ఓపెన్ యాక్సెస్ విధానంలో కొనుగోలు చేసుకోవచ్చు. సాధారణ గృహ విద్యుత్ వినియోగదారుల శాంక్షన్డ్/కాంట్రాక్ట్ లోడ్ 10 కిలోవాట్ల లోపే ఉంటుంది. 100 కిలోవాట్ లోడ్ కలిగి ఉన్న భారీ నివాస భవనాలు, వాణిజ్య, పారిశ్రామిక వినియోగదారులకు కొత్త విధానంతో ప్రయోజనం ఉండనుంది. ఇక 2032 డిసెంబర్ నాటికి నిర్మాణం పూర్తి చేసుకోనున్న సముద్ర తీర పవన విద్యుత్ ప్రాజెక్టుల నుంచి ఓపెన్ యాక్సెస్ విద్యుత్ కొనే వినియోగదారులపై అదనపు సర్‌చార్జి విధించవద్దని కేంద్రం తాజా నిబంధనల్లో స్పష్టం చేసింది.

ఎంపిక ఎమ్మెల్యేలకే?

▶ మొదటి పేజీ తరువాయి

రూ.3 లక్షలను ఆర్థిక సాయంగా అందిస్తుంది. లబ్ధిదారులు అవసరమైన అదనపు మొత్తాన్ని కలిపి సొంత జాగాలో కావాల్సిన విధంగా ఇంటిని నిర్మించుకోవడానికి అవకాశం ఇవ్వనున్నారు. ఇలా ప్రతి నియోజకవర్గానికి 3 వేల ఇళ్ల చొప్పున రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 4 లక్షల ఇళ్లను మంజూరు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

అసెంబ్లీ ఎన్నికలు ఉండటంతో..

కొన్ని నెలల్లో అసెంబ్లీ ఎన్నికలు ఉన్న నేపథ్యంలో.. జూలైలో పథకాన్ని పట్టాలెక్కించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోందని తెలిసింది. దీనికి తగ్గట్టుగానే ఇటీవల ఉన్నతాధికారులు భేటీ అయి ఈ పథకం తీరుతెన్నులపై చర్చించారు. వివరాలతో సీఎంకు నివేదిక అందజేశారు. త్వరలో అనుమతి వస్తుందని, ఆ వెంటనే మార్గదర్శకాలు, ఇతర అంశాలపై కసరత్తు ముమ్మరం చేస్తామని అధికారవర్గాలు చెప్తున్నాయి. ఇక వచ్చే ఎన్నికల్లో ఈ పథకం కీలకంగా మారుతుందని.. లబ్ధిదారుల జాబితాను సిద్ధం చేసే విషయంలో స్థానిక శాసనసభ్యులకే బాధ్యత అప్పగించాలని ప్రభుత్వం భావిస్తున్నట్టు తెలిసింది.

కనీసం స్థలంపై అస్పష్టత

సొంత స్థలమున్న పేద లబ్ధిదారులకే గృహలక్ష్మి పథకాన్ని వర్తింపజేస్తారు. అయితే ఈ స్థలం ఎంత ఉండాలన్న విషయంలో మార్గదర్శకాలు రూపొందించాల్సి ఉంది. పట్టణ ప్రాంతాల్లో అయితే ఎంత, గ్రామీణ ప్రాంతాల్లో అయితే ఎంత స్థలం ఉంటే మంచిదన్న విషయంలో ఇప్పటివరకు స్పష్టత లేదు. ఇక కులాల వారీగా ఇళ్ల కేటాయింపులో రిజర్వేషన్ అమలు చేయాలన్న విజ్ఞప్తులూ ఉన్నాయి. వీటన్నింటిపై మార్గదర్శకాల్లో స్పష్టత వచ్చే అవకాశం ఉంది. మరోవైపు ఇటీవల డబుల్ బెడ్రూం ఇళ్ల పథకంలో లబ్ధిదారుల ఎంపికపై గందరగోళం నెలకొన్న నేపథ్యంలో.. 'గృహలక్ష్మి'కి అర్హుల విషయంలో ఆచితూచి నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వం భావిస్తోందని అధికార వర్గాలు తెలిపాయి. కనీస స్థలం పరిమితులు లేకుండా ఉంటే ఎలా ఉంటుందన్న కోణంలో ప్రభుత్వం ఇటీవల ఉన్నతాధికారుల నుంచి అభిప్రాయాలు స్వీకరించిందని వివరించాయి. మొత్తంగా ఆగస్టు నాటికి అన్ని నియోజకవర్గాల్లో మొదటి విడత ఇళ్ల నిర్మాణానికి నిధులు విడుదల చేయాలన్న దిశగా ఏర్పాట్లు జరుగుతున్నట్టు వెల్లడించాయి.

సినీ, రాజకీయాల్లో ఎన్టీఆర్‌ది చెరగని ముద్ర

- బహుముఖ ప్రజ్ఞతో కోట్లాది మంది ప్రజల హృదయాలు గెలుచుకున్నారు
- ఎన్టీఆర్ శతజయంతిని పురస్కరించుకొని ప్రధాని మోదీ ఘన నివాళి
- మాసాంతపు రేడియో కార్యక్రమం 'మన్ కీ బాత్'లో ప్రసంగం



సాక్షి, న్యూఢిల్లీ: సినీ, రాజకీయాల్లో తన అద్భుత ప్రతిభతో చెరగని ముద్రవేసిన గొప్ప వ్యక్తి ఎన్.టి.రామారావు అని ప్రధాని మోదీ కొనియాడారు. కోట్లాది మంది ప్రజల హృదయాల్లో ఆయన సుస్థిర స్థానం సంపాదించుకున్నారని కీర్తించారు. ఆదివారం 101వ 'మన్ కీ బాత్'లో ప్రసంగించిన ప్రధాని మోదీ... ఎన్టీఆర్ శత జయంతిని పురస్కరించుకొని ఆయనకు వినమ్రపూర్వక నివాళులు ఘటించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ సేవలు, ఖ్యాతిని స్మరించుకున్నారు. 'ఈ రోజు ఎన్టీఆర్ శతజయంతి. ఆయన బహుముఖ ప్రజ్ఞతో తెలుగు చిత్రసీమలో సూపర్‌స్టార్‌గా నిలవడమే కాకుండా కోట్లాది మంది ప్రజల హృదయాలను గెలుచుకున్నారు. 300కిపైగా సినిమాల్లో నటించారు. తన నటనతో అనేక చారిత్రక పాత్రలకు జీవం పోశారు. శ్రీకృష్ణుడు, శ్రీరాముడు లాంటి అనేక పాత్రల్లో ఎన్టీఆర్ నటనను ప్రజలు ఎంతగానో ఇష్టపడ్డారు. ప్రజలు ఇప్పటికీ ఆయన్ను గుర్తుంచుకుంటారు. ఎన్టీఆర్ సినీరంగంతోపాటు రాజకీయాల్లోనూ తనకంటూ ఓ గుర్తింపు తెచ్చుకున్నారు. దేశంలోనూ, ప్రపంచవ్యాప్తంగానూ కోట్లాది మంది ప్రజల హృదయాలను ఏలిన ఎన్టీఆర్‌కు వినమ్రపూర్వకమైన నివాళులర్పిస్తున్నా'అని మోదీ పేర్కొన్నారు.

విభజన సమస్యలు పరిష్కరించండి

- కేంద్ర హోం మంత్రికి సీఎం వైఎస్ జగన్ విజ్ఞప్తి
- అమిత్ షాతో 40 నిమిషాల పాటు భేటీ

సాక్షి, న్యూఢిల్లీ: తెలుగు రాష్ట్రాల మధ్య విభజన సమస్యలు పరిష్కరించాలని కేంద్ర హోం మంత్రి అమిత్ షా కు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఆదివారం రాత్రి ఆయన హోం మంత్రి నివాసంలో అమిత్ షా తో సుమారు 40 నిమిషాలు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా తెలుగు రాష్ట్రాల మధ్య ఇప్పటికీ పరిష్కారం కాని పలు అంశాలపై చర్చించారు. పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి సవరించిన అంచనాలకు వీలైనంత త్వరగా కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపేలా చూడాలని కోరారు. రాష్ట్ర విభజన తర్వాత ఏపీ, తెలంగాణ మధ్య అపరిష్కృతంగా ఉన్న అంశాలను వెంటనే పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. న్యూఢిల్లీలో ఏపీ భవన్ సహా షెడ్యూల్ 9, 10 ఆస్తుల విభజనపై కూడా చర్చించారు. తెలంగాణ ప్రభుత్వం నుంచి రావాల్సిన విద్యుత్ బకాయిల అంశాన్నీ హోం మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ఏపీ విద్యుత్ సంస్థల ఆర్థిక స్థిగతులను పరిగణనలోకి తీసుకుని, వెంటనే ఈ బకాయిలు వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

పార్లమెంటు భవనం ప్రారంభోత్సవానికి హాజరైన సీఎం వైఎస్ జగన్

పార్లమెంటు నూతన భవన ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హాజరయ్యారు. లోక్‌సభలో నిర్వహించిన కార్యక్రమంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో కలిసి ముఖ్యమంత్రి తొలి వరుసలో కూర్చొన్నారు.

31న విశాఖలో నేవల్ ఇన్వెస్టిచర్ వేడుకలు

సాక్షి, విశాఖపట్నం: నౌకాదళంలో విశిష్ట సేవలందించిన వారికి గ్యాలంట్రీ, విశిష్ట సేవా పతకాల్ని అందించే బృహత్తర కార్యక్రమానికి విశాఖ వేదికగా మారనుంది. ఈ నెల 31న విశాఖలోని తూర్పు నౌకాదళ ప్రధాన కేంద్రంలోని నేవల్ బేస్‌లో నేవల్ ఇన్వెస్టిచర్ సెర్మనీ-2023 పేరుతో ఈ వేడుకల్ని నిర్వహించనుంది. రాష్ట్రపతి తరఫున సేవా పతకాల్ని అందించేందుకు భారత నౌకాదళాధిపతి అడ్మిరల్ ఆర్ హరికుమార్ ఈ కార్యక్రమానికి హాజరుకానున్నారు. నౌకాదళంలో అత్యుత్తమ సేవలు అందించిన నావికాదళ సిబ్బందికి ఈ వేదికపై ప్రతిష్టాత్మకమైన అవార్డుల్ని అందజేస్తారు.

ఎన్టీఆర్‌కు ఘన నివాళి





ఎన్టీఆర్ ఘాట్ వద్ద నివాళులు అర్పిస్తున్న బాలకృష్ణ, మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తదితరులు

ఎన్టీఆర్ ఘాట్ వద్దకు వచ్చిన కుటుంబ సభ్యులు, ప్రముఖులు

- సినిమాల్లో, రాజకీయాల్లో ఆయనది కీలక పాత్ర: బాలకృష్ణ

ఖైరతాబాద్ (హైదరాబాద్): ఉమ్మడి రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు (ఎన్టీఆర్) శత జయంతి సందర్భంగా ఆదివారం ఆయన కుటుంబ సభ్యులు, పలువురు ప్రముఖులు ఘనంగా నివాళి అర్పించారు. ఆదివారం తెల్లవారుజామునే ఎన్టీఆర్ ఘాట్ వద్దకు చేరుకున్న సినీ నటుడు, ఏపీ ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఎన్టీఆర్ సినిమాల్లోనే కాకుండా రాజకీయాల్లోనూ తనదైన ముద్ర వేశారని.. ఎన్టీఆర్ శత జయంతిని రెండు తెలుగు రాష్ట్రాలతోపాటు ప్రపంచవ్యాప్తంగా ఘనంగా నిర్వహిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. తర్వాత ఎన్టీఆర్ తనయుడు రామకృష్ణ, కుమార్తె, కేంద్ర మాజీ మంత్రి పురందేశ్వరి, జూనియర్ ఎన్టీఆర్, నటుడు రాజేంద్ర ప్రసాద్, మరికొందరు ప్రముఖులు, నేతలు, అభిమానులు ఎన్టీఆర్ ఘాట్ వద్దకు చేరుకుని ఘనంగా నివాళులు అర్పించారు. జూనియర్ ఎన్టీఆర్ వచ్చిన సమయంలో అభిమానులు ఆయనను చూసేందుకు, సెల్ఫీలు దిగేందుకు దూసుకురావడంతో తోపులాట జరిగింది. ఈ సందర్భంగా జూనియర్ ఎన్టీఆర్ సీఎం, సీఎం అంటూ అభిమానులు నినాదాలు చేశారు.

చరిత్రలో నిలిచిపోయే గొప్పమనిషి ఎన్టీఆర్: మంత్రి తలసాని

చరిత్రలో ఎప్పటికీ నిలిచిపోయే గొప్ప మహనీయుడు, మకుటం లేని మహారాజు ఎన్టీఆర్ అని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. ఎన్టీఆర్ ఘాట్ వద్ద నివాళులు అర్పించిన అనంతరం ఆయన మాట్లాడారు. రాముడు, కృష్ణుడు వంటి పాత్రలతో నేటికీ ప్రజల మదిలో ఎన్టీఆర్ నిలిచిపోయారన్నారు. తెలుగుదేశం పార్టీని స్థాపించి 9 నెలల్లోనే అధికారంలోకి తెచ్చిన గొప్ప నాయకుడని.. రాజకీయంగా ఎంతో మందికి భవిష్యత్ ఇచ్చారని గుర్తు చేసుకున్నారు. ఇలాంటి మహనీయుడి శత జయంతిని దేశ విదేశాల్లో నిర్వహిస్తుండటం సంతోషకరమన్నారు.

మరో రెండ్రోజులు ఉక్కపోత

▶ మొదటి పేజీ తరువాయి

నమోదయ్యే అవకాశమున్నట్లు సూచించింది. కాగా, ఆదివారం రాష్ట్రంలో అత్యధిక ఉష్ణోగ్రత నల్లగొండ జిల్లా నిడమనూరులో 46.1 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. రాష్ట్రంలోని ప్రధాన నగరాల్లో నమోదైన ఉష్ణోగ్రతలు పరిశీలిస్తే... గరిష్ట ఉష్ణోగ్రత ఖమ్మంలో 42.4 డిగ్రీల సెల్సియస్, కనిష్ట ఉష్ణోగ్రత మెదక్‌లో 24.0 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది.

ఉపరితలద్రోణి ప్రభావంతో తేలికపాటి వర్షాలు

మరోవైపు విదర్భ నుంచి తెలంగాణ, ఉత్తర తమిళనాడు మీదుగా దక్షిణ తమిళనాడు వరకు ఉపరితల ద్రోణి ఏర్పడిందని ఇది సముద్రమట్టం నుంచి 0.9 కిలోమీటర్ల ఎత్తులో కొనసాగుతోందని వాతావరణశాఖ వెల్లడించింది. దీని ప్రభావంతో రానున్న రెండ్రోజులు రాష్ట్రంలో అక్కడక్కడా తేలికపాటి వర్షాలు కురిసే అవకాశమున్నట్లు సూచించింది.

రాష్ట్రంలో అత్యధిక ఉష్ణోగ్రత నమోదైన ప్రాంతాలు

ప్రాంతం	జిల్లా	గరిష్ట ఉష్ణోగ్రత
నిడమనూరు	నల్లగొండ	46.1
దామెరచర్ల	నల్లగొండ	45.6
బయ్యారం	మహబూబాబాద్	45.5
తంగుల	కరీంనగర్	45.5
కేతెపల్లి	నల్లగొండ	45.3

రాష్ట్రంలోని ప్రధాన కేంద్రాల్లో నమోదైన గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలు (సెల్సియస్‌లో)

కేంద్రం	గరిష్టం	కనిష్టం	కేంద్రం	గరిష్టం	కనిష్టం
ఖమ్మం	42.4	30.0	నిజామాబాద్	40.9	29.5
భద్రాచలం	42.2	28.0	మెదక్	40.6	24.0
నల్లగొండ	42.2	24.8	మహబూబ్‌నగర్	40.5	28.5
ఆదిలాబాద్	41.5	26.2	హైదరాబాద్	39.4	26.6
రామగుండం	41.4	25.0	దుండిగల్	38.5	24.9
హనుమకొండ	41.0	25.0	హకీంపేట్	37.5	23.9

క్లుప్తంగా...

బాన్సువాడ నుంచే పోటీ చేస్తా: స్పీకర్ పోచారం



బీర్కూర్‌లో రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న స్పీకర్ పోచారం

నస్రుల్లాబాద్(బీర్కూర్): రాబోయే ఎన్నికల్లో బాన్సువాడ నియోజకవర్గం నుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థిగా నేనే పోటీ చేస్తానని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. బీర్కూర్ మండల కేంద్రంలో ఆదివారం పలు అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో స్పీకర్ మాట్లాడుతూ...బాన్సువాడ నియోజక అభివృద్ధి కోసమే మీరు తనను గెలిపించారని, ప్రజలకు సేవ చేయడం తన బాధ్యతని చెప్పారు. అందుకోసమే వయస్సు మీద పడుతున్నా సీఎం కేసీఆర్ ఇచ్చిన ప్రోత్సాహంతో యువకుడిలాగా పనిచేస్తానని తెలిపారు. సీనియర్ కావడం వలనే అడిగిన వెంటనే నిధులు వస్తున్నాయని కొత్తగా..ఎన్నికైన శాసనసభ్యులకు ఇలాంటి అవకాశం ఉండదని అందుకే తనను మరోమారు గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

కొత్త పార్లమెంట్‌ను వ్యతిరేకించే వారు ఆధునిక అసురులు

బీజేపీ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యుడు పొంగులేటి సుధాకర్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: నూతన పార్లమెంటు భవనాన్ని వ్యతిరేకించే వారంతా ఆధునిక అసురులని బీజేపీ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యుడు, తమిళనాడు రాష్ట్ర సహ ఇన్‌చార్జ్ పొంగులేటి సుధాకర్‌రెడ్డి విమర్శించారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. లోక కల్యాణం కోసం పూర్వపు రోజుల్లో దేవతలు, రుషులు యజ్ఞాలను చేస్తుంటే అసురులు ఎన్నో రకాలుగా అడ్డుకునేవారని, ఇప్పుడు దేశంలో ప్రతిపక్షాలు ఇలానే వ్యవహరిస్తున్నాయని మండిపడ్డారు. మోదీని ప్రపంచమంతా కీర్తిస్తోందని, నేటి రాజకీయ నాయకుల ముసుగులో ఉన్న ఆధునిక అసురులు మోదీని ఎన్నిసార్లు అడ్డుకుందామని ప్రయత్నించినా విజయం సాధించలేకపోతున్నారని, అంతిమంగా ధర్మమే గెలుస్తుందన్నారు.

పొంగులేటి క్యాంప్ కార్యాలయంపై దాడి



ధ్వంసమైన పూలకుండీలు

మధిర: ఖమ్మం జిల్లా మధిరలో మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంప్ కార్యాలయంపై శనివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దాడికి పాల్పడ్డారు. కార్యాలయంలో ని పూల కుండీలు, ఫ్లెక్సీలను ధ్వంసం చేశారు. సమీపంలోని ఒక ఇంటి యజమాని గమనించి కేకలు వేయడంతో.. మోటార్ సైకిల్‌పై ఇద్దరు వ్యక్తులు పరారైనట్లు తెలిసింది. ఈ సందర్భంగా పొంగులేటి అనుచరుడు డాక్టర్ కోట రాంబాబు మాట్లాడుతూ శ్రీనివాసరెడ్డి రాజకీయ ఎదుగుదలను ఓర్వలేని వ్యక్తులు ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. అన్ని విషయాలనూ ప్రజలు గమనిస్తున్నారని, సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకుంటారని స్పష్టం చేశారు.

తెలంగాణలో ఎమర్జెన్సీ విధించాలి

వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధినేత్రి వైఎస్ షర్మిల ఆగ్రహం



సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు పాలనలో పట్టపగలే నడిరోడ్డుపై హత్యలు, అన్యాయాన్ని ప్రశ్నిస్తే కేసులు, అరెస్టులు చేస్తున్నారని రాష్ట్రంలో శాంతిభద్రతలు అదుపులోలేవని అందుకే తెలంగాణలో అత్యవసరపరిస్థితిని విధించాలని వైఎస్సార్ టీపీ అధినేత్రి వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. ప్రతిపక్షాలను రాష్ట్రంలో ఉండనిచ్చే పరిస్థితి లేదని ముఖ్యమంత్రి కేసీఆర్ వంటి నియంత పాలనలో ఎన్నికలు కూడా సవ్యంగా జరుగుతాయనే నమ్మకం తమకు లేదని ఆమె విమర్శించారు. ఈ మేరకు ఆదివారం షర్మిల ట్విట్టర్‌లో బీఆర్‌ఎస్ సర్కార్‌పై ధ్వజమెత్తారు. పక్క రాష్ట్రాల హక్కుల కోసం ఉద్యమాలు చేసే సీఎం కేసీఆర్ తెలంగాణ ప్రయోజనం కోసం కనీసం ఉభయసభల్లో ఒక్కరోజైనా ఉద్యమించింది లేదని..ఢిల్లీ హక్కుల కోసం గల్లీ ఉద్యమం చేస్తానని డాబులు చెబుతున్నారని ఎద్దేవా చేశారు. బయ్యారం ఉక్కు పరిశ్రమ, కాజీపేట రైల్వే కోచ్, గిరిజన యూనివర్సిటీ, ప్రాజెక్టులకు జాతీయ హోదా ఎందుకు ఇవ్వరని ఏనాడైనా పార్లమెంట్‌లో నిలదీశారా? అని ప్రశ్నించారు. రాష్ట్రానికి కేంద్రం నిధులు ఇవ్వడం లేదని ప్రగతిభవన్‌లో దొంగ ఏడుపులు తప్ప తెలంగాణకు వచ్చిన ప్రధాని మోదీని ఎదుటపడి ఏనాడైనా అడిగిందే లేదని ఎద్దేవా చేశారు. జర్నలిస్టుల స్థలాల విషయంలో సుప్రీం కోర్టు తీర్పును ఎక్కడ అమలు చేశారో కేసీఆర్ సమాధానం చెప్పాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద మిల్లర్లు కోతలు పెట్టి దోపిడీ చేస్తోంటే ఇప్పటి వరకు ప్రభుత్వం స్పందించకపోవడం శోచనీయమన్నారు.

తెలంగాణల బీజేపీ దుకాణం బంద్‌ైనట్టే..

అండ్లకెల్లి ఒక్కొక్కడు టీఆర్‌ఎస్ దిక్కు సూస్తున్నరు

- కాంగ్రెసోళ్లు ప్రతిపక్ష పాత్ర కోసం తండ్లాడుతున్నరు
- లింగంపేట సభలో మంత్రి హరీశ్‌రావు



మెదక్‌లో మాట్లాడుతున్న మంత్రి హరీశ్ రావు, చిత్రంలో ఎంపీ బీబీ పాటిల్, ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

సాక్షి, కామారెడ్డి: 'తెలంగాణల బీజేపీ దుకాణం బంద్‌ైనట్టే కనబడుతోంది. ఈ మధ్య సప్పుడు లేదు. అండ్లకెల్లి ఒక్కొక్కడు బీఆర్‌ఎస్ దిక్కు తొంగి సూస్తున్నరు. ఇంకొందరు వేరే పార్టీల దిక్కు సూస్తున్నరు. కాంగ్రెస్‌కు భవిష్యత్తు లేనట్టు ఆ పార్టీ లీడర్లకు అర్థమైంది. అందుకే కనీసం ప్రతిపక్ష హోదా అయినా దక్కించుకుందామని తండ్లాడుతున్నరు'అని ఆర్థిక, వైద్యారోగ్య శాఖల మంత్రి తన్నీరు హరీశ్‌రావు ప్రతిపక్ష పార్టీలపై విరుచుకుపడ్డారు. ఆదివారం హరీశ్‌రావు కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని నాగిరెడ్డిపేట, ఎల్లారెడ్డి, లింగంపేట మండలాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం లింగంపేటలో బీఆర్‌ఎస్ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి మాట్లాడుతూ.. తెలంగాణ ప్రతిష్టను దెబ్బతీసే విధంగా విపక్షాలు చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. తప్పుడు ప్రచారాన్ని అభివృద్ధి అనే ఆయుధంతో సమాధానం ఇవ్వాలన్నారు. 'కాంగ్రెస్‌కు 40–50 స్థానాల్లో అభ్యర్థులే లేరు. అధికారంలోకి రావడమనేది కలే. అయితే, కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ధరణిని రద్దు చేస్తామని చెబుతున్నారు. ధరణిని రద్దు చేస్తే వీఆర్వోలు వస్తరు, మళ్లీ లంచాలు ఉంటేనే పని జరుగుతది. బీజేపోళ్లు ఎల్లెను కలవద్దరు, వాళ్ల దుకాణం బంద్‌ైనట్టే'నని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ జాతీయ పార్టీ పెట్టి జాతీయ రాజకీయాల్లోకి పోతున్నరని, కేసీఆర్ బలపడితే తెలంగాణకు లాభం జరుగుతదని హరీశ్ పేర్కొన్నారు. కేసీఆర్ ఎదిగితే తెలంగాణకు మేలు జరుగుతదని, తెలంగాణ మీద కేసీఆర్‌కు ఉన్న ప్రేమ రాహుల్ గాంధీకో, మోదీకో ఉంటుందా అని ప్రశ్నించారు. వైద్యంలో తెలంగాణ దేశంలో మూడో స్థానంలో నిలిచిందని, కొన్ని రోజుల్లో దేశంలో మొదటిస్థానంలో ఉంటామని స్పష్టం చేశారు.

నీతి ఆయోగ్ ఇజ్జత్ తీశారు

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: మిషన్ భగీరథకు రూ.24 వేల కోట్లు ఇవ్వాలన్న నీతి ఆయోగ్ సిఫార్సులను తుంగలో తొక్కి పైసా విడుదల చేయకుండా ఆ నీతి ఆయోగ్ ఇజ్జత్ తీసిన బీజేపీ సర్కారు.. ఈ సమావేశానికి సీఎం కేసీఆర్ రాలేదని అనడం విడ్డూరంగా ఉందని మంత్రి టి.హరీశ్‌రావు అన్నారు. సమావేశానికి పది మంది సీఎంలు కూడా గైర్హాజరయ్యారన్నారు. ఆదివారం ఆయన మెదక్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాని మోదీ సమాఖ్య స్ఫూర్తిని దెబ్బతీస్తున్నారని, టీమిండియా అని చెబుతూనే తోడో ఇండియాలాగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. పార్లమెంట్‌ను రాష్ట్రపతితో ప్రారంభించకపోవడం వారి విజ్ఞతకే వదిలేస్తున్నామని వ్యాఖ్యానించారు. పార్లమెంటుకు అంబేడ్కర్ పేరు పెట్టాలని తాము డిమాండ్ చేస్తుంటే బీజేపీ ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. ఈ అంశంపై కేంద్రంలోని బీజేపీ స్పందించాలని డిమాండ్ చేశారు.

సభలో జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్, జెడ్పీ చైర్‌పర్సన్ దఫేదార్ శోభ తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం లేని ప్రభుత్వం

- బాధ్యతను మరచి నిర్వాసితులకు అన్యాయం చేసింది
- సీఎం కేసీఆర్‌కు భట్టి విక్రమార్క బహిరంగ లేఖ



సీఎంకు రాసిన బహిరంగ లేఖను మీడియాకు చూపుతున్న సీఎల్పీ నేత భట్టి విక్రమార్క

సాక్షి, నాగర్‌కర్నూల్: పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు వట్టెం రిజర్వాయర్‌లో ముంపునకు గురైన నిర్వాసితుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం మానవత్వం లేకుండా వ్యవహరించిందని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క ఆరోపించారు. ఆదివారం ఆయన చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర 73వ రోజున నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలం ఇంద్రకల్‌లో మాట్లాడారు. వట్టెం రిజర్వాయర్ నిర్వాసితులతో మాట్లాడిన అనంతరం సీఎం కేసీఆర్‌కు బహిరంగ లేఖ రాశారు. వట్టెం రిజర్వాయర్‌లో అన్‌కాన్‌పల్లితండా, కారుకొండతండా, రాంరెడ్డిపల్లితండా, జీగుట్టతండా, అన్‌కాన్‌పల్లి గ్రామాలు పూర్తిగా ముంపునకు గురవుతున్నాయని చెప్పారు. ఇక్కడి నిర్వాసితులంతా నూరు శాతం దళిత, గిరిజనులేనని పేర్కొన్నారు. వీరిపట్ల ప్రభుత్వం మానవత్వంతో వ్యవహరించి భూమికి భూమి, ఇల్లుకు ఇల్లు, ఉద్యోగం కల్పించాల్సి ఉండగా బాధ్యతను మర్చిపోయిందని విమర్శించారు. సాక్షాత్తు సీఎం కేసీఆర్ భూ నిర్వాసితులకు ఉద్యోగం ఇస్తామన్న హామీ నెరవేర్చలేదన్నారు. ప్రాజెక్టు ప్రారంభం సందర్భంగా సీఎం హామీతోనే నిర్వాసితులంతా సంతకాలు చేశారని, ఇప్పుడు వారిని ప్రభుత్వం మోసం చేసిందని దుయ్యబట్టారు. దీంతో నిర్వాసితులు ఉన్న ఊరు, భూమి, ఇల్లు, ఉపాధి కోల్పోయి దిక్కులేనివారయ్యారని ఆవేదన వ్యక్తంచేశారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం బాధితులకు భూమి, ఉద్యోగం, పరిహారం అందజేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే పోరాడతామని హెచ్చరించారు.

ఎమ్మెల్యే మంచిరెడ్డి మాతృమూర్తికి సీఎం నివాళి

దశదినకర్మకు హాజరైన పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు



పద్మమ్మకు నివాళి అర్పిస్తున్న సీఎం కేసీఆర్, మంత్రి సబితా ఇంద్రారెడ్డి తదితరులు

ఇబ్రహీంపట్నం: రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి మాతృమూర్తి మంచిరెడ్డి పద్మమ్మ దశదినకర్మకు ముఖ్యమంత్రి కేసీఆర్ హాజరయ్యారు. ఇబ్రహీంపట్నం మండలం ఎల్మినేడులో ఆదివారం జరిగిన కార్యక్రమంలో పద్మమ్మ చిత్రపటానికి పూలుజల్లి, నివాళి అర్పించారు. కిషన్‌రెడ్డి, ఆయన తనయుడు ప్రశాంత్‌కుమార్‌రెడ్డితో పాటు వారి కుటుంబసభ్యులను సీఎం పరామర్శించారు. మంత్రులు సబితారెడ్డి, చామకూర మల్లారెడ్డి, జగదీశ్‌రెడ్డి, లోక్‌సభ పక్ష నాయకుడు నామా నాగేశ్వర్‌రావు, ఎమ్మెల్యేలు కేపీ వివేకానంద, బాల్క సుమన్, జీవన్‌రెడ్డి, ప్రకాశ్‌గౌడ్, జైపాల్ యాదవ్, ఎమ్మెల్సీలు కసిరెడ్డి నారాయణరెడ్డి, శంభీపూర్ రాజు, ఎంపీ రంజిత్‌రెడ్డి, రెడ్కో చైర్మన్ సతీష్‌రెడ్డి, రంగారెడ్డి జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సుభాషణ్‌రెడ్డి, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు క్యామ మల్లేశ్‌తోపాటు పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పెద్ద సంఖ్యలో హాజరై పద్మమ్మకు నివాళులు అర్పించారు.

హెలికాప్టర్‌లో వచ్చిన సీఎం కేసీఆర్.. : సీఎం కేసీఆర్.. ఆదివారం మధ్యాహ్నం ఒంటి గంట మూడు నిమిషాలకు హెలికాప్టర్‌లో ఎల్మినేడు గ్రామానికి చేరుకున్నారు. ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి ఫాంహౌస్ దగ్గర హెలిప్యాడ్‌ను ఏర్పాటు చేశారు. అక్కడి నుంచి కాన్వాయ్‌లో ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి ఇంటికి వచ్చి సుమారు 50 నిమిషాలకుపైగా గడిపారు. పరామర్శ అనంతరం భోజనం చేసి తిరిగి హైదరాబాద్‌కు బయలుదేరారు. సీఎం రాక సందర్భంగా పోలీసులు ఎల్మినేడులో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. రాచకొండ పరిధిలోని సివిల్, స్పెషల్ బ్రాంచ్, ట్రాఫిక్ పోలీసులు పెద్ద సంఖ్యలో మోహరించారు.

తెలంగాణ వైతాళికుడు సురవరం: సీఎం

సాక్షి, హైదరాబాద్: సురవరం ప్రతాపరెడ్డి జయంతి సందర్భంగా ఆయన సమాజానికి అందించిన సేవలను ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు స్మరించుకున్నారు. బహుముఖ ప్రజ్ఞాశాలి, తెలంగాణ వైతాళికుడు సురవరం అని కొనియాడారు. సురవరం స్ఫూర్తిని కొనసాగిస్తామని సీఎం స్పష్టం చేశారు

15 ఏళ్ల కలను నెరవేర్చండి

సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌కు జేఎన్‌జే ఎంఏసీహెచ్‌ఎస్ మహిళా సభ్యుల వినతి

లక్డీకాపూల్(హైదరాబాద్): జవహర్‌లాల్ నెహ్రూ జర్నలిస్టుల హౌసింగ్ సొసైటీ(జేఎన్‌జేఎంఏసీహెచ్‌ఎస్) సభ్యుల ఇళ్ల స్థలాల పంపిణీపై సుప్రీంకోర్టు తీర్పును వెంటనే అమలుపరచాలని పలువురు మహిళా సభ్యులు డిమాండ్ చేశారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సొసైటీ మహిళా సభ్యుల ఆత్మీయ సమావేశం జరిగింది. మహిళా జర్నలిస్టులుగా సుమారు 20 నుంచి 35 ఏళ్ల వరకు వివిధ మీడియాల్లో పని చేశాము. ప్రస్తుతం కొందరు ఉద్యోగాల్లో కొనసాగుతున్నా.. కోవిడ్ అనంతరం చాలామంది ఉద్యోగాలు కోల్పోయి ఎన్నో అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సొసైటీలో సభ్యులు తమ ఆప్తులను కోల్పోయిన కుటుంబ సభ్యులు తమ కష్టాలను విన్నవిస్తూ కన్నీరు మున్నీరయ్యారు. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న తమ భూ సమస్యను పరిష్కరించాలని మొరపెట్టుకున్నారు. మరణించిన సభ్యుల అంత్యక్రియలకు కూడా డబ్బు లేని దుర్భర స్థితిని ఎదుర్కొన్నామని, దివంగత జర్నలిస్ట్ శ్రీనివాస్ సతీమణి జయశ్రీ ఆవేదన వ్యక్తం చేశారు. తన కార్టూన్లతో పేరు ప్రతిష్టలు సంపాదించుకున్నా...ఆయన మరణానంతరం తమ కుటుంబం అనేక ఇబ్బందుల్లో పడిందని కార్టూనిస్ట్ శేఖర్ సతీమణి చంద్రకళ అన్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి తమ బాధను అర్థం చేసుకుని తమకు భూమిని అప్పగించాలని కోరారు. రిటైరై కూడా కనీసం పీఎఫ్, పెన్షన్ వంటి సౌకర్యాలు కూడా లేక ఇబ్బందుల్లో ఉన్నామని ఆందోళన వ్యక్తం చేశారు. 15 ఏళ్లుగా ఇళ్ల స్థలాల కోసం ఎదురు చూస్తున్న వారిలో 60 మంది సభ్యులు ప్రాణాలు కోల్పోవడంతో ఆర్థిక సమస్యలను ఎదుర్కొంటున్నాయని వాపోయారు. ఇప్పటికైనా తమకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని మహిళా సభ్యులు విజ్ఞప్తి చేశారు.

బడుగులను బానిసలుగా మార్చేందుకు మోదీ కుట్ర

- గిరిజన మహిళ అయినందునే రాష్ట్రపతి ముర్ముకు అవమానం
- సత్యాగ్రహ దీక్షలో ఆదివాసీ కాంగ్రెస్ నేత బెల్లయ్య నాయక్



గాంధీభవన్ వద్ద బెల్లయ్య నాయక్ ఆధ్వర్యంలో సత్యాగ్రహ దీక్షలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

సాక్షి, హైదరాబాద్: మనుధర్మ శాస్త్రం ప్రకారం వెనుకబడిన వర్గాల ప్రజలను బానిసలుగా చూస్తారని, ప్రస్తుతం ప్రధాని మోదీ కూడా దేశంలోని బడుగు వర్గాల ప్రజలను బానిసలుగా మార్చేందుకు ప్రయత్నిస్తున్నారని జాతీయ ఆదివాసీ కాంగ్రెస్ వైస్‌చైర్మన్ టి.బెల్లయ్య నాయక్ విమర్శించారు. భారతీయ జనతా పార్టీ రాజ్యాంగాన్ని అడ్డుపెట్టుకుని దేశంలో మనుధర్మ శాస్త్రాన్ని అమలు చేసేందుకు కుట్ర చేస్తోందని ఆరోపించారు. పార్లమెంటు నూతన భవనాన్ని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముతో ప్రారంభింపజేయనందుకు నిరసనగా ఆదివాసీ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆదివారం గాంధీభవన్‌లో సత్యాగ్రహ దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా బెల్లయ్య నాయక్ మాట్లాడుతూ గిరిజన మహిళ అయినందునే రాష్ట్రపతి ముర్మును కేంద్రం అవమానిస్తోందని ఆరోపించారు. ప్రధాని మోదీ అశోకచక్రాన్ని పక్కన పెట్టి రాజదండం తీసుకువస్తోంది.. దేశంలో రాచరికాన్ని తీసుకువచ్చేందుకేనని విమర్శించారు. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ అంజన్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ పార్లమెంటు భవనాన్ని ప్రారంభించే అధికారం కేవలం రాష్ట్రపతికి మాత్రమే ఉంటుందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఒక్కటే దేశంలోని అన్ని వర్గాలను అక్కున చేర్చుకుంటుందని చెప్పారు. మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ మాట్లాడుతూ అంటరానితనం గురించి ఎప్పుడో విన్నాం కానీ, ఇప్పుడు చూస్తున్నామని వ్యాఖ్యానించారు. ఈ పోరాటాన్ని ఇంతటితో విరమించేది లేదని, రాబోయే రోజుల్లో ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద కూడా నిరసన తెలిపి పోరాటాన్ని ఉధృతం చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ కాంగ్రెస్ నేత చందా లింగయ్యతో పాటు పలువురు కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం సచివాలయం సమీపంలోని అంబేడ్కర్ విగ్రహానికి ఆదివాసీ కాంగ్రెస్ నేతలు వినతిపత్రం సమర్పించారు.

తెలంగాణ వైతాళిక తేజోమూర్తి సురవరం

మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, నిరంజన్‌రెడ్డి



సురవరం ప్రతాపరెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, నిరంజన్‌రెడ్డి తదితరులు

కవాడిగూడ (హైదరాబాద్): తెలంగాణలో భాషా, సాంస్కృతిక, సామాజిక, రాజకీయ చైతన్యాన్ని రగిలించడంలో ప్రధాన పాత్ర పోషించిన తెలంగాణ వైతాళిక తేజోమూర్తి సురవరం ప్రతాపరెడ్డి అని ఎక్సైజ్ శాఖ మంత్రి డాక్టర్ వి.శ్రీనివాస్‌గౌడ్, రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డిలు కొనియాడారు. స్వాతంత్ర్య సమరయోధుడు, కవి సురవరం ప్రతాపరెడ్డి 127వ జయంతి సందర్భంగా మంత్రులు డాక్టర్ వి.శ్రీనివాస్‌గౌడ్, సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డిలు ఆదివారం ట్యాంక్‌బండ్‌పై ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు తెలంగాణ ప్రాంత వైతాళికులు, కవులు, సాహితీవేత్తలు, కళాకారులు, సామాజిక వేత్తలను గుర్తించి వారి జయంతులు, వర్ధంతులను అధికారికంగా నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సురవరం ప్రతాపరెడ్డి సాహితీ వైజయంతి ట్రస్ట్ అధ్యక్షుడు డాక్టర్ ఎల్లూరి శివరెడ్డి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె.చెన్నయ్య పాల్గొన్నారు.

మోదీ ముఖం చూస్తే ప్రజలకు భయం

నీతి ఆయోగ్ భేటీకి వెళ్లినా ఒరిగేదేమీ లేదు : ప్రభుత్వ విప్‌లు గొంగిడి, గువ్వల



మీడియాతో మాట్లాడుతున్న గువ్వల బాలరాజు, గొంగిడి సునీత

సాక్షి, హైదరాబాద్: ప్రధాని మోదీ ముఖమే తెలంగాణలో బీజేపీని గెలిపిస్తుందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై బీఆర్‌ఎస్ మండిపడింది. ప్రధాని ముఖం చూస్తే ప్రజలు భయపడుతున్నారని, ఆకలి కడుపులతో ఉన్న ప్రజలను చూస్తే బీజేపీ నేతలకు మంచి నిద్ర వస్తుందని ప్రభుత్వ విప్‌లు గొంగిడి సునీత, గువ్వల బాలరాజు ఎద్దేవా చేశారు. బీఆర్‌ఎస్ శాసనసభా పక్షం కార్యాలయంలో ఆదివారం ఇద్దరు విప్‌లు మీడియాతో మాట్లాడారు. నీతి ఆయోగ్ భేటీకి పది మంది సీఎంలు హాజరు కాలేదని, భేటీకి వెళ్లినా ఒరిగేదేమీ లేదని ప్రభుత్వ విప్ గొంగిడి సునీత అన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై బీజేపీ నేతలకు అవగాహన లేదని, తెలంగాణకు బీజేపీ నేతలు ఏం సాధించారో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర అభివృద్ధిపై బీజేపీ నేతలకు చిత్తశుద్ధి లేదని, దేశంలో రాక్షస పాలన కొనసాగుతోందని మండిపడ్డారు.

బీజేపీది జాతీయ వాదం కాదు : గువ్వల

బీజేపీ అనుసరిస్తున్నది జాతీయ వాదం కాదని కేవలం ప్రధాని మోదీ వాదమని ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజ్ విమర్శించారు. పార్లమెంటు ప్రారంభోత్సవానికి ఎన్ని పార్టీలు హాజరయ్యాయో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి చెప్పాలన్నారు. సోషల్ మీడియాలో కూడా బీజేపీకి వ్యతిరేకత మొదలైందని, ప్రధాని మోదీని త్వరలోనే దేశ ప్రజలు ఇంటికి సాగనంపుతారని జోస్యం చెప్పారు.

కొత్త కార్యదర్శి వస్తారా?

కర్ణాటక మంత్రిగా బోసురాజు నియామకంతో రాష్ట్ర కాంగ్రెస్‌లో చర్చ

సాక్షి, హైదరాబాద్: కర్ణాటక మంత్రివర్గంలో ఏఐసీసీ కార్యదర్శి బోసురాజుకు స్థానం దక్కడం రాష్ట్ర కాంగ్రెస్ వర్గాల్లో కొత్త చర్చకు తావిస్తోంది. ప్రస్తుతం తెలంగాణ కాంగ్రెస్‌కు ప్రధాన కార్యదర్శి హోదాలో మహారాష్ట్రకు చెందిన మాణిక్‌రావ్ ఠాక్రే ఏఐసీసీ నుంచి ఇన్‌చార్జిగా ఉండగా ఆయనకు సహాయకులుగా ముగ్గురు ఏఐసీసీ కార్యదర్శులు బోసురాజు, నదీమ్ జావెద్, రోహిత్ చౌదరిలు పని చేస్తున్నారు. ఈ ముగ్గురు కార్యదర్శులకు అనుబంధ సంఘాలతో, పార్లమెంటు నియోజకవర్గాలవారీగా బాధ్యతలున్నాయి. ఇప్పుడు బోసురాజు కర్ణాటక మంత్రి కావడంతో ఆయన్ను ఇన్‌చార్జి కార్యదర్శిగా కొనసాగిస్తారా లేదా అన్నది చర్చనీయాంశమవుతోంది. మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించాల్సి ఉండటంతో ఆయనకు తెలంగాణ కాంగ్రెస్ బాధ్యతలు తప్పించి మరొకరికి ఇస్తారనే చర్చ జరుగుతోంది. మరోవైపు బోసురాజు సేవలు ఈసారి ఎన్నికల్లో తెలంగాణకు అవసరమని ఏఐసీసీ భావిస్తోందని... కర్ణాటక మంత్రిగా ఉన్నప్పటికీ ఆయన్నే కొనసాగిస్తారనే చర్చ కూడా జరుగుతోంది. ఈ నేపథ్యంలో బోసురాజును కొనసాగించాలా లేక కొత్త నేతను పంపాలా అన్న దానిపై టీపీసీసీ ముఖ్య నేతల అమెరికా టూర్ పూర్తయ్యాక ఏఐసీసీ నిర్ణయం తీసుకుంటుందని తెలుస్తోంది.

అమెరికాకు రేవంత్ బృందం...

ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ అమెరికా పర్యటనను విజయవంతం చేసేందుకు రాష్ట్రం నుంచి ముఖ్య నేతలు వెళ్తున్నారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డితోపాటు భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ తదితరులు ఈ జాబితాలో ఉన్నారు. జూన్ 4న న్యూయార్క్‌లో జరిగే ఓవర్సీస్ కాంగ్రెస్ సభలో రాహుల్‌తో కలసి వారు పాల్గొననున్నారు. ఈ సభకు హాజరయ్యే దక్షిణాదికి చెందిన ఎన్‌ఆర్‌ఐలను సమన్వయం చేసేందుకు ఇతర దక్షిణాది నేతలతో కలసివారంతా అమెరికా వెళ్తున్నట్లు టీపీసీసీ వర్గాలు వెల్లడించాయి. ఈ నేపథ్యంలో రేవంత్, కోమటిరెడ్డి, యాష్కీ తదితరులు అమెరికాలోనే తెలంగాణ ఆవిర్భావ వేడుకల్లో పాల్గొంటారని టీపీసీసీ వర్గాలు తెలిపాయి.

కరీంనగర్ పోరాటాల ప్రతీక సహదేవ్

- 'రక్తచలన సంగీతం' పుస్తకావిష్కరణలో విమలక్క
- హైదరాబాద్‌లో సహదేవ్ 35వ వర్ధంతి



రిక్కల సహదేవ్‌రెడ్డి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న అరుణోదయ విమలక్క

సిరిసిల్ల: కామ్రేడ్ రిక్కల సహదేవ్‌రెడ్డి.. ఉమ్మడి కరీంనగర్ జిల్లా విప్లవ పోరాటాల ప్రతీకని అరుణోదయ విమలక్క కొనియాడారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం ధర్మారం వద్ద 1988 మే 28న జరిగిన ఎన్‌కౌంటర్‌లో అమరుడైన రిక్కల సహదేవ్ 35వ వర్ధంతిని హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం నిర్వహించారు. సహదేవ్‌రెడ్డి యాదిలో తెచ్చిన 'రక్తచలన సంగీతం'పుస్తకాన్ని, పునర్ముద్రించి ఆవిష్కరించారు. ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి జోహార్లు అర్పించిన అనంతరం విమలక్క మాట్లాడుతూ హుస్నాబాద్‌లో పుట్టిన సహదేవ్.. ప్రగతిశీల విద్యార్థి ఉద్యమాలు, రైతాంగ పోరాటాల నిర్మాణాల నుంచి ఎదిగొచ్చాడని గుర్తు చేశారు. కార్యక్రమంలో సహదేవ్‌రెడ్డి సోదరీలు రాజేశ్వరి, లక్ష్మి, అల్లుడు రాము, వక్తలు సంతోష్, ఎనిశెట్టి శంకర్, ప్రముఖ కవి, రచయిత అన్నవరం దేవేందర్, కట్టా భగవంతరెడ్డి, వినయ్‌బాబు, అల్లూరి విజయ్, రాజు, మల్సూర్, బైరాగీ, పద్మ, మల్లేశం, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

కేంద్రం గిరిజనుల రిజర్వేషన్లను 10 శాతానికి పెంచాలి

- ప్రైవేటు రంగంలోనూ రిజర్వేషన్లు అమలు చేయాలి
- గిరిజనులకు అందాల్సిన రాజ్యాంగ ఫలాలను కేంద్రం అడ్డుకుంటోంది
- జాతీయ బంజారా మీట్‌లో మంత్రి సత్యవతి రాథోడ్



సాక్షి, హైదరాబాద్/ఖైరతాబాద్: కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్డీఏ ప్రభుత్వం గిరిజనులపై కపట ప్రేమను చూపిస్తోందని రాష్ట్ర గిరిజన, మహిళాభివృద్ధి శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ విమర్శించారు. గిరిజనులకు రాజ్యాంగబద్ధంగా అందాల్సిన ఫలాలను కేంద్రం నిలువరిస్తోందని ఆమె మండిపడ్డారు. జనాభా ప్రాతిపదికన గిరిజనులకు 10 % రిజర్వేషన్లు దక్కాలన్నారు. తెలంగాణలో ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం గిరిజనులకు 10% రిజర్వేషన్లను అమలు చేస్తోందని, కానీ కేంద్ర ప్రభుత్వ సంస్థల్లో మాత్రం ఈ రిజర్వేషన్లు అమలు కావడం లేదని ఆగ్రహించారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే గిరిజన రిజర్వేషన్లను 10 శాతానికి పెంచాలని డిమాండ్ చేశారు. ఆదివారం ఖైరతాబాద్‌లోని విశ్వేశ్వరయ్య భవన్‌లో జరిగిన జాతీయ బంజారా మీట్–2023 కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ రాష్ట్రంలో గిరిజనులకు సీఎం కేసీఆర్ అన్ని విధాలుగా అండగా ఉన్నారని అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గిరిజనుల కోసం ఏం చేసిందో స్పష్టం చేయాలన్నారు. ఢిల్లీలో కేంద్ర ప్రభుత్వం నిర్మించిన నూతన పార్లమెంటు భవనం గిరిజనులదేనని అన్నారు. హైదరాబాద్‌లో రాష్ట్ర ప్రభుత్వం గిరిజనుల కోసం ప్రతిష్టాత్మకంగా గిరిజన, ఆదివాసీభవన్‌లను ఏర్పాటు చేసిందన్నారు. ఢిల్లీలో సంత్ సేవాలాల్ భవనాన్ని ఏర్పాటు చేయాలని మంత్రి డిమాండ్ చేశారు. సేవాలాల్ జయంతిని దేశవ్యాప్తంగా అధికారికంగా జరపాలన్నారు. 15 రాష్ట్రాల నుంచి వచ్చిన గిరిజన ప్రతినిధులు ఈ సదస్సులో పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా బంజారాల సమస్యలపై ఈ సమావేశంలో చర్చించి పలు తీర్మానాలను ఆమోదించారు. కార్యక్రమంలో ట్రైకార్ చైర్మన్ రామచంద్రునాయక్, జీసీసీ చైర్మన్ వాల్యానాయక్, మాజీ ఎంపీ సీతారాం నాయక్ పాల్గొన్నారు.

సదస్సులో చేసిన ముఖ్య తీర్మానాలు..

- రాజ్యాంగంలోని ఎనిమిదవ షెడ్యూల్‌లో బంజారా భాషను చేర్చాలి.
- దేశవ్యాప్తంగా ఉన్న బంజారాలను గిరిజనులుగా గుర్తించి ఎస్టీ రిజర్వేషన్లను వర్తింపచేయాలి.
- పార్లమెంటు ప్రాంగణంలో బాబా లఖీషా బంజారా పేరిట బంజారా భవన్‌ను నిర్మించాలి.
- పార్లమెంట్ ప్రాంగణంలో బాబా లఖీషా బంజారా విగ్రహం ఏర్పాటు చేయాలి.
- తెలంగాణలో గిరిజన వర్సిటీని ప్రారంభించాలి.
- ప్రైవేటు రంగంలోనూ ఎస్టీ రిజర్వేషన్లు అమలు చేయాలి.
- హైకోర్టు, సుప్రీంకోర్టు జడ్జీల నియామకాల్లో గిరిజనులకు ప్రాధాన్యం కల్పించాలి.

బీజేపీది బడుగు, బలహీన వర్గాల వ్యతిరేక పాలన

టీఎస్‌ఎంఐడీసీ చైర్మన్ డా.ఎర్రోళ్ల శ్రీనివాస్



సాక్షి, హైదరాబాద్: ప్రతిష్టాత్మకమైన పార్లమెంటు నూతన భవనాన్ని భారత రాష్ట్రపతి, ఆదివాసీ బిడ్డ ద్రౌపదీ ముర్ముతో ప్రారంభించకపోవడాన్ని చూస్తే బీజేపీది బడుగు, బలహీన వర్గాల వ్యతిరేక పాలనగా అర్థం అవుతోందని టీఎస్‌ఎంఐడీసీ చైర్మన్ డా.ఎర్రోళ్ల శ్రీనివాస్ ఆదివారం ఓ ప్రకటనలో విమర్శించారు. రాజ్యాంగ పితామహుడైన డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ పేరును పార్లమెంట్‌కు నామకరణం చేయలేదని, ఇంకా మౌనంగా ఉంటే బీజేపీ ఆర్‌ఎస్‌ఎస్ పాలన తెస్తుందని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రజలంతా మేల్కొని బీజేపీ పాలనకు చరమగీతం పాడాలని ఆయన పిలుపునిచ్చారు.

International Institute of Information Technology
(IIIT) Gachibowli, Hyderabad - 500 032. Telangana. India
మహిళా విద్యార్థులకు జెఇఇ(JEE) జెండర్ డైవర్సిటీ పూల్ ద్వారా బీటెక్ (BTech) అడ్మిషన్లు
జెఇఇ మెయిన్ (JEE Mains) 2023లో టాప్ 1 పర్సంటైల్ మార్కులు సాధించిన మహిళా విద్యార్థులకు జెండర్ డైవర్సిటీ పూల్ ద్వారా బీటెక్ (BTech) ప్రవేశం. కుటుంబ వార్షికాదాయం రూ.10 లక్షల లోపు ఉన్న బాలికలకు 25 శాతం ట్యూషన్ ఫీజు పై పార్శ్వల్ స్కాలర్‌షిప్ ఆర్థిక సహాయం లభిస్తుంది.
సీఎస్‌ఈలో బీటెక్ (BTech in CSE)
ఈసీఈలో బీటెక్ (BTech in ECE)
దరఖాస్తు చేయడానికి, సంప్రదించండి:
https://ugadmissions.iiit.ac.in/jee/
దరఖాస్తుల స్వీకరణకు చివరి తేదీ: జూన్ 6, 2023



ఎవరినీ ఎప్పుడూ నిరుత్సాహ పరచవద్దు. ఎవరు ఎంత నిదానంగా ఉన్నా, వారిలో నిరంతర పురోగతి ఉండనే ఉంటుంది.

– ప్లేటో

సాక్షి

సోమవారం, 29 మే 2023

రాజదండం - రాజ్యాంగ దండం

నిప్పు కాలుతుంది, అయినా నిప్పు లేనిదే రోజు గడవదు. కాలకుండా జాగ్రత్తలు తీసుకుంటూనే నిప్పును వాడుకోవాలి. అధికారం కూడా అంతే; అధికారం చెడగొడుతుందనీ, సంపూర్ణ అధికారం సంపూర్ణంగా చెడగొడుతుందనీ ఒక ఆంగ్ల మేధావి సెలవిచ్చాడు. లోకవ్యవహారం సజావుగా సాగాలంటే అందుకు అవసరమైన అధికారాన్ని ఒక వ్యక్తి చేతిలోనో, వ్యవస్థ చేతిలోనో పెట్టక తప్పదు. మళ్ళీ అది చెడుదారి పట్టకుండా అవసరమైనప్పుడు కళ్లేలు బిగించకా తప్పదు. ఒక తెగకు లేదా ఒక ప్రాంతానికి చెందిన జనం సమష్టి ప్రయోజనాల కోసం ఎప్పుడైతే గుంపు కట్టారో అప్పుడే అధికార- నియంత్రణల రెండింటి అవసరాన్నీ గుర్తించారు. ఆ క్రమంలో ఎన్నో ప్రయోగాలు జరిగాయి, ఇంకా జరుగుతూనే ఉన్నాయి. ఒక కోణంలో చూస్తే మానవచరిత్ర అంతా అధికారమూ, దాని నియంత్రణల మధ్య ఎడతెగని పెనుగులాటే!

ఈ పెనుగులాట రూపురేఖలు మన పురాణ ఇతిహాసాలలోనూ కనిపిస్తాయి. దశరథుడు అవడానికి రాజే కానీ పెద్దకొడుకైన రాముడికి పట్టాభిషేకం చేసే స్వతంత్రాధికారం మాత్రం ఆయనకు లేదు. పౌరజానపద పరిషత్తును సమావేశపరచి అనుమతి కోరాడు. ఆ పౌర జానపదులలో తరుజనులు, గిరిజనులూ కూడా ఉన్నారని రామాయణం చెబుతోంది. దశరథుడికి పౌరజానపదుల ఆమోదం సునాయాసంగా లభించింది కానీ; మహాభారత ప్రసిద్ధుడైన యయాతికి మాత్రం అంత సులువుగా లభించలేదు. తన చిన్న కొడుకైన పూరునికి రాజ్యం అప్పగించాలన్న తన ప్రతిపాదనను అతడు పౌరజానపదుల ముందు ఉంచినప్పుడు, పెద్దకొడుకైన యదువు ఉండగా చిన్నకొడుకును ఎలా రాజును చేస్తావని వారు ప్రశ్నించారు. యయాతి వారిని ఎలాగో ఒప్పించి తన నిర్ణయాన్ని అమలు చేశాడు. ప్రజామోదంతో రాజైన వ్యక్తి ఆ తర్వాత సర్వస్వతంత్రుడై విర్రవీగినప్పుడు అతణ్ణి తొలగించిన ఉదాహరణలూ ఉన్నాయి. మహాభారతంలోని పురూరవుడు, నహుషుడు ఆ కోవలోకి వస్తారు.

రాజు ధర్మతత్పరతను ఉగ్గడించే కథలు; ధర్మం తప్పిన రాజూ, అతని రాజ్యమూ కూడా భస్మీపటలమైన కథలూ చరిత్రకాలంలోనూ కనిపిస్తాయి. బెజవాడ రాజధానిగా ఏలిన విష్ణుకుండిన రాజు మాధవవర్మ, తన కొడుకు ప్రయాణించే రథం కింద పడి ఒక పౌరుడు మరణించినప్పుడు కొడుకని చూడకుండా మరణశిక్ష అమలు చేస్తాడు. 'శిలప్పదికారం' అనే ప్రసిద్ధ తమిళ కావ్యంలో నాయిక కణ్ణగి తన భర్త కోవలన్ కు పాండ్యరాజు ఒకడు అన్యాయంగా మరణశిక్ష అమలు చేసినప్పుడు ఆగ్రహించి అతని రాజ్యాన్ని బూడిదకుప్ప కమ్మని శపిస్తుంది. శిక్షించే అధికారంతో పాటు తప్పొప్పులను నిర్ణయించే అధికారాన్ని కూడా రాజు గుప్పిట పెట్టుకున్న దశను ఈ కథ సూచిస్తుంది.

రాజూ, రాజ్యాధికారమూ, ధర్మబద్ధత, దండనీతి గురించిన భావనలు ఏ ఒక్క దేశానికో పరిమితమైనవి కావు; సార్వత్రికమైనవీ, అత్యంత ప్రాచీనమైనవీ కూడా! ఆధునిక భాషాశాస్త్ర నిర్ధారణలనే ప్రామాణికంగా తీసుకుంటే, ప్రోటో-ఇండో-యూరోపియన్ మూలరూపమైన 'రెగ్' అనే మాటే సంస్కృతంలో రాజశబ్దంగానూ, ఇతర ఇండో-యూరోపియన్ భాషల్లో దానికి దగ్గరగా ధ్వనించే 'రెక్స్' (లాటిన్) వంటి శబ్దాలుగానూ మారింది. 'సరళరేఖలా తిన్నగా నడిచేది, నడిపించే'దనే అర్థం కలిగిన 'రెగ్' అనే మాట నుంచే నేటి రెగ్యులేషన్, రెగ్యులర్, రైట్, రీజన్, రెజీమ్ మొదలైన మాటలు వచ్చాయని భాషావేత్తలు అంటారు. రాజశబ్దం ఎంత ప్రాచీనమో, కొద్దిరోజులుగా ప్రచారంలో ఉన్న రాజదండం కూడా అంతే ప్రాచీనమూ, సార్వత్రికమూ కూడా!

మన పురాణ, ఇతిహాసాలలో రాచరికానికీ, రాజుల నియామకానికీ ఇంద్రుడు బాధ్యుడిగా కనిపిస్తాడు. చేది దేశాన్ని పాలించే వసురాజు విరక్తుడై అడవిలో తపస్సు చేసుకుంటున్నప్పుడు ఇంద్రుడు అతణ్ణి తిరిగి రాజ్యపాలనకు ప్రోత్సహించి ఇతర రాజోచిత పురస్కారాలతోపాటు, ఒక రాజదండాన్నీ చేతికిచ్చాడని మహాభారతం చెబుతోంది. ఇలాగే ఇంద్రుడు రాజ్యపాలనకు ప్రోత్సహించిన మరో రాజు – మాంధాత. ధర్మరక్షణను రాజుకు నిత్యం గుర్తు చేస్తూ ఉంటుంది కనుక రాజదండాన్ని ధర్మదండంగా కూడా అన్వయించారు. పట్టాభిషేక సమయంలో రాజుకీ, గురువుకీ మధ్య నడిచే ఒక సంభాషణ ప్రకారం, 'నన్ను ఎవరూ శిక్షించలే'రని రాజు అంటాడు; అప్పుడు, 'ధర్మం నిన్ను శిక్షిస్తుంది' అంటూ గురువు మూడుసార్లు ధర్మదండంతో అతని శిరసు మీద కొడతాడు.

ఈ రాజదండం ఆనవాయితీ రోమన్లకూ సంక్రమించింది. వారిలో మొదట్లో వ్యక్తికేంద్రిత పాలన కాక, పౌరకేంద్రిత పాలన- అంటే గణతంత్ర వ్యవస్థ ఉండేది. రాచరికాన్నీ, రాజు అనే మాటనూ కూడా వారు ఏవగించుకునేవారు. ఒక దశలో రోమ్ సైనిక నియంతగా ఉన్న జూలియస్ సీజర్ ఈజిప్టు రాణి క్లియోపాత్రా ప్రేమలో పడిన తర్వాత, అక్కడున్న వ్యవస్థ ప్రభావంతో సింహాసనాన్నీ, రాజదండాన్నీ స్వీకరించాడు. అదే చివరికి అతని హత్యకు దారితీసింది.

అధికారమంతా రాజు దగ్గరే పోగుబడే ప్రమాదం తలెత్తినప్పుడు అతణ్ణి అదుపు చేసే సంకేత పాత్రను రాజదండం నిర్వహించి ఉండవచ్చు. ఆధునిక ప్రజాస్వామ్యంలో అధికార వికేంద్రీకరణ ద్వారా ఆ ప్రమాదాన్ని అరికట్టేందుకు ఆయా వ్యవస్థలు ఏర్పడ్డాయి. ఏ వ్యవస్థ ఏ హద్దుల్లో ఉండాలో చెప్పే రాజ్యాంగమూ వచ్చింది. అదే నేటి అసలు సిసలు రాజదండం!

దేశానికి అవసరమైన విజయం!

విశ్లేషణ



ప్రొ॥ కంచ ఐలయ్య షెపర్డ్

కీలకమైన ఎన్నికల్లో విజయం సాధించి కర్ణాటక ముఖ్యమంత్రిగా సిద్ధరామయ్య రెండోసారి ఎన్నికవడం శుభవార్త అనే చెప్పాలి. ప్రజా సంక్షేమ రాజకీయాలకూ, మత రాజకీయాలకూ మధ్య జరిగిన ఎన్నిక ఇది. క్షేత్రస్థాయిలో ఉన్న ప్రజాదరణ, స్థిరమైన లౌకిక ప్రజాస్వామ్య వ్యూహాలు సిద్ధరామయ్యను నిజమైన మాస్ లీడర్‌గా మార్చాయి. దేశం మతతత్వం నుండి ప్రజాస్వామ్య సంక్షేమం వైపు మళ్లాల్సిన అవసరం ఉన్నందున, కర్ణాటక ఎన్నికలు దేశానికి చాలా ముఖ్యమైనవి. మహాత్మా పూలే, బి.ఆర్. అంబేద్కర్, పెరియార్‌లు రాజకీయాలలో మతం ప్రమేయం లేకుండా సానుకూల ప్రజాస్వామ్యాన్ని కోరుకున్నారు. సిద్ధరామయ్య మతపరమైన భావజాలానికి చోటివ్వకుండా లౌకికవాద భావజాలానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర వల్లే కర్ణాటక ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచిందన్న కథనం ఢిల్లీ నుంచి వినిపిస్తోంది. ఇది ఒక పాత్ర పోషించిందనడంలో సందేహం లేదు. కానీ రాష్ట్ర స్థాయిలో ఒక బలమైన మాస్ లీడర్ లేకుండా ఏ జాతీయ పార్టీ కూడా రాష్ట్ర ఎన్నికల్లో గెలవలేదు. శూద్ర ఓబీసీల కోసం నిబద్ధత కలిగి, మంచి పరిపాలనాదక్షుడిగా, చిల్లర అవినీతి రాజకీయాలకు అతీతంగా తనను తాను నిరూపించుకున్న సిద్ధరామయ్య లాంటి బలమైన లీడర్ లేకుండా కాంగ్రెస్ గెలవలేక పోయేది. అవినీతికి వ్యతిరేకంగా ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడుతున్నప్పటికీ, ఆయన పార్టీకి చెందిన కర్ణాటక నేతలు మాత్రం ఆయన మాట తప్పని నిరూపించారు. కేపీసీసీ అధ్యక్షుడిగా డీకే శివకుమార్ కాంగ్రెస్ గెలుపులో మంచి పాత్ర పోషించినప్పటికీ, సిద్ధరామయ్యకు ఉన్న ప్రజాపునాది, క్లీన్ ఇమేజ్ ఆయనకు లేదు.

కర్ణాటక ముఖ్యమంత్రిగా సిద్ధరామయ్య రెండోసారి ఎన్నికవడం యావత్ భారతదేశానికి శుభవార్త అనే చెప్పాలి. అయినప్పటికీ, ఆయన రెండవ టర్మ్... మోసపూరిత బీజేపీని అదుపులో ఉంచడం, శివ కుమార్ తక్కువ స్థాయి ఆకాంక్షలను నియంత్రించడంతోపాటు మోదీని ఓడించిన ప్రజలను మాత్రమే కాకుండా స్థానిక నాయకులను సంతృప్తిపరిచేలా పరిపాలనను నడపడం వంటి సవాళ్లను కలిగి ఉంది.

ఇది ఆర్‌ఎస్‌ఎస్ తదుపరి సర్‌సంచాలక్ దత్తాత్రేయ హొసబలే సొంత రాష్ట్రం. బహుశా ఈయన కూడా ఢిల్లీలోని మొత్తం బలాన్ని ఉపయోగించి, అన్ని విధాలుగా రాష్ట్రంలో అధికారాన్ని నిలుపుకోవాలనుకున్నారు. హొసబలే బ్రాహ్మణ నాయకుడు. అంతేకాకుండా మోదీకి బలమైన మద్దతుదారు. 2013లో మోదీని ప్రధాని అభ్యర్థిగా తీసుకురావడానికి హొసబలే కారణమని చెబుతున్నారు. అందుకే మోదీ ఓబీసీ కార్డ్‌ని, మతతత్వాన్ని ఉపయోగించి కర్ణాటకను గెలవడానికి తన ప్రభుత్వ బలాన్ని, తన సమయాన్ని, తన శక్తిని ఉపయోగించి నట్లనిపించింది.

ప్రతి గ్రామ వ్యవసాయ సమాజాన్నీ, చేతివృత్తుల సంఘాన్నీ కలిసిన సిద్ధరామయ్య... మోదీ కంటే భిన్నమైన ఓబీసీ నాయకుడని తెలియజేస్తోంది. సిద్ధరామయ్య 75వ జన్మదినోత్సవానికి 16 లక్షల మంది హాజరైనట్లు 'వికీపీడియా' రాసింది. ''సిద్ధరామయ్య తన 75వ పుట్టినరోజును 2022 ఆగస్టు 3న దావణగెరెలో జరుపుకొన్నారు. జనం దాన్ని సిద్ధరామోత్సవ అని పిలిచారు, సిద్ధరామయ్య అనుయాయులైన 16 లక్షల మంది ఆనాటి కార్యక్రమానికి హాజరయ్యారు''. రాహుల్ గాంధీ కూడా హాజరైన ఈ జన్మదిన వేడుకల్లో, పైన చెప్పిన సంఖ్యలో సగం మంది హాజరైనా కూడా, లక్షలాది మంది జనం ఒక నాయకుడి చుట్టూ గుమికూడటం భారతీయ చరిత్రలోనే అపూర్వం.



ఆయన పెద్ద లేదా చిన్న పట్టణ వ్యాపార నేపథ్యం నుండి కానీ, కొత్తగా చేర్చబడిన ఓబీసీ నేపథ్యం నుండి కానీ రాజకీయ అధికారానికి రాలేదు. ఆయన ఋగ్వేదం రాసిన రోజుల నుండి విద్య, ప్రభుత్వోద్యోగం, మానవ గౌరవ హక్కుల నిరాకరణకు గురైన చారిత్రక శూద్ర గొర్రెల కాపరి కుటుంబానికి చెందిన ఓబీసీ. ఢిల్లీలో అధికారాన్ని ఓబీసీ ఓటు నిర్ణయిస్తుందని గ్రహించిన ఆరెస్సెస్-బీజేపీ శక్తులు, చాలా మంది శూద్రేతర నాయకులను ఓబీసీలుగా ప్రచారం చేస్తున్నాయి. మండల్ రిజర్వేషన్‌ను వ్యతిరేకించిన తర్వాత ఓబీసీ ఓట్లు లేకుండా ఢిల్లీని చేజిక్కించుకోలేమని వారు గ్రహించడమే దీనికి కారణం. మోదీ, సుశీల్ మోదీ తరహాలో ఇప్పుడు ఓబీసీ కార్డు వాడుతున్న బీజేపీ నాయకులు ఆనాడు మండల్ రిజర్వేషన్‌ను వ్యతిరేకిస్తూ మిలిటెంట్ కమండల్ ఉద్యమ నాయకులుగా పనిచేశారు.

సిద్ధరామయ్య బలమైన మండల్ ఉద్యమ నాయకుడు. గొర్రెల కాపరి కుటుంబం నుండి వచ్చి, బీఎస్సీ, ఎల్ఎల్‌బీ డిగ్రీలు పొందారు. ఆ రోజుల్లో ఇది ఒక కురుబ బాలుడు ఊహించనిది. ఎల్ఎల్‌బి పూర్తి చేసిన తర్వాత మైసూర్ ప్రాంతంలో సామాజిక కార్యకర్తగా పని చేస్తున్నప్పుడు లా ప్రాక్టీస్‌లోకి ప్రవేశించారు. ఈ అసాధారణ యువ కురుబ న్యాయవాది 1980వ దశకం ప్రారంభంలో రైతు ఉద్యమంలో సుప్రసిద్ధ నాయకుడైన ఎం.డీ. నంజుండస్వామి దృష్టిని ఆకర్షించారు. ఆయనే సిద్ధరామయ్యను రాజ్య రైతు సంఘం ప్రతినిధిగా అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయించారు. అలా 1983లో గెలిచి అసెంబ్లీకి వెళ్ళారు. తరువాత జనతా పార్టీలో చేరారు. వరుసగా ఎన్నికల్లో గెలుస్తూ మంత్రి కాగలిగారు.

దేవెగౌడ పదవీ విరమణ చేసిన తర్వాత తాను ముఖ్యమంత్రి కావాలనే ఆశతో, పేదల అనుకూలత, నిబద్ధత కలిగిన ఓబీసీ, ఎస్సీ, ఆదివాసీ ప్రతినిధిగా జేడీ (యూ)లో చేరారు. ఆయన మంత్రివర్గంలో డిప్యూటీ సీఎంగా పనిచేశారు. కానీ సిద్ధరామయ్యను పట్టించుకోకుండా దేవెగౌడ తన కుమారుడిని ముఖ్యమంత్రిని చేశారు. దేవెగౌడ సంప్రదాయవాద అర్ధ-హిందుత్వ నాయకుడు. కాగా, సిద్ధరామయ్య శూద్ర ఆధ్యాత్మిక భావజాలం కలిగిన హేతువాది.

ఆ తర్వాత జేడీ (యూ)ను విడిచిపెట్టి 'అహిందా' పార్టీని స్థాపించారు. అంటే 'అల్పసంఖ్యాక, హిందూళిద, దళిత' అని! హిందూళిద అంటే కన్నడంలో వెనుకబడినది అని అర్థం. వాస్తవానికి ప్రధాన స్రవంతి మీడియా సిద్ధరామయ్య నాటి దశను ఆయన రాజకీయ జీవితానికి ముగింపుగా చూసింది. మాస్ లీడర్ లేని సమయంలో ఆయన కాంగ్రెస్ లోకి వచ్చారు. ఓబీసీ ఎజెండా, లౌకికవాదం, హేతువాదంపై తనకున్న బలమైన నిబద్ధతను వదలకుండా కాంగ్రెస్‌లోకి ప్రవేశించారు. ఢిల్లీలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆయన చేసిన అన్ని ప్రకటనల్లో కుల వ్యతిరేకత, సెక్యులరిజం, హేతువాదం పట్ల ఆయన నిబద్ధతను చూడవచ్చు. ఎల్లప్పుడూ తన మణికట్టుకు కాషాయ దారాలను ధరించే కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డీకే శివ కుమార్ శైలితో దీన్ని పోల్చి చూడవచ్చు. కాంగ్రెస్ జాతీయ నాయకులు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ విచిత్రంగా దేవాలయాలకు వెళ్తూ శివుడు (రాహుల్), హనుమంతుడి (ప్రియాంక) పూజలు చేస్తున్నారు. కానీ సిద్ధరామయ్య అలా చేయలేదు. తన ఆధ్యాత్మిక నాయకుల సంప్రదాయంగా బసవ, అక్క మహాదేవిలను ఉదాహరిస్తారు. దేవాలయాల చుట్టూ తిరగరు.

సిద్ధరామయ్య, పినరయి విజయన్, ఎం.కె.స్టాలిన్, కె.చంద్రశేఖరరావు, జగన్‌మోహన్ రెడ్డి- దక్షిణాదిలోని ముఖ్యమంత్రులందరూ శూద్ర వ్యవసాయ, చేతివృత్తుల నేపథ్యం ఉన్నవారే. ఉత్తరాదిలో అఖిలేశ్ యాదవ్, తేజస్వీ యాదవ్, నితీశ్ కుమార్, భూపేశ్ బఘేల్, అశోక్ గెహ్లోత్ కూడా శూద్ర వ్యవసాయ నేపథ్యం నుండి వచ్చినవారే. వీరందరూ 2024లో మెజారిటీ పార్లమెంటు స్థానాలు గెలిస్తే బీజేపీ ఓడిపోతుంది.

జాతీయ శూద్ర-ఓబీసీ నాయకులు ఏకమై సానుకూల ప్రజాస్వామ్య సంక్షేమం దిశగా దేశాన్ని నడిపించాల్సిన సమయం ఇది. ఓబీసీ రాజకీయాల పేరుతో జరుగుతున్న మతతత్వాన్ని అంతమొందించాలి. వ్యవసాయాధారిత జాతీయవాదాన్ని అగ్రపీఠిన ఉంచడం; ఓబీసీలు, దళితులు, ఆదివాసీలు కానివారు భారీ మొత్తంలో కూడగట్టిన క్రోనీ క్యాపిటల్ సమీకరణను తనిఖీ చేయడం ప్రస్తుతం చాలా ముఖ్యం. తమకు భాగస్వామ్యం లేని క్రోనీ క్యాపిటలిజానికి ఓబీసీలు మద్దతు ప్రకటిస్తే, అది భారతదేశ ప్రజాస్వామ్య పెట్టుబడిదారీ మార్గాన్ని నాశనం చేస్తుంది. మహాత్మా పూలే, అంబేడ్కర్, పెరియార్‌లు రాజకీయాలలో మతం ప్రమేయం లేకుండా సానుకూల ప్రజాస్వామ్యాన్ని కోరుకున్నారు. సిద్ధరామయ్య తన జీవితంలో ఏ సమయంలోనైనా మతపరమైన భావజాలానికి చోటివ్వకుండా లౌకికవాద భావజాలానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

వ్యాసకర్త ప్రముఖ రచయిత, సామాజిక కార్యకర్త

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

దిగేవరకు ఆగలేదు



భారత ప్రధాని జవహర్ లాల్ నెహ్రూకు స్వాగతం పలికేందుకు అమెరికా అధ్యక్షుడు జాన్ ఎఫ్. కెన్నెడీ అన్ని ప్రొటోకాల్స్‌నూ ఉల్లంఘించి విమానంలోకి ప్రవేశించారు! స్వాతంత్య్రం వచ్చిన వెంటనే నెహ్రూ వహించిన గొప్ప నాయకత్వం వల్ల భారతదేశానికి లభించిన గౌరవం అది. (మొన్నటి నెహ్రూ వర్ధంతి సందర్భంగా)

– అన్షుమాన్ సాయిల్, ట్విటిజెన్

ప్రారంభానికి ముందే!



మహత్తు గల గొప్ప వాస్తుశిల్పానికీ, వాస్తుశాస్త్రానికీ.. తిరుగులేని నిదర్శనం మన కొత్త పార్లమెంటు భవనం. ఇందుకు రుజువు కావాలా?! ప్రతికూల శక్తులు భవనంలోకి ప్రవేశించడానికి మొదటే స్వచ్ఛందంగా ఎలా నిరాకరించాయో చూడండి.

– అమితాబ్ చౌదరి, సనాతన ధర్మ కార్యకర్త

ప్రేమ వెలసింది



తొమ్మిదేళ్లుగా మోదీ చేతుల్లో ధ్వంసమైన ఈ దేశాన్ని రాహుల్ తొమ్మిది నెలల్లో పునర్నిర్మించారు. భారత్ జోడో యాత్ర దేశమంతటా ప్రేమను రేకెత్తించింది.

– అర్మాన్, గాంధీ ఫాలోవర్

ఎన్నని చెప్పడం?!



నేను మోదీజీకి మళ్లీ ఎందుకు ఓటేస్తానంటే: 5వ అతి పెద్ద జీడీపీ, ఆర్టికల్ 370 రద్దు, టీకాలు, విదేశీ విధానం, నీరు, ఉజ్వల పథకం, మరుగుదొడ్లు, ఆలయాల పునర్నిర్మాణం, మౌలిక సదుపాయాలు, పీఎల్ఐ, యూపీఐ.. ఇంకా డిజిటైజేషన్!

– రవిసుతంజని, ఇన్‌ఫ్లుయెన్సర్

జర్నలిజం 'టుడే'



రాజ్‌దీప్ : సీఎంని విమర్శించినందుకు ఒక ప్రభుత్వ టీచర్‌ని సస్పెండ్ చేశారు.
సాగరిక : ఈ నియంతృత్వంపై ఆర్టికల్ రాస్తాను. యూపీలోనే కదా జరిగింది?!
రాజ్‌దీప్ : కాదు.. కర్ణాటకలో.
సాగరిక : సరే, ఈ సమ్మర్‌లో మనం ఎక్కడికి వెళుతున్నాం?

– వరుణ్ కుమార్ రాణా, పొలిటికల్ ఎనలిస్ట్

అక్షరాలకు కొత్త పరిమళాలు అద్ది...

సందర్భం



రామా చంద్రమౌళి

'సముద్రం నా పేరు' అన్న మకుటంతో ఒక రసవత్తర కావ్యాన్ని వెలయించి తనవే అయిన, అప్పటిదాకా ఎవరూ ఉపయోగించని రూపకాలూ, ప్రతీకలూ, బింబ ప్రతిబింబాలనూ, ఉపమానాలనూ విలక్షణ రీతిలో అక్షరాలలో పొదిగి అక్షరాలకు కొత్త జ్ఞాన పరిమళాన్ని అద్ది జగద్వ్యాప్తం చేశారు శేషేంద్ర. 'సూర్యుడు సముద్రాల మీద వంగి/ నీళ్ళు తాగే గుఱ్ఱం/ ఆకాశం నగరాల మీద వంగి గర్జించే/ సింహం/ భూమి ఒక శూన్యంలో తిరిగే/ బొంగరం/ జీవితం మనం అడక్కుండా వచ్చిన / ఒక సంగరం' అని ఆయనంటారు. అతి నూతన మెటఫర్లతో కొత్త కవిత్వ కిటికీలను తెరిచిన శేషేంద్ర శర్మ ముప్పై నలభై ఏళ్ళ క్రితపు జిజ్ఞాసువులైన యువకవులకు ఒక ప్రేరకుడైనారు. దాదాపు రెండు తరాలను తన మాయా మోహ మహత్తులో ముంచి 'కవిసేన'ను స్థాపించి, ప్రజల పక్షాన... ప్రధానంగా దేశానికి అన్నాన్ని దానం చేసే రైతు పక్షాన క్షితిజ రేఖపై నిలబడి 'మండే సూర్యుడై' విస్ఫోటించారు.

గుంటూరు శేషేంద్ర శర్మ పురాణాలు, ఇతిహాసాలు, ప్రబంధాల నుండి స్వీకరించిన విలువైన మూలవిలువలతో పాటు విస్తృతంగా యూరోపియన్, ప్రధానంగా ఫ్రెంచ్, పర్షియన్ కవిత్వాన్ని లోతుగా అధ్యయనం చేసి తనను తాను ఒకానొక విచిత్రమైన శైలీనిర్మాతగా తీర్చి దిద్దుకున్నారు. అందువల్లనే ఆయన తన సమకాలికులైన విశ్వనాథ, శ్రీశ్రీ, కృష్ణశాస్త్రి, జాషువాల కంటే భిన్నమైన, విశిష్టమైన కవిగా కూడా ఎదిగారు.

శేషేంద్ర శర్మ వచనం కూడా అసాధారణంగా కొత్త కొత్త పదబంధాలతో సంభరితమై ఉంటుంది. ఇది చూడండి.. 'పక్షుల గొంతు శబ్దాల గొంతు కంటె గొప్పది. పక్షుల గొంతు కంటె పూల గొంతు గొప్పది. పూల భాష, పక్షుల భాష, ఉషస్సుల భాష, అస్తమయాల భాష, అడవుల, సెలయేళ్ళ, సముద్రాల, ఆకాశాల భాష.. ఈ విశ్వం బహుభాషల పర్ణశాల! అది చేరుకోవాలె కవి.' (నా డైరీ- రక్తరేఖ-పుట 33).

1974 ప్రాంతం నుండే శర్మకి 'కవులుకాని అకవుల' గురించి చాలా ఈసడింపుతో కూడిన ఆవేదన ఉండేది. ఈ మౌన వేదన నుండి నిజమైన, హృదయాన్ని పరివర్తింపజేయగల, సాహిత్య సాంస్కృతిక సైన్యాన్ని ఒకటి నిర్మించాలని 1975 నుండి తపించడం నాకు తెలుసు. దాని ఫలితంగా శేషేంద్ర మానస పుత్రికగా 'కవిసేన' అన్న సంస్థ రూపుదిద్దుకుంది. దాని సిద్ధాంతాలను డాక్యుమెంట్ చేస్తూ 1977లో 'కవిసేన మేనిఫెస్టో' విడుదలైంది.

కవిసేన మేనిఫెస్టోను శేషేంద్ర 'ఆధునిక కావ్య శాస్త్రం' అని పిలిచారు. ఇది ఏ రాజకీయ పార్టీకి



గుంటూరు శేషేంద్రశర్మ

సంబంధించింది కాదు. కవులు రాజకీయ పార్టీల కోసం కాకుండా కేవలం ప్రజల కోసమే సాంస్కృతిక సేనానులుగా వ్యవహరించాలని స్వప్నించారు. కవి ఏం రాయాలి, ఎలా రాయాలి, ఎందుకు రాయాలి, ఎవరి కోసం రాయాలి అన్న స్పృహతో బాధ్యతగల సామాజిక నిర్మాతగా అవతరించాలని లక్షించారు. మేనిఫెస్టో ఆశయాలు నియమాలుగా.. మనిషిని 'ఆలోచించే జంతువ'ని శాస్త్రజ్ఞులు నిర్వచిస్తే కవిసేన మనిషిని 'కన్నీరు కార్చే జంతువ'ని పునర్నిర్వచించింది. మనిషిని బెంజమిన్ ఫ్రాంక్లిన్ 'పనిముట్లు చేసే జంతువ'న్నాడు. కవిసేన మనిషిని 'ఆయుధాలను చేసే జంతువు' అంది. 'ఆకాశంలో మెరిసే విద్యుత్తును భూమండలానికి' బెంజమిన్ ఫ్రాంక్లిన్ తెస్తే, కవిసేన 'మెరిసే కన్నీటిని నక్షత్ర లోకాలకెత్తుదామని' ప్రతిన బూనాలంది. ఈ రకమైన దాదాపు పది ఆశయాల్ని స్థిరీకరిస్తూ మేనిఫెస్టోలో ఒక డాక్యుమెంట్ ఉంది. ఈ లక్ష్యాల వైపు అడుగులు వేస్తూ కొన్ని కవితా సంపుటాలను కవిసేన తదనంతర కాలంలో ప్రచురించి విడుదల చేసింది.

సాహిత్య ఉద్యమ స్ఫూర్తితో కొంతమంది నిబద్ధతతో 'కవిసేన'లో ముందుకు సాగుతూండగానే... గొప్ప ఉద్వేగభరితమైన కవితా సామగ్రితో క్రొంగొత్త ప్రతీకలతో, ఉపమలతో ఒక పరంపరగా 1970 నుండి 1986 వరకు వెలువడిన శేషేంద్ర ఎనిమిది కవిత్వ సంపుటాలను సమీకృతపర్చి 'ఆధునిక మహాభారతం' వెలువరించబడింది. 1985లో ప్రథమ ముద్రణగా వెలువడి 2016 నాటికి నాలుగు ముద్రణలను పూర్తి చేసుకుని బహుళ పాఠకాదరణకు పాత్రమయ్యింది.

శేషేంద్రశర్మ రాసిన విలువైన సాహిత్య తులనాత్మక వ్యాసాల పుస్తకం 'కాలరేఖ' 1994లో ప్రతిష్ఠాత్మక కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారాన్ని సంపాదించి పెట్టింది. దీంట్లో తెలుగు సంప్రదాయ సాహిత్య పురాణాలు, ప్రబంధాలపై రాసిన వాల్మీకి కవిత, 'మేఘ సందేశం', 'అరవింద సావిత్రి', 'వ్యాసుడెవరు?', 'విక్రమోర్వశీయం' నుండి 'గజల్ ఒక అగ్ని', 'కవిత్వం- ఒక అవగాహన', 'ఛందస్సు- కవిత్వం', 'వచన కవిత పుట్టు పూర్వోత్తరాలు'; అలాగే ప్రసిద్ధ తెలుగు కవులు రాయప్రోలు, గురజాడ, పానుగంటి లక్ష్మీనరసింహారావు, తిరుపతి వేంకట కవులు, చిలకమర్తి లక్ష్మీనరసింహారావు... ఇట్లా ఈ తరానికి తెలియని అనేక ఉపయుక్త విశేషాలున్నాయి.

జీవితంలో, రచనల్లో అనేక వివాదాలనూ, ప్రతిఘటనలనూ ఎదుర్కొని నిలిచారు శేషేంద్ర. ఇప్పటి తరానికి శేషేంద్ర జీవితం... ప్రేరణనూ, స్ఫూర్తినీ, కొత్త చేవనూ ఇస్తుంది.

వ్యాసకర్త ప్రముఖ కవి । 93901 09993

(రేపు గుంటూరు శేషేంద్రశర్మ 16వ వర్ధంతి. హైదరాబాద్ జేఎన్‌టీయూలో సాహిత్య సదస్సు)

అవధాన కళను రక్షించుకోవాలి!

అభిప్రాయం



వనం జ్వాలా నరసింహారావు

అనుకోకుండా అవకాశం, అదృష్టం లభించడం అంటే ఇదేనేమో! చిరకాల మిత్రుడు మరుమాముల దత్తాత్రేయ శర్మ వ్యవస్థాపక అధ్యక్షులుగా ఏర్పాటైన 'అవధాన విద్యా వికాస పరిషత్' ఆధ్వర్యంలో మే 14న నిర్వహించిన రెండవ అవధాన శిక్షణా శిబిరం విజయోత్సవ సభలో పాల్గొనడం ఒక అదృష్టం. ముఖ్య అతిథిగా పాల్గొన్న పంచ సహస్రావధాని, తిరుమల తిరుపతి అన్నమాచార్య ప్రాజెక్ట్ మాజీ సంచాలకులు డాక్టర్ మేడసాని మోహన్ ఉపన్యాసం ఎన్నో విషయాలు చెబుతూ సాగింది. సభలో మాట్లాడిన వక్తలందరూ అవధాన ప్రక్రియ తెలుగు భాషకే గర్వకారణమనీ, తెలుగుభాషలో ఉన్న ఈ అద్భుత ప్రక్రియ ప్రపంచంలో మరేభాషలో లేదనీ, ఇది ఒక మనోవైజ్ఞానిక ధారణతో కూడుకున్న తెలుగుజాతి తరగని ఆస్తి అనీ అన్నారు. మేడసాని ఉపన్యాసం ఆసాంతం 'అవధానంలో ఏకాగ్రత' గురించి నొక్కి వక్కాణించింది.

మేడసాని తన ఉపన్యాసంలో కొంత మేరకు తన జీవనయానాన్ని కూడా ఆవిష్కరించారని అనాలి. ఒక మధ్యతరగతి కుటుంబంలో పుట్టిన తాను చిన్నతనంలో సుదీర్ఘకాలం కడుపు నొప్పితో బాధపడ్డాననీ, ఒక అవధూత ఒక పరమౌషధం ఇచ్చారనీ, దాంతో తనకు బాధ తగ్గిందనీ, ఆయన సలహా మేరకే ఆశ్రమానికి దగ్గరలో ఒక పాఠశాలలో చేరాను అని చెప్పారు.

తనకు దేవీ దర్శనం, అనుగ్రహం కలిగిందనీ, ఫలితంగా తొమ్మిదవ తరగతిలోనే పద్యం రాయడం ఆరంభించానని మేడసాని అన్నారు. తన గురువుగారు తన పద్యాలలోని ఛందస్సు తప్పొప్పులు సరిచేసే వారని పెప్పారు. పదవ తరగతి చదువుతున్నప్పుడే అవధానం చేయడం మొదలు పెట్టాననీ, భగవదనుగ్రహం వల్ల అది నిరంతరాయంగా కొనసాగిందనీ, ఇప్పటికీ ఖండాంతరాలలో చేసిన 300కు పైగా అవధానాలను కలుపుకొని, మొత్తం 1,200 పైగా అవధానాలు చేశాననీ చెప్పారు.

ఒకప్పటికీ, ఇప్పటికీ అవధానాల తీరుతెన్నులలో, పృచ్ఛకుల నుండి ఎదుర్కొంటున్న ప్రశ్నల సవాళ్ల విధానంలో చాలా మార్పులు వచ్చాయనీ, తెలుగుభాషలో ఇంగ్లీష్, ఉర్దూ, సంస్కృతం... ఆ మాటకొస్తే కొన్ని సందర్భాలలో మరెన్నో పరాయి భాషల పదాలు ఛందోబద్ధంగా వాడాల్సిన అవసరం, ఆగత్యం, ఏర్పడిందనీ అన్నారు. అవధాని చేసే అపురూపమైన సాహితీ విన్యాసంలో కాలానుగుణంగా వస్తున్న మార్పులకు అనుగుణంగా నేటి తరం అవధాని కూడా ఏకాగ్రతతో మారాల్సి వస్తున్నదని అన్నారు.



ఇప్పుడు నలుగురు సినిమా నటీమణుల పేర్లు చెప్పి సరస్వతీ స్తోత్రం చేయమనో; నాలుగు ఆంగ్లపదాలు ఇచ్చి విష్ణుమూర్తిని వర్ణించమనో; పాకిస్తాన్, అఫ్గానిస్తాన్, కజకిస్తాన్ లాంటి ఉర్దూ పదాలు ఇచ్చి వెంకటేశ్వర స్వామిని స్తుతించమనో... ఇలా ఏమేమో అడుగుతున్నారనీ, వారి ప్రశ్నలకు అనుగుణంగా సమస్యాపూరణ చేయాల్సి వస్తున్నదనీ అన్నారు. అలా ఆయన ఉపన్యాసం ఆసాంతం ఆసక్తికరంగా, ఎన్నో విషయాలు నేర్చుకునే విధంగా కొనసాగింది. ఏదేమైనా 'ఏకాగ్రత' ఉంటే అన్ని సమస్యలూ తొలగిపోతాయని, అదిలేని నాడు అవధానం కష్టమని ఆయన స్పష్టం చేశారు.

అవధానాలు చేయగలవారు అతికొద్ది మందే ఉంటారు. అమెరికాకు చెందిన 'ఆదిత్య' అతి పిన్న వయస్సులోనే, సొంతంగా ఆన్‌లైన్‌లో శిక్షణ పొంది ద్విభాషావధానం అద్వితీయంగా చేయడమే కాకుండా రికార్డ్ సమయంలో అష్టావధానం చేయగలిగారు. అలా ఎందరో ఇటీవలి కాలంలో అవధానాలు చేస్తున్నారు. అయితే ఇంకా, ఇంకా ఎంతోమంది కొత్తవారు చేయాలి. చేస్తున్నవారిలో పరిపక్వత రావాలి.

సాహిత్యంలో ఒక విశిష్ట ప్రక్రియ అయిన అవధానం... కవి ఆశుకవిత్వ గరిమకూ, సాహితీ పటిమకూ, ధారణా శక్తికీ, పాండితీ ప్రకర్షకూ అత్యున్నత పరీక్ష. పద్యాలన్నిటినీ ధారణ చేసి అదే క్రమంలో ఏకధాటిగా చివరలో వాటిని అప్పగించడం మామూలు విషయం కాదు. ఈ యావత్ ప్రక్రియ కొందరికి అభ్యాసం ద్వారా కూడా సిద్ధిస్తుంది. నేర్చుకుంటే రానిదేదీ లేదు. అయితే, నేర్పేవారు ఉండాలి. కాలం గడిచిపోతున్న కొద్దీ అవధానాలు చేసేవారు తగ్గిపోతున్నారు. ఆస్వాదించే వారూ తగ్గిపోతున్నారు.

మరుమాముల నిర్వహించిన శిక్షణా శిబిరాలకు హాజరైన వారిలో పదేళ్ల అమ్మాయి నుండి ఎంబీబీఎస్ చదువుతున్న వారూ, వయసు మీరినవారూ, సుదూరం నుండి వచ్చినవారూ ఉన్నారు. మన తెలుగు భాషకే సొంతమైన ఈ అవధాన పరంపర నిర్విరామంగా ఆచంద్రతారార్కం కొనసాగాలి. అవధాన పండుగలు నిర్వహించుకునే రోజులు మళ్లీ మళ్లీ రావాలి.

వ్యాసకర్త తెలంగాణ సీఎంఓ ప్రధాన ప్రజా సంబంధాల అధికారి

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, జ్యేష్ఠ మాసం, **తిథి:** శు.నవమి ఉ.8.47 వరకు, తదుపరి దశమి, **నక్షత్రం:** ఉత్తర రా.1.57 వరకు, తదుపరి హస్త, **వర్జ్యం:** ఉ.7.43 నుండి 9.29 వరకు, **దుర్ముహూర్తం:** ప.12.22 నుండి 1.14 వరకు, తదుపరి ప.2.57 నుండి 3.51 వరకు, **అమృతఘడియలు:** సా.6.10 నుండి 7.34 వరకు; **రాహుకాలం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **యమగండం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **సూర్యోదయం:** 5.29, **సూర్యాస్తమయం:** 6.26.

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును. టోల్ ఫ్రీ నం: 1800 425 9899

క్లుప్తంగా...

పొలంలో గడ్డి తగులబెడుతూ..

● పొగతో ఊపిరాడక రైతు మృతి


సత్యగౌడ్

అల్లాదుర్గం(మెదక్): పొలంలో వరి గడ్డి తగులబెడుతూ పొగలో చిక్కుకుని రైతు మృతి చెందాడు. ఈ ఘటన మెదక్ జిల్లా అల్లాదుర్గం మండలం రాంపూర్‌లో ఆదివారం జరిగింది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన తిమ్మాపురం సత్యగౌడ్(57) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇతనికి భార్య, నలుగురు కూతుళ్లు ఉన్నారు. 15 రోజుల క్రితమే చిన్న కూతురు వివాహం జరిపించాడు. ఇటీవలే యాసంగి వరి ధాన్యం విక్రయించాడు. వృథాగా ఉన్న గడ్డిని తగులబెట్టేందుకు ఉదయం పొలానికి వెళ్లాడు. గడ్డికి నిప్పంటించగా పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. మంటలు చుట్టుపక్కల ఉన్న పొలాలకు వ్యాపించి, దట్టమైన పొగ కమ్ముకుంది. ఆ మంటలను ఆర్పేందుకు ప్రయత్నించిన సత్యగౌడ్ పొగలో చిక్కుకున్నాడు. తప్పించుకునే ప్రయత్నంలో కొద్దిదూరం పరిగెత్తి, ఊపిరాడక అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో మృతదేహాన్ని ఇంటికి తరలించారు. కూతురు పెళ్లి చేసి 15 రోజులు కాకముందే సత్యగౌడ్ మృతి చెందడంతో కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

పింఛన్ కోసం రెండు కిలోమీటర్లు నడిచి..

● వడదెబ్బతో వృద్ధుని మృతి


బీక్యానాయక్

కోదాడ రూరల్/ఆత్మకూర్ (ఎస్)(సూర్యాపేట): పింఛన్ డబ్బుల కోసం ఎండలో రెండు కిలోమీటర్లు నడిచి వెళ్లిన ఓ వృద్ధుడు వడదెబ్బతో మృతి చెందాడు. సూర్యాపేట జిల్లా కోదాడ మండల పరిధిలోని బీక్యాతండాలో ఆదివారం జరిగిన ఈ సంఘటన వివరాలివి. తండాకు చెందిన బీక్యా పింఛన్ డబ్బుల కోసం మూడు రోజుల కిందట ఎండలో రెండు కిలోమీటర్ల దూరంలోని రామలక్ష్మీపురం గ్రామానికి నడుచుకుంటూ వెళ్లాడు. అక్కడ గంటన్నర సేపు క్యూలో నిలబడి.. తిరిగి మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో ఎండలోనే ఇంటికి నడుచుకుంటూ రావడంతో వడదెబ్బకు గురయ్యాడు. రెండు రోజులుగా ఇంటివద్ద చికిత్స పొందుతూ ఆదివారం తీవ్ర అస్వస్థతకు గురై మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

మొక్కలకు నీళ్లు పోస్తూ..

వడదెబ్బకు గురై వన సేవకుడు మృతి చెందాడు. సూర్యాపేట జిల్లా ఆత్మకూర్(ఎస్) మండల పరిధిలోని నెమ్మికల్ గ్రామంలో ఆదివారం జరిగిన ఈ సంఘటనపై స్థానికులు తెలిపిన వివరాలివి. గ్రామానికి చెందిన గంపల దేవదాసు (58) రెండేళ్లుగా స్థానికంగా హరితహారం నర్సరీ, పల్లె ప్రకృతి వనంలో వన సేవకుడిగా పనిచేస్తున్నాడు. ఎండలు తీవ్రంగా ఉండడంతో రోజూ మొక్కలకు నీళ్లు పోస్తున్న క్రమంలో వడ దెబ్బకు గురయ్యాడు. రెండురోజులుగా స్థానికంగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతునికి భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు.

రాజీవ్‌గాంధీ విగ్రహం జోలికొస్తే.. కాల్చేస్తా


వనపర్తిలో రాస్తారోకో చేస్తున్న చిన్నారెడ్డి, కాంగ్రెస్ నాయకులు

వనపర్తి: జిల్లాకేంద్రంలో చేపట్టిన రోడ్ల విస్తరణ పనులు రాజకీయ రగడకు దారితీశాయి. వనపర్తి జిల్లాకేంద్రంలోని పాతబజార్ వద్ద కాంగ్రెస్ నాయకులతో కలిసి మాజీ మంత్రి చిన్నారెడ్డి ఆదివారం రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా చిన్నారెడ్డి మాట్లాడుతూ 'అర్ధ రాత్రి అంబేడ్కర్ విగ్రహం తీసేశారు.. రెండు ప్రార్థనా మందిరాల నిర్మాణాలను తొలగించినట్లుగానే.. రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని తీయాలనుకుంటున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. అదే జరిగితే తుపాకీతో కాల్చుతా' అంటూ మాజీ మంత్రి ఆవేశంగా పోలీసుల ఎదుటనే హెచ్చరించారు. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

యాదాద్రిలో భక్తుల రద్దీ

యాదగిరిగుట్ట: వేసవి సెలవులు ముగుస్తుండటం, ఆదివారం కావడంతో యాదాద్రి శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారి ఆలయం కిటకిటలాడింది. ధర్మదర్శనానికి మూడున్నర గంటలు, వీఐపీ దర్శనానికి గంట సమయం పట్టిందని భక్తులు తెలిపారు. మండుటెండకు భక్తులు ఆలయ పరిసరాల్లో ఇబ్బందులు పడాల్సి వచ్చింది. శ్రీస్వామి వారిని 35 వేల మందికి పైగా భక్తులు దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. వివిధ పూజలతో శ్రీస్వామి వారికి నిత్యాదాయం రూ.52,99,823 వచ్చినట్లు అధికారులు వెల్లడించారు.

ఇవేం 'రక్త' సంబంధాలు..

ఆస్తి కోసం అయిన వారినే తుదముట్టిస్తున్న వైనం

ఆస్తి కోసం ఒకనాడు అన్నను, ఇప్పుడు తమ్ముడిని హత్య చేశాడో వ్యక్తి. కన్న తండ్రినే చంపేందుకు ప్రయత్నించాడో యువకుడు. వివాహేతర సంబంధం కోసం ఓ భార్య.. భర్తపై హత్యాయత్నం చేస్తే.. ఆవేశంలో అన్నీ మరిచి కన్న తల్లినే చంపిందో కూతురు. బంధాలు, అనుబంధాలన్నీ మాటలకే.. మనిషిలోని మానవత్వం మాయమైపోతోంది. కన్నవారి మీద, తోబుట్టువుల పట్ల కూడా కనీస ప్రేమ కరువైంది. క్షణికావేశమో.. పగ, ప్రతీకారమో.. కుటుంబ సభ్యులను చంపేందుకు వెనుకాడటం లేదు మనిషి. అందుకు ఈ ఘటనలు ఓ ఉదాహరణ మాత్రమే!

భర్తపై డీజిల్ పోసి.. నిప్పంటించి..

● ఓ భార్య ఘాతుకం
● దాదిగూడ రాంనగర్ కాలనీలో ఘటన


యాదమ్మ


నర్సింహులు

జిన్నారం(పటాన్‌చెరు): వివాహేతర సంబంధానికి అడ్డొస్తున్నాడని భర్తపై డీజిల్ పోసి హత్య చేసేందుకు ఓ భార్య యత్నించింది. ఈ ఘటన జిన్నారం మండలం ఊట్ల గ్రామ పంచాయతీ పరిధిలోని రాంనగర్ కాలనీలో ఆదివారం జరిగింది. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. ఊట్ల గ్రామ పంచాయితీ పరిధిలోని దాదిగూడ గ్రామానికి చెందిన సంకు నర్సింహులు(32)కి దుండిగల్‌కు చెందిన యాదమ్మతో 15 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరు దాదిగూడ సమీపంలోని రాంనగర్ కాలనీలో ఉంటున్నారు. వీరికి ముగ్గురు సంతానం. భార్యాభర్తలు కూలి పని చేసుకుంటూ బతుకుతున్నారు. యాదమ్మ కొంత కాలంగా వివాహేతర సంబంధం పెట్టుకుంది. ఈ విషయం తెలిసిన భర్త తరచూ కుటుంబ సభ్యులకు చెప్పి బాధపడేవాడు. ఇదే విషయమై 27వ తేదీ రాత్రి భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. భర్త తనకు అడ్డంకిగా మారాడని భావించిన యాదమ్మ అతడిని చంపాలని నిర్ణయించుకుంది. గొడవ జరిగాక ఇంటి పక్కనే ఉన్న ఆటో నుంచి డీజిల్ తీసి పెట్టుకుంది. భర్త నర్సింహులు గాఢ నిద్రలోకి వెళ్లాక, రాత్రి 12 గంటల తర్వాత అతడిపై డీజిల్ పోసి నిప్పంటించింది. నర్సింహులు అరుపులతో చుట్టుపక్కల వారు వచ్చి మంటలను ఆర్పేందుకు ప్రయత్నించారు. అప్పటికే 60 శాతం గాయాలయ్యాయి. అంబులెన్స్‌లో హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం నర్సింహులు పరిస్థితి విషమంగా ఉంది. నర్సింహులు తమ్ముడు పోచయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ విజయరావు తెలిపారు. యాదమ్మ పోలీసుల అదుపులో ఉంది.

తల్లిని రోకలితో బాది..

● ఓ కుమార్తె దుర్మార్గం


నాగం నర్సు

నందిపేట్(ఆర్మూర్): తల్లీకూతుళ్ల మధ్య జరిగిన చిన్నపాటి గొడవ హత్యకు దారితీసింది. కూతురు ఆవేశంలో తల్లిని రోకలితో బాది చంపిన ఘటన నిజామాబాద్ జిల్లా నందిపేట మండలం ఉమ్మెడ గ్రామంలో వెలుగు చూసింది. ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. ఉమ్మెడకు చెందిన నాగం నర్సు(52) భర్త చనిపోవడంతో ఉమ్మెడలో ఒంటరిగా నివసిస్తోంది. ఆమెకు ఇద్దరు కూతుర్లు హరిత, అరుణ. పెద్ద కూతురు హరిత.. తల్లి ఉండే ఇంట్లోని పక్కగదిలోనే వేరుగా నివసిస్తోంది. కాగా తల్లీకూతుళ్ల మధ్య కొన్నేళ్ల నుంచి గొడవలు జరుగుతున్నాయి. మృతురాలి రెండో కూతురు అరుణ ఇంట్లో ఈ నెల 26న తొట్లె ఫంక్షన్ జరిగింది. తల్లి నర్సు, పెద్ద కూతురు హరిత వెళ్లారు. అక్కడ నర్సు.. రెండో కూతురు అరుణ బంధువులతో గొడవపడి వారిని దూషించింది. ఇంటికి తిరిగొచ్చాక శుక్రవారం రాత్రి పెద్ద కూతురు హరితకు, మృతురాలికి మధ్య ఈ విషయంలో గొడవ జరిగింది. హరిత ఆవేశంలో తల్లి తల, ముఖంపై రోకలితో ఇష్టం వచ్చినట్లు కొట్టి వెళ్లిపోయింది. శనివారం రాత్రి తన చెల్లిలికి, బంధువులకు ఫోన్ చేసి జరిగిన విషయాన్ని తెలిపింది. వారు వచ్చి చూడగా నర్సు చనిపోయి ఉంది. విషయం తెలుసుకున్న పోలీసులు శనివారం రాత్రి ఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించారు. మృతురాలి మేనల్లుడు గణపురం రవి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

ఆస్తి కోసం తండ్రిపై తనయుడి దాడి

● కత్తితో ఇష్టారీతిన పొడిచిన వైనం


కుమారుడి దాడిలో గాయపడ్డ వృద్ధుడు

తొర్రూరు: వృద్ధాప్యంలో ఉన్న తండ్రిని కంటికి రెప్పలా కాపాడుకోవాల్సిన కొడుకు.. ఆస్తి కోసం హత్యాయత్నానికి ఒడిగట్టాడు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండల కేంద్రంలో ఆదివారం జరిగింది. ఎస్సై లింగారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... వరంగల్ జిల్లా నెక్కొండ మండలం అమీనాపురం గ్రామ శివారు టీక్యా తండాకు చెందిన మాలోతు రాములు అనే 70 ఏళ్ల వృద్ధుడికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అందరికీ పెళ్లిళ్లు చేసి, తనకున్న మూడెకరాల భూమిని కుమారులిద్దరికి సమానంగా పంచాడు. భూ పంపకాల్లో అన్నకు ఎక్కువ భూమి పంచాడని, కుమార్తెలకు డబ్బులు పంపుతున్నాడని తండ్రితో చిన్న కుమారుడు స్వామి కొంత కాలంగా గొడవపడుతున్నాడు. పలుమార్లు పెద్దమనుషుల్లో పంచాయితీ పెట్టి నచ్చజెప్పినా అతని తీరులో మార్పు రాలేదు. రాములు ఈ నెల 26న దంతాలపల్లి పడమటిగూడెం శివారు చారి తండాలోని బంధువుల ఇంటికి వెళ్లాడు. తిరిగి ఇంటికివ వెళ్లేందుకు ఆదివారం తొర్రూరు బస్టాండుకు వచ్చాడు. బస్సు కోసం ఎదురుచూస్తున్న తండ్రిని చాటుగా ఫాలో అవుతున్న స్వామి.. హెల్మెట్ ధరించి వెంట తెచ్చుకున్న కత్తితో తండ్రిపై దాడి చేశాడు. ఏం జరుగుతుందో తెలుసుకునేలోపే తల, పొట్ట, చేతులపై పదునైన కత్తి గాట్లు పడ్డాయి. బస్టాండ్‌లోని ప్రయాణికులు అడ్డుకోవడంతో అక్కడినుంచి పరారయ్యాడు. తీవ్ర రక్త స్రావంతో అల్లాడుతున్న వృద్ధుడి గురించి పోలీసులకు అక్కడున్న ప్రయాణికులు సమాచారం అందించారు. పోలీసులు 108లో వరంగల్‌లోని ఎంజీఎంకు తరలించారు. క్షతగాత్రుడి పెద్ద కుమారుడు శంకర్‌నాయక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

నాడు అన్నను.. నేడు తమ్ముడిని..

● ఆస్తి కోసం హత్య చేసిన సోదరుడు


మృతుడు విజయ్ పాటిల్

మద్నూర్(జుక్కల్): ఆస్తి తగాదాలు నిండు ప్రాణాన్ని బలితీసుకున్నాయి. రక్త సంబంధాన్ని మరిచి తోబుట్టువును దారుణంగా హత్య చేశాడో అన్న. కామారెడ్డి జిల్లా మద్నూర్ మండలం సోనాలలో ఈ దారుణం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం .. సోనాలకు చెందిన గంగాధర్, గినాన్‌బాయికి ముగ్గురు కొడుకులు సంజయ్ పాటిల్, రాజు పాటిల్, విజయ్ పాటిల్(32). వీరికి 18 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఆస్తి విషయంలో గొడవలతో.. గంగాధర్ పెద్ద కొడుకు సంజయ్ పాటిల్‌ను తమ్ముడు రాజు పాటిల్ 2011లోనే హత్య చేసి, శిక్ష అనుభవించాడు. జైలు నుంచి బయటకు వచ్చిన రాజు అప్పటి నుంచి పెద్దపల్లి, హైదరాబాద్‌లలో ఇంగ్లిష్ టీచర్‌గా ప్రైవేటు స్కూళ్లలో పనిచేసేవాడు. కరోనా సమయంలో సొంతూరుకు తిరిగి వచ్చాడు. అయితే గంగాధర్ పేరున ఉన్న 18 ఎకరాల భూమిలోంచి ఐదు ఎకరాల భూమిని అప్పట్లో హత్యకు గురైన సంజయ్ భార్య పేరున చేశారు. 13 ఎకరాల్లోంచి మూడెకరాల భూమిని తమ్ముడు విజయ్ పాటిల్ అమ్మేశాడు. మిగిలిన పదెకరాల భూమిని తాకట్టు పెట్టడంతో రాజుపాటిల్ తీవ్ర ఆగ్రహానికి గురయ్యాడు. ఆస్తి పంపకాలు జరగక ముందే ఇష్టారాజ్యంగా ఎట్లా అమ్మారని? భూమి తాకట్టు పెట్టి అప్పు చేయడం ఏమిటని? ఇద్దరు అన్నదమ్ముళ్ల మధ్య తరచూ గొడవలు జరిగేవి. ఒడిశా రాష్ట్రానికి వెళ్లి అక్కడే ఏదైనా ప్రైవేటు స్కూల్‌లో టీచర్‌గా చేరాలని రాజు పాటిల్ అతడి భార్య సీతిక్ష నిర్ణయించుకున్నారు. అయితే ఆదివారం వేకువజామున నాలుగు గంటల ప్రాంతంలో రాజుపాటిల్ లేచి అదే ఇంట్లో వేరే గదిలో నిద్రిస్తున్న విజయ్‌పాటిల్‌ను విచక్షణ రహితంగా పొడిచాడు. మెడ, కాళ్లు, కడుపులో పలుమార్లు పొడవడంతో కడుపులోని పేగులు బయటకు వచ్చి విజయ్ వెంటనే మృతిచెందాడు. అక్కడి నుంచి నేరుగా మద్నూర్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయిన రాజు పాటిల్ జరిగిన విషయాన్ని పోలీసులకు వివరించాడు. బాన్సువాడ డీఎస్పీ జగన్నాథ్‌రెడ్డి, బిచ్కుంద సీఐ కృష్ణ, మద్నూర్ ఎస్సై కృష్ణారెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని మద్నూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. మృతుడు విజయ్ పాటిల్‌కు ఏడాది క్రితమే పెళ్లి జరిగిందని, భార్యాభర్తల మధ్య గొడవలతో భార్య ఇటీవలే పుట్టింటికి వెళ్లిపోయిందని చెప్పారు.

పేదలందరినీ ధనికులుగా మారుస్తా

● టీడీపీ తొలి విడత మేనిఫెస్టోలో స్పష్టీకరణ
● 'భవిష్యత్తుకు గ్యారంటీ'అంటూ మహానాడులో విడుదల చేసిన చంద్రబాబు
● వచ్చే దసరా నాటికి పూర్తి స్థాయి మేనిఫెస్టో విడుదల


రాజమండ్రిలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద చంద్రబాబు అభివాదం. చిత్రంలో బాలకృష్ణ తదితరులు

సాక్షి, అమరావతి: ఏపీలో పేదలే లేకుండా చేస్తానని, అందరినీ ధనికులుగా మారుస్తానని టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారు. భవిష్యత్తుకు గ్యారంటీ పేరుతో ఆదివారం మహానాడులో ఆయన తొలి విడత ఎన్నికల మేనిఫెస్టో విడుదల చేశారు. మహిళలు, యువకులు, రైతులను ఆకర్షించడమే లక్ష్యంగా అందులో ఆరు అంశాలను పొందుపరిచారు. అధికారంలోకి వస్తే మహాశక్తి, యువగళం, అన్నదాత, ఇంటింటికీ నీరు, బీసీలకు రక్షణ చట్టం, పూర్ టూ రిచ్ పేర్లతో ఆయా వర్గాలకు ప్రయోజనాలు కల్పిస్తామని చెప్పారు. మహానాడు ముగింపు సందర్భంగా రాజమండ్రిలో ఆదివారం జరిగిన బహిరంగ సభలో ఆయన ఈ మేనిఫెస్టో ప్రకటించారు. ప్రతి మహిళను మహాశక్తిగా తయారు చేస్తానంటూ ఆడబిడ్డ నిధి కింద ప్రతి నెలా 18–59 సంవత్సరాల లోపు వారికి రూ.1500 నేరుగా వారి అకౌంట్‌లో వేస్తామన్నారు. ఒక ఇంట్లో ఇద్దరు మహిళలుంటే ఇద్దరికీ ఇస్తామన్నారు. ఈ లెక్కన ఏటా రూ.18 వేలు, ఐదేళ్లలో రూ.90 వేలు ఇస్తామన్నారు. జగన్ అమలు చేసే అమ్మఒడి పథకం బూటకమని చెబుతూ.. తాను అదే తరహాలో తల్లికి వందనం పేరుతో సంవత్సరానికి ప్రతి బిడ్డకు రూ.15 వేలు ఇస్తానని తెలిపారు. ఒక ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉంటే అంతమందికి ఈ పథకం ఇస్తానని చెప్పారు. ఇద్దరి కంటే ఎక్కువ మంది పిల్లలున్నా మహిళలకు స్థానిక సంస్థల్లో పోటీ చేసే అవకాశం కల్పిస్తామని, గతంలో తాను పొరపాటున ఇద్దరు పిల్లల నిబంధన పెట్టానని చెప్పారు. ఇప్పుడు ఆ నిర్ణయాన్ని మార్చుకుంటున్నట్లు తెలిపారు. దీపం పథకం మాదిరిగా మహిళలకు సంవత్సరానికి 3 సిలిండర్లు ఉచితంగా ఇస్తానన్నారు. ఆడ బిడ్డలకు ఆయా జిల్లాల్లో ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించే అవకాశం కల్పిస్తామని చెప్పారు.

20 లక్షల ఉద్యోగాలు..: యువగళం విన్నామని, ఐదు సంవత్సరాల్లో 20 లక్షల మందికి ఉద్యోగాలు ఇస్తామని, ఉద్యోగాలు వచ్చే వరకు నెలకు రూ.3 వేల చొప్పున నిరుద్యోగ భృతి ఇస్తామని తెలిపారు. ప్రతి రైతుకి ఇప్పుడు ఇచ్చేది కాకుండా సంవత్సరానికి రూ.20 వేలు ఇస్తామని చెప్పారు. అధికారంలోకి రాగానే ప్రతి ఇంటికీ మంచి నీరు ఇస్తామన్నారు. బీసీలకు రక్షణ కల్పించేందుకు ఒక చట్టాన్ని తీసుకువస్తామన్నారు. పూర్ టు రిచ్ పేరుతో పేదవారిని ధనికులుగా చేసి ప్రపంచానికే ఆదర్శంగా నిలుస్తామని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో పేదవాడు అనేవాడు లేకుండా చేస్తానని, ప్రతి పేదవాడినీ ధనికుడిగా చేసే బాధ్యత తనదేనన్నారు. ఇందు కోసం సమాజంలో పైకి వచ్చిన వారు ఒకరిద్దరు పేద వారిని ధనికులుగా చేసే బాధ్యత తీసుకోవాలన్నారు. పబ్లిక్, ప్రైవేట్ పార్టనర్‌షిప్‌తో దీన్ని చేస్తామన్నారు. దసరా నాటికి పూర్తి స్థాయి మేనిఫెస్టో విడుదల చేస్తానని తెలిపారు. రాష్ట్రంలో అసమర్థ పాలన సాగుతోందని చెప్పారు.

తడబడిన లోకేశ్.. సుత్తికొట్టిన బాలకృష్ణ: మహానాడు ముగింపు సభ మధ్యాహ్నం బదులు సాయంత్రం 6 గంటల తర్వాత మొదలైంది. దీంతో చాలా మంది సభ ప్రారంభం కాకముందే వెళ్లిపోయారు. టీడీపీ నేత పయ్యావుల కేశవ్ సభను నిర్వహించగా ఏపీ, తెలంగాణ రాష్ట్రాల అధ్యక్షులు అచ్చెన్నాయుడు, కాసాని జ్ఞానేశ్వర్ తదితరులు ప్రసంగించారు. లోకేశ్ తన ప్రసంగంలో పలుసార్లు తడబడగా, బాలకృష్ణ సుత్తికొడుతూ కార్యకర్తలకు విసుగు తెప్పించారు.

పేదలను ధనికుల్ని చేస్తావా?

● అమరావతిలో పేదలకు సీఎం జగన్ సెంటు భూమి ఇస్తుంటే.. నువ్వు రగిలిపోలేదా?
● అధికారంలో ఉన్నప్పుడు ఒక్క పేదనైనా ధనికుడ్ని చేశావా?
● చంద్రబాబుపై ఏపీ మంత్రి అంబటి ఫైర్



సాక్షి, అమరావతి: అమరావతి ప్రాంతంలో ఏపీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పేదలకు ఒక సెంటు భూమి చొప్పున ఇస్తుంటే కడుపు మంటతో రగిలిపోయిన నువ్వు పేదలను ధనవంతులుగా చేస్తావా? అంటూ టీడీపీ అధినేత చంద్రబాబుపై ఏపీ మంత్రి అంబటి రాంబాబు విరుచుకుపడ్డారు. సీఎంగా పనిచేసిన 14 ఏళ్లలో ఒక్క పేదనైనా ధనవంతుడిగా చేశా వా? అని ప్రశ్నించారు. ప్రజాధనాన్ని దోచేసి.. ఈనాడు రామోజీ, ఆంధ్రజ్యోతి రాధాకృష్ణ, టీవీ5 నాయుడు, సుజనాచౌదరి వంటి పేదలను ధనవంతుల్ని చేయడం కోసం పరిపాలన చేసిన చరిత్ర నీదేనంటూ చంద్రబాబుపై మండిపడ్డారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఆదివారం రాత్రి అంబటి మీడియాతో మాట్లాడుతూ.. అమరావతిలో ఒక సెంటు చొప్పున భూమిని పేదలకు ఇచ్చేందుకు సీఎం జగన్ సిద్ధమైతే.. దాన్ని హైకోర్టు, సుప్రీంకోర్టులో సవాల్ చేయడం ద్వారా చంద్రబాబు అడ్డుకునేయత్నం చేశారని గుర్తుచేశారు. దీనిపై సుప్రీం మొట్టికాయలు వేస్తే.. ప్రభుత్వంపై ఎల్లో మీడియాలో దుష్ప్రచారం చేయించడం ద్వారా పేదలపై బాబు కక్ష తీర్చుకున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. 'మహానాడులో హామీలను ప్రకటిస్తూ మాటమాటకీ తమ్ముళ్లూ.. నా మాట నమ్మారా? అంటూ అడిగావు. అంటే.. నువ్వు తీసుకొచ్చిన కార్యకర్తలే నీ మాట నమ్మరనే అనుమానం నీది చంద్రబాబూ. తల్లికి వందనం పేరుతో ప్రతి తల్లికి రూ.15 వేలు.. రైతులకు ఏడాదికి రూ.20 వేలు.. నిరుద్యోగ భృతి కింద నెలకు రూ.3 వేలు ఇస్తానని చంద్రబాబు హామీలు ఇచ్చాడు. అసలు నీ 40 ఏళ్ల రాజకీయ చరిత్రలో.. నువ్వు ఎనాడైనా నీ హామీల్లో ఒక్కటైనా అమలుచేశావా? 2014 ఎన్నికల్లో రైతుల రుణాలను పూర్తిగా మాఫీ చేస్తానని హామీ ఇచ్చావు. అరొకరగా మాఫీచేసి రైతులను మోసం చేశావు. ఇదేం న్యాయమని మీడియా అడిగితే దబాయించలేదా చంద్రబాబూ? 2014 ఎన్నికల్లో నిరుద్యోగ భృతికింద నెలకు రూ.2 వేల చొప్పున ఇస్తానని చంద్రబాబు హామీ ఇచ్చారు. కానీ, ఇవ్వకుండా యువతను మోసం చేశాడు. ఎన్నికల మేనిఫెస్టోను భగవద్గీత, ఖురాన్, బైబుల్‌గా సీఎం జగన్ భావించి అమలు చేస్తున్నారు. ఇప్పటికే 98.5 శాతం హామీలను అమలుచేశారు. విశ్వసనీయతకు వైఎస్ జగన్ ప్రతీకైతే.. ప్రజలను మోసంచేసే చంద్రబాబు ఓ 420, ఓ చీటర్'అని అంబటి ధ్వజమెత్తారు.

ప్రమాదమని తెలిసినా..



రవాణా ఖర్చులు భరించలేక పంట ఉత్పత్తులను వ్యవసాయ మార్కెట్లకు తరలించేందుకు రైతులు ప్రమాదాలతో చెలగాటమాడుతున్నారు. ఓ రైతు తన ఐదు బస్తాల మిర్చి పంటను మహబూబాబాద్ మార్కెట్‌కు తీసుకొచ్చేందుకు ద్విచక్ర వాహనంపై పెట్టుకుని ఇలా ప్రయాణం చేశాడు.
– మహబూబాబాద్ రూరల్

నా చేతిలో 'ప్రభుత్వ స్టీరింగ్' అవాస్తవం

ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ

● నా ఆనందం కోసమే సర్కారు సచివాలయం కడితే అక్కడ కూల్చిన మసీదులు నిర్మించలేదేం?
● సీఎం హామీ ఇచ్చిన ఇస్లామిక్‌సెంటర్ నిర్మాణం ఇంతవరకు జరగలేదెందుకు?
● నా చేతిలో స్టీరింగ్ ఉంటే సాగు ప్రాజెక్టులకు హిందూ దేవతల పేర్లు ఉండేవా?
● ఆదిలాబాద్ సభలో అమిత్ షా, బండి సంజయ్‌లకు అసదుద్దీన్ ప్రశ్నలు



సభలో మాట్లాడుతున్న అసదుద్దీన్ ఓవైసీ

కైలాస్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వ స్టీరింగ్ తన చేతిలోనే ఉందంటూ కేంద్ర హోంమంత్రి అమిత్ షా, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ఇటీవల చేసిన ఆరోపణలను ఏఐఎంఐఎం అధ్యక్షుడు, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఖండించారు. అలాగే తన ఆనందం కోసమే ప్రభుత్వం కొత్త సచివాలయం నిర్మించిందన్న ఆరోపణలనూ ఆయన తోసిపుచ్చారు. బీజేపీ నేతలు వాస్తవాలు తెలుసుకోకుండా మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. ఆదివారం రాత్రి ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డైట్ కళాశాల మైదానంలో ఎంఐఎం బహిరంగ సభకు ముఖ్య అతిథిగా హాజరైన అసద్... బీజేపీ నేతల తీరుపై మండిపడ్డారు. గుజరాత్‌లోని ఓ హనుమాన్ మందిరం నమూనా ఆధారంగానే కొత్త సచివాలయం నిర్మించారని... కానీ గుమ్మటాలు ఉన్నందున దాన్ని తన కోసమే ప్రభుత్వం నిర్మించిందని బండి సంజయ్ చెబుతున్నారన్నారు. అయితే తన ఆనందం కేవలం మసీదులోనే ఉంటుందని స్పష్టం చేశారు. సచివాలయ నిర్మాణం కోసం రెండు మసీదులను కూల్చేశారని... ఒకవేళ బీజేపీ నేతలు చెబుతున్నట్లుగా సర్కారు స్టీరింగ్ తన చేతిలోనే ఉంటే వాటిని తిరిగి ఎందుకు నిర్మించలేదో సమాధానం చెప్పే దమ్ము వారికి ఉందా? అని అసద్ ప్రశ్నించారు.

మందిరాలకు రూ. వేల కోట్ల ఖర్చు...

బీఆర్‌ఎస్ ప్రభుత్వం ముస్లింల కోసమే పనిచేస్తోందని వారు ఆరోపిస్తున్నారని... అలాంటప్పుడు సీఎం కేసీఆర్ గతంలో హామీ ఇచ్చిన విధంగా హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో ఇస్లామిక్ సెంటర్ నిర్మాణం ఇంతవరకు ఎందుకు జరగలేదని అసద్ ప్రశ్నించారు. అదే సమయంలో హైదరాబాద్‌లోని గోపన్‌పల్లిలో రాష్ట్ర ప్రభుత్వం నిర్మించిన బ్రాహ్మణ సదన్ ప్రారంభానికి సిద్ధంగా ఎలా ఉందని నిలదీశారు. దీని ప్రారంభోత్సవానికి కర్ణాటక, తమిళనాడు, ఏపీలోని అన్ని మఠాధిపతులను ప్రభుత్వం ఆహ్వానిస్తోందన్నారు. ప్రభుత్వం రూ. 2,500 కోట్ల నిధులను మందిరాల కోసం ఖర్చు చేసిందని, ఎన్నో సాగునీటి ప్రాజెక్టులకు హిందూ దేవతల పేర్లు పెట్టారన్నారు. స్టీరింగ్ తన చేతిలో ఉంటేనే ఈ పనులన్నీ జరిగాయా? అని బీజేపీ నేతలను ప్రశ్నించారు. అమిత్ షా, బండి సంజయ్, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిలకు తనపై విమర్శలు చేయడం అలవాటుగా మారిందని ఒవైసీ మండిపడ్డారు. పార్లమెంట్‌ను ప్రారంభించిన ప్రధాని మోదీ కేవలం హిందూ మఠాధిపతులనే ఆహ్వానించడం సరికాదన్నారు. దేశంలో ముస్లిం, సిక్కు, ఇసాయి వంటి మతాలు ఉన్నాయని అన్ని మతాలు గౌరవించే పార్లమెంట్ ప్రారంభోత్సవానికి వారిని కూడా పిలిస్తే గౌరవంగా ఉండేదన్నారు. ఎంఐఎం ఎవరి బెదిరింపులకు భయపడే పార్టీ కాదని, అన్ని వర్గాల ప్రజలకు రాజ్యాంగపరంగా ఫలాలు అందాలని కోరుకుంటుందని తెలిపారు.

ధాన్యం అమ్మడానికి వెళ్లి..

● అన్‌లోడింగ్ కాక తిరిగి వస్తుండగా రోడ్డు ప్రమాదం..
● ఆస్పత్రిలో చికిత్స పొందుతూ రైతు కన్నుమూత
● హనుమకొండ జిల్లాలో ఘటన


కంఠాత్మకూర్‌లో ధర్నా చేస్తున్న రైతులు


చంద్రు

దామెర/నడికూడ: ఇటు ధాన్యం కొనుగోలు కేంద్రం నిర్వాహకుల నిర్లక్ష్యం.. అటు మిల్లర్ అన్‌లోడ్ చేయడంలో జాప్యం.. వెరసి రోడ్డు ప్రమాదంలో ఓ రైతు నిండు ప్రాణం పోయింది. ఈ ఘటన హనుమకొండ జిల్లా దామెర మండలం ఊరుగొండలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ ముత్యం రాజేందర్ కథనం ప్రకారం.. నడికూడ మండలం కంఠాత్మకూర్ గ్రామానికి చెందిన పేరబోయిన చంద్రు (48) తన ఎకరన్నర భూమిలో వరి పండించాడు. శనివారం గ్రామంలోని ఐకేపీ కేంద్రంలో ధాన్యం అమ్మాడు. ఆ ధాన్యాన్ని దుర్గంపేట్ సమీపంలోని మణికంఠ రైస్‌మిల్‌కు కేటాయించగా చంద్రు సొంతంగా ట్రాక్టర్ మాట్లాడుకుని ధాన్యం లోడ్‌తో మిల్లు వద్దకు వచ్చాడు. అప్పటికే ఎక్కువ ట్రాక్టర్లు ఉండటం.. అన్‌లోడింగ్ చేయడం ఇప్పుడు సాధ్యం కాదని మిల్లు నిర్వాహకులు తెలపడంతో పక్క గ్రామమైన రామకృష్ణాపూర్‌కు చెందిన ట్రాక్టర్ ఎక్కి స్వగ్రామానికి బయలుదేరాడు. ఈ క్రమంలో ఊరుగొండ సమీపంలో జాతీయరహదారిపై వేగంగా వస్తున్న లారీ.. చంద్రు ప్రయాణిస్తున్న ట్రాక్టర్‌ను ఢీకొట్టింది. దీంతో ట్రాక్టర్ పైన ఉన్న చంద్రు ఎగిరి కిందపడటంతో తలకు, కాళ్లకు, చేతులకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు 108లో ఆయనను వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. తర్వాత మెరుగైన చికిత్స కోసం ఆయనను ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా ఆదివారం తెల్లవారుజామున మృతిచెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రైతుల ధర్నా

రోడ్డు ప్రమాదంలో చనిపోయిన రైతు చంద్రు కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ పలువురు రైతులు ఆదివారం కంఠాత్మకూర్ బస్టాండ్ వద్ద ధర్నాకు దిగారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల ఒక నిండు ప్రాణం పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యం తరలింపు బాధ్యత కొనుగోలు కేంద్రాల నిర్వాహకులదే అయినా, రైతులు సొంతంగా వాహనాలు పెట్టుకుని మిల్లులకు తరలించాల్సిన పరిస్థితి ఉందని వాపోయారు. ప్రభుత్వం చంద్రు కుటుంబానికి రైతుబీమా, రూ.20 లక్షల పరిహారం అందించాలని కోరారు. ఇప్పటికైనా అధికారులు రైతుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

ANDHRA PRADESH CENTRAL POWER DISTRIBUTION CORPORATION LIMITED
Dr.Y.S.R VIDYUT SOUDHA, CORPORATE OFFICE, ITI COLLEGE ROAD, VIJAYAWADA-520 008
Tender Notice No: DIRECTOR (Tech)/ DEE/ CIVIL/ No.02/2023-24, Dt: 29-05-2023
APCPDCL invites online bids under e-procurement for the work of construction Of Corporate Office building (G+3 floors) at Gunadala, Vijayawada as follows:
➤ Civil-CPWT:03/2023-24.
Tenderers can have further details and download the tender schedule from e-procurement from 29-05-2023. Contact: 94901 56504
Director (Technical)
APCPDCL::VIJAYAWADA

శుభోదయం.. నవోదయం

నూతన పార్లమెంట్‌లో ప్రధాని మోదీ ఉద్ఘాటన



- పార్లమెంట్ కొత్త భవనం ప్రపంచ దేశాల ప్రగతికి స్ఫూర్తి
- ఇక్కడ తీసుకొనే ప్రతి నిర్ణయం దేశ ఉజ్వల భవిష్యత్తుకు పునాది వేస్తుంది
- అణగారిన వర్గాల సాధికారతకు ఇక్కడే ముందడుగు
- కొత్త భవనంలోని ప్రతి ఇటుక, ప్రతి గోడ పేదల సంక్షేమానికే అంకితం
- పార్లమెంట్‌లో మరికొంత మంది ఎంపీలు చేరుతారు
- 2026 తర్వాత పునర్వ్యవస్థీకరణతో ఎంపీల స్థానాలు పెరుగుతాయి

న్యూఢిల్లీ: పార్లమెంట్ నూతన భవన ప్రారంభోత్సవం దేశ అభివృద్ధి ప్రయాణంలో చిరస్థాయిగా నిలిచిపోయే ఘట్టమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అభివర్ణించారు. స్వావలంబన, అభివృద్ధి భారత్‌కు ఇదొక శుభోదయమని చెప్పారు. మన పార్లమెంట్ కొత్త భవనం ఇతర దేశాల ప్రగతికి సైతం స్ఫూర్తిగా నిలుస్తుందని ఉద్ఘాటించారు. ఆదివారం పార్లమెంట్ కొత్త భవన ప్రారంభోత్సవం సందర్భంగా లోక్‌సభ సభామందిరంలో ప్రధాని మోదీ ప్రసంగించారు. 'నవ భారత్' ఆశలు ఆకాంక్షలను, నూతన లక్ష్యాలను కొత్త భవనం ప్రతిబింబిస్తోందని అన్నారు. ఇక్కడ తీసుకొనే ప్రతి నిర్ణయం దేశ మహోన్నత భవిష్యత్తుకు పునాది వేస్తుందని చెప్పారు. పేదలు, దళితులు, వెనుకబడిన తరగతులు, గిరిజనులు, దివ్యాంగులు, ఇతర అణగారిన వర్గాల సాధికారతకు ఇక్కడే ముందడుగు పడుతుందని వివరించారు. పార్లమెంట్ కొత్త భవనంలోని ప్రతి ఇటుక, ప్రతి గోడ పేదల సంక్షేమానికే అంకితమని నరేంద్ర మోదీ తేల్చిచెప్పారు. ఆయన ఇంకా ఏం మాట్లాడారంటే...

బానిస మనస్తత్వాన్ని వదిలించుకుంటున్నాం

''75వ స్వాతంత్య్ర వేడుకలను పురస్కరించుకొని దేశ ప్రజలు అమృత మహోత్సవాన్ని జరుపుకుంటున్నారు. ఈ సందర్భంగా ప్రజలు పార్లమెంట్ కొత్త భవనాన్ని తమ ప్రజాస్వామ్యానికి కానుకగా ఇచ్చుకున్నారు. దేశ ప్రజలకు అభినందనలు తెలియజేస్తున్నా. మన దేశ వైవిధ్యాన్ని, ఘనమైన సంప్రదాయాన్ని పార్లమెంట్ కొత్త భవన నిర్మాణశైలి చక్కగా ప్రతిబింబిస్తుండడం హర్షణీయం. వందల సంవత్సరాల వలస పాలన వల్ల అణువణువునా పాకిపోయిన బానిస మనస్తత్వాన్ని నవ భారతదేశం వదిలించుకుంటోంది. మహాత్మాగాంధీ చేపట్టిన సహాయ నిరాకరణ ఉద్యమం దేశ ప్రజలను మేల్కొల్పింది. నూతన చైతన్యాన్ని నింపింది. స్వాతంత్య్ర కాంక్షను రగిలించింది. స్వాతంత్య్ర పోరాటానికి అంకితమయ్యేలా ప్రజల్లో ఆత్మవిశ్వాసం కలిగించింది. రాబోయే 25 ఏళ్లలో దేశ అభివృద్ధి కోసం ప్రతి పౌరుడు అదే తరహాలో పనిచేయాలి. సహాయ నిరాకరణ ఉద్యమం 1922లో ముగిసింది. మరో 25 ఏళ్లకు.. 1947లో స్వాతంత్య్రం వచ్చింది. 2047లో మనం వందో స్వాతంత్య్ర దినోత్సవాలను జరుపుకోబోతున్నాం. 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దుకోవడానికి మనమంతా కంకణబద్ధులమై పనిచేయాలి.



పార్లమెంట్ నిర్మాణ కార్మికులకు కానుకలు

కొత్త భవనం.. ప్రజాస్వామ్య దేవాలయం

ఇది కేవలం ఒక నిర్మాణం కాదు, 140 కోట్ల మంది ఆకాంక్షలకు, కలలకు ప్రతిరూపం. మన స్వాతంత్య్ర సమర యోధుల కలలను సాకారం చేయడానికి ఇదొక వేదిక. ఇది మన ప్రజాస్వామ్య దేవాలయం. భారతదేశ దృఢసంకల్పం ప్రపంచానికి ఇస్తున్న సందేశమిది. ప్రతి దేశ చరిత్రలో అమరత్వం పొందిన క్షణాలు కొన్ని ఉంటాయి. కాలం ముఖచిత్రంపై కొన్ని తేదీలు చెరిగిపోని సంతకంగా మారుతాయి. 2023 మే 28 కూడా అలాంటి అరుదైన సందర్భమే. పేదల ప్రజల సాధికారత, అభివృద్ధి, పునర్నిర్మాణం కోసం గత తొమ్మిదేళ్లుగా కృషి చేస్తున్నాం. ఇది నాకు సంతృప్తినిస్తున్న క్షణం. పేదలకు 4 కోట్ల ఇళ్లు నిర్మించి ఇచ్చాం. 11 కోట్ల మరుగుదొడ్లు నిర్మించాం. గ్రామాలను అనుసంధానించడానికి 4 లక్షల కిలోమీటర్లకుపైగా రహదారులు నిర్మించాం. 50,000కుపైగా అమృత సరోవరాలు(చెరువులు), 30,000కుపైగా కొత్త పంచాయతీ భవనాలు నిర్మించాం. పంచాయతీ భవనాల నుంచి పార్లమెంట్ కొత్త భవనం దాకా కేవలం ఒకేఒక్క స్ఫూర్తి మమ్మల్ని ముందుకు నడిపించింది. అదే.. దేశ అభివృద్ధి, ప్రజల అభివృద్ధి. కొత్త దారుల్లో నడిస్తేనే కొత్త ఆవిష్కరణలు సాధ్యమవుతాయి. భారత్ ఇప్పుడు కొత్త లక్ష్యాలను నిర్దేశించుకుంది. నూతనోత్సాహం కనిపిస్తోంది. కొత్త ఆలోచన, కొత్త ప్రయాణం. దిశ కొత్తదే, విజన్ కొత్తదే. మన విశ్వాసం, తీర్మానం కూడా కొత్తవే. ఇప్పుడు ప్రపంచం మొత్తం భారత్ వైపు చూస్తోంది. భారత్ ముందుకు నడిస్తే ప్రపంచం కూడా ముందుకు నడుస్తుంది.

ఆత్మనిర్భర్ భారత్ ఆవిర్భావానికి సాక్షి

ఇప్పటి అవసరాలకు పాత భవనం సరిపోవడం లేదు. అందుకే కొత్తది నిర్మించాం. కొత్తగా మరికొంత మంది ఎంపీలు చేరనున్నారు. 2026 తర్వాత పునర్వ్యవస్థీకరణతో పార్లమెంట్ స్థానాలు పెరుగుతాయి. సెంగోల్‌కు తగిన గౌరవం దక్కుతుండడం సంతోషకరం. చోళ సామ్రాజ్యంలో సెంగోల్‌ను కర్తవ్య మార్గం, సేవా మార్గం, జాతీయ మార్గానికి గుర్తుగా పరిగణించేవారు. కొత్త భవన నిర్మాణంలో 60,000 మంది కార్మికులు పాల్గొన్నారు. ఇక్కడి డిజిటల్ గ్యాలరీని వారికే అంకితమిస్తున్నాం. ఈ కొత్త భవనం ఆత్మనిర్భర్ భారత్ ఆవిర్భావానికి, వికసిత భారత్ దిశగా మన ప్రయాణానికి ఒక సాక్షిగా నిలుస్తుంది.

భారత్ విజయం ప్రపంచ విజయం

భారత్‌లాంటి పూర్తి వైవిధ్యం, అధిక జనాభా ఉన్న దేశం పరిష్కరించే సవాళ్లు, సాధించే విజయాలు చాలా దేశాలకు స్ఫూర్తిగా నిలుస్తాయి. రాబోయే రోజుల్లో భారత్ సాధించే ప్రతి విజయం ప్రపంచం సాధించే విజయంగా మారుతుంది. భారత్ కేవలం ఒక ప్రజాస్వామ్య దేశం కాదు, ప్రజాస్వామ్యానికి తల్లి కూడా. మన ప్రజాస్వామ్యమే మనకు స్ఫూర్తి. మన రాజ్యాంగమే మన బలం. ఈ స్ఫూర్తికి, బలానికి ఉత్తమమైన ప్రతీక పార్లమెంట్. పాత కొత్తల కలయికకు పరిపూర్ణ ఉదాహరణ పార్లమెంట్ నూతన భవనం. శతాబ్దాల బానిసత్వం కారణంగా మన ఉజ్వలమైన భవన నిర్మాణ శైలికి, పట్టణ ప్రణాళికకు దూరమయ్యాం. ఇప్పుడు ప్రాచీన వైభవాన్ని పునరుద్ధరించుకుంటున్నాం. పార్లమెంట్ కొత్త భవనాన్ని చూసి ప్రతి ఒక్కరూ గర్వపడుతున్నారు. మన వారసత్వం వైభవం, నైపుణ్యాలు, సంస్కృతితోపాటు రాజ్యాంగ వాణికి సైతం ఈ భవనం ప్రాతినిధ్యం వహిస్తోంది. దేశవ్యాప్తంగా వేర్వేరు ప్రాంతాల నుంచి తీసుకొచ్చిన సామగ్రితో కొత్త భవనం నిర్మించాం. ఏక్ భారత్, శ్రేష్ట భారత్‌కు ఇదొక గుర్తు.



పార్లమెంట్ ప్రాంగణంలో శిలాఫలకం ఆవిష్కరించాక మోదీ అభివాదం



రాజదండాన్ని మోదీకి అందజేస్తున్న మఠాధిపతులు



రాత్రివేళ విద్యుత్ వెలుగుల్లో కొత్త పార్లమెంట్



కొత్త పార్లమెంట్‌లో ఆసీనులైన అమిత్ షా, గడ్కరీ తదితరులు



నూతన పార్లమెంట్‌లో ఏపీ సీఎం జగన్‌మోహన్ రెడ్డి, నిర్మలా సీతారామన్ తదితరులు



కార్యక్రమంలో పాల్గొన్న దేవెగౌడ, రామ్‌నాథ్ కోవింద్, నడ్డా, గోయల్ తదితరులు

ప్రారంభోత్సవం సాగింది ఇలా..!

అత్యాధునిక హంగులు, సకల సదుపాయాలతో నిర్మించిన ప్రజాస్వామ్య దేవాలయం పార్లమెంటు కొత్త భవనాన్ని ఆదివారం ఉదయం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించారు. అట్టహాసంగా ఒక ఉత్సవంలా సాగిన ఈ వేడుకలో ప్రధాని చారిత్రక ప్రాధాన్యమున్న అధికార మార్పిడికి గుర్తయిన రాజదండం (సెంగోల్)ను లోక్‌సభ ఛాంబర్‌లో ప్రతిష్ఠించారు. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా సమక్షంలో పార్లమెంటు భవనాన్ని జాతికి అంకితమిచ్చారు.

- సంప్రదాయ దుస్తులు ధరించిన ప్రధాని మోదీ ఉదయం 7.30 గంటలకి పార్లమెంటుకు వచ్చారు. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ప్రధానికి ఎదురేగి స్వాగతం పలికారు.
- పార్లమెంటు ఆవరణలో ఉన్న మహాత్మాగాంధీ విగ్రహం దగ్గర ప్రధాని మోదీ నివాళులర్పించారు
- అక్కడ నుంచి నేరుగా కొత్త భవనం ఆవరణలో ఏర్పాటు చేసిన పూజామండపానికి చేరుకున్నారు. అక్కడ ప్రధానికి వేదపండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. కర్ణాటక శృంగేరి మఠాధిపతులు వేద మంత్రాలు పఠిస్తూ ఉంటే ప్రధాని మోదీ గణపతి హోమం నిర్వహించారు. దీంతో పార్లమెంటు కొత్త భవనం ప్రారంభోత్సవ కార్యక్రమం అంగరంగ వైభవంగా సాగింది.
- అనంతరం వేద పండితులు ప్రధానికి శాలువా కప్పి ఆశీర్వాదాలు అందజేశారు.
- అక్కడ నుంచి తమిళనాడు నుంచి వచ్చిన 21 మంది పీఠాధిపతులు వద్దకి వెళ్లారు. వారికి నమస్కరించారు. అప్పటికే పూజలు చేసి సిద్ధంగా అక్కడ ఉంచిన చారిత్రక సెంగోల్ ఎదుట ప్రధాని సాష్టాంగ నమస్కారం చేశారు. వారు అందించిన సెంగోల్‌ను చేత పుచ్చుకున్న ప్రధాని మోదీ వీనుల విందుగా నాదస్వరం వాయిస్తూ ఉంటే, వేద పండితులు మంత్రాలు పఠిస్తూ ఉంటే స్పీకర్ ఓం బిర్లా వెంటరాగా ఒక ఊరేగింపుగా వెళ్లి సెంగోల్‌ను లోక్‌సభ ఛాంబర్‌లోకి తీసుకువెళ్లి స్పీకర్ కుర్చీకి కుడివైపు ప్రతిష్ఠించారు.



రూ. 75 స్మారక నాణెం ఆవిష్కరణ దృశ్యం

- అనంతరం స్పీకర్ ఆసీనులయ్యే సీటు దగ్గర ప్రధాని జ్యోతి ప్రజ్వలన చేశారు.
- లోక్‌సభ నుంచి తిరిగి ప్రధాని మోదీ పూజాస్థలికి చేరుకున్నారు. అక్కడ ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని స్పీకర్ ఓం బిర్లా సమక్షంలో ఆవిష్కరించి నూతన పార్లమెంటు భవనాన్ని జాతికి అంకితం చేశారు.
- అనంతరం కొత్త భవన నిర్మాణంలో పాలుపంచుకున్న కొంతమంది కార్మికులకు శాలువాలు కప్పి సత్కరించారు. వారి ప్రతిభకి గుర్తింపుగా జ్ఞాపికలను బహూకరించారు.
- అనంతరం సర్వమత ప్రార్థనలు నిర్వహించారు.
- దేశానికి స్వాతంత్య్రం వచ్చి 75 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా రూ.75 స్మారక నాణేన్ని ప్రధాని ఆవిష్కరించారు. త్రిభుజాకారంలో ఉన్న కొత్త భవనం ముద్రించి ఉన్న స్టాంపు, కవర్‌ని కూడా ఆవిష్కరించారు.
- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ పంపించిన సందేశాలను రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్ చదివి వినిపించారు.
- కార్యక్రమంలో భాగంగా లోక్‌సభలో నేతల సమక్షంలో జాతీయ గీతం అయిన జనగణమన వినిపించారు.
- ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, అమిత్ షా, ఎస్. జైశంకర్, అశ్వినీ వైష్ణవ్, మన్‌సుఖ్ మాండవీయ, జితేంద్ర సింగ్, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తదితరులు పాల్గొన్నారు.
- నూతన భవనం ప్రారంభోత్సవానికి కనీసం 20 విపక్ష పార్టీలు హాజరు కాలేదు.

రాజదండం ప్రతిష్ఠాపన దృశ్యం



ప్రారంభోత్సవమా? పట్టాభిషేకమా?

కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ట్వీట్

న్యూఢిల్లీ: పార్లమెంట్ అనేది ప్రజల గొంతుక అని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత రాహుల్ గాంధీ చెప్పారు. ప్రధాని నరేంద్ర మోదీ పార్లమెంట్ కొత్త భవనం ప్రారంభోత్సవాన్ని పట్టాభిషేక కార్యక్రమంలా నిర్వహించారని ఆక్షేపించారు. ఈ మేరకు రాహుల్ ట్వీట్ చేశారు. ప్రజాస్వామ్యం మనగలిగేది భవనాల్లో కాదని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ట్వీట్ చేశారు. ప్రజల గొంతుకల్లో ప్రజాస్వామ్యం మనుగడ సాగిస్తుందని తెలిపారు. ప్రజాస్వామ్యం, జాతీయవాదం, ఆడశిశువుల సంరక్షణపై బీజేపీ-ఆర్‌ఎస్‌ఎస్ పాలకులు చెబుతున్న మాటల్లోని డొల్లతనం బయటపడిందన్నారు. పార్లమెంట్ కొత్త భవన ప్రారంభోత్సవం సందర్భంగా మహిళా రెజ్లర్లపై దాడి చేయడం దారుణమని విమర్శించారు. పార్లమెంట్ నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసినప్పుడు అప్పటి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌ను దూరంగా ఉంచారని, ఇప్పుడు ప్రారంభోత్సవానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్మును దూరం పెట్టారని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ మండిపడ్డారు. ఎన్నికల రాజకీయాల కోసం దళితులను, గిరిజనులను పావులుగా వాడుకోవడం ప్రధాని మోదీకి అలవాటేనని దుయ్యబట్టారు. చరిత్రాత్మక సందర్భానికి రాష్ట్రపతిని దూరం పెట్టడం ఏమిటని నిలదీశారు. ఇదిలా ఉండగా, రాహుల్ గాంధీ ట్వీట్‌పై బీజేపీ ఎంపీ సుశీల్‌కుమార్ సింగ్ స్పందించారు. నరేంద్ర మోదీకి దేశ ప్రజలు రెండుసార్లు అధికారం కట్టబెట్టడాన్ని రాహుల్ గాంధీ జీర్ణించుకోలేకపోతున్నారని, అందుకే మోదీపై అసూయ పెంచుకున్నారని విమర్శించారు.


భారీ ప్రచార కార్యక్రమం..

పార్లమెంట్ కొత్త భవనాన్ని ప్రధాని మోదీ ప్రారంభించిన తీరుపై వామపక్షాలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశాయి. ఈ కార్యక్రమం చక్రవర్తి పట్టాభిషేక మహోత్సవంలా ఉందని వ్యాఖ్యానించాయి. దేశ ప్రజలను భాగస్వాములుగా చేయలేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశాయి. 'న్యూ ఇండియా'అనే ప్రకటనతో భారత రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, ప్రతిపక్ష పార్టీలు ఎవరూ లేకుండానే పార్లమెంట్ భవనాన్ని ప్రారంభించిన మోదీ ప్రభుత్వం దీనిని భారీ ప్రచార కార్యక్రమంగా మార్చుకుందని సీపీఎం జనరల్ సెక్రటరీ సీతారాం ఏచూరి ట్వీట్ చేశారు. ఒక వైపు సెంగోల్‌కు పూజలు చేసిన మోదీ ప్రభుత్వం మరోవైపు రెజ్లర్లపై లాఠీలను ఝళిపించిందని సీపీఐ ఎంపీ బినోయ్ విశ్వమ్ ఆరోపించారు. ముస్ముందు నిరంకుశ ఫాసిస్ట్ విధానాలు సాగుతాయనేందుకు ఈ ఘటనలే నిదర్శనమన్నారు. చక్రవర్తి పట్టాభిషేకం మాదిరిగా పార్లమెంట్ కొత్త భవనం ప్రారంభోత్సవం జరుగుతుండగానే మహిళా రెజ్లర్లు, మహిళా పంచాయత్‌కు వచ్చిన మహిళలపై పోలీసు జులుం సాగింది. ఇది ప్రజాస్వామ్యం, రాజ్యాంగ స్ఫూర్తిపై నిరంకుశ దాడి'అని సీపీఐ ఎంఎల్ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య పేర్కొన్నారు.

తిరోగమనానికి నిదర్శనం: పవార్

పార్లమెంట్ కొత్త భవనం ప్రారంభం సందర్భంగా ప్రధాని మోదీ వివిధ మతసంబంధ పూజలు చేయడంపై ఎన్సీపీ అధ్యక్షుడు శరద్ పవార్ అభ్యంతరం వ్యక్తం చేశారు. దేశం వెనక్కి వెళుతోందనటానికి ఇవే నిదర్శమన్నారు. 'మన సమాజంలో శాస్త్రీయ దృక్పథం పెంపొందాలని భారత ప్రథమ ప్రధాని నెహ్రూ ఆకాంక్షించారు. కొత్త పార్లమెంట్ భవన సముదాయం ప్రారంభం సందర్భంగా నిర్వహించిన మతాచారాలు అందుకు విరుద్ధంగా ఉన్నాయి'అని పవార్ పుణేలో మీడియాతో పేర్కొన్నారు. మన దేశం కొన్ని దశాబ్దాలు వెనక్కి వెళ్తున్నట్లు భయం కలుగుతోందన్నారు. రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతిని కూడా ఆహ్వానించకపోవడంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. పార్లమెంట్ సమావేశాలు రాష్ట్రపతి ప్రసంగంతోనే ప్రారంభమవుతున్నప్పుడు వారిని ఆహ్వానించకపోవడమేంటన్నారు. 'పార్లమెంట్ నూతన భవనం ప్రారంభానికి నాకు ఆహ్వానం పంపిందీ లేనిదీ తెలియదు. ఒక వేళ ఢిల్లీలోని నా కార్యాలయానికి ఆహ్వానం వచ్చి ఉంటుందేమో తెలియదు'అని వ్యాఖ్యానించారు.

శవపేటికలా పార్లమెంట్ భవనం: ఆర్‌జేడీ వివాదాస్పద ట్వీట్



బిహార్‌లోని అధికార పార్టీ రాష్ట్రీయ జనతాదళ్(ఆర్‌జేడీ)పార్లమెంట్ నూతన భవనాన్ని శవపేటికతో పోల్చింది. పార్లమెంట్ కొత్త భవనం శవపేటిక మాదిరిగా త్రిభుజాకారంలో ఉందంటూ బిహార్ అధికార ఆర్‌జేడీ ఆదివారం ట్వీట్ చేసింది. దీనిపై బీజేపీ ఆగ్రహం వ్యక్తం చేసింది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు ఆర్‌జేడీని శవపేటికలోనే సమాధి చేస్తారంటూ వ్యాఖ్యానించింది. 'ఆర్‌జేడీ అథమ స్థితికి దిగజారింది. త్రికోణానికి భారతీయ వ్యవస్థలో ఎంతో ప్రాధాన్యం ఉంది. శవపేటిక షట్కోణంగా గానీ బహుభుజిగా కానీ ఉంటుందని తెలుసుకోవాలి'అని పేర్కొంది. అయితే, ఆర్‌జేడీ తన వ్యాఖ్యలను సమర్థించుకుంది. ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని పాతిపెట్టింది. కొత్త పార్లమెంట్ భవనం ప్రారంభోత్సవానికి రాష్ట్రపతిని గానీ, రాజ్యసభాధ్యక్షుడైన ఉపరాష్ట్రపతిని గానీ పిలవలేదు. ప్రజాస్వామ్యంలో ఇటువంటి జరగవు'అంటూ ఆ పార్టీ ట్వీట్ చేసింది.

దేశానికి గర్వకారణం: రాష్ట్రపతి

న్యూఢిల్లీ: పార్లమెంట్ నూతన భవనం ప్రధాని మోదీ చేతుల మీదుగా ప్రారంభం కావడాన్ని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము స్వాగతించారు. 'దేశానికి ఇది గర్వకారణం, సంతోషకరమైన విషయం. దేశ చరిత్రలో పార్లమెంట్ నూతన భవన ప్రారంభం స్వర్ణాక్షరాలతో లిఖించదగ్గ అంశం. పార్లమెంట్‌పై విశ్వాసానికి ప్రతీకగా నిలిచే ప్రధాని మోదీ కొత్త పార్లమెంట్‌ను ప్రారంభించడం చాలా సంతృప్తినిచ్చింది'అని ఆమె అన్నారు. భారత ప్రజాస్వామ్యం గొప్ప సంప్రదాయాలు, ఆదర్శాలకు కొత్త ప్రమాణాలను నెలకొల్పాలని ఆకాంక్షించారు. ఈ మేరకు రాష్ట్రపతి పంపిన సందేశాన్ని పార్లమెంట్ ప్రారంభం సందర్భంగా రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్ చదివి వినిపించారు.

దేశ ప్రగతికి సాక్షి : ఉప రాష్ట్రపతి

పార్లమెంట్ కొత్త సౌధం రాజకీయ ఏకాభిప్రాయ సాధనకు, బానిస మనస్తత్వం నుంచి పొందిన స్వేచ్ఛకు ప్రతీకగా ఉపయోగపడాలని ఉప రాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ ఆకాంక్షించారు. కొత్త భవనం ప్రారంభోత్సవం సందర్భంగా ఆయన ఈ మేరకు సందేశమిచ్చారు. ఈ సందేశాన్ని రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్ లోక్‌సభ చాంబర్‌లో చదివి వినిపించారు. ప్రజల ఆకాంక్షలను నిజం చేయడానికి, వారి సమస్యలకు పరిష్కారాలు కనుగొనడానికి ఈ భవనం తోడ్పడాలని జగదీప్ ధన్‌ఖడ్ పేర్కొన్నారు. అమృతకాలంలో నిర్మించిన ప్రజాస్వామ్య సౌధం ఇప్పుడు మాత్రమే కాదు, భవిష్యత్తులోనూ మన దేశ ప్రగతికి సాక్షిగా నిలుస్తుందని వివరించారు. రాబోయే కాలంలో ఎన్నెన్నో చారిత్రక అధ్యాయాలను లిఖించడానికి ఇదొక వేదిక అవుతుందన్నారు. ప్రధాని మోదీ పార్లమెంట్ కొత్త భవనాన్ని జాతికి అంకితం చేయడం తనకు చాలా ఆనందంగా ఉందని ధన్‌ఖడ్ వెల్లడించారు.

మణిపూర్‌లో మళ్లీ ఘర్షణలు..

ఇంఫాల్: మణిపూర్‌లో మళ్లీ హింసాత్మక ఘర్షణలు మొదలయ్యాయి. సాయుధ కుకి మిలిటెంట్లు ప్రత్యర్థి మైతి వర్గానికి చెందిన ఎనిమిది కొండ ప్రాంత గ్రామాలపై దాడులకు పాల్పడ్డారు. ఈ దాడుల్లో ఇద్దరు చనిపోగా, 10 మంది వరకు గాయపడినట్లు పోలీసులు ఆదివారం తెలిపారు. కక్చింగ్ జిల్లాలో మిలిటెంట్లు శనివారం అర్ధరాత్రి మైతీ వర్గానికి చెందిన వారి 80 ఇళ్లకు నిప్పుపెట్టారు. దీంతో, గ్రామస్తులు భయంతో ఇళ్లు వదిలి తలోదిక్కుకు పారిపోయారు. సుగ్నులో పోలీసులు, మిలిటెంట్ల మధ్య జరిగిన కాల్పుల్లో ఒక పోలీసు చనిపోయారు. సుగ్ను, సెరౌ ప్రాంతాల్లో జరిగిన ఘర్షణల్లో ఒకరు చనిపోగా పది మంది గాయపడ్డారు. బిష్ణుపూర్ జిల్లాలో కుకి మిలిటెంట్లు మైతీ వర్గం ప్రజలకు చెందిన 30 ఇళ్లకు నిప్పుపెట్టారు. పరిస్థితులు ఉద్రిక్తంగా మారడంతో అధికారులు నిషేధాజ్ఞల సడలింపు సమయాన్ని 11 గంటల నుంచి 6 గంటలకు కుదించారు. కుకీలు దాడులు చేస్తున్నా భద్రతా బలగాలు పట్టించుకోవడం లేదంటూ ఇంఫాల్ వెస్ట్ జిల్లా ఫయెంగ్ గ్రామానికి చెందిన మహిళలు నిరసనకు దిగారు.

40 మంది తీవ్రవాదులు హతం

రాష్ట్రంలో పౌరులపై కాల్పులకు దిగుతూ, ఇళ్లకు నిప్పుపెడుతున్న 40 మంది తీవ్రవాదులను ఇప్పటి వరకు బలగాలు చంపినట్లు ముఖ్యమంత్రి బిరేన్ సింగ్ తెలిపారు. 'రాష్ట్రంలో జరుగుతున్నది జాతుల మధ్య వైరం కాదు. కుకి మిలటెంట్లు, భద్రతా బలగాలకు మధ్య జరుగుతున్న పోరు'గా ఆయన అభివర్ణించారు. షెడ్యూల్ తెగ(ఎస్‌టీ) హోదా విషయమై రాష్ట్రంలో ఈ నెల 3వ తేదీ నుంచి కుకి, మైతి వర్గాల మధ్య మొదలైన ఘర్షణల్లో 75 మంది ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే.

నేడు అమెరికాకు రాహుల్

న్యూఢిల్లీ: కోర్టు ఆదేశాల మేరకు కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఆదివారం సాధారణ పాస్‌పోర్టును అందుకున్నారు. పార్లమెంట్ సభ్యత్వం కోల్పోయిన రాహుల్ ఇటీవల తన దౌత్యహోదా పాస్‌పోర్టును అధికారులకు తిరిగి ఇచ్చేశారు. ఆయనకు సాధారణ పాస్‌పోర్టును జారీ చేయడంలో ఎలాంటి అభ్యంతరం లేదంటూ శనివారం ఢిల్లీ కోర్టు తెలిపింది. ఈ మేరకు అధికారులు రాహుల్‌కు ఆదివారం ఉదయం పాస్‌పోర్టును పంపించారు. సోమవారం రాహుల్ శాన్‌ఫ్రాన్సిస్కోకు బయలుదేరి వెళ్తారు. అక్కడ స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీ విద్యార్థులు, ఇతర ముఖ్యులను కలుసుకుంటారు.

చైనా స్వదేశీ విమానం సక్సెస్

బీజింగ్: చైనా మొట్టమొదటి సారిగా పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన ప్రయాణికుల విమానం సీ919 ఆదివారం విజయవంతంగా ప్రయాణించింది. విమానయాన రంగం మార్కెట్‌లోకి డ్రాగన్ దేశం అధికారికంగా ప్రవేశించింది. పశ్చిమదేశాలకు చెందిన బోయింగ్, ఎయిర్‌బస్ సంస్థలతో పోటీ పడేలా చైనా ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే చైనా ఈస్టర్న్ ఎయిర్‌లైన్స్ ప్రయాణికుల విమానాన్ని తయారు చేసింది. తొలిసారిగా షాంఘై నుంచి బీజింగ్‌కు వెళ్లిన ఈ విమానం రెండున్నర గంటల్లో సురక్షితంగా గమ్యస్థానానికి చేరుకున్నట్టు జిన్‌హువా న్యూస్ ఏజెన్సీ వెల్లడించింది.

సాక్షి
కరీంనగర్
సోమవారం, 29, మే, 2023



రాజన్నకు 'సండే' రద్దీ

వేములవాడ: రాజన్నను ఆదివారం 20 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. అనంతరం బద్దిపోచమ్మకు బోనం మొక్కులు సమర్పించారు. ఏఈవో శ్రీనివాస్ ఏర్పాట్లు పరిశీలించారు.



మల్లన్న సన్నిధిలో పూజలు

ఓదెల: ఓదెల మల్లికార్జునస్వామి ఆలయానికి భక్తులు ఆదివారం పోటెత్తారు. ఒగ్గు పూజారులతో పట్నాలు వేశారు. బోనాలు చేసి నైవేద్యంగా సమర్పించారు. ఏర్పాట్లను పాలకవర్గం పర్యవేక్షించింది.

గరిష్టం/కనిష్టం
42.0/28.0

వాతావరణం

మధ్యాహ్నం ఎండ తీవ్రత కొనసాగుతుంది. ఉక్కపోత పెరుగుతుంది. రాత్రి ఉష్ణోగ్రతలు పాక్షికంగా పెరుగుతాయి.

న్యూస్‌రీల్

చొక్కారావు సేవలు చిరస్మరణీయం



నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ నేతలు

కరీంనగర్‌టౌన్: మాజీ పార్లమెంట్ సభ్యుడు స్వర్గీయ జువ్వాడి చొక్కారావు జిల్లాకు చేసిన సేవలు చిరస్మరణీయమని డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, కాంగ్రెస్ నగర అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి అన్నారు. చొక్కారావు వర్ధంతి సందర్భంగా ఆదివారం డీసీసీ కార్యాలయం, వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ సమీపంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. చొక్కారావు మూడుసార్లు ఎమ్మెల్యేగా, మూడుసార్లు ఎంపీగా గెలుపొంది పలు మంత్రి పదవులు చేపట్టడమే కాక తెలంగాణ ప్రాంత అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా, జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించిన ప్రజాప్రతినిధిగా కృషి చేశారని కొనియాడారు. హౌసింగ్ బోర్డుకాలనీలోని వీర బ్రహ్మేంద్ర అనాథవృద్ధాశ్రమంలో థెండీ ఇమ్రాన్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. రహమత్ హుస్సేన్, అబ్దుల్ రెహమాన్, పులి ఆంజనేయులుగౌడ్, శ్రావణ్‌నాయక్, వైద్యుల అంజన్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న రెడ్డి నాయకులు

గన్నేరువరం(మానకొండూర్): 2018 ఎన్నికల సమయంలో మేనిఫెస్టో ప్రకారం ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని రెడ్డి సంఘం ఐక్యవేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూంపల్లి రాఘవరెడ్డి అన్నారు. జూన్ 6వ తేదీన కరీంనగర్‌లో జరిగే రెడ్ల ఆత్మీయ సమ్మేళనం హలోరెడ్డి.. చలో కరీంనగర్ పోస్టర్‌ను ఆదివారం గన్నేరువరంలో సంఘం మండల అధ్యక్షుడు కాంతాల కొండల్‌రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా ఉపాధ్యక్షుడు కాంతాల సత్యనారాయణరెడ్డితో కలిసి ఆవిష్కరించారు. అంజిరెడ్డి, రాంరెడ్డి, రాజిరెడ్డి, నరసింహారెడ్డి, శ్రీధర్‌రెడ్డి, రాజిరెడ్డి, మల్లారెడ్డి, మధుకర్‌రెడ్డి, సంతోశ్‌రెడ్డి, హరికృష్ణరెడ్డి, రవీందర్‌రెడ్డి, సాయికిరణ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

టీఎన్జీవో నేతలకు అభినందన



కరీంనగర్ అర్బన్: రాష్ట్ర, జిల్లా టీఎన్జీవో కార్యవర్గాన్ని రాష్ట్ర ప్లానింగ్ కమిషన్ ఉపాధ్యక్షుడు బి.వినోద్‌కుమార్ ఆదివారం అభినందించారు. టీఎన్జీవో కేంద్ర సంఘం రాష్ట్ర కార్యదర్శిగా నియామకమైన మారం జగదీశ్వర్, జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి, కార్యదర్శి సంగెం లక్ష్మణరావును ప్రత్యేకంగా అభినందించారు. నేతలు నాగుల నర్సింహస్వామి, ముప్పిడి కిరణ్‌కుమార్‌రెడ్డి, రాగి శ్రీనివాస్, రవీందర్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, జి.రమేష్, మహిళా అధ్యక్షురాలు ఇరుమల్ల శారద, సబిత, సునీత పాల్గొన్నారు.

రేపు కౌలురైతుల సమస్యలపై రౌండ్‌టేబుల్ సమావేశం

జమ్మికుంట(హుజూరాబాద్): పట్టణంలోని చాణక్య డిగ్రీ కళాశాలలో 30వ తేదీన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు రైతు స్వరాజ్య వేదిక ప్రతినిధి రాచపల్లి సమ్మయ్య, మానవ హక్కుల వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి మధు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో 36శాతం కౌలు రైతులు ఉన్నారని, భూమి ఉన్న రైతులతో సమానంగా రైతుబీమా, రైతుబంధు, వ్యవసాయ ఉత్పత్తుల అమ్మకంలో హక్కులు, వడ్డీ లేని రుణాలు, కౌలు చట్టాన్ని ప్రభుత్వం అమలు చేసే విధంగా రౌండ్‌టేబుల్ సమావేశంలో చర్చించడం జరుగుతుందని అన్నారు.

రేపు కృషిభవన్‌లో రైతులతో ముఖాముఖి

కరీంనగర్‌టౌన్: రైతు ఆదాయం పెంపు, అధిక ఉత్పత్తి, విత్తనాలు, లాభసాటి పద్ధతులు, ఆధునిక యంత్రాల ఉపయోగం తదితర అనేక విషయాలపై అవగాహన కల్పించాలనే లక్ష్యంతో ఈనెల 30న ఉదయం 10 గంటలకు కరీంనగర్ కలెక్టరేట్ సమీపంలో ఉన్న కృషి భవన్‌లో రైతులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కిసాన్ జాగరణ్ అధ్యక్షుడు పొల్సాని సుగుణాకర్‌రావు తెలిపారు. వ్యవసాయ రంగ నిపుణులు, యంత్రాల తయారీదారులు, విత్తన కంపెనీ ప్రతినిధులు పాల్గొని రైతులతో నేరుగా చర్చిస్తారన్నారు. రైతులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

అంగన్‌వాడీల్లో సన్నబువ్వ

- సెంటర్లకు సన్నబియ్యం పంపిణీకి కసరత్తు
- జూన్ నుంచి అమలుకు సన్నాహాలు
- జిల్లాలో లబ్ధిపొందనున్న వేలాదిమంది



అంగన్‌వాడీ కేంద్రం

కరీంనగర్: అంగన్‌వాడీ కేంద్రాల్లోనూ సన్న బియ్యంతో వండిన భోజనాలు అందించనున్నారు. ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలల్లో సన్న బియ్యం భోజనం అందిస్తుండగా.. అంగన్‌వాడీ కేంద్రాల్లోనూ అమలు చేయాలనే డిమాండ్ చాలాకాలం నుంచి ఉంది. దొడ్డుబియ్యం అన్నం తినేందుకు చిన్నారులు, గర్భిణులు, బాలింతలు ఆసక్తిచూపడం లేదు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకున్న ప్రభుత్వం అంగన్‌వాడీలకు సన్న బియ్యం సరఫరా చేసేందుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. దీంతో పాటు చిన్నారులకు పాలు అందించనున్నారు. రాష్ట్ర నూతన సచివాలయం ప్రారంభోత్సవ రోజున రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌర సరఫరాలశాఖ మంత్రి గంగుల కమలాకర్ ఫైల్‌పై సంతకం చేసి ఆమోదం తెలిపారు. దీంతో జిల్లాలో వేలాదిమందికి జూన్ నుంచి సన్నబియ్యంతో వండిన భోజనం అందనుంది.

జిల్లాలో ఇలా..

- జిల్లాలో నాలుగుప్రాజెక్టుల పరిధిలో 777అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఇందులో గర్భిణులు 5,205, బాలింతలు 5,393,0– 07 ఏళ్ల చిన్నారులు 56,735 మంది ఉన్నారు.
- మూడు నుంచి అయిదేళ్ల పిల్లలకు రోజూ ఒక గుడ్డు (ఉడకబెట్టింది), 75గ్రాముల బియ్యం, 15 గ్రాముల కందిపప్పు, 5 గ్రాముల నూనెతో చేసిన ఆహారం, 20 గ్రాముల మురుకులు, 50 గ్రాముల బాలామృతం అందజేస్తున్నారు. 7 నెలల నుంచి మూడేళ్ల లోపు వారికి నెలకు 16 గుడ్లు అందిస్తున్నారు.
- కేంద్రాలకు వచ్చే గర్భిణులు, బాలింతలకు ఆరోగ్యలక్ష్మి పథకం పేరుతో రోజూ 150 గ్రాముల బియ్యం, 30 గ్రాముల కందిపప్పు, 16 గ్రాముల మంచి నూనెతో చేసిన ఆహారం, 200 మిల్లీలీటర్ల పాలు అందిస్తున్నారు.
- మిగతా పోషకాహారాలు బాగానే ఉన్నా దొడ్డుబియ్యంతో భోజనం వడ్డిస్తుండడంతో తినేందుకు చాలామంది ఇష్టపడటం లేదు. ముఖ్యంగా గర్భిణులు కేంద్రాల వద్ద భోజనం చేయకుండా, ఇంటికి తీసుకెళ్లి ఇతరులకు అందిస్తున్న పరిస్థితులు ఉన్నాయి. ఈ నేపథ్యంలో సన్నబియ్యంతో కూడిన భోజనం అందించడంతో ఇష్టంగా తినేందుకు అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు.
- ఏడాది నుంచి మూడేళ్లలోపు చిన్నారులు జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో 19,554 మందికి పైగా ఉంటారు. వీరందరికీ ప్రతిరోజూ పాలు సరఫరా చేయనుండటంతో పూర్తిస్థాయిలో పోషకాహారం అందనుంది.
- అంగన్‌వాడీ కేంద్రాలకు సన్నబియ్యం సరఫరా చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించడంతో మరింత ప్రాధాన్యం పెరిగే అవకాశాలు ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం సన్నబియ్యం సరఫరా చేయాలని తీసుకున్న నిర్ణయంపై సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో ప్రాజెక్టుల వారీగా లబ్ధిదారులు

ప్రాజెక్టు	కేంద్రాలు	గర్భిణులు	బాలింతలు	చిన్నారులు
గంగాధర	159	1,002	981	10,300
హుజూరాబాద్	244	1,206	1,494	13,394
కరీంనగర్‌రూరల్	202	1,253	1,318	13,973
కరీంనగర్‌అర్బన్	172	1,744	1,600	19,068
మొత్తం	777	5,205	5,393	56,735

సంతోషంగా ఉంది

నేను గర్భిణిగా ఉన్నప్పటి నుంచి అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రతిరోజూ ఆహారం అందిస్తున్నారు. దొడ్డుబియ్యంతో వండడం వల్ల అన్నం తినడం ఇబ్బందిగా ఉండేది. ప్రస్తుతం బాలింతగా ఉన్నా అదే ఆహారం ఇస్తున్నారు. సన్నబియ్యంతో వండిన అన్నం పెడితే ఇష్టంగా తినొచ్చు. పిల్లలకు పాలు ఇవ్వాలని నిర్ణయించడం సంతోషంగా ఉంది.
– ఆర్.విజయ, బాలింత, వావిలాలపల్లి

ఆకలి తీర్చే ప్రభుత్వం



నూతన సచివాలయం ప్రారంభోత్సవం రోజున అంగన్‌వాడీ కేంద్రాలకు సన్నబియ్యం పంపిణీ చేయాలనే ఫైల్‌పై సంతకం చేయడం అదృష్టంగా భావిస్తున్నా. వేలాది మంది చిన్నారులకు సన్నబియ్యం భోజనం ఎంతో ఉపశమనం కలిగిస్తుంది. సీఎం కేసీఆర్ సారథ్యంలోని ప్రభుత్వం పేదల ఆకలి తీర్చడానికే మొదటి ప్రాధాన్యం ఇస్తోంది. – గంగుల కమలాకర్, రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి

'కమర్షియల్' కనెక్షన్

- నల్లా కనెక్షన్లలో సిబ్బంది చేతివాటం
- నగరపాలకసంస్థ ఆదాయానికి గండి
- ఓ హోటల్‌కు కమర్షియల్ కనెక్షన్
- ఫిర్యాదులతో గంటల్లో తొలగింపు
- తెలియక కనెక్షన్ ఇచ్చారన్న నగరపాలక అధికారులు



నల్లా కనెక్షన్ ఏర్పాటు చేసి తొలగించిన ప్రాంతం

కరీంనగర్ కార్పొరేషన్: నగరపాలకసంస్థ నల్లా కనెక్షన్ల అక్రమాల బాగోతం కొనసాగుతోంది. గృహావసరాలకు ఇచ్చే నల్లా కనెక్షన్లలో సిబ్బంది కలెక్షన్ల వ్యవహారం ఓ వైపు సాగుతుండగా, మరో వైపు వాణిజ్య (కమర్షియల్) నల్లా కనెక్షన్ల ఏర్పాటులో అక్రమదందా బల్దియా ఆదాయానికి గండికొడుతోంది. రూ.40 వేల నల్లా కమర్షియల్ కనెక్షన్‌ను ఓ హోటల్‌కు ఉచితంగా అమర్చిన వ్యవహారం ఆదివారం వెలుగు చూసింది. ఈ వ్యవహారంపై ఆరోపణలు, ఫిర్యాదులు వెల్లువెత్తడంతో అధికారులు దిద్దుబాటు చర్యలకు దిగారు. సిబ్బంది తెలియక అమర్చారంటూ కొన్నిగంటల్లోనే ఆ కనెక్షన్‌ను తొలగించారు. నగరంలో జరుగుతున్న నల్లా కనెక్షన్ల దందాకు ఈ తాజా తార్కాణం అద్దం పడుతోంది.

హోటల్‌కు నల్లా కనెక్షన్ .. ఆ వెంటనే తొలగింపు

నగరంలోని 57వ డివిజన్ పరిధిలో ఓ హోటల్‌కు కమర్షియల్ నల్లా కనెక్షన్ ఇవ్వడం వివాదాస్పదంగా మారింది. కరీంనగర్–జగిత్యాల ప్రధాన రహదారిలో చైతన్యపురికాలనీ సమీపంలోని ఓ హోటల్‌కు కమర్షియల్ నల్లా కనెక్షన్‌ను ఇచ్చారు. కమర్షియల్ కనెక్షన్ కావాలంటే పరిమాణం ఆధారంగా నగరపాలకసంస్థకు రుసుం చెల్లించి దరఖాస్తు చేయాల్సి ఉంటుంది. అర ఇంచు నల్లాకు సుమారు రూ.30వేలు, ఇంచు నల్లా కనెక్షన్‌కు రూ.40 వేలు చెల్లించాల్సి ఉంటుంది. కాని ఈ హోటల్ నిర్వాహకులు ఎలాంటి ఆధారాలు చూపించకుండానే సిబ్బంది నల్లా కనెక్షన్ ఇచ్చారు. ఈ విషయంలో సిబ్బంది, అధికారుల పాత్రపై అనుమానాలు వ్యక్తమయ్యాయి. డబ్బులు చేతులు మారడంతోనే కమర్షియల్ నల్లాను అమర్చారంటూ పలు సంఘాలు అధికారులను నిలదీశాయి. ఈ వ్యవహారం వెలుగులోకి రావడంతో అధికారులు దిద్దుబాటు చర్యలు చేపట్టారు. ఆ నల్లా కనెక్షన్‌ను ఆదివారం మధ్యాహ్నం తొలగించారు.

ఇక్కడ మామూలే...

నగరంలో నల్లా నీళ్లు రావాలంటే అధికారులు, సిబ్బంది చేతులు తడపాలనేది ఇక్కడ సర్వసాధారణమే. గృహావసరాలకు రూ.వేయి, వాణిజ్య అవసరాలకు రూ.30 వేలు, రూ.40 వేలు రుసుము చెల్లించాల్సి ఉంటుంది. కాని గృహావసరాలకు కనెక్షన్ ఇచ్చే సమయంలో రోడ్ కటింగ్ పేరిట రూ.3 వేలు నుంచి రూ.4 వేల వరకు అదనంగా వసూలు చేస్తున్నారు. లేదంటే ఏదో సాకుతో నల్లా కనెక్షన్ ఇవ్వకుండా వేధిస్తున్నారు.

బల్దియా ఆదాయానికి గండి

నగరంలో కమర్షియల్ నల్లా కనెక్షన్లలో జరుగుతున్న అక్రమాలకు అధికారిక లెక్కలే సజీవ సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి. గ్రేటర్ కరీంనగర్ వైపు నగరం పరుగులెడుతూ.. నిత్యం కొత్త వాణిజ్య సముదాయాలు పుట్టుకొస్తుంటే నగరంలో కమర్షియల్ నల్లా కనెక్షన్లు కేవలం 480 మాత్రమే ఉన్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. గృహావసరాలు 48,850 ఉండగా, కమర్షియల్ కనెక్షన్‌లు 480 ఉన్నాయి. ఈ లెక్కలతోనే నగరంలో జరుగుతున్న కమర్షియల్ కనెక్షన్‌ల దందాను అర్థం చేసుకోవచ్చు. రికార్డుల్లో సాధారణ కనెక్షన్లుగా లేదంటే అసలు రికార్డే లేకుండా కమర్షియల్ కనెక్షన్‌లు ఇస్తుండడంతోనే ఈ పరిస్థితి ఎదురైందనేది తేటతెల్లమవుతోంది. నగరపాలకసంస్థకు రావాల్సిన ఆదాయానికి గండికొడుతూ తమ జేబులు నింపుకొనే పనిని అధికారులు, సిబ్బంది విజయవంతంగా నిర్వర్తిస్తున్నారు. కమర్షియల్ నల్లా కనెక్షన్లపై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తే తప్ప ఈ అక్రమాల గుట్టు వీడే అవకాశం లేదు.

తెలియక కనెక్షన్ ఇచ్చారు

సిబ్బందికి అవగాహన లేకపోవడంతోనే హోటల్‌కు కనెక్షన్ ఇచ్చారు.ఆ ప్రాంతంలో ప్రెషర్ సరిగా లేకపోవడంతో మెయిన్ లైన్‌కు 20 కనెక్షన్‌లు ఇస్తున్నారు. ఈ సందర్భంలోనే తెలియకుండా హోటల్‌కు కూడా కనెక్షన్ ఇచ్చారు. ఆ తరువాత హోటల్ వాళ్లు రశీదులు చూపించకపోవడంతో కనెక్షన్‌ను తొలగించాం. ఇది తెలియక జరిగిందే తప్ప కావాలని చేసింది కాదు.
– వెంకటేశ్వర్, డీఈ, నగరపాలక సంస్థ

ఎన్‌సీసీతో జాతీయత భావం అలవడుతుంది

- కలెక్టర్ ఆర్వీ కర్ణన్
- ముగిసిన ఎన్‌సీసీ వార్షిక శిబిరం



కలెక్టర్ కర్ణన్‌కు స్వాగతం పలుకుతున్న కెడెట్లు

కరీంనగర్‌స్పోర్ట్స్: ప్రస్తుతకాలంలో క్రమశిక్షణ జాతీయ సమైక్యత భావం ఎన్‌సీసీతోనే పెంపొందుతుందని కలెక్టర్ ఆర్వీ.కర్ణన్ అన్నారు. స్థానిక పద్మనగర్‌లోని పారమిత పాఠశాలలో పదిరోజులుగా నిర్వహిస్తున్న ఎన్‌సీసీ వార్షిక శిక్షణ శిబిరం ఆదివారంతో ముగిసింది. ముగింపు కార్యక్రమానికి కలెక్టర్ కర్ణన్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. ఎన్‌సీసీ విద్యార్థులు ఆర్మీలో చేరడానికి మొగ్గు చూపాలని సూచించారు. శిక్షణలో నేర్చుకున్న విషయాలను సమాజానికి ఉపయోగపడే విధంగా చూడాలన్నారు. తానూ ఎన్‌సీసీ విద్యార్థిని అని.. అందరినీ చూశాక తానూ 23సంవత్సరాలు వెళ్లానని, ఎన్‌సీసీ కారణంగానే తనలో క్రమశిక్షణ పెరిగిందని గుర్తుచేసుకున్నారు. శిక్షణలో భాగంగా కెడెట్లకు నిత్యం ఉదయం 5:30గంటల నుంచి సాయంత్రం 9:30గంటల వరకు వివిధ రంగాల్లో శిక్షణ, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని, యోగా, మెడిటేషన్, ఫైర్‌ఫైటింగ్, రోడ్డు భద్రత నియమాలు తదితర వాటిపై అవగాహన కల్పించినట్లు కలెక్టర్‌కు ఎన్‌సీసీ అధికారులు వివరించారు. ఆర్మీకి సంబంధించిన శిక్షణలో భాగంగా ఫైరింగ్, మ్యాప్ రీడింగ్, డ్రిల్, యుద్ధనైపుణ్యాలు, పర్సనాలిటీ డెవలప్‌మెంట్, కమ్యూనికేషన్ స్కిల్స్, నేషనల్ ఇంటిగ్రేషన్, హెల్త్ అండ్ హైజీన్ గురించిన శిక్షణ ఇవ్వడం జరిగిందని తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను జాతీయస్థాయి శిక్షణ శిబిరాలకు ఎంపిక చేయడం జరిగిందని 9వ తెలంగాణ బెటాలియన్ కమాండర్ ఆఫీసర్ కల్నల్ డానియల్ లోట్జిమ్ తెలిపారు. పారమిత విద్యాసంస్థల అధినేత ఇ.ప్రసాద్‌రావు, సుబేదార్ మేజర్ సాగర్‌సింగ్, ఎన్‌సీసీ అధికారులు కిరణ్‌జ్యోతి, జ్యోత్స్న, బోగిని ప్రకాశ్, వి.రాజేశ్, జ్యోతిలక్ష్మి, మ్యాగీ, సందీప్ కుమార్ ట్రైనింగ్ ఆఫీసర్ బాలషణ్ముగం పాల్గొన్నారు.

ఆర్వోబీల నిర్మాణంలో ఇంత జాప్యమా?

- నిధులు మంజూరై ఆరు నెలలైనా పనుల పురోగతి లేదు
- త్వరగా పూర్తి చేయాలంటూ రాష్ట్ర ఆర్అండ్‌బీ శాఖకు కేంద్రం లేఖ
- తీగలగుట్టపల్లి ఆర్వోబీ జాప్యంపై ఈనెల 11న కేంద్రానికి లేఖ రాసిన సంజయ్



ఎంపీ బండి సంజయ్

కరీంనగర్‌టౌన్: రోడ్డు ఓవర్ బ్రిడ్జి(ఆర్వోబీ)ల నిర్మాణంలో జరుగుతున్న జాప్యంపై కేంద్రం అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ మేరకు జాతీయ రహదారులు, రవాణాశాఖ రీజనల్ అధికారి ఎస్.కె.కుశ్వహా రాష్ట్ర రహదారులు, భవనాలశాఖ కార్యదర్శికి లేఖ రాశారు. కరీంనగర్‌లోని తీగలగుట్టపల్లి ఆర్వోబీ సహా రాష్ట్రవ్యాప్తంగా ఐదు ఆర్వోబీల నిర్మాణానికి కేంద్రం అంగీకారం తెలుపుతూ గత నవంబర్‌లోనే రూ.432.84 కోట్లు మంజూరు చేసింది. నిధులు విడుదలై ఆరు నెలలు దాటినా ఇంతవరకు నిర్మాణ పనుల్లో పురోగతి లేకపోవడంపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్ కుమార్ ఈనెల 11న కేంద్రానికి లేఖ రాశారు. ముఖ్యంగా కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని తీగలగుట్టపల్లి సమీపంలో రైల్వే ఓవర్ బ్రిడ్జి(ఆర్ఓబీ)నిర్మాణంలో జరుగుతున్న జాప్యంతో స్థానిక ప్రజల రాకపోకలకు తీవ్రమైన ఇబ్బంది ఏర్పడిందన్నారు. త్వరగా పనులు పూర్తిచేసి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని పలుమార్లు అధికారులను కోరుతున్నా ఫలితం లేకుండా పోయిందని అన్నారు. ఇచ్చిన గడువు ప్రకారం బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని లేఖలో కోరారు. సంజయ్ రాసిన లేఖ ఆధారంగా కేంద్ర రీజనల్ అధికారి కుశ్వహ రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ కార్యదర్శికి లేఖ రాశారు. తీగలగుట్టపల్లితోపాటు హన్మకొండ, వరంగల్, నిజామాబాద్, వికారాబాద్‌లో మంజూరైన ఆర్వోబీల నిర్మాణంలోనూ పురోగతి లేని విషయాన్ని గుర్తు చేశారు. ఇచ్చిన గడువు ప్రకారం వెంటనే ఆర్వోబీ నిర్మాణాలను పూర్తి చేయాలని కోరారు.

భావితరాలు గుర్తుంచుకునేలా దశాబ్ది ఉత్సవాలు

- జూన్ 17న కేబుల్ బ్రిడ్జి, ఆగస్టు 15న మానేరు రివర్ ఫ్రంట్ ప్రారంభం
- రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి గంగుల కమలాకర్

కరీంనగర్: తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు భావితరాలకు గుర్తుండిపోయేలా నిర్వహించుకుందామని రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాలశాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. జూన్ 2 నుంచి 22 వరకు నిర్వహించే తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలపై ఆదివారం కలెక్టరేట్ ఆడిటోరియంలో సమీక్షించారు. తొమ్మిదేళ్లకాలంలో సాధించిన ప్రగతిని ప్రపంచానికి చాటేలా ఉత్సవాలు జరగాలని ఆకాంక్షించారు. జూన్ 9న సంక్షేమ దినోత్సవాన్ని పురస్కరించుకొని కులవృత్తుల వారికి న్యాయం చేకూర్చేలా జీవో వెలువడనుందని తెలిపారు. దశాబ్ది ఉత్సవాల సందర్భంగా జూన్ 17న గిరిజనోత్సవం రోజున కేబుల్‌బ్రిడ్జిని ప్రారంభించుకుని రెండురోజులు ఘనంగా వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మానేరు రివర్ ఫ్రంట్‌ను ఆగస్టు 15న ప్రారంభించడానికి ఏర్పాట్లు చేయడం జరుగుతుందని వివరించారు. ఈనెల 31న కరీంనగర్‌లో శ్రీవారి ఆలయానికి భూమిపూజ, సాయంత్రం శ్రీనివాస కల్యాణం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. ప్రణాళిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్ర సాధనతో నీళ్లు, నిధులు, నియమాకాలను చేపట్టడంతో పాటు ఆదాయమార్గాలను వృద్ధి చేసుకోవడం జరిగిందని అన్నారు. కలెక్టర్ ఆర్వీ.కర్ణన్ మాట్లాడుతూ.. తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా ప్రతిశాఖ ద్వారా తొమ్మిదేళ్లలో సాధించిన ప్రగతిని తెలియజేస్తూ శకటాలు సిద్ధం చేయాలని, జూన్ 2 ఆవిర్భావ దినోత్సవం పతాకావిష్కరణ జరుగుతుందని 22వరకు ప్రత్యేక కార్యక్రమాలు ఉంటాయని వివరించారు. ప్రభుత్వ కార్యాలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించాలని, అత్యవసర పరిస్థితులు మినహా ఎవరికీ సెలవులు మంజూరు చేయకూడదని ఆదేశించారు. జెడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ, ఎమ్మెల్సీ ప్రభుత్వ విప్ పాడి కౌశిక్ రెడ్డి, చొప్పదండి, మానకొండూరు శాసనసభ్యులు సుంకె రవిశంకర్, రసమయి బాలకిషన్, రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్, సుడా చైర్మన్ జీవీ.రామకృష్ణరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పొన్నం అనిల్ కుమార్‌గౌడ్, మేయర్ వై.సునీల్ రావు, అదనపు కలెక్టర్లు జీవీ.శ్యాంప్రసాద్‌లాల్, గరిమా అగర్వాల్, శిక్షణ సంయుక్త కలెక్టర్ నవీన్ నికోలస్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల వార్షిక ప్రణాళిక రూపొందించండి

కరీంనగర్ అర్బన్: 2023–24ఆర్థిక సంవత్సరానికి గానూ అభివృద్ధి పనుల వార్షిక ప్రణాళికను రూపొందించాలని రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ అధికారులను ఆదేశించారు. ఆదివారం కలెక్టరేట్ సమావేశమందిరంలో డీఎంఎఫ్‌టీ సమావేశం నిర్వహించారు. 2018–19 సంవత్సరం నుంచి 2022–23 సంవత్సరం వరకు డిస్ట్రిక్ట్ మినరల్ ఫండ్ ట్రస్ట్ నిధుల కింద చేపట్టబడిన అభివృద్ధి పనుల పురోగతిని, నిధుల వ్యయాన్ని, ఇతర అంశాల గురించి చర్చించారు. ప్రజాప్రతినిధులు, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి మంచిపేరు వచ్చేలా సేవలందించండి

కరీంనగర్‌టౌన్: జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగుల్లో 19మంది వైద్య సహాయకులు, 8మంది ల్యాబ్ టెక్నీషియన్లు, 2 ఫార్మసిస్టులకు ఆదివారం కలెక్టరేట్ ఆడిటోరియంలో మంత్రి కమలాకర్ క్రమబద్ధీకరణ ఉత్తర్వులు అందజేశారు. వీరందరూ గత కొన్నేళ్లుగా కాంట్రాక్ట్ పద్ధతి పైన పనిచేస్తున్నారని, వీరిసేవలను గుర్తించిన సీఎం కేసీఆర్ పర్మినెంట్ చేయడం సంతోషకరమని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో కె.లలితాదేవి, తదితరులు పాల్గొన్నారు.

బ్యాక్టీరియా లేని దూద్‌బావి



దూద్‌బావి నీరు తాగుతున్న డీపీవో వీరబుచ్చయ్య

శంకరపట్నం(మానకొండూర్): శంకరపట్నం మండలం మొలంగూర్ ఖిల్లా వద్ద ఉన్న దూద్‌బావినీటిలో బ్యాక్టీరియా లేదని యూనిసెఫ్ అధికారులు చేసిన పరీక్షల్లో గుర్తించారు. నిజాంకాలం నుంచి దూద్ బావి నీటికి ప్రాముఖ్యత ఉంది. నిజాం రాజులు నిత్యం గుర్రపుబండిపై మొలంగూర్ ఖిల్లా దూద్ బావినీటిని హైదారాబాద్ తీసుకెళ్లేవారని ఇక్కడ ప్రచారంలో ఉంది. హుజూరాబాద్‌కేంద్రంగా పనిచేసిన పోలీస్ అధికారులు మొలంగూర్ దూద్‌బావి నీటిని క్యాన్లలో పోలీస్‌వ్యాన్‌లో తీసుకెళ్లేవారు. ఈ ప్రాంత ప్రజలతో పాటు సందర్శకులు మొలంగూర్ ఖిల్లాను సందర్శించి దూద్‌బావినీటిని సేవించి తన్మయత్వం పొందేవారు. మండు వేసవిలోనూ దూద్‌బావిలోకి జలధార వస్తుందని గ్రామస్తులు చెప్తున్నారు. ఈ నీరు పాలవలే తెల్లగా ఉంటుంది. గ్రామస్తులు ప్యూరిఫైడ్ వాటర్‌ప్లాంట్ ఏర్పాటు చేసుకోకముందు బిందెలు, క్యాన్లలో నీటిని తీసుకెళ్లేవారు. ప్యూరిఫైడ్ వాటర్‌లో నీటిపరీక్షలు చేస్తే బ్యాక్టీరియా ఆనవాళ్లు కనిపిస్తాయని, మొలంగూర్ ఖిల్లా దూద్‌బావిలో బ్యాక్టీరియా లేదని యూనిసెఫ్ అధికా రులు ఇటీవల ప్రకటించారు. మొలంగూరును పర్యాటక ప్రాంతంగా గుర్తించడంతో పాటు దూద్‌బావి ప్రాముఖ్యతలను ప్రజలకు తెలిసేలా ప్రచా రం చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

దశాబ్ది ఉత్సవ కవితా సంకలనం

విద్యానగర్(కరీంనగర్):దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా జిల్లా అధికార యంత్రాంగం ఆధ్వర్యంలో జూన్ 11న కవిసమ్మేళనం నిర్వహిస్తున్నట్లు తెలంగాణ దశాబ్ది ఉత్సవ కవితా సంకలనం ప్రధాన సంపాదకుడు, అదనపు పాలనాధికారి జీవీ.శ్యాంప్రసాద్ లాల్ తెలిపారు. వచన, పద్య, గేయ కవితల్లో ఏదైనా ఒకదాన్ని ఎంచుకుని, నిడివి అచ్చులో రెండు పేజీలకు మించకుండా ఉండాలన్నారు. గేయ కవితలు పల్లవితో పాటు చరణాలు మూడు,నాలుగు మించకుండా ఉండాలన్నారు. కవులు తమ రచనలను జూన్ 5 సాయంత్రం 6గంటలలోగా కెఎస్.అనంతాచార్య వాట్సాప్ నంబర్ 9441195765కు పంపించాలని సూచించారు. ఎంపికైన కవితలతో పుస్తకం ప్రచురించి జూన్ 11న జరిగే కార్యక్రమంలో ఆవిష్కరించడం జరుగుతుందని తెలిపారు.

క్లుప్తంగా

లాంగ్‌జంప్‌లో సత్తాచాటిన పూజ


పూజను అభినందిస్తున్న లక్ష్మణ్, పద్మ

కరీంనగర్‌స్పోర్ట్స్: ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో ఈనెల 25, 26వ తేదీల్లో జరిగిన రాష్ట్రస్థాయి సీనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లాకు చెందిన క్రీడాకారిణి సత్తా చాటింది. టార్గెట్ హెల్త్ ఫిట్‌నెస్ అకాడమీకి చెందిన క్రీడాకారిణి చేకూర్తి పూజ లాంగ్‌జంప్‌లో బంగారు పతకం సాధించింది. ఈవెంట్‌లో 4.70 మీటర్ల దూరాన్ని దూకి బంగారు పతకాన్ని కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా పూజను అకాడమీ కోచ్ నీలం లక్ష్మణ్, మాస్టర్ అథ్లెట్ నీలం పద్మ, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నందెల్లి మహిపాల్, కడారి రవి తదితరులు అభినందించారు.

రాజ్‌కుమార్‌కు లెజెండరీ అవార్డు


అవార్డు అందుకుంటున్న రాజ్‌కుమార్

చిగురుమామిడి(హుస్నాబాద్): మండలంలోని సుందరగిరి వాసి, విశ్వకర్మ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు శ్రీరామోజు రాజ్‌కుమార్‌కు లెజెండరీ అవార్డు వరించింది. ఆదివారం ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడలో నిర్వహించిన కార్యక్రమంలో గాయత్రి పీఠాధిపతులు శ్రీ కాంతేంద్రస్వామి, భువనేశ్వరీ పీఠాధిపతులు దవతురి శక్తి భోగార్థాసన్ స్వామి, విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, విశ్వకర్మ నాలెడ్జ్ సెంటర్ వ్యవస్థాపకుడు విశ్వనాథుల పుష్పగిరి చేతుల మీదుగా రాజ్‌కుమార్ అవార్డు అందుకున్నాడు. కాగా రంగస్థల కళారంగంలో విశేష సేవలందించినందుకు రాజ్‌కుమార్‌కు అవార్డు వరించింది.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి


సురేందర్ (ఫైల్)

ఓదెల(పెద్దపల్లి): పొత్కపల్లికి చెందిన పిట్టల సురేందర్(30) విద్యుత్‌షాక్‌తో మృతిచెందాడు. వివరాల్లోకి వెళ్తే.. గ్రామంలో తన అన్నయ్య కొత్తగా నిర్మించుకున్న రేకుల షెడ్డుకు సురేందర్ ఆదివారం సాయంత్రం నీళ్లు పడుతున్నాడు. ఈ క్రమంలో పైన ఉన్న 11 కేవీ వైరు చేతికి తగలడంతో విద్యుదాఘాతం సంభవించి, అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య పద్మ, కుమారుడు ఉన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

ప్రమాదవశాత్తు కారు దగ్ధం


మంటల్లో కాలిపోతున్న కారు

ఓదెల(పెద్దపల్లి): మండలంలోని రూపునారాయణపేట గ్రామంలో ప్రమాదవశాత్తు ఓ కారు దగ్ధమైంది. వివరాల్లోకి వెళ్తే.. గోదావరిఖనికి చెందినవారు ఆదివారం పొత్కపల్లిలో జరిగిన వివాహానికి కారులో వచ్చారు. సమీపంలోని రూపునారాయణపేట మానేరులో నిర్మిస్తున్న చెక్‌డ్యాంను చూసేందుకు వెళ్లారు. పక్కన పంట పొలాల్లో చెలరేగిన మంటలు కారుకు అంటుకోవడంతో పూర్తిగా దగ్ధమైంది. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఏఎస్సై లక్ష్మీరాజం తదితరులు తెలిపారు.

ఎస్‌ఎంసీల గడువు పెంపు

- మరో ఆరు నెలలు పొడిగిస్తూ ఉత్తర్వులు
- నవంబర్ 30 వరకు కొనసాగనున్న పాత కమిటీలు



సప్తగిరికాలనీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల

కరీంనగర్: స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ(ఎస్‌ఎంసీ)లకు మరో ఆరునెలల వరకు పాత కమిటీనే కొనసాగించేలా రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఈనెల 31 వరకు ఉన్న గడువు పెంచడంతో నవంబర్ 30 వరకు పాత కమిటీలే పనిచేయనున్నాయి. సాధారణంగా ఆయా పాఠశాలల్లో విద్యార్థులు పదో తరగతి పూర్తయ్యాక వారి తల్లిదండ్రులు ఎస్‌ఎంసీ చైర్మన్లుగా లేదా సభ్యులుగా ఉంటే వారి స్థానంలో కొత్తవారిని ఎన్నుకోవాల్సి ఉంటుంది. జిల్లావ్యాప్తంగా మొదటి విడత 'మన ఊరు– మన బడి' పనులు చురుకుగా సాగుతుండగా, పనులన్నీ చివరి దశలో ఉన్నాయి. చాలా స్కూళ్లలో ప్రస్తుతం ఉన్న ఎస్‌ఎంసీ చైర్మన్లు, సభ్యుల తీర్మానాలతో పనులు చేస్తున్నారు. పనులకు ఆటంకం కలగకుండా మరో ఆరునెలలు పాత కమిటీలే కొనసాగేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

పథకాల పర్యవేక్షణ కమిటీలదే..

ప్రభుత్వ స్కూళ్లలో మధ్యాహ్న భోజనం, విద్యార్థులకు అందే ప్రతి సంక్షేమ పథకంలో ఎస్‌ఎంసీలకే బాధ్యతలు ఉండటంతో వారిని ఉన్న ఫలంగా తొలగించి కొత్త కమిటీలకు ఎన్నుకోవడం కత్తిమీద సాములా తయారవుతుందని ప్రభుత్వం ముందస్తు ఆలోచనతోనే పాత కమిటీలను కొనసాగిస్తూ నిర్ణయం తీసుకుంది. దీంతో పాటు పాఠశాలల పునః ప్రారంభం నాటికి ప్రారంభించిన పనులు పూర్తి చేయడం, పిల్లలకు నోట్‌బుక్‌లు, దుస్తులు అందించడంతో పాటు ఆయా పథకాలను పర్యవేక్షించేలా కమిటీలకే రాష్ట్ర ప్రభుత్వం బాధ్యతలు, అధికారం ఇచ్చింది.

జిల్లాలో 678 కమిటీలు

జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల ఎస్‌ఎంసీ చైర్మన్లుగా మొత్తం 678 మంది కొనసాగుతున్నారు. 16 మండలాల్లో 651 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా తొలి విడతగా 230 పాఠశాలలను 'మన ఊరు– మనబడి' కార్యక్రమం కింద ఎంపిక చేశారు. ఎంపికైన స్కూళ్లలో జిల్లా యంత్రాంగం మౌలిక వసతుల కల్పనపై ఇంజినీరింగ్ అధికారులతో అంచనాలు తయారు చేసి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించింది. ఈ మేరకు జిల్లాకు ప్రభుత్వం రూ.2 కోట్ల నిధులు విడుదల చేసింది. ఎంపికైన స్కూళ్లలోని విద్యాకమిటీ చైర్మన్, ప్రధానోపాధ్యాయుల జాయింట్ అకౌంట్‌తో ఒక్కో పాఠశాలకు రూ.30 లక్షల నుంచి అవసరం మేరకు నిధులను కేటాయించి పనులు ప్రారంభించింది. సదరు పాఠశాలల్లో నీటి సౌకర్యంతో కూడిన టాయిలెట్లు, విద్యుద్దీకరణ, తాగునీటి సరఫరా, విద్యార్థులకు సరిపడా ఫర్నీచర్, స్కూల్ మొత్తం పేయింటింగ్, పెద్ద, చిన్న మరమ్మతులు, గ్రీన్‌చార్ట్ బోర్డులు, ప్రహరీ నిర్మాణం, కిచెన్ షెడ్లు, శిథిలమైన గదుల స్థానంలో కొత్త గదులు, ఉన్నత పాఠశాలల్లో డైనింగ్ హాల్‌లు, డిజిటల్ విద్య అమలు లాంటి సదుపాయాలను ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన చేపట్టింది. ఈ పనుల్లో నాణ్యత, ఇతర అంశాలపై పరిశీలన చేయడంలో ఎస్‌ఎంసీ చైర్మన్లదే ప్రధాన భూమిక. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకొని ఎస్‌ఎంసీ కమిటీల పదవీకాలాన్ని ఆరు నెలలు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

ఉత్తర్వులు వచ్చాయి



ఎస్‌ఎంసీ చైర్మన్ల పదవీకాలం ఆరు నెలలు పొడగిస్తూ ఉత్తర్వులు అందాయి. మళ్లీ ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చేవరకు పాత కమిటీలే పనులను పర్యవేక్షిస్తాయి. మన ఊరు– మన బడి పనులతో పాటు ఇతరత్రా పనులపై స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీల పాత్రే కీలకం. ప్రభుత్వ నిబంధనల మేరకు మరో ఆరునెలల పాటు ఎస్‌ఎంసీ కమిటీల ఎన్నికలు లేనట్టే.

– జనార్దన్‌రావు, డీఈవో

గొప్ప యోధుడు వీర సావర్కర్


మాట్లాడుతున్న ప్రజ్ఞాభారతి ప్రతినిధి

కరీంనగర్: కవి, వక్త, సంఘ సంస్కర్తగా హైందవ సమాజాన్ని జాగృత పరిచిన గొప్ప యోధుడు వీర సావర్కర్ అని సమాచార భారతి కల్చరల్ అసోసియేషన్ జాతీయ సాహిత్య పరిషత్, ఇతిహాస సంకలన సమితి, ప్రజ్ఞా భారతి కరీంనగర్ శాఖ ప్రతినిధులు కొనియాడారు. వీర సావర్కర్ 140వ జయంతి సందర్భంగా ఆయన జీవితంపై వచ్చిన సినిమాను ఆదివారం సాయంత్రం కరీంనగర్ ఫిలిం భవన్‌లో ప్రదర్శించారు. అంతకముందు పలువురు ప్రతినిధులు మాట్లాడారు. వినాయక దామోదర్ సావర్కర్ పేరు వినగానే భారతీయులందరి మదిలో దేశభక్తి ఉప్పొంగుతుందన్నారు. నిజమైన స్వాతంత్య్ర వీరుని గాథను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. బ్రిటిష్‌వారి అధికారాన్ని ధిక్కరించి స్వాతంత్య్ర పోరాటాన్ని ముందుకు నడిపించిన గొప్ప వీరుడు వీర సావర్కర్ అన్నారు. కార్యక్రమంలో వివేకానంద విద్యా సంస్థల అధినేత కొమురయ్య, నంది శ్రీనివాస్, నైజాం విముక్త స్వాతంత్య్ర పోరాట సమితి గౌరవ అధ్యక్షుడు డాక్టర్ భాగ్యరెడ్డి, ఆర్‌ఎస్‌ఎస్ నగర కార్యవాహ చామ మహేశ్వర్, ఉప్పుల శ్రీహరి, నాగేశ్వరరావు, విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

ఒకరిపై అట్రాసిటి కేసు

జమ్మికుంట(హుజూరాబాద్): కులం పేరుతో దూషించినందుకు ఓ వ్యక్తిపై ఆదివారం అట్రాసిటి కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ రమేశ్ తెలిపారు. మండలంలోని వావిలాల గ్రామానికి చెందిన కలకోట శ్రీకాంత్‌ను అదే గ్రామానికి చెందిన శంకర్‌గౌడ్ కులం పేరుతో దూషించాడని బాధితుడు ఫిర్యాదు చేశాడు. వీరిద్దరి మధ్య బర్రె అమ్మకం విషయంలో గొడవ జరిగిందని, దాడి చేసి దూషించినందుకు బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

నాటుసారా పట్టివేత


నాటుసారా పట్టుకున్న ఎక్సైజ్ పోలీసులు

చొప్పదండి: పట్టణంలో నాటుసారా అమ్ముతున్న ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసి ఆరు లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ చంద్రమోహన్ తెలిపారు. కొంత కాలంగా చొప్పదండిలో గుట్టు చప్పుడు కాకుండా నాటుసారా అమ్ముతున్నారన్న సమాచారం మేరకు దాడులు నిర్వహించారు. దాడుల్లో బి.కొమురయ్య, పి.కొమురయ్య సారాతో పట్టుబడ్డారని తెలిపారు. వారిపై కేసు నమోదు చేశామని, సారా అమ్మినా, కొనుగోలు చేసినా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, పీడీ యాక్టు అమలు చేస్తామని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు


మహిళను 108లో తరలిస్తున్న సిబ్బంది

శంకరపట్నం(మానకొండూర్): మండలంలోని తాడికల్ గ్రామంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల వివరాలు.. తాడికల్‌కు చెందిన చిట్యాల కుమారస్వామి ఆదివారం మోటార్ సైకిల్‌పై భార్యతో కలిసి కేశవపట్నం వెళ్తున్నాడు. ఈక్రమంలో అదే గ్రామానికి చెందిన కొరిమి వెంకటయ్య రోడ్డు దాటుతుండగా కుమారస్వామి మోటార్ సైకిల్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వెంకటయ్యతో పాటు కుమారస్వామి భార్యకు తీవ్ర గాయాలు అయ్యాయి. స్థానికులు 108కు సమాచారం అందించడంతో ఈఎమ్‌టీ సతీశ్ రెడ్డి ప్రథమ చికిత్స చేసి కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు.

మంచి ఒప్పందమనడం సిగ్గుచేటు

- కార్మికులకు జాతీయ సంఘాలు అన్యాయం చేశాయి
- టీజీఎల్‌బీకేఎస్(ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఐ.కృష్ణ


మాట్లాడుతున్న కృష్ణ

గోదావరిఖని(రామగుండం): బొగ్గు గని కార్మికవర్గమంతా రాజీలేని పోరాటాలకు సిద్ధంగా ఉన్న సమయంలో అటు ప్రభుత్వంతో, ఇటు కోల్ ఇండియా యాజమాన్యంతో చేతులు కలిపి, జాతీయ సంఘాలు వారికి తీరని అన్యాయం చేశాయని ఐఎఫ్‌టీయూ అనుబంధ తెలంగాణ గోదావరిలోయ బొగ్గు గని కార్మిక సంఘం(టీజీఎల్‌బీకేఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఐ.కృష్ణ ఆరోపించారు. ఆదివారం గోదావరిఖనిలోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జాతీయ సంఘాలు సింగరేణిలో ఓటుబ్యాంకు రాజకీయాలు చేస్తున్నాయని మండిపడ్డారు. అనేక వేజ్‌బోర్డుల సందర్భంగా వేతనాల పెరుగుదలకు సమరశీల పోరాటాలు చేసిన ఘనత ఇక్కడి కార్మికవర్గానికి ఉందని తెలిపారు. కార్మికుల చైతన్యంపై నీళ్లు చల్లిన ఆయా సంఘాలు లొంగుబాటు ఒప్పందాలు చేసుకువచ్చాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. చారిత్రక ఒప్పందమంటూ గనుల వద్ద సంబరాలు చేస్తూ గేట్ మీటింగ్‌లలో చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరేష్, నాయకులు మల్లేశ్, సంతోష్, కొమురయ్య, బాబు తదితరులు పాల్గొన్నారు.

పైపులైన్‌కు మరమ్మతు చేయించాలి


లీకేజీని పరిశీలిస్తున్న నాయకులు

గోదావరిఖని(రామగుండం): గోదావరిఖని ఆర్జీ–1 ఫిల్టర్ బెడ్ వద్ద పైపులైన్ లీకేజీని అరికట్టాలని సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం సదరు ప్రాంతాన్ని ఏఐటీయూసీ నగర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎంఏ.గౌస్, సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు తోడుపునూరి రమేశ్‌కుమార్‌లు పరిశీలించి, మాట్లాడారు. సింగరేణి యాజమాన్యం రూ.లక్షలు ఖర్చు చేసి, గోదావరినది నుంచి నీటి సరఫరా కోసం పైపులైన్ వేసిందన్నారు. జీడీకే–1 ఇంక్లయిన్ ఫిల్టర్ బెడ్ వద్ద పైపులైన్ నుంచి నెల రోజులుగా వేలాది గ్యాలన్ల నీరు వృథాగా పోతూ రోడ్డంతా బురదమయంగా మారుతోందని పేర్కొన్నారు. ఈ రోడ్డులో ముస్త్యాల, సుందిల్ల, జనగామ గ్రామాలకు చెందిన ప్రజలు గోదావరిఖనికి వెళ్తుంటారని, బస్టాండ్ కాలనీ, ఐబీ కాలనీ, గాంధీనగర్, జీఎం కాలనీల నుంచి కార్మికులు, ఉద్యోగులు విధులకు హాజరవుతారని తెలిపారు. రోడ్డుపై నిలిచిన నీటితో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. సింగరేణి యాజమాన్యం స్పందించి, పైపులైన్‌కు మరమ్మతు చేయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు శనగల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



60 టైర్లు.. వంద కిలోమీటర్లు

తిమ్మాపూర్(మానకొండూర్): సముద్ర జలాల్లో ఉపయోగించే భారీ మోటార్ లోడ్‌తో 60 టైర్ల లారీ ఆదివారం మండల పరిధిలోని రాజీవ్ రహదారి గుండా హైదరాబాద్ వెళ్తుండగా స్థానికులు ఆసక్తిగా తిలకించారు. గంటకు పది కిలోమీటర్ల వేగంతో వెళ్లే ఈ లారీ కిలోమీటర్ దూరం వెళ్లేందుకు 2 లీటర్ల డీజిల్ అవసరమట. రోజుకు వంద కిలోమీటర్లు మాత్రమే ప్రయాణిస్తున్నట్లు డ్రైవర్ తెలిపాడు.

సివిల్స్ ర్యాంకర్‌ను అభినందించిన మంత్రి


సాయికృష్ణను సన్మానిస్తున్న మంత్రి గంగుల కమలాకర్, కలెక్టర్ కర్ణన్ తదితరులు

కరీంనగర్: ఇటీవల సివిల్స్‌లో 94వ ర్యాంక్ సాధించిన ఆవుల సాయికృష్ణను ఆదివారం కలెక్టరేట్ ఆడిటోరియంలో రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ శాలువాతో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ, కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్, ఎమ్మెల్యేలు రసమయి బాలకిషన్, సుంకే రవిశంకర్, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్, సివిల్ సప్లై చైర్మన్ సర్దార్ రవీందర్‌సింగ్, అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్, నగర మేయర్ వై.సునీల్‌రావు, సుడా చైర్మన్ జీవీ రామకృష్ణారావు, ట్రెయినీ కలెక్టర్ నవీన్ నికోలస్, గ్రంథాలయ చైర్మన్ పొన్నం అనిల్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే సాయికృష్ణ పారమిత ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి కావడంతో కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్‌తో పాటు పారమిత విద్యాసంస్థల చైర్మన్ ఇ.ప్రసాదరావు బొకే అందజేసి ప్రత్యేకంగా అభినందించారు.

విద్యుదాఘాతంతో ఇద్దరికి తీవ్రగాయాలు


ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన శ్రీనివాస్


సాయికుమార్‌ను తరలిస్తున్న 108 సిబ్బంది

శంకరపట్నం(మానకొండూర్): మండలంలోని అంబాల్‌పూర్ గ్రామంలో విద్యుదాఘాతంతో ఇద్దరికి తీవ్రగాయాలు అయ్యాయి. గ్రామస్తుల కథనం ప్రకారం.. అంబాల్‌పూర్ గ్రామంలో రైస్ మిల్లు పక్కన కామెర నారాయణ రేకుల షెడ్డు వేసుకుంటున్నాడు. షెడ్డు వేసేందుకు ఆదివారం గంగాధర మండలం ఒద్యారం గ్రామానికి చెందిన రామగిరి శ్రీనివాస్, శంకరపట్నం మండలం మక్త గ్రామానికి చెందిన నేరేళ్ల సాయికుమార్ కూలీ పనులకు వచ్చారు. రేకుల షెడ్డు వేస్తున్న క్రమంలో ఇనుప పైపు పైకి లేపుతుండగా పైన ఉన్న విద్యుత్ వైర్లకు తగిలి ఇద్దరూ షాక్‌కు గురయ్యారు. ఈ ప్రమాదంలో ఇద్దరికీ తీవ్రగాయాలు కాగా 108 వాహనంలో కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు.

విద్యుత్ తీగలు తగిలి గడ్డి దగ్ధం


మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

జూలపల్లి(పెద్దపల్లి): పొలం నుంచి వరి గడ్డి కట్టలను ట్రాక్టర్‌లో తరలిస్తుండగా 33 కేవీ ప్రధాన లైన్ విద్యుత్ తీగలు తగిలి దగ్ధమయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. జూలపల్లికి చెందిన రైతు మల్లెత్తుల సంతోశ్ ఆదివారం తన పొలం నుంచి గడ్డి కట్టలను ట్రాక్టర్‌లో ఇంటికి తీసుకెళ్తున్నాడు. విద్యుత్ తీగలు కిందికి ఉండటంతో గడ్డి కట్టలు వాటికి తగిలి, మంటలు చెలరేగాయి. చుట్టుపక్కల రైతులు వచ్చి, ఆర్పే ప్రయత్నం చేసినా సాధ్యం కాకపోవడంతో ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. చొప్పదండి ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను ఆర్పడంతో పెను ప్రమాదం తప్పింది. లేకుంటే ట్రాక్టర్ కూడా కాలిపోయేదని కాంగ్రెస్ నాయకుడు బండి శ్రీనివాస్ తెలిపారు. కరెంటు వైర్లను ఎత్తు లేపాలని ఎన్నోసార్లు విన్నవించినా అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు ఆరోపించారు. ఈ ప్రమాదంలో దాదాపు రూ.10 వేల నష్టం జరిగినట్లు ఫైర్ స్టేషన్ అధికారి నరేందర్ పేర్కొన్నారు.

కాలు పని చేయక.. కదల్లేక

- నాలుగు రోజులుగా ఎద్దు యాతన
- రక్షణ లేని ట్రాన్స్‌ఫార్మర్‌కు తగలడంతో విద్యుదాఘాతం



కదల్లేని ఎద్దుకు సపర్యలు చేస్తున్న రైతు, రక్షణ కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం గౌరెడ్డిపేట శివారులో ఓ ఎద్దు మేత మేస్తూ రక్షణ లేని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లింది. దాని తోక ట్రాన్స్‌ఫార్మర్‌కు తగలడంతో విద్యుదాఘాతానికి గురై, పడిపోయింది. ఎద్దు కాలు పని చేయకపోవడంతో ఎటూ కదల్లేక నాలుగు రోజులుగా యాతన పడుతోంది. పశువైద్యాధికారితో చికిత్స చేయిస్తున్నానని రైతు తోకల శంకరయ్య తెలిపాడు. పంట భూముల్లో ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేస్తున్న విద్యుత్ శాఖ అధికారులు వాటి చుట్టూ కంచె ఏర్పాటు చేయడంలో నిర్లక్ష్యం చేయడం వల్లే ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి, రక్షణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



'అపూర్వ' సమ్మేళనం

పెగడపల్లి: మండలకేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్ ఉన్నత పాఠశాలలో 1985 నుంచి 90వ సంవత్సరంలో ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. పాఠశాలలో చదివిన రోజులను గుర్తు చేసుకుంటూ తీపి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకొని రోజంతా ఉత్సాహంగా గడిపారు. కాగా మంత్రి ఈశ్వర్, పెద్దపల్లి ఎంపీ వెంకటేశ్ నేత పాల్గొని కేక్‌కట్ చేశారు. అప్పటి గురువులు కిషన్‌రావు, పరంధాములు. కిష్టయ్య, లక్ష్మణ్, పాఠశాల హెచ్‌ఎం లచ్చయ్య, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



అక్రమంగా మట్టి తవ్వకాలు

శంకరపట్నం(మానకొండూర్): మండలంలోని ఏరడపల్లి చెరువులో ఆదివారం అనుమతులు లేకుండా జేసీబీతో మట్టి తవ్వకాలు చేపట్టారు. చెరువు మట్టిని ట్రాక్టర్లలో తరలిస్తున్నారని గ్రామానికి చెందిన కొంతమంది రెవెన్యూ అధికారులకు సమాచారం అందించారు. కాగా ఆదివారం సెలవు కావడంతో అధికారులు రారని అక్రమార్కులు యథేచ్ఛగా తవ్వకాలు చేపడుతున్నారని ఆరోపణలు ఉన్నాయి. చెరువులో అక్రమంగా తవ్వకాలు చేపడుతున్న జేసీబీ, ట్రాక్టర్ ఫొటోలను గ్రామస్తులు తీస్తుండగా అక్కడి నుంచి జారుకున్నారు. ఈ విషయమై తహసీల్దార్ శ్రీనివాస్‌రావును వివరణ కోరగా, తాను సెలవులో ఉన్నానని, వెంటనే ఆర్‌ఐని పంపించి అక్రమార్కులపై కేసు నమోదు చేయిస్తానని పేర్కొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

■ త్రినేత్ర గోల్డ్: మీ బంగారం బ్యాంకులో గాని ఏ సంస్థలో వున్నా మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును.(స్పాట్‌క్యాష్) బంగారంపై అధికం లోన్ ఇవ్వబడును. ✆ 9389214214. [T-88]

CHANGE OF NAME

■ నా పేరు కున్‌సోతు భద్రు, తండ్రి: మక్త్యానాయక్ ఇంటి నెం. 8-3-275/10/A/1/2, రాంచంద్రపూర్ కాలనీ, కరీంనగర్, జిల్లా: కరీంనగర్ గలది కున్‌సోత్ భద్రునాయక్, తండ్రి: మక్త్యానాయక్ గా మార్చబడినది. సెల్: 9908906116 [K-1219947]

WANTED

■ ప్రముఖ కంపెనీ నందు మీ ఇంటి వద్దనే ఉండి పార్ట్ టైమ్/ఫుల్‌టైమ్ పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలయును. జీతం: 15000+ ఇన్సెంటివ్స్. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 8341371684 [G-786366]

■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి+ భోజనం. జీ: 16K–18K, ఏజెంట్ కమిషన్ 6K. ఫోన్:9640258899. [H-793430]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602933, 9951602824

క్లుప్తంగా

పీఎం మన్ కీ బాత్ వీక్షణ



మన్ కీ బాత్ వీక్షిస్తున్న బీజేపీ నాయకులు

కరీంనగర్‌రూరల్: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మన్ కీ మాత్ కార్యక్రమాన్ని ఆదివారం కరీంనగర్ మండలం మొగ్దుంపూర్‌లో బీజేపీ నాయకులు టీవీలో వీక్షించారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్, శక్తి కేంద్రం ఇన్‌చార్జిలు సంకరి సతీశ్, కూకట్ల రమేశ్, బూత్ అధ్యక్షులు ప్రదీప్‌కుమార్, శివ రామకృష్ణ, సతీశ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అల్పాహారం పంపిణీ



అల్పాహారం పంపిణీ చేస్తున్న క్లబ్ సభ్యులు

కరీంనగర్‌రూరల్: నగరంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో గల వీరబ్రహ్మేంద్రస్వామి వృద్ధాశ్రమంలోని వృద్ధులు, అనాథలకు ఆదివారం లయన్స్‌క్లబ్ ఆఫ్ బొమ్మకల్ ఆధ్వర్యంలో అల్పాహారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు చింతల కిషన్, సభ్యులు పుట్టపాక అనూష–రాజ్‌కుమార్ దంపతులు, నర్సింహరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సన్మానం



బాలరాజును సన్మానిస్తున్న నాయకులు

విద్యానగర్(కరీంనగర్): కరీంనగర్‌లో ఆదివారం జరిగిన కార్యక్రమానికి వచ్చిన గొర్రెల, మేకల ఫెడరేషన్ రాష్ట్ర చైర్మన్ దూదిమెట్ల బాలరాజును సన్మానించారు. ఈ కార్యక్రమంలో గొర్రెల మేకల పెంపకం వృత్తిదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు చిగుర్ల శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి ఐలయ్య, కాలువ శ్రీనివాస్, మల్లేశ్, జంగ కొమురయ్య, ముక్కెర కొమురయ్య, పరశురాం, యాదవ సంఘం నాయకులు నాగరపు సత్యనారాయణ, కురుమ యువజన సంఘం నాయకులు కర్రె అనిల్‌కుమార్, మేకల ఎల్లయ్య, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డే పార్కింగ్ ప్లేస్

- హాస్పిటల్స్, ఫంక్షన్‌హాళ్ల ఎదుట ఇష్టారాజ్యంగా పార్కింగ్
- నగరపాలకసంస్థ ఆదేశాలు బేఖాతరు
- పార్కింగ్ ఏర్పాటుకు కార్పొరేషన్ అల్టిమేటం
- గడువు మీరినా మారని తీరు



నగరంలోని ఆస్పత్రుల ఎదుట రహదారిపైనే నిలిపిన వాహనాలు

కరీంనగర్‌కార్పొరేషన్: నగరంలో హాస్పిటల్స్, ఫంక్షన్‌హాల్స్ వ్యవహారం ఇష్టారాజ్యంగా మారింది. నగరపాలకసంస్థ అధికారుల నిర్లక్ష్యం, కుమ్మక్కు ఫలితంగా నిబంధనలకు ఇవి అతీతంగా వ్యవహరిస్తున్నాయి. నిత్యం వేలాది మంది సందర్శించే హాస్పిటల్స్, సీజన్‌లో జాతరను తలపించే ఫంక్షన్‌హాల్స్‌తో ఆయా ప్రాంతవాసులు, నగర ప్రజానీకం తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ట్రాఫిక్ అంతరాయం అనేది ఆయా ప్రాంతాల్లో నిత్యకృత్యంగా మారింది. ఈ ఫిర్యాదుల నేపథ్యంలో ఈనెల 15వ తేదీలోగా పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేసుకోవాలని, లేనిపక్షంలో వాటి అనుమతి రద్దు చేస్తామని నగరపాలక సంస్థ భవన యజమానులను హెచ్చరించింది. కాని గడువు ముగిసి పదిహేను రోజులు కావస్తున్నా, నగరపాలకసంస్థ ఆదేశాలను యజమానులు పట్టించుకున్నట్లు కనిపించడం లేదు.

100 ఫంక్షన్‌హాల్స్.. 150 హాస్పిటల్స్

నగరంలో ఫంక్షన్‌హాల్స్, కల్యాణమండపాలు, బంకెట్‌హాల్స్ కలిపి 100 వరకు ఉండగా, 150 వరకు హాస్పిటల్స్ ఉన్నాయి. ఫంక్షన్‌హాల్స్ ఎక్కువగా శివారు ప్రాంతాల్లో ఉండగా, హాస్పిటల్స్ మాత్రం నగరం మధ్యలో ఉన్నాయి. ఇందులో కొన్ని ఫంక్షన్‌హాల్స్, హాస్పిటల్స్ పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేసుకున్నాయి. కాని ఎక్కువగా రోడ్లపైనే పార్కింగ్ చేస్తున్నారు. ఫలితంగా ఆయా ప్రాంతాల్లో ప్రజలు ట్రాఫిక్ పరంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి చుట్టూ ప్రైవేట్ హాస్పిటల్స్ విస్తరించి ఉన్నాయి. ఇక్కడ రోడ్లపై వాహనాలు సర్వసాధారణం. అత్యవసర పరిస్థితుల్లోనూ ఈ ప్రాంతంలో ప్రయాణించడం అంత సులువుగా ఉండదు. హాస్పిటల్స్ ఎదుట రోడ్డుపైనే వాహనాలు నిలిపి ఉంచడంతో ట్రాఫిక్‌కు ఎప్పటికీ ఇక్కడ అంతరాయంగానే ఉంటుంది. ఇక ఆరెపల్లి, రాంనగర్, విద్యానగర్, ముకరంపుర, జ్యోతినగర్, భగత్‌నగర్, రాంపూర్, పెద్దపల్లి రోడ్, తీగలగుట్టపల్లి తదితర ప్రాంతాల్లో ఫంక్షన్‌హాల్స్, బంకెట్‌హాల్స్ పెరిగిపోయాయి. ఇందులో చాలా వాటికి పార్కింగ్ సదుపాయం లేకపోవడంతో రోడ్లపైనే పార్కింగ్ చేస్తున్నారు.

ఆదేశాలు బేఖాతరు

ఫంక్షన్‌హాల్స్, ప్రైవేట్ హాస్పిటల్స్, వాణిజ్య సముదాయాల భవన యజమానులు ఈనెల 15వ తేదీలోగా తప్పకుండా పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేసుకోవాలని నగరపాలక సంస్థ హెచ్చరించింది. ఆయా భవన యజమానులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మేయర్, కమిషనర్‌లు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. పార్కింగ్ ఏర్పాటు చేసుకోని భవనాలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కాని గడువు ముగిసి పదిహేను రోజులు కావస్తున్నా పరిస్థితిలో మాత్రం మార్పు కనిపించడం లేదు.

స్పెషల్ డ్రైవ్ చేపడుతాం

ఫంక్షన్‌హాల్స్, హాస్పిటల్స్ భవనాల్లో పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేసుకోవాలని ఆదేశాలు ఇచ్చామని నగరపాలకసంస్థ టౌన్‌ప్లానింగ్ అధికారులు చెబుతున్నారు. ఆదేశాల అమలు తీరుపై త్వరలో స్పెషల్ డ్రైవ్ చేపట్టి, ఖచ్చితంగా పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేసుకునేలా చర్యలు తీసుకొంటామంటున్నారు.

పట్టని నిబంధనలు

భవనాల నిర్మాణ సమయంలో పాటించాల్సిన నిబంధనలు ఇక్కడ అమలు కావడం లేదు. ప్రధానంగా వాణిజ్య సముదాయాలు, ఫంక్షన్‌హాల్స్, హాస్పిటల్స్ భవనాలు నిర్మిస్తున్నప్పుడే పార్కింగ్ స్థలాలు చూపిస్తేనే అనుమతివ్వాల్సి ఉంటుంది. కాని నగరపాలక సంస్థ అధికారులు పార్కింగ్ స్థలాలు లేనప్పటికీ ఆయా భవనాలకు అనుమతినివ్వడంతోనే ఈ సమస్యలు పెరిగిపోతున్నాయనే ఆరోపణలున్నాయి. ఇక ఇటీవల బంకెట్‌హాల్స్ విపరీతంగా పెరిగిపోయాయి. కాస్త పెద్దగా ఉన్న నివాసగృహాలను కూడా బంకెట్‌హాల్స్‌గా మారుస్తున్నారు. ఈ భవనాలకు ఎక్కడా పార్కింగ్ స్థలాలు ఉండడం లేదు. కాగా కొంతమంది మాత్రం నిర్మాణ సమయంలో పార్కింగ్ స్థలాలను చూపిస్తూ తర్వాత వాటిని వాచ్‌మెన్ గదులు, ల్యాబ్ గదులు, ఇతరత్రా అవసరాలకు వినియోగిస్తున్నారు. దీంతో వాహనాలు మళ్లీ రోడ్డెక్కాల్సిన పరిస్థితి నెలకొంది. నిబంధనలను కఠినంగా అమలు చేయాల్సిన నగరపాలక సంస్థ అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తుండడం అనుమానాలకు దారితీస్తోంది.



మానకొండూర్ మండలం వెల్ది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2002–03 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం కరీంనగర్‌లోని ఓ ఫంక్షన్‌హాల్ వేదికగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించుకున్నారు. 20 ఏళ్ల తర్వాత చిన్ననాటి స్నేహితులను చూడటంతో వారి ఆనందానికి అవధుల్లేవు. ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకొని క్షేమ సమాచారం తెలుసుకున్నారు. తరగతి గదిలో చేసిన అల్లరిని గుర్తు చేసుకొని, సంతోషం వ్యక్తం చేశారు. తమను వీడిన తోటి విద్యార్థులకు నివాళులర్పించారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. సహపంక్తి భోజనాలు చేసి కలిసిన గుర్తుగా జ్ఞాపికలు అందజేసుకున్నారు.

– విద్యానగర్(కరీంనగర్)

నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దడమే లక్ష్యం



భూమిపూజ అనంతరం అధికారులకు సూచనలు చేస్తున్న మంత్రి గంగుల

- రూ.1.11 కోట్లతో మరమ్మతు
- 15 రోజుల్లో పనులు పూర్తి చేయాలి
- రాష్ట్ర మంత్రి గంగుల కమలాకర్

కరీంనగర్‌కార్పొరేషన్: ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. నగరంలోని బైపాస్‌రోడ్డు జంక్షన్ నుంచి కమాన్ చౌరస్తా వరకు చేపట్టనున్న బీటీ రోడ్ల పునరుద్ధరణ పనులకు ఆదివారం భూమిపూజ చేశారు. నగరంలోని బీటీ రోడ్లను రూ.1.11కోట్లతో పునరుద్ధరిస్తున్నట్లు తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా నగరంలోని ప్రధాన రహదారులతో పాటు అంతర్గత రోడ్లను నిర్మిస్తున్నామన్నారు. ఇటీవల కురిసిన భారీవర్షాలతో కొన్ని చోట్ల రహదారులపై గుంతలు ఏర్పడ్డాయని, వాటికి మరమ్మతు చేపడుతున్నామని తెలిపారు. 14.5 కిలోమీటర్ల మేర ఉన్న ప్రధాన రహదారుల్లో ధ్వంసమైన రోడ్లన్నిటికీ మరమ్మతులు చేస్తామని అన్నారు.ఈ పనులను 15 రోజుల్లో పూర్తి చేయాలని అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. మరమ్మతులు పూర్తయితే మరో ఐదేళ్ల వరకు ఎలాంటి ఇబ్బంది ఉండదన్నారు. బీటీ రోడ్లపై నీరు నిల్వకుండా నగరపాలక సంస్థ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. కార్యక్రమంలో మేయర్ సునీల్‌రావు, నగరపాలక సంస్థ ఎస్‌ఈ నాగమల్లేశ్వర్‌రావు, ఆర్‌అండ్‌బీ ఈఈ సాంబశివరావు, డీఈ రవీందర్, ఏఈ లక్ష్మణ్‌రావు, కార్పొరేటర్లు ఐలెందర్‌యాదవ్, గుగ్గిళ్ల జయశ్రీ, కొలిపాక శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్ తాటి ప్రభావతి పాల్గొన్నారు.

పూసల సంచార జాతులకు బాసట

కరీంనగర్: రాష్ట్రంలో అణగారిన వర్గాలకు ఆర్థికంగా ఆదుకుని, మరుగున పడిన వృత్తికులాలను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. ఆదివారం కరీంనగర్‌లోని వాసర గార్డెన్‌లో జరిగిన పూసల సమర శంఖారావం రాష్ట్ర సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో పాలుపంచుకున్న ప్రతి కులాన్ని సీఎం కేసీఆర్ పెద్దపేట వేస్తున్నారని తెలిపారు. అన్ని బీసీ కులాలకు ఆత్మగౌరవ భవనాలను ప్రభుత్వం మంజూరు చేసిందని గుర్తు చేశారు. గతంలో పూసల సామాజిక వర్గం ఎలాంటి గుర్తింపునకు నోచుకోలేదని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం ఈసారి రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా ఆర్థిక భరోసా ఇచ్చేందుకు రకరకాల పథకాలను రూపకల్పన చేసిందని అన్నారు. కరీంనగర్ పూసల సంఘం అధ్యక్షుడు కోనేటి శ్రీనివాస్ నాగమణి అధ్యక్షత జరిగిన కార్యక్రమంలో శాసనమండలి విప్ పాడి కౌశిక్‌రెడ్డి, మేయర్ సునీల్ రావు, రవీందర్‌రావులతో పాటు పూసల ఆత్మ గౌరవ ట్రస్ట్ చైర్మన్ గుంటుపల్లి వెంకట్, రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు పగిడిపల్లి బాలయ్య, పసుపులేటి వేదాంతం, తన్నీరు వెంకటేశం, గుండ్లపల్లి సత్యనారాయణ, శని వెంకటేశం, పన్నీర్ సత్యం ,నూతన గంటి పురుషోత్తం, మధురకొల వెంకటయ్య, గుడ్ల సమ్మయ్య, గుడ్ల తిరుపతి, పొదిల గంగారం సుదర్శన్, పోదిల వెంకట రమణ, పట్టెం కొమురయ్య, పాదిలి రమేష్, కోనేటి రమేష్, కోనేటి నాగమణి, తన్నీరు కళాపూర్ణ పాల్గొన్నారు.

‘కేంద్ర ప్రభుత్వ పథకాల అమలులో కేసీఆర్ విఫలం’



సమావేశంలో పాల్గొన్న బీజేపీ కార్యకర్తలు

కరీంనగర్‌టౌన్: కేంద్రంలో మోదీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను రాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్ అమలు చేయడంలో విఫలమయ్యారని ఒకటవ డివిజన్ కార్పొరేటర్ కొలగని శ్రీనివాస్, బీజేపీ నార్త్‌జోన్ ప్రధాన కార్యదర్శి కొమ్మెర రవీందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం తీగలగుట్టపల్లిలో నిర్వహించిన భారతీయ జనతా పార్టీ నార్త్‌జోన్ కరీంనగర్ శాఖ కార్యవర్గ సమావేశంలో మాట్లాడారు. కేసీఆర్ ప్రభుత్వ పాలనలో కొత్తగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రం అధోగతి పాలైందన్నారు. పూర్తిస్థాయి కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపట్టే తీగలగుట్టపల్లి రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులకు రాష్ట్ర ప్రభుత్వం సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు కాశెట్టి శేఖర్, సుధాకర్ పటేల్, కైలాస నవీన్, చిట్టి బాబు, భూమయ్య, సుధాకర్, పైడి ప్రసాద్, శ్రీనివాస్, ఎన్నం శ్రీనివాస్, కందుకూరి వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం



విద్యానగర్(కరీంనగర్): కరీంనగర్ రాఘవేంద్రనగర్‌లో ఏర్పాటు చేసిన అక్షయ స్వచ్ఛంద సేవా సంస్థ పది సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆదివారం కమాన్‌చౌరస్తాలో అన్నదానం నిర్వహించారు. మాజీ కార్పొరేటర్ గూడూరి మురళి, సంస్థ బాధ్యులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్‌కు ఘన నివాళి



నివాళి అర్పిస్తున్న టీడీపీ నాయకులు

విద్యానగర్(కరీంనగర్): తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు శత జయంతి సందర్భంగా ఆదివారం కరీంనగర్‌లోని ఆయన విగ్రహానికి టీడీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు వంచ శ్రీనివాస్ రెడ్డి, పార్టీ నాయకులు రొడ్డ శ్రీధర్, ఎలిమిల్ల కిషన్,పెరుమాండ్ల సతీష్, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

చిందేస్తూ.. సందడి చేస్తూ

- నృత్య శిక్షణపై ఆసక్తి చూపుతున్న చిన్నారులు
- రోజూ అంబేడ్కర్ స్టేడియంలోని బాలభవన్‌లో తర్ఫీదు



నాట్యంలో శిక్షణ పొందుతున్న చిన్నారులు

కరీంనగర్‌కల్చరల్: వేసవికాలం సమయాన్ని వృథా చేయకుండా చిన్నారులు నృత్యాలపై ఆసక్తి చూపుతున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో డ్యాన్స్ మాస్టర్ వద్ద శిక్షణ తీసుకుంటూ స్టెప్పులు వేస్తున్నారు. చిన్నారుల అభిరుచిలను బట్టి ఆ దిశగా డ్యాన్స్ మాస్టర్ శిక్షణ ఇస్తున్నారు. విద్యార్థులు జానపద పాటలను ఎంపిక చేసుకొని శిక్షణ పొందుతున్నారు. నిత్యం శిక్షణ తరగతులకు వెళ్తానే అక్కడ నేర్చుకున్న స్టెప్పులను ఇంటి వద్ద సాధన చేస్తున్నారు. పాఠశాలలకు సెలవులు ప్రకటించిన తర్వాత చిన్నారులు వేసవిలో ఇంటి వద్ద ఆటలు ఆడేస్తూ మరోవైపు ఇలా నృత్యాలపై దృష్టిసారిస్తూ సమయాన్ని గడిపేస్తున్నారు. కరీంనగర్‌లోని అంబేడ్కర్ స్టేడియంలో గల బాలభవన్‌లో నృత్యాలపై శిక్షణ పొందుతున్న చిన్నారులను ‘సాక్షి’ పలకరించగా తమ అభిప్రాయాలు వెల్లడించారు.

ఏకాగ్రత, శ్రద్ధ పెరుగుతుంది



నెలరోజులుగా బాలభవన్‌లో నిర్వహిస్తున్న వేసవి శిబిరంలో శిక్షణ తీసుకుంటున్న. ప్రతిరోజూ నృత్యంతో మంచి ఏకాగ్రత, శ్రద్ధ పెరుగుతుంది. ఇది వరకు తిరుపతి, వేములవాడలలో నృత్యం చేశా. వేసవి శిక్షణ శిబిరం నాకు బాగా ఉపయోగపడుతుంది.

– శివానిక, సిక్కువాడీ

జానపద నృత్యంపై మక్కువ



నేను 8వ తరగతి చదువుకుంటున్న. ఇక్కడ 30 రోజులుగా నాట్యంలో మెలకువలు నేర్చుకుంటున్న. మా డ్యాన్స్ మాస్టర్ జానపద నృత్యంలో మంచి శిక్షణ ఇస్తున్నారు. హైదరాబాద్‌లో మా టీమ్ ప్రదర్శనలు ఇచ్చాం.

– మైథిలి, చైతన్యపురికాలనీ

నాలుగేళ్లుగా..



నాలుగు సంవత్సరాలుగా బాలభవన్‌లో నాట్యంలో తర్ఫీదు పొందుతున్న. హైదరాబాద్, తిరుపతి, అంతర్జాతీయ కళోత్సవాల్లో డాన్స్ చేశా. భవిష్యత్‌లో మంచి నృత్య దర్శకురాలిని కావాలని కోరిక.

– హిరణ్మయి, సిక్కువాడీ

నృత్యం అంటే ఇష్టం



డాన్స్, క్లాసికల్, జానపద నృత్యం అంటే ఇష్టం. బాలభవన్‌లో నృత్య శిక్షణ తీసుకుంటున్న. పూర్తిస్థాయిలో నృత్యంలో తర్ఫీదు పొందుతున్నా. ఇది వరకు పలు చోట్ల ప్రదర్శనలు ఇచ్చాం.

– కృతిక, మంకమ్మతోట

మంచి డ్యాన్స్‌మాస్టర్ కావాలని..



నృత్యం అంటే చాలా ఇష్టం. భవిష్యత్‌లో మంచి డ్యాన్స్‌మాస్టర్ కావాలని కోరిక. ఈ శిక్షణ శిబిరం మాలాంటి వారికి ఎంతో ఉపయోగపడుతుంది. ఇలా వేసవి శిక్షణ శిబిరం ప్రభుత్వం ఉచితంగా నిర్వహించడం సంతోషంగా ఉంది.

– అంజె హాసినీ, గోద్దాంగడ్డ


సంస్కృతి, సంప్రదాలయాలకు ప్రతీకగా జానపదం



జానపద నృత్యాలు సంస్కృతి, సంప్రదాలయాలకు ప్రతీకగా నిలుస్తాయి. మన పండుగల విశిష్టతను నృత్యం రూపంలో చూపించవచ్చు. బాలభవన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్న విద్యార్థులకు హైదరాబాద్, ఢిల్లీలలోని బాలభవన్‌లో జరిగే కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశం ఉంటుంది. ఇక్కడ శిక్షణ పొందిన వారు ఇది వరకు అన్ని ప్రభుత్వ సంబంధించిన కార్యక్రమాల్లో నృత్యాలు చేసి ఆకట్టుకున్నారు.

– సంగెం రాధాకృష్ణ, నృత్య దర్శకుడు

బైక్ ఆటో కన్సల్టెంట్ ఓనర్స్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక



సుప్రీం జావిద్

కరీంనగర్: కరీంనగర్ బైక్ ఆటో కన్సల్టెంట్ ఓనర్స్ అసోసియేషన్ కార్యవర్గాన్ని సంఘ కార్యాలయంలో ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సుప్రీం జావిద్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జావిద్ మాట్లాడుతూ నాపై నమ్మకం చూపించి తనను ఎన్నుకున్న అసోసియేషన్ సభ్యులకు ఏ సమస్య వచ్చిన తీరుస్తానని అన్నారు. నియమాకానికి సహకరించిన సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు హస్సన్ బీన్ అహ్మద్, బిన్, షైక్ హాఫీసుల్లహ, సలాం బిన్ అహ్మద్, రాజు, అబ్దుల్ బిన్ ఖాలీద్, ఎండీ మోసిన్ ఖాన్, ఈజ్జాన్ రమీల్, ఎండీ. ఖలీం, షాబేజ్ ఖాన్, ఖాజా ఐజాజుద్దీన్, అవన్ బిన్ అలీ తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ చేయాలి

చిగురుమామిడి: ఎన్నికల సమయంలో సీఎం కేసీఆర్ రైతులకు ఇచ్చిన లక్ష రూపాయల రుణమాఫీని తక్షణం అమలు చేయాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సాయిని మల్లేశం డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని సుందరగిరిలో బీజేపీ ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు డి. లక్ష్మీనారాయణ అధ్యక్షత వహించిన సమావేశంలో మల్లేశం మాట్లాడారు.

ఆర్థికసాయం అందజేత



ఆర్థిక సాయం అందిస్తున్న బసవరాజు శ్రీనివాస్

విద్యానగర్(కరీంనగర్): హుజూరాబాద్ పరిధిలోని కమలాపూర్ మండలానికి చెందిన చిరంజీవి అభిమాని కిరణ్‌కుమార్ అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల మరణించాడు. చిరంజీవి స్ఫూర్తితో భారత్ సేవా సహకార ఫోరం అధ్యక్షుడు బసవరాజు శ్రీనివాస్ మృతుడి కుటుంబానికి అండగా నిలుస్తూ..అతడి ఇద్దరు కూతుర్లను పదో తరగతి వరకు అయ్యే విద్యా ఖర్చులకు ఆదివారం ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా తెలంగాణ చిరంజీవి యువత అధ్యక్షుడు వేల్పుల వెంకటేశ్ కృతజ్ఞతలు తెలిపారు.

4న సీపీఐ ప్రజాగర్జన సభ



వాల్‌పోస్టర్లు విడుదల చేసిన సీపీఐ నాయకులు

కరీంనగర్‌రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ జూన్ 4న కొత్తగూడెంలో సీపీఐ ప్రజాగర్జన బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు సీపీఐ కరీంనగర్ నియోజకవర్గ కార్యదర్శి కసిరెడ్డి సురేందర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం కరీంనగర్ మండలం చామనపల్లిలో ×చలో కొత్తగూడెం₹ బహిరంగ సభ వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ్ కో బచావో బీజేపీ హటావో నినాదంతో దేశవ్యాప్తంగా ఇంటింటికీ సీపీఐ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. సీఎం కేసీఆర్ ఎన్నికల హామీలను అమలు చేయడంలో విఫలం చెందారని ఆరోపించారు. కొత్తగూడెంలో జరిగే బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి పిల్లి కొమురయ్య, నాయకులు పోసాని రాజేశ్వర్‌రావు, కొమురయ్య, రాములు, నాంపల్లి, శ్రీనివాస్, తిరుపతి, రాజయ్య, దుర్గాప్రసాద్, రాజు, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

దారం శ్రీనివాస్‌రెడ్డికి సన్మానం



శ్రీనివాస్‌రెడ్డిని సన్మానిస్తున్న రెడ్డి సంక్షేమ సంఘం నాయకులు

విద్యానగర్(కరీంనగర్): టీఎస్ జీవోస్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన దారం శ్రీనివాస్‌రెడ్డిని ఆదివారం కరీంనగర్ భగత్‌నగర్‌రెడ్డి సంక్షేమ సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు గుర్రం భాస్కర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి రొండ్ల ప్రభాకర్ రెడ్డి, కోశాధికారి సంది జలపతిరెడ్డి, సంఘ బాధ్యులు మెతుకు దామోదర్‌రెడ్డి, గంగిడి దేవేందర్‌రెడ్డి, వెంకట్‌రాంరెడ్డి, కాసం శ్రీనివాస్‌రెడ్డి, భూజేందర్‌రెడ్డి, పెండ్యాల కేశవరెడ్డి, రాజిరెడ్డి, జలంధర్‌రెడ్డి, అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కరీంనగర్ జిల్లా :
9951602933, 9951602958, 9951602824
Office mail : knrjagati@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
రమేష్, ACO - 7997958214
కరీంనగర్ : రాజశేఖర్ - 9618304759
చొప్పదండి : మొండయ్య - 7997958217
మానకొండూర్ : మహేశ్ - 9573106760
హుజూరాబాద్ : ప్రశాంత్ - 7331119941
టోల్ ఫ్రీ నం. : 1800 425 9899

పాలనలో నయా పంథా

సంస్కరణలతో విప్లవాత్మక మార్పులు

- పల్లె, పట్టణ ప్రజల చెంతకే ప్రభుత్వ సేవలు, పథకాలు
- దేశ చరిత్రలోనే తొలిసారిగా 15,004 గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థ
- వాటిలో కొత్తగా 1.34 శాశ్వత ఉద్యోగాల భర్తీ
- ప్రతి 50 ఇళ్లకు ఒక వలంటీర్ చొప్పున సేవా వ్యవస్థ
- నవరత్నాల పథకాల ద్వారా రూ.2.11 లక్షల కోట్లు ప్రజల ఖాతాల్లో జమ



సాక్షి, అమరావతి: కేవలం నాలుగేళ్లలోనే సంస్కరణల ద్వారా పరిపాలన వ్యవస్థలో విప్లవాత్మక మార్పులకు రాష్ట్రం చిరునామాగా మారింది. సామాజిక బాధ్యతగా విద్య, వైద్యం, వ్యవసాయం, సంక్షేమ రంగాల్లో అందించాల్సిన సేవల్లో ప్రభుత్వం తీసుకొచ్చిన మార్పులు, సంస్కరణలు సత్ఫలితాలిస్తున్నాయి. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పాలనా వ్యవస్థల్లో మార్పులు కొట్టొచ్చినట్లు కనిపించేలా చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సర్కారుకే దక్కుతుంది. గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని, 73వ రాజ్యాంగ సవరణ ద్వారా స్థానిక సంస్థలకే అధికారాలు, విధులు అప్పగించాలనే మాటలను సాక్షాత్కరింప చేసిన ఏకైక రాష్ట్రంగా నిలిచింది ఏపీనే. గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థను ఏర్పాటు చేసి.. పల్లె, పట్టణ ప్రజల చెంతకే ప్రభుత్వ సేవలు, పథకాలను అందిస్తోంది. అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదే (2019) కొత్త వ్యవస్థలను ఏర్పాటు చేసి, చేతులు దులుపుకోకుండా.. ఆ వ్యవస్థల ద్వారా ప్రభుత్వ సేవలు, పథకాలు అందించడానికి అవసరమైన మౌలిక సదుపాయాలతో పాటు ఉద్యోగులు, సిబ్బందిని భర్తీ చేసింది. దేశ చరిత్రలోనే తొలిసారిగా 15,004 గ్రామ, వార్డు సచివాలయాలతో పక్కా వ్యవస్థ ఏర్పాటు చేసింది. వీటిలో 1.34 లక్షల శాశ్వత ఉద్యోగాలను కొత్తగా సృష్టించి.. భర్తీ చేసింది. ప్రతి 50 ఇళ్లకు ఒక వలంటీర్ చొప్పున ప్రజల చేయి పట్టుకుని నడిపించే సేవా వ్యవస్థను తీసుకొచ్చింది. గ్రామ, వార్డు సచివాలయాలతో అనుసంధానమై 2.65 లక్షల మంది వలంటీర్లుగా గ్రామాల్లో పని చేస్తున్నారు. తద్వారా 600 పౌర సేవలు ఎటువంటి లంచాలు, వివక్షకు తావు లేకుండా అందుతున్నాయి. మారుమూల పల్లెల్లో సైతం ఎక్కడ చూసినా పౌర సేవల్లో గొప్ప విప్లవం కళ్లకు కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది.

ఉన్న ఊరిలోనే ప్రభుత్వ సేవలు

ప్రజలు పనుల నిమిత్తం మండల కేంద్రాలు, జిల్లా కేంద్రాలకు తిరగాల్సిన అవసరం లేకుండా ఉన్న ఊరిలోనే ప్రభుత్వ సేవలు, పథకాలు అందుతున్నాయి. దీంతో గతంలో ఎక్కడకో వెళ్లి దరఖాస్తు చేయడం, రాజకీయ నేతల చుట్టూ తిరగడం, లంచాలు ఇవ్వడం.. ఇలాంటి కష్టాలన్నింటికీ బ్రేక్ పడింది. ఉన్న ఊరిలో గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకుంటే అర్హత ఉంటే చాలు.. ఎవరి సిఫార్సు లేకుండానే సేవలు, పథకాలు అందుతున్నాయి. గతంలో రూపాయి ఇస్తే పావలా మాత్రమే లబ్ధిదారులకు చేరేది. ఇప్పుడు నేరుగా నగదు బదిలీ ద్వారా రూపాయి ఇస్తే రూపాయి లబ్ధిదారుల ఖాతాల్లోకి వెళ్లోంది. గత నాలుగేళ్లలో నవరత్నాల పథకాల ద్వారా రూ.2.11 లక్షల కోట్లు లబ్ధిదారుల ఖాతాలకు నేరుగా నగదు జమ అయింది. రేషన్ కార్డు, ఆరోగ్య శ్రీ కార్డు, పెన్షన్, ఇంటి జాగా ఇలా ఏ ప్రభుత్వ పథకం కావాలన్నా.. లేదా ఏ ప్రభుత్వ సేవలు కావాలన్నా గ్రామ, వార్డు సచివాలయాల్లోనే అందుతున్నాయి. గతానికి, ఇప్పటికీ ఇదో గొప్ప మార్పు.

రేషన్ డోర్ డెలివరీతో రోల్ మోడల్

పేదల ఇంటి వద్దకే రేషన్ డోర్ డెలివరీ చేయడంలో ఆంధ్రప్రదేశ్ రోల్ మోడల్‌గా నిలిచింది. ఏ పల్లెలో అయినా, పట్టణంలో అయినా రేషన్ బియ్యం మన వీధికి, మన ఇంటి ముంగిటకే అందించే వ్యవస్థ దేశంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మాత్రమే అమల్లో ఉంది. మిగతా రాష్ట్రాలు ఈ వ్యవస్థను అమలు చేసేందుకు యత్నిస్తున్నాయి. రేషన్ షాపుల దగ్గర గంటల తరబడి క్యూలో నిలబడే దుస్థితిని నివారించి రాష్ట్ర వ్యాప్తంగా మొత్తంగా 9,260 డెలివరీ వ్యాన్‌లతో నాణ్యమైన సార్టెక్స్ బియ్యాన్ని నెలనెలా డెలివరీ చేస్తున్న ప్రభుత్వం దేశంలో ఏపీ ఒక్కటే.

అవ్వాతాతల ఇంటికే ప్రతి నెలా పెన్షన్

దేశంలో ఎక్కడా లేని విధంగా పేద అవ్వాతాతలు, వికలాంగులు, వితంతువులు, దీర్ఘ వ్యాధిగ్రస్తుల ఇంటికే ప్రతి నెలా పెన్షన్‌ను వలంటీర్ల ద్వారా అందిస్తున్న ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్. ప్రతి నెలా ఒకటో తేదీన సూర్యోదయానికి ముందే వలంటీర్ ఇంటింటికీ వచ్చి లబ్ధిదారుల చేతిలో పెన్షన్ సొమ్ము పెట్టే కార్యక్రమం సజావుగా సాగుతోంది. అర్హులైన పేదలకు పెన్షన్ మంజూరు, పంపిణీలో వచ్చిన మరో గొప్ప మార్పు ఇది.

వ్యవసాయం పండుగైంది

దేశంలోనే తొలిసారిగా రైతుల కోసం 10,778 రైతు భరోసా కేంద్రాలు (ఆర్బీకే) ఏర్పాటు చేయడం ద్వారా వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు కనిపిస్తున్నాయి. ఈ కేంద్రాలు విత్తనం నుంచి పంట కొనుగోలు వరకు ప్రతి సేవలోనూ రైతన్నకు తోడుగా ఉంటూ, వారి చేయి పట్టుకుని నడిపిస్తున్నాయి. ఆర్బీకేలలో 10,778 మంది అగ్రికల్చర్, హార్టికల్చర్ గ్రాడ్యుయేట్లు పని చేస్తూ రైతులకు తోడుగా ఉన్నారు.

'ఫ్యామిలీ డాక్టర్'తో ఆరోగ్యానికి భరోసా

రాష్ట్రంలో 10,592 గ్రామ, పట్టణ హెల్త్ క్లినిక్స్ ద్వారా ఆయా గ్రామాల్లోని ప్రజలకు ఉచితంగా చికిత్సలను అందుబాటులోకి తెస్తూ ప్రభుత్వం ఈ రంగంలో గొప్ప మార్పులను తీసుకొచ్చింది. ఈ క్లినిక్స్‌లో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ 24 గంటలూ అందుబాటులో ఉంటారు. 105 రకాల మందులు ఉంటున్నాయి. 14 రకాల పరీక్షలు చేస్తూ.. ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌తో అనుసంధానమై అక్కడే సేవలందిస్తూ కనిపిస్తున్నారు. గతానికి ఇప్పటికి వ్యవస్థలో ఇదో స్పష్టమైన మార్పు.

కొత్తగా మరో 13 జిల్లాలు

రాష్ట్రంలో 2019 నాటికి 13 జిల్లాలు ఉంటే జిల్లా పాలన వికేంద్రీకరణలో భాగంగా ప్రభుత్వం కొత్తగా 13 జిల్లాల ఏర్పాటు ద్వారా మొత్తం 26 జిల్లాలను చేసింది. 51 డివిజన్లను 78కి, 679 మండలాలను 691కి పెంపు ద్వారా మరింతగా పాలనను వికేంద్రీకరణ చేసింది. ఆఖరికి చంద్రబాబు నియోజకవర్గం కేంద్రమైన కుప్పంను రెవెన్యూ డివిజన్‌గా చేసింది ప్రస్తుత ప్రభుత్వమే. ప్రజలకు జిల్లా, డివిజన్, మండల పాలన సేవలను మరింత చేరువ చేయడంలో భాగంగా వికేంద్రీకరణ చేపట్టింది. ఇది పరిపాలన రంగంలో గొప్ప సంస్కరణగా నిలుస్తోంది.

సమగ్ర భూ సర్వేతో వివాదాలకు స్వస్తి

భూ వివాదాలకు శాశ్వత ముగింపు దిశగా వందేళ్ల తర్వాత సమగ్ర భూ సర్వే చేపట్టి గ్రామ స్థాయిలో గొప్ప మార్పునకు నాంది పలికింది. సమగ్ర భూ సర్వే కోసం గ్రామాలు, పట్టణాల్లో ఏకంగా 10,185 మంది సర్వేయర్లను నియమించింది. 40 డ్రోన్లు కొనుగోలు చేసింది. కబ్జాలకు, భూ వివాదాలకు శాశ్వతంగా స్వస్తి పలుకుతూ.. ప్రజల భూములపై శాశ్వత భూ హక్కును కల్పిస్తూ స్పష్టమైన భూ రికార్డులకు ప్రభుత్వం నాంది పలికింది.

టెండర్ల విధానంలో పారదర్శకత

జ్యుడీషియల్ ప్రివ్యూతో పాటు రివర్స్ టెండర్ ద్వారా టెండర్ల విధానంలో పారదర్శకతకు పెద్ద పీట వేసింది. దేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా తొలిసారి జ్యుడీషియల్ ప్రివ్యూను ఏర్పాటు చేసింది. ఇందుకోసం ఏపీ మౌలిక సదుపాయాలు (తొలుత న్యాయ పరమైన సమీక్ష ద్వారా పారదర్శకత) చట్టం–2019ను అమల్లోకి తెచ్చింది. రూ.100 కోట్లు పైబడిన పనుల టెండర్లన్నీ జ్యుడీషియల్ ప్రివ్యూకు వెళ్తున్నాయి. రివర్స్ టెండర్ ద్వారా ప్రజా ధనం ఆదాకు పెద్దపీట వేస్తూ తెచ్చిన సంస్కరణలు మంచి ఫలితాలిస్తున్నాయి.

'స్పందన'తో ప్రజా సమస్యల పరిష్కారం

అధికారంలోకి వచ్చిన నాటి నుంచే రాష్ట్ర, జిల్లా, డివిజన్, మండల, గ్రామ, వార్డు సచివాలయాల స్థాయిలో ప్రజా సమస్యలు, ఫిర్యాదుల పరిష్కారానికి 'స్పందన' కార్యక్రమాన్ని అమల్లోకి తెచ్చింది. ప్రతి సోమవారం స్పందన కార్యక్రమాన్ని గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి కార్యాలయాల్లో సంబంధిత ఉన్నతాధికారులు స్వయంగా నిర్వహిస్తున్నారు. 1902కు ఫోన్ చేసి సమస్యను చెబితే.. దాన్ని నమోదు చేసుకుని నిర్ణీత సమయంలోగా పరిష్కరించే ఏర్పాటు చేశారు. దీన్ని మరింత నాణ్యతతో అమలు చేయడంలో భాగంగా ప్రజా సమస్యల పరిష్కారం కోసం జగనన్నకు చెబుదాం కార్యక్రమంగా మార్చారు. ఇది ప్రజల సమస్యల పరిష్కారానికి వ్యవస్థలో తీసుకువచ్చిన గొప్ప మార్పుగా నిలుస్తోంది.

మహిళా సాధికారత దిశగా అడుగులు

మహిళలకు ప్రభుత్వ నామినేటెడ్ పనులు, నామినేటెడ్ పదవుల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ఏకంగా చట్టాలు చేసి, అమలు చేస్తోంది. దేశంలో ఏ రాష్ట్రంలోనూ మహిళల కోసం ఇలాంటి చట్టాలు చేసిన దాఖలాల్లేవు. జెండర్ బేస్డ్ బడ్జెట్ పేరుతో మహిళలకు, పిల్లలకు బడ్జెట్ ప్రత్యేక కేటాయింపులు చేస్తోంది. 31 లక్షలకు పైగా ఇళ్ల స్థలాలను మహిళల పేరిట ఇచ్చిన ఏకైక ప్రభుత్వం ఇదే. మహిళా సాధికారత దిశగా వేగంగా అడుగులు వేస్తోంది. రాష్ట్రంలో స్థాపించే పరిశ్రమలు, కంపెనీల్లో స్థానిక యువతకు ఉద్యోగాల్లో 75 శాతం ఇవ్వాలని ప్రత్యేకంగా చట్టం చేసి, అమలు చేస్తోంది. స్థానికంగా యువతకు ఎక్కువగా ఉపాధి కల్పించే ఎంఎస్ఎంఈ రంగాలను ప్రోత్సహిస్తోంది.

మారిన విద్య, వైద్య రంగాలు

ప్రజలకు విద్య, వైద్యం అందించాల్సిన కనీస సామాజిక బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలకు ఉంటుంది. ఈ రెండు రంగాల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భారీ మార్పులకు శ్రీకారం చుట్టడంతో ఫలితాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ప్రభుత్వ రంగంలోని విద్య, వైద్య సంస్థలను వేగంగా బలోపేతం చేస్తున్నారు. మారుతున్న సాంకేతికతతో పాటు భవిష్యత్‌లో అవసరమైన రంగాల్లో మానవ వనరులను అభివృద్ధి చేసేందుకు బోధనా పద్ధతుల్లో, పాఠ్యాంశాల్లో మార్పులు తెచ్చారు. నైపుణ్యాలతో కూడిన యువతను తయారు చేయడానికి బాటలు వేశారు. వైద్య రంగంలో గతంలో ఎన్నడూ లేని విధంగా మార్పులు తెచ్చారు. రెండేళ్లలోనే 48,639 మంది వైద్యులు, వైద్య సిబ్బందిని నియమించడం ద్వారా అన్ని స్థాయి వైద్య సంస్థల్లో మెరుగైన వైద్య చికిత్సలను అందుబాటులోకి తెచ్చారు.

నాడు ఎన్టీఆర్‌ను తిట్టారు.. నేడు దండలు వేస్తున్నారు

చంద్రబాబు, టీడీపీ నేతల తీరుపై ఆర్జీవీ, పోసాని, లక్ష్మీపార్వతి ఆగ్రహం

- రాజమండ్రిలో జరుగుతున్నది పెద్ద జోక్
- ఎన్టీఆర్ కూడా నవ్వాలో.. ఏడ్వాలో అర్థం కాని జోక్ అది
- చంద్రబాబు, టీడీపీ నేతల తీరుపై సినీ దర్శకుడు రామ్‌గోపాల్‌వర్మ విమర్శ
- వైఎస్సార్‌సీపీని మళ్లీ మళ్లీ గెలిపిస్తేనే ఎన్టీఆర్ ఆత్మకు శాంతి
- ఏపీ ఎఫ్‌డీసీ చైర్మన్ పోసాని కృష్ణమురళి
- విజయవాడలో ఘనంగా ఎన్టీఆర్ శతజయంతి వేడుకలు
- ఎన్టీఆర్ విజ్ఞాన్ ట్రస్టు, దేవినేని నెహ్రూ చారిటబుల్ ట్రస్టుల ఆధ్వర్యంలో నిర్వహణ

లబ్బీపేట(విజయవాడతూర్పు): 'నేను ఒక సీరియస్ జోక్ చెప్పడానికే ఇక్కడికి వచ్చాను. ఆ జోక్ ప్రస్తుతం రాజమండ్రిలో జరుగుతోంది. స్వర్గంలో ఉన్న ఎన్టీఆర్ కూడా నవ్వాలో.. ఏడ్వాలో అర్థం కాని జోక్ అది. ఆయన మరణానికి కారణమైన వాళ్లే.. ఇప్పుడు ఎన్టీఆర్ కంటే గొప్ప వ్యక్తి లేరు అంటూ కీర్తిస్తున్నారు' అని టీడీపీ మహానాడును ఉద్దేశించి సినీ దర్శకుడు రామ్‌గోపాల్‌వర్మ అన్నారు. నాడు లక్ష్మీపార్వతితో ఉన్న ఎన్టీఆర్‌ను తిట్టిన వాళ్లే.. నేడు ఆయనకు ఎందుకు దండలు వేస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. ఎన్టీఆర్ విజ్ఞాన్ ట్రస్టు, దేవినేని నెహ్రూ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో విజయవాడలో ఆదివారం ఎన్టీఆర్ శత జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా అతిథులు ఎన్టీఆర్ లలిత కళా అవార్డును పోసాని కృష్ణమురళికి ప్రదానం చేశారు. అనంతరం రామ్‌గోపాల్‌వర్మ మాట్లాడుతూ.. చంద్రబాబు ఎలాంటి వ్యక్తి అనేది స్వయంగా ఎన్టీఆరే చెప్పారన్నారు. రజనీకాంత్ లాంటి వ్యక్తి రాష్ట్రానికి వచ్చి ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచిన వాళ్లతో కూర్చున్నారంటే.. ఒకరకంగా ఆయన కూడా ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడుస్తున్నట్లేనన్నారు. నందమూరి కుటుంబంలో ఉన్న ఒకే ఒక్క మగాడు జూనియర్ ఎన్టీఆర్ అని పేర్కొన్నారు. తాతకు వెన్నుపోటు పొడిచిన వారితో వేదిక పంచుకోవడం ఇష్టం లేకే.. ఆయన వీళ్లందరికీ దూరంగా ఉంటున్నారన్న విషయం స్పష్టమవుతోందన్నారు. తాను 'వ్యూహం' సినిమా తీస్తున్నానని, అందులో చంద్రబాబు క్యారెక్టర్‌ను అరటిపండులా వలిచి చూపిస్తానని ప్రకటించారు.



పోసానికి ఎన్టీఆర్ లలిత కళా పురస్కారం అందజేస్తున్న లక్ష్మీపార్వతి, రామ్‌గోపాల్‌వర్మ తదితరులు

లక్ష్మీపార్వతిపై బాబు వదంతులు

ఏపీ ఎఫ్‌డీసీ చైర్మన్ పోసాని కృష్ణమురళి మాట్లాడుతూ.. ఏ కులం, ఏ మతం వారితో అయినా స్నేహం చేయవచ్చు కానీ.. గుణం లేని వారితో మాత్రం చేయకూడదన్నారు. గుణం లేని వాడు చంద్రబాబు అని.. అతనికి దూరంగా ఉండటం చాలా మంచిదని సూచించారు. తన మంచిచెడులు చూసుకునేందుకు లక్ష్మీపార్వతిని ఎన్టీఆర్ ఆహ్వానించారని, కానీ ఆమెపైనా చంద్రబాబు అనేక పుకార్లు పుట్టించారని చెప్పారు. చంద్రబాబు వల్ల ఎన్టీఆర్‌కు మూడుసార్లు గుండెపోటు వచ్చినా.. లక్ష్మీపార్వతి ఒక్కరే అండగా నిలిచారని చెప్పారు. రాష్ట్రంలో మళ్లీ మళ్లీ వైఎస్సార్‌సీపీని గెలిపిస్తేనే ఎన్టీఆర్ ఆత్మకు శాంతి కలుగుతుందన్నారు.

బాబు కుట్రలకు ఎన్టీఆర్ కుమిలిపోయారు

తెలుగు అకాడమీ చైర్‌పర్సన్ నందమూరి లక్ష్మీపార్వతి మాట్లాడుతూ.. అడ్డదారుల్లో అధికారాన్ని లాక్కునేందుకు చంద్రబాబు చేసిన కుట్రలపై ఎన్టీఆర్ ఎంతగానో కుమిలిపోయారని చెప్పారు. ఎన్టీఆర్‌ను అడుగడుగునా వేధింపులకు గురిచేశారన్నారు. ఎన్టీఆర్ కష్టకాలంలో దేవినేని నెహ్రూ అన్నీ తానై నిలిచారని పేర్కొన్నారు. ఎన్టీఆర్ పేరుతో జిల్లా ఏర్పాటు చేసినందుకు సీఎం జగన్‌కు ధన్యవాదాలు తెలిపారు. తన గౌరవాన్ని నిలబెట్టిన జగన్‌కు జీవితాంతం రుణపడి ఉంటానని చెప్పారు. మాజీ మంత్రి పేర్ని నాని మాట్లాడుతూ.. ఎన్టీఆర్ ప్రారంభించిన పథకాలు ఎప్పటికీ చిరస్మరణీయమేనని అన్నారు. ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ఎన్టీఆర్ పార్టీ స్థాపించినప్పటి నుంచి మరణించే వరకు ప్రతి ఘటననూ తాను ప్రత్యక్షంగా చూశానని చెప్పారు. ఎన్టీఆర్ లాంటి గొప్ప మనిషి కూడా చంద్రబాబు కుట్రకు బలయ్యారన్నారు. దేవినేని నెహ్రూ చారిటబుల్ ట్రస్టు కన్వీనర్, వైఎస్సార్‌సీపీ విజయవాడ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ మాట్లాడుతూ.. ఎన్టీఆర్, వైఎస్సార్ ఒక కులానికో, పార్టీకో పరిమితం కాదన్నారు. వారు మహనీయులని.. తెలుగు జాతి గొప్పతనాన్ని ప్రపంచానికి చాటి చెప్పారని కొనియాడారు. సభలో ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, మేయర్ రాయన భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

బీజేపీ ఓటమిలో ఎంఐఎం కీలకపాత్ర

- జిల్లాలో పార్టీని మరింత బలోపేతం చేయండి
- ఎమ్మెల్యే ఒకవర్గం వారి కోసమే పనిచేస్తున్నారు..
- ముస్లింల సమస్యలు పరిష్కరించకుంటే ఇబ్బంది తప్పదు
- ఎంఐఎం జాతీయ అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ



సభకు హాజరైన జనం



మాట్లాడుతున్న అసదుద్దీన్ ఒవైసీ

కైలాస్‌నగర్: దేశంలో, రాష్ట్రంలో ఏ వర్గానికి చెందిన రాజకీయ బలముంటుందో వారి గొంతు బలంగా వినిపిస్తుందని, ఆ దిశగా మజ్లిస్ పార్టీని రాజకీయంగా మరింత బలోపేతం చేయాలని ఎంఐఎం జాతీయ అధ్యక్షుడు, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. ఆదివారం రాత్రి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డైట్ కళాశాలలో ఆపార్టీ పట్టణశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన బహిరంగ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. స్థానిక ఎమ్మెల్యే ఒక వర్గం వారి కోసమే పనిచేస్తూ ముస్లింల సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. ఆదిలాబాద్ పట్టణంలో ఉర్దూ మీడియం ఒకేషనల్ ట్రైనింగ్ సెంటర్‌ను ఎందుకు ఏర్పాటు చేయలేదని, ఖుర్షీద్ నగర్‌లో షాదీఖానా కోసం రూ.2 కోట్ల నిధులు మంజూరైనా నిర్మాణమెందుకు జరుగలేదని ప్రశ్నించారు. ఎంఐఎం కౌన్సిలర్లు కలిగిన అంబేద్కర్‌నగర్, రాంనగర్ వార్డులకు ఒక్క రూపాయి ఎందుకు ఇవ్వకుండా వివక్ష చూపుతున్నారని ఎమ్మెల్యేను ప్రశ్నించారు. రిమ్స్ ఆసుపత్రిలో అటెండర్ ఉద్యోగం దక్కాలన్నా రూ.2లక్షలు లంచం తీసుకుంటున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యే కేవలం మున్నూరు కాపులకేనా లేక అందరికీ ఉద్యోగాలిప్పించే ఉద్దేశముందా అని ప్రశ్నించారు. అలాగే ఇప్పోడలో ఉర్దూ కాలేజీ ఏర్పడలేదని, ఏళ్ల క్రితం మంజూరైన షాదీఖానా అభివృద్ధికి నోచుకోవడం లేదన్నారు. ప్రతిపక్షాలు మాత్రం స్టీరింగ్ నా చేతిలో ఉందంటూ విమర్శిస్తున్నాయన్నారు. కేవలం మాటలతో నిరుద్యోగ యువత కడుపు నిండదని, అర్హులైన ముస్లింలకు న్యాయం చేసేలా కలెక్టర్ స్పందించాలన్నారు. ఆదిలాబాద్‌లో ముస్లింల ఓట్లు 62 వేలున్నాయని, ఎన్నికలకు ఇంకా సమయముందని ఆలోగా సమస్యలు తీరిస్తే సరి, లేదంటే వచ్చే ఎన్నికల్లో మేం మిమ్మల్ని పట్టించుకునే పరిస్థితులుండవని హెచ్చరించారు. ఐటీ హబ్‌లోనూ నిరుద్యోగ ముస్లిం పిల్లలకు ఉద్యోగాలు దక్కాలన్నారు. కాంగ్రెస్ పార్టీ అస్తిత్వాన్ని కోల్పోతుందని అందులోని నాయకులు పార్టీని వీడి ఇతర పార్టీల్లోకి వెళుతున్నారన్నారు. తనపై విమర్శలు చేస్తున్న రేవంత్‌రెడ్డి ముందు వారిని కాపాడుకునే ప్రయత్నం చేయాలన్నారు. మున్నూరుకాపులు, ముదిరాజ్‌లు తన వెంట వస్తున్నారని బీజేపీ నాయకులు సంబరపడుతున్నారని వారి సంబరం ఎన్ని రోజులో చూద్దామన్నారు. 2014, 2019లో రాష్ట్రంలోని బీజేపీని ఓడించడంలో ఎంఐఎం పాత్రనే కీలకమని ఈవిషయాన్ని ప్రభుత్వం గుర్తుంచుకోవాలన్నారు. ఎంఐఎం దేశంలో కేవలం మూడు చోట్ల పోటీ చేస్తేనే కాంగ్రెస్, బీజేపీలు భయపడుతున్నాయన్నారు. ఆదిలాబాద్‌లో సభ పెట్టగానే ఆ రెండు పార్టీల్లో వణుకు మొదలైందన్నారు. కరీంనగర్, నిజామాబాద్, సికింద్రాబాద్‌లో ఏం జరుగనుందోనని ఆ పార్టీలు భయపడుతున్నాయన్నారు. ఎన్నికలు వచ్చే వరకు తమసభలు ఇలాగే కొనసాగుతాయని, రాష్ట్రంలో ఎన్ని స్థానాల్లో పోటీ చేయలేనేదీ త్వరలోనే వెల్లడిస్తామని స్పష్టం చేశారు. నాంపల్లి ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మెహ్రాజ్, హైదరాబాద్ మాజీ డిప్యూటీ మేయర్ మాజీద్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

ముఖరా(కె)ను సందర్శించిన కోరుట్ల సర్పంచులు



ముఖరా(కె) పంచాయతీ కార్యాలయం ఎదుట సర్పంచులు, కార్యదర్శులు

ఇచ్చోడ: మండలంలోని ముఖరా(కె) పంచాయతీని జగిత్యాల జిల్లా కోరుట్ల మండల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు ఆదివారం సందర్శించారు. గ్రామంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు. చెత్తతో వర్మీకంపోస్టు తయారీ, సోలర్ విద్యుత్ వినియోగం, ఇంకుడుగుంతలు, సామూహిక మరుగుదొడ్లతో పాటు నూతనంగా నిర్మించిన పంచాయతీ కార్యాలయ భవనాన్ని పరిశీలించారు. గ్రామ సర్పంచ్ గాడ్గే మీనాక్షి, ఎంపీటీసీ సుభాష్‌ను అభివృద్ధి పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కోరుట్ల ఎంపీపీ నారాయణ, ఎంపీడీవో నీరజ, 20 గ్రామాల సర్పంచులు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

యాదవులు అన్నిరంగాల్లో ఎదగాలి

- టూరిజం కార్పొరేషన్ చైర్మన్ గెల్లు శ్రీనివాస్



మాట్లాడుతున్న గెల్లు శ్రీనివాస్ యాదవ్

పాతమంచిర్యాల: యాదవులు ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి సాధించాలని టూరిజం కార్పొరేషన్ చైర్మన్ గెల్లు శ్రీనివాస్‌యాదవ్, మంచిర్యాల షాద్‌నగర్ ఎమ్మెల్యేలు దివాకర్‌రావు, అంజయ్య యాదవ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఫారెస్టు కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ఫంక్షన్ హాల్‌లో యాదవ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు పెండ్లి అంజయ్యయాదవ్ ఆధ్వర్యంలో ఆదివారం యాదవ శంఖారావ సమావేశం నిర్వహించారు. ముందుగా శ్రీకృష్ణభగవానుని చిత్రపటం వద్ద జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ యాదవుల సంస్కృతి సంప్రదాయాలు గొప్పవన్నారు. యాదవులు నేటికీ అన్నిరంగాల్లో వెనుకబడే ఉన్నారని తెలిపారు. యాదవులు, బీసీల అభివృద్ధి కోసం నియమించిన కాకా కాలేకర్ కమిషన్ సిఫారసులను గత ప్రభుత్వాలు అమలు చేయలేదని విమర్శించారు. బీసీల రిజర్వేషన్లపై కేంద్రం నిర్లక్ష్యం చేస్తోందన్నారు. జిల్లా కేంద్రంలో యాదవ భవన్ నిర్మాణానికి రూ.5 లక్షలు కేటాయిస్తానని ఎమ్మెల్యే దివాకర్‌రావు ప్రకటించారు. తెలంగాణ ప్రభుత్వం యాదవుల అభివృద్ధి కోసం రూ.5 వేల కోట్లతో 4 లక్షల మందికి గొర్రెలు పంపిణీ చేసిందన్నారు. యాదవ హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు రాములుయాదవ్ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో అన్ని పార్టీలు 20 మంది యాదవకులకు ఎమ్మెల్యే టికెట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం యాదవ కళాకారులు, ఒగ్గు కళాకారులు చేసిన నృత్యాలు అలరించాయి. సమావేశంలో రాష్ట్ర గొర్రెలు, మేకల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ బాలరాజు యాదవ్, యాదవ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు అరిగెల నాగేశ్వర్‌రావు, యాదవ సంఘం రాష్ట్ర కార్యదర్శి గడ్డం సతీశ్‌యాదవ్, జన్నారం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాజేశ్‌యాదవ్, రాష్ట్ర గొర్రెలు, మేకల పెంపకం వృత్తిదారుల సంఘం అధ్యక్షుడు కొమ్ము అశోక్‌యాదవ్, నాయకులు అల్లంల నాగన్న, అరిగెల పద్మయాదవ్, పల్లె తిరుమలయాదవ్, గోపు లింగన్న యాదవ్, పుర్ర కుమార్, పుట్ట లావణ్య, అవుల సురేశ్, నాగభూషణం, గట్టయ్య తదితరులు పాల్గొన్నారు.

మిల్లర్ల మాయాజాలం

- ట్రక్‌షీట్ లేకుండానే ధాన్యం డంప్
- విజిలెన్స్ తనిఖీల్లో అక్రమాల గుట్టు రట్టు

సుల్తానాబాద్(పెద్దపల్లి): పెద్దపల్లి జిల్లాలో మిల్లర్ల మాయాజాలానికి అన్నదాత చిత్తవుతున్నాడు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, మిల్లర్లు కుమ్మక్కై రైతులను అందినకాడికి దోచుకుంటున్నారు. ధాన్యంలో తరుగు పేరుతో ఒక లారీ లోడ్‌కు రూ.25 వేల వరకు మిల్లర్లు కటింగ్ పెడుతున్నారు. మరోవైపు కొనుగోలు కేంద్రాల్లో తాలు, తప్ప పేరుతో 2 నుంచి 5 కిలోల తరుగు తీస్తున్నారు. మంత్రి గంగుల కమలాకర్ ఒక్క గింజ కూడా తరుగు ఉండదని చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో అందుకు విరుద్ధంగా జరుగుతోంది.

విజిలెన్స్ దాడులు

జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు, తూకం, తరలింపు ఆలస్యం కావడంపై విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదులు అందాయి. దీంతో రంగంలోకి దిగిన సివిల్ సప్లయ్ విజిలెన్స్ అధికారులు మిల్లులు, కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేస్తున్నారు. హైదరాబాద్ నుంచి వచ్చిన విజిలెన్స్ అధికారి జిల్లాలోని పలు మిల్లులను తనిఖీ చేశారు.

అక్రమాల బట్టబయలు

అధికారుల తనిఖీల్లో మిల్లర్ల నిర్లక్ష్యం, దోపిడీ, అక్రమాలు బయటపడ్డాయి. మిల్లులకు చేరిన ధాన్యం అన్‌లోడ్ చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నట్లు గుర్తించారు. ట్రక్‌షీట్ రికార్డులు, మిల్లుకు వచ్చిన ధాన్యం రికార్డులు లేకపోవడంతో రైతులకు డబ్బులు అందడంలో జాప్యం జరుగుతుందని నిర్ధారించారు. లూజ్ ధాన్యం కూడా అన్‌లోడ్ చేయడం అనుమానాలకు తావిస్తోంది.

పొరుగు రాష్ట్రం నుంచి ధాన్యం..

పొరుగున ఉన్న మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి భారీగా ధాన్యాన్ని జిల్లాలోని మిల్లర్లు అక్రమంగా దిగుమతి చేసుకుంటున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అక్కడ క్వింటాల్ రూ.1,700 చొప్పున కొనుగోలు చేసి, జిల్లా నుంచి వచ్చిన ధాన్యం లోడ్ లారీగా లెక్కల్లో చూపుతున్నట్లు పలువురు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా రైతుల ధాన్యం అన్‌లోడింగ్, లారీలు పంపడంలో ఆలస్యం అవుతోందని తెలుస్తోంది.

కొనుగోలు కేంద్రాల్లో ఇష్టారాజ్యం..

ఇక జిల్లాలో కొనుగోలు కేంద్రాల్లో నిర్వాహకుల ఇష్టారాజ్యంగా వ్యవహరించడంతో రైతులు దగా పడుతున్నారు. తరుగు పేరుతో అదనంగా రైతుల నుంచి దండుకుంటున్నారు. కేంద్రాల నిర్వాహకులు, మిల్లర్లు కుమ్మక్కై దోపిడీ చేస్తున్నారంటూ తరచూ రైతులు ఆందోళన చేస్తున్నారు.



ఇటీవల సుల్తానాబాద్‌లో విజిలెన్స్ అధికారుల తనిఖీలు

ఆన్‌లైన్ నమోదులో ఆలస్యం

ధాన్యం తూకం వేసిన వెంటనే వివరాలను కేంద్రాల నిర్వాహకులు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి. ఆ లోడ్ మిల్లుకు చేరుకున్న తర్వాత అన్‌లోడ్ చేసిన మిల్లర్ సదరు వివరాలను మళ్లీ ఆన్‌లైన్ చేయాలి. ఇలా ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ జరిగితేనే రైతులకు 48 గంటల్లో ధాన్యం డబ్బులు అందే అవకాశం ఉంటుంది. కాగా జిల్లాలో మిల్లర్లు, కేంద్రాల నిర్వాహకులు అలా చేయడం లేదు.

సీబీఐ విచారణ చేయించాలి



రైతులు కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకువచ్చిన తర్వాత మాయిశ్చర్ రాగానే కొనుగోలు చేస్తున్నారు. మిల్లర్లు వరి ధాన్యం హీలింగ్ లేదని సాకు చెబుతూ రెండు నుంచి ఐదు కిలోల వరకు కటింగ్ పెడుతున్నారు. అధికారులు, కేంద్రాల నిర్వాహకులు, మిల్లర్లు కుమ్మక్కై ఇదంతా చేస్తున్నారు. విజిలెన్స్ అధికారులు కాకుండా సీబీఐ అధికారులు దాడులు చేస్తే రూ.కోట్లలో కుంభకోణం బయటకు వచ్చే అవకాశం ఉంది. సీబీఐ అధికారులతో విచారణ చేయించాలి.

– కడారి సునీల్, సీపీఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు

అధికారులు, మిల్లర్ల కుమ్మక్కు



రెవెన్యూ, వ్యవసాయ, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు కుమ్మక్కు అయ్యారన్నది బహిరంగ రహస్యం. ప్రభుత్వం నుంచి సబ్సిడీ తీసుకున్న రైస్ మిల్లుల్లో సర్కార్ ఆదేశాలను పట్టించుకోకపోవడం చూస్తుంటే అధికారుల లోపాయికారి ఒప్పందమే నిదర్శనం అని చెప్పవచ్చు. కోట్ల రూపాయలు చేతులు మారుతుండడంతోనే అధికారులు నిమ్మకునీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారు.

– కల్లేపల్లి జానీ, సింగిల్ విండో మాజీ చైర్మన్, గర్రెపల్లి

దశాబ్ది ఉత్సవాలు దద్దరిల్లాలి

- సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్
- పెద్దపల్లి కలెక్టరేట్‌లో సమీక్ష



మాట్లాడుతున్న మంత్రి కొప్పుల ఈశ్వర్, చిత్రంలో కలెక్టర్, ఎమ్మెల్యేలు, జెడ్పీ చైర్మన్ తదితరులు

పెద్దపల్లిరూరల్: తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన తర్వాత అన్నిరంగాల్లో అద్భుత ప్రగతిని సాధించిందని, రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలు నలుదిశలా దద్దరిల్లేలా నిర్వహించాలని రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. ఆదివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జెడ్పీ చైర్మన్ పుట్ట మధు, ఎంపీ వెంకటేశ్‌నేత, కలెక్టర్ సంగీత, ఎమ్మెల్యేలు దాసరి మనోహర్‌రెడ్డి, కోరుకంటి చందర్, డీసీపీ వైభవ్‌గైక్వాడ్‌తో కలిసి దశాబ్ది వేడుల నిర్వహణపై మంత్రి సమీక్షించారు. జూన్ 2 నుంచి 22 వరకు వేడుకలను శాఖల వారీగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. సీటిపారుదల, విద్యుత్ రంగాల్లో తెలంగాణ అనేక అద్భుతాలు సాధించిందన్నారు. దశాబ్ది వేడుకలను గ్రామ, మండల, జిల్లా స్థాయిలో ఘనంగా నిర్వహించాలన్నారు. కొత్త జిల్లాలను ఏర్పాటు చేసుకుని పాలనను మరింత చేరువగా తెచ్చుకున్నామని ఎంపీ, జెడ్పీ చైర్మన్ అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా లబ్ధిదారులకు గొర్రెలు, పట్టాలను పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు. గ్రామాలు, పట్టణాల్లో చేపట్టిన అభివృద్ధి పనుల వివరాలను ఫ్లెక్సీల రూపంలో ప్రదర్శించాలని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. అదనపు కలెక్టర్ కుమార్ దీపక్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్‌సింగ్, మేయర్ అనిల్‌కుమార్, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



అంతర్జాతీయ చింతన

మంచి మాట

దేశభక్తి ఒకవైపున ఉంటే మరొకవైపున ప్రపంచభక్తి ఉన్న నాణెంగా ప్రతివ్యక్తీ ఉండాలి; జాతీయ చింతన, అంతర్జాతీయ చింతన ఈ రెండూ ప్రతివ్యక్తిలోనూ తొణికిసలాడుతూ ఉండాలి. అంతర్జాతీయత అన్నది ప్రతివ్యక్తికీ ఆశంసనీయమైంది; అవసరమైంది.

ప్రతివ్యక్తికీ జాతీయ చింతన ఎంత ముఖ్యమైందో అంతర్జాతీయ చింతన కూడా అంత ముఖ్యమైందే. సరైన ఆలోచన చేస్తే మనకు అంతర్జాతీయత ఆవశ్యకత అవగతం అవుతుంది. ఈ ఆవశ్యకతను ఆకళింపు చేసుకున్న తరువాతే మన పెద్దలు 'వసుధైవకుటుంబకం' అంటూ భూమండలం ఒక కుటుంబమే అని చెప్పారు.

భూమి అంతా ఒక కుటుంబం అన్న భావన భూమిపై ఉంటున్న మనిషిలో కలగడం లేదు. ఈ భావనే ఉండి ఉంటే దండ యాత్రలు, కూలగొట్టడాలు, కొల్లగొట్టడాలు, దారుణ మారణకాండలు భూమిపై జరిగి ఉండేవి కావు. మొదటి, రెండవ ప్రపంచ యుద్ధాలు జరిగి ఉండేవి కావు. అణు ఆయుధాలు ప్రయోగించబడి ఉండేవి కావు. ఇవాళ్టి రోజున ప్రపంచానికి పెద్దగడ్డుగా పరిణమిస్తున్న ఉక్రెయిన్ యుద్ధం కూడా ఉండేది కాదు.

> అంతర్జాతీయతను ఆలోచన చేద్దాం; మనం విపత్తుల్ని నిశ్వాసిద్దాం. అంతర్జాతీయతకు మాలిమి అవుదాం; మనం ప్రశాంతతను ఉచ్ఛ్వాసిద్దాం.

కుటుంబం అని అంటే ఒక ఇంట్లో నివసించే బంధువర్గం అనీ అర్థం ఉంది. దేశదేశాలతో ఉన్న భూమి మొత్తం ఒక ఇల్లు దేశదేశాలవాళ్లందరూ ఒక బంధువర్గం అన్న భావన ప్రపంచంలోని ప్రతిదేశంలోని ప్రతివ్యక్తిలోనూ ఉండాలి.

వ్యావహారిక శకానికి పూర్వం 6వ శతాబ్దికి చెందిన తమిళ సంగకాల కవి-తాత్త్వికుడు కణియన్ పూంగున్రనార్ 'ఏదైనా ఊరే; ఎవరైనా బంధువులే' అన్న అర్థాన్ని ఇచ్చే ఒక గొప్పమాట చెప్పారు. ఆయన చెప్పిన ఆ తమిళమాట అంతర్జాతీయం అయిపోయింది. ఆ మాట సూచించిన అంతర్జాతీయతకు ఆకృతిగా' ఈ ప్రపంచంలోని ప్రతి ఊరూ మన ఊరే; ప్రతి వ్యక్తీ మన బంధువే' అన్న భావన మనకు తప్పకుండా కావాలి.

మొత్తం ప్రపంచం అంతా ఒక నేల కదా? మొత్తం నేల అంతా ఒక ప్రపంచం కదా? ఈ భావన మనలో లేకుండా పోవడం కాదు మనకు రానేలేదు. అందుకే ఎప్పటినుంచో మనల్ని అపాయాలు చుట్టుముడుతూనే ఉన్నాయి. ఈ భావన రాకపోవడంవల్ల మానవాళికి ముప్పు అంటుకుంది. ఆ ముప్పు ఆనాటికానాటికీ వ్యాపిస్తూనే ఉంది; వ్యథల్ని రగిలిస్తూనే ఉంది.

మొత్తం నేల అంతా ఖండాలు, దేశాలు, ప్రాంతాలుగా ముక్కలైపోయింది. శత్రుత్వాలు, విద్వేషాలు అనే దీర్ఘరోగాలతో అనాదిగా ప్రపంచం బాధపడుతూనే ఉంది. మనిషి ఎందుకు నేలను ముక్కలు చేశాడు? అసలు మనిషి ఎవరు నేలను ముక్కలు చెయ్యడానికి? ఇలా ముక్కలు చేసి మనిషి ప్రపంచాన్ని చెడగొట్టాడు; తనకు తానే పెనుచెడుపు చేసుకున్నాడు; తాను చేసుకున్న చెడుపునకు తానే చెల్లిపోతున్నాడు.

ప్రపంచం అన్న నేల పలుముక్కలయ్యాక ఒక ముక్క మరో ముక్కకు పక్కలో బల్లెం అయింది; ఒక ముక్క మరో ముక్కకు గాయం చేస్తూనే ఉంది. గాయంలేని చోటులేదు ప్రపంచంలో. అవును ప్రపంచానికి గాఢమైన గాయం అయింది. ఆ గాయం వల్ల ప్రజ జీవనం విలవిలలాడుతోంది; ప్రజ జీవితం విలపిస్తోంది. అంతర్జాతీయత లేకపోవడం ఈ పరిణామానికి ఏకైక కారణం.

సరిహద్దుల్ని చెరిపేసుకుని దేశాలన్నీ కలిసిపోవాలి. ఇలా అనుకోవడం అత్యాశే కావచ్చు; ఇది జరిగేది కాకపోవచ్చు. నిజంగా అదే జరిగితే ప్రపంచానికి పట్టుకున్న యుద్ధాల ఉచ్చు తొలగిపోతుంది. మూడవ ప్రపంచ యుద్ధం రాకుండా ఉండాలన్నా, ఏ దేశమూ, ఏ వ్యక్తీ యుద్ధానికి గురై బలైపోకుండా ఉండాలన్నా మనలో అంతర్జాతీయత రావాలి. భయంతో కాదు మనిషి భద్రతతో మనుగడ చెయ్యాలి. అందుకు మనలో అంతర్జాతీయత ఉండాలి.

– రోచిష్మాన్

సన్నిధి

సన్యసించిన వ్యక్తులు, పరమహంసలు, మఠాధిపతులు, పీఠాధిపతులు... వీరు సర్వసాధారణంగా ఆత్మోద్ధరణకు సంబంధించిన విషయాల మీద అనుగ్రహభాషణలు చేస్తుంటారనీ, వారు తాము తరించి, ఇతరులు తరించడానికి సంబంధించిన మార్గాలను బోధచేయడం వరకే పరిమితం అవుతారని లోకంలో భావన చేస్తుంటారు. కానీ ఈ భావనలకు భిన్నంగా వెళ్ళిన గురువు ఒకరున్నారు. ఆయన సమర్థ రామదాసు. ఈ దేశం కష్టాల్లో ఉన్నప్పుడు సనాతన ధర్మానికి పూర్వ వైభవం తీసుకురావడంలో ఆయన ఎనలేని కృషి చేశారు.

సంపద.. సమృద్ధి

గురువాణి



దేశంలో సమకాలీన పరిస్థితులను బాగా అధ్యయనం చేసారు. ఆ కాలంలో ఉన్న పాలనా వ్యవస్థ, అప్పుడున్న సామాజిక అలజడులు, ప్రజలలో అప్పుడున్న అభద్రతా భావాన్ని దష్టిలో పెట్టుకుని ప్రజలకు మౌలికంగా ఏవి అవసరమో వాటిని బోధించి, ఆచరణలో కూడా మార్గదర్శనం చేసిన గురువు ఆయన. ప్రజలు తమ శారీరక ఆరోగ్యంతోపాటూ, ఆత్మరక్షణకు అవసరమయిన దృఢత్వాన్ని పొందడానికి ఆయన పర్యటించిన ప్రదేశాల్లో వ్యాయామశాలలు నెలకొల్పారు. ఆరోగ్యంతోపాటూ మానసిక పరిణతికి చదువు అవసరమని పాఠశాలలు ఏర్పాటు చేసారు. ఆధ్యాత్మిక క్రమశిక్షణకు, ధర్మంపట్ల అనురక్తి కలగడానికి భక్తి అవసరమని హనుమాన్ మందిర్ లు నిర్మించారు. ప్రజలందరిలో దేశభక్తి నూరిపోసారు. ఆయన ప్రజలకు తరచుగా ఆరు సూత్రాలు బోధిస్తుండేవారు...అవి ఎప్పటికీ ఆచరణ యోగ్యాలే.

వాటిలో మొదటిది సంపద, సమృద్ధి. అంటే అందరివద్దా సంపద ఉండాలి, అది కూడా సమృద్ధిగా ఉండాలి. లేకపోతే తను వ్యక్తిగతంగా అనుకున్నది కూడా సాధించలేరు, జీవితంలో అభ్యున్నతిని పొందలేరు. ఒక వయసు వచ్చిన తరువాత, మనిషి కష్టపడి స్వయంగా సంపాదించుకోవడం అవసరం.

దీని ప్రాధాన్యతను మన సుభాషితాలు కూడా చక్కగా వివరించాయి. మాతానిందతి/ న అభినందతి పితా / భ్రాతా న సంభాషతే! భృత్యః కృప్యతి/ న అనుగచ్ఛతి సుతః/ కాంతాచ న ఆలింగతే/ అర్థప్రార్థన్


శంకయా న కురుతే స్వాలాపమాత్రం సుహృత్/ తస్మాత్ అర్థముపాశ్రయ శ్రుణు సర్వేహి అర్థేన సర్వే వశాః... అంటాయి. అంటే – నీకంటూ సంపాదన లేకపోతే ఎప్పుడూ నిందించని అమ్మ కూడా నిందిస్తుంది. తండ్రి సంతోషంతో భుజం మీద చెయ్యివేసి ఆప్యాయంగా అభినందించడు. తోడపుట్టినవారు కూడా చులకన చేస్తారు. పలకరించరు.సేవకుడికి ఏదయినా పని చెబితే... పైసా విదల్చడు కానీ పనులు మాత్రం చెబుతుంటాడని ఆగ్రహిస్తాడు.

పిల్లల అభ్యున్నతికి ఖర్చుపెట్టనప్పుడు కన్న కుమారుడు సేవలందించడు. ఇల్లు గడవడానికి అవసరమయిన సొమ్ము తీసుకురానప్పుడు కట్టుకున్న భార్య ప్రేమగా కౌగిలించుకోదు. ఎంత మంచి స్నేహితుడయినా ఎదురుపడితే అప్పు అడుగుతాడేమోనని ముఖం చాటేస్తాడు. అందువల్ల ఓ స్నేహితుడా! నీతి తప్పకుండా సంపాదించు. దానితో సమస్తమూ నీకు వశపడుతుంది... అంటారు.

ఒక తోటలో అరవిరిసిన పువ్వుల వాసనలకన్నా.... కష్టపడి చెమటోడ్చి సంపాదించిన ద్రవ్యం ఎంత తక్కువయినా దాని సువాసన ఎక్కువగానే ఉంటుందని కూడా అంటారు. అలా సక్రమ మార్గంలో కష్టపడి మనిషి సంపాదించి బతకగలగాలి. అది ఆత్మగౌరవం. అది మనిషికి సంపూర్ణతను ఇస్తుంది.


బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

బౌద్ధవాణి



పట్టుదలకు ప్రతిరూపం

కొందరు అపజయం వస్తుందేమో అని అసలు పనులు ప్రారంభించరు. కొందరు కొద్ది ఇబ్బంది రాగానే విరమించుకుంటారు. ఇంకొందరు గట్టి దెబ్బ తగిలితే మధ్యలోనే మానుకుంటారు. కానీ, ధీరులు ఫలితం పొందే వరకూ ప్రయత్నం విడిచిపెట్టరు. అలా ఉండటమే బుద్ధుని లక్షణాల్లో ఒకటి. జ్ఞానం కోసం ఎక్కడెక్కడో, ఎన్నోచోట్ల, ఎంతోమంది గురువుల దగ్గరకు తిరిగి తిరిగి వెదకి వెదకి చివరికి తానే ఏకాంతంగా ధ్యానానికి కూర్చున్నాడు గౌతముడు. ఎన్ని కష్టాలొచ్చినా జ్ఞానోదయం పొందేవరకూ లేవకూడదు అనుకున్నాడు. శారీరకంగా మానసికంగా తట్టుకోలేనన్ని అవాంతరాలు వచ్చిపడ్డాయి. అయినా లేవలేదు. చివరికి జ్ఞానోదయం పొందాడు. పట్టుదలకు మారుపేరుగా నిలిచాడు.

ఒకసారి బుద్ధుడు గోసింగ అనే చోట సాలవనంలో ఉన్నాడు. అప్పుడు ఆయనతో సారిపుత్రుడు, మహా మౌద్గల్యాయనుడు, మహా కాశ్యపుడు, అనిరుద్ధుడు, రేవతుడు, ఆనందుడు అనే అనుయాయులు ఉన్నారు. వీరంతా బౌద్ధ సంఘ ప్రముఖులే. మహా ప్రాజ్ఞులే.

ఒకరోజు వారంతా ఒకచోటకు చేరి మాట్లాడుకుంటున్నారు. ఆ సాలవనం పచ్చగా నిండుగా ఉంది. చెట్లనిండా పూలు విప్పారాయి. ఆ పూల తెల్లని రేకుల చుట్టూ నల్లని తుమ్మెదలు తిరుగుతున్నాయి. మెల్లగా వీచే గాలి పూల పరిమళాన్ని మోసుకు వస్తోంది. చెట్లమీద పున్నమి వెన్నెల పడి మెరుస్తోంది.

అప్పుడు సారిపుత్రుడు ''మిత్రులారా! ఈ గోసింగవనం గుబాళిస్తోంది. ఈ వనంలో ఎలాంటి భిక్షువు ఉంటే మరింత శోభనీయగలడు?'' అని అడిగాడు.

''బహుశ్రుతుడు విన్నవన్నీ గుర్తుపెట్టుకోగల నేర్పరి. లోతైన దృష్టి గలవాడు'' అన్నాడు ఆనందుడు.

''మరి రేవతా! నీ అభిప్రాయం?''

''ఇక్కడ ఏకాంతంగా ఉండి ఈ ఏకాంతంలోని ఆనందాన్ని అనుభవించే భిక్షువు'' అన్నాడు రేవతుడు.

సారిపుత్రుడు ప్రశాంతంగా అనిరుద్ధుని వైపు చూశాడు.

''ఏకాంతంగా కూర్చొని మానవ నేత్రంతో కాకుండా, దివ్య నేత్రంతో లోకాన్ని దర్శించగలవాడు'' అన్నాడు గంభీరంగా.

''మహా కాశ్యపా! మీ అభిప్రాయం?''

''తాను ఒంటరిగా ఉంటూ ఒంటరిగా ఉండేవారిని మెచ్చుకునే వాడు. తాను ప్రయత్నిస్తూ ప్రయత్నించే వారిని ప్రోత్సహించేవాడు. తాను శీలవంతునిగా ఉంటూ శీల సంపన్నులను శ్లాఘించే వాడు'' అన్నాడు. సారిపుత్రుడు మౌద్గల్యాయుని వంక తల తిప్పాడు.

''నా ఉద్దేశ్యంలో ఒంటరిగా కాదు, ఇద్దరు మిత్రులు ఇక్కడ ఉండాలి. వారు ధర్మాన్ని చెప్పుకోవాలి. చర్చించుకోవాలి. ప్రశ్నించుకోవాలి. సమాధానాలు చెప్పుకోవాలి. అలాంటి మైత్రి వల్ల ఈ వనం మరింత శోభిస్తుంది'' అన్నాడు. ఇక అందరూ సారిపుత్రుని వైపు చూశారు.

''తాను చిత్తం (మనస్సు) వశంలో కాకుండా చిత్తాన్నే తన వశంతో ఉంచుకోగల భిక్షువు అన్నాడు.

అలా ఆరుగురు మిత్రులూ ఆరు విధాలుగా సమాధానాలు చెప్పారు. వారిలో ఎవరి అభిప్రాయం సరైనదో తెలుసుకోవాలని బుద్ధుని దగ్గరకు వెళ్లారు. విషయం చెప్పారు.

''మీరు చెప్పినవన్నీ అయితే.. ఎవరైతే ధ్యానానికి కూర్చొని '' నా మనస్సు నిండి మలినాలు పూర్తిగా తొలగేవరకూ ఇక్కడి నుండి లేవను. అని కూర్చొని దాన్ని సాధించే వరకూ పట్టు విడవని వారు ఎవరుంటారో.... వారి వల్ల, వారి అకుంఠిత దీక్ష వల్ల ఈ వనం మరింత ప్రకాశిస్తుంది'' అన్నారు.

మనోప్రకాశానికి పట్టుదల, దీక్షలే పట్టుకొమ్మలని వారికి అర్థమయ్యింది. వారంతా తదేకంగా బుద్ధుని వంక చూశారు. ఆయన ముఖం వెన్నెల కంటే ప్రకాశంగా, ప్రశాంతంగా, మనోహరంగా కనిపించింది. అందరూ ప్రణమిల్లారు!

– డా. బొర్రా గోవర్ధన్

సినిమా

నేను క్షేమంగా ఉన్నాను

– శర్వానంద్



'నా కారు చిన్న ప్రమాదానికి గురైంది. కానీ, నేను క్షేమంగానే ఉన్నాను' అంటూ హీరో శర్వానంద్ పేర్కొన్నారు. ఆదివారం ఉదయం హైదరాబాద్‌లోని ఫిల్మ్‌నగర్ జంక్షన్‌లో శర్వానంద్ ప్రయాణిస్తున్న కారు డివైడర్‌ను ఢీకొట్టింది. దీంతో శర్వానంద్ రోడ్డు ప్రమాదానికి గురయ్యాడనే వార్తలు రావడంతో ఆయన అభిమానులు, సినీ వర్గాల్లో ఆందోళన నెలకొంది. దీనిపై సోషల్ మీడియా వేదికగా శర్వానంద్ స్పందిస్తూ – ''ఈ రోజు (ఆదివారం) ఉదయం నా కారు ప్రమాదానికి గురైనట్లు వార్తలు వస్తున్నాయి. ఇది చాలా చిన్న ప్రమాదం. మీ అందరి ప్రేమ, ఆశీస్సులతో నేను క్షేమంగానే ఉన్నాను. నా ఆరోగ్యం గురించి ఎవరూ ఆందోళన పడొద్దు'' అన్నారు. కాగా జూన్ 3న రాజస్థాన్‌లో శర్వానంద్ వివాహం రక్షితతో జరగనున్న విషయం తెలిసిందే.

హనుమంతుణ్ణి నమ్మాం

– ప్రశాంత్ వర్మ



''హను-మాన్' చిత్రాన్ని చిన్నదిగా స్టార్ట్ చేశాం. అయితే మా మూవీ హనుమంతుని వలే భారీ ప్రాజెక్ట్ అయ్యింది. మేము హనుమంతుణ్ణి, కథని నమ్మాం. అద్భుతమైన విజువల్ ట్రీట్‌గా రూపొందిన 'హను-మాన్' అందరి అంచనాలు అందుకుంటుంది'' అని డైరెక్టర్ ప్రశాంత్ వర్మ అన్నారు. తేజ సజ్జ హీరోగా నటించిన చిత్రం 'హను-మాన్'. చైతన్య సమర్పణలో ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్‌పై కె.నిరంజన్ రెడ్డి నిర్మించిన ఈ సినిమా విడుదలకు సిద్ధమవుతోంది. నేడు ప్రశాంత్ వర్మ పుట్టినరోజు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ–''తెలుగులో గొప్ప దర్శకులు చాలా అద్భుతమైన చిత్రాలు తీశారు. వాళ్ల కంటే నేను బెటర్‌గా తీయలేను. నాకంటూ ఒక యూనిక్ జోనర్ క్రియేట్ చేయాలనే ఆలోచనలో భాగంగా కొత్త జోనర్స్‌పై దృష్టి పెట్టాను. ఆ క్రమంలో 'అ, కల్కి, జాంబి రెడ్డి' సినిమాలు చేశాను. తర్వాత నాకు ఇష్టమైన సూపర్ హీరో కథతో 'హను-మాన్' తీశా. హనుమంతుని కథలో జరిగిన ఒక కీలక ఘటనని తీసుకొని ఈ మూవీ చేశాం. 'హను-మాన్' టీజర్ విడుదలైన తర్వాత రాజమౌళిగారిని కలిశాను.. ఆయన ఇచ్చిన సూచనలతో మాకు చాలా సమయం కలిసొచ్చింది. జూలై ఫస్ట్ వీక్‌లో సినిమా రిలీజ్ డేట్ ప్రకటిస్తాం. ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్‌ని(పీవీసీయూ) నా బర్త్ డే కానుకగా నేడు అనౌన్స్ చేస్తాను. ప్రస్తుతం నా దర్శకత్వంలో 'అధీర' ఫిల్మ్ రూపొందుతోంది. బాలకృష్ణగారితోనూ ఓ సినిమా ఉంటుంది'' అన్నారు.

నిరుద్యోగుల జీవితాలు ఏమైపోవాలి?

ఆర్.నారాయణ మూర్తి ప్రధాన పాత్రలో నటించి, స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'యూనివర్సిటీ'. స్నేహచిత్ర పిక్చర్స్ బ్యానర్‌పై రూపొందిన ఈ సినిమా సెన్సార్ పూర్తి చేసుకుంది. జూన్ 9న రెండు తెలుగు రాష్ట్రాల్లో ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నట్లు చిత్రయూనిట్ ప్రకటించింది. ఆర్.నారాయణ మూర్తి మాట్లాడుతూ– ''10వ తరగతిలో పేపరు లీకేజీలు.. గ్రూప్ 1, 2లాంటి ఉద్యోగ పరీక్షల్లోనూ పేపరు లీకేజీలు జరుగుతున్నాయి. ఇలా అయితే విద్యార్థుల భవిష్యత్ ఏం కావాలి? నిరుద్యోగుల జీవితాలు ఏమైపోవాలి?. కుంభకోణాలు చేసే వారి వల్ల విద్యావ్యవస్థ, ఉద్యోగ వ్యవస్థ నిర్వీర్యం కావాలా?. మనది నిరుద్యోగ భారతం కాదు.. ఉద్యోగ భారతం కావాలని చెప్పే చిత్రమే 'యూనివర్సిటీ'' అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: బాబూరావు దాస్, కథ-స్క్రీన్ ప్లే-మాటలు- సంగీతం- దర్శకత్వం- నిర్మాత: ఆర్. నారాయణ మూర్తి.


● ఆర్. నారాయణ మూర్తి

నన్ను కొత్తగా చూస్తారు

– సత్యదేవ్


● శరణ్, రామాంజనేయులు, సత్యదేవ్, కోన వెంకట్

''నాలుగు క్వార్టర్స్ ఉంటే ఫుల్ బాటిల్. అలాగే మనిషి జీవితం కూడా ఓ ఫుల్‌బాటిల్ లాంటిదనే ఉద్దేశంతోనే ఈ సినిమాకు 'ఫుల్‌బాటిల్' టైటిల్‌ని పెట్టాడు శరణ్. ఇందులో మెర్క్యూరీ సూరిగా కొత్త సత్యదేవ్‌ని చూస్తారు'' అని హీరో సత్యదేవ్ అన్నారు. శరణ్ కొప్పిశెట్టి దర్శకత్వంలో సత్యదేవ్ హీరోగా రూపొందిన చిత్రం 'ఫుల్ బాటిల్'. జవ్వాజి రామాంజనేయులు, ఎస్.డి కంపెనీ చినబాబు నిర్మించారు. ఈ సినిమా ట్రైలర్‌ను హీరో విజయ్ దేవరకొండ సోషల్ మీడియాలో షేర్ చేశారు. హైదరాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో శరణ్ కొప్పిశెట్టి మాట్లాడుతూ–''డార్క్ కామెడీ నా బలం అని భావించి ఈ మూవీ చేశాను'' అన్నారు. ''సత్యదేవ్‌తో మా బ్యానర్‌లో మరో సినిమా చేస్తాం'' అన్నారు రామాంజనేయులు.



'ది ఇండియా హౌస్' లోకి నిఖిల్ ఎంట్రీ ఇస్తున్నారు. నిఖిల్ హీరోగా అనుపమ్ ఖేర్ ఓ లీడ్ రోల్‌లో నటించనున్న తాజా చిత్రం 'ది ఇండియా హౌస్'. 'జై మాతా ది' అనేది ఉపశీర్షిక. వి మెగా పిక్చర్స్, అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్ పతాకాలపై రామ్ చరణ్, విక్రమ్ రెడ్డి, అభిషేక్ అగర్వాల్ ఈ సినిమాను నిర్మించనున్నారు. స్వాతంత్ర్య సమరయోధుడు వీర్ సావర్కర్ 140వ జయంతి సందర్భంగా 'ది ఇండియా హౌస్' సినిమా ప్రకటన వీడియోను సోషల్ మీడియా వేదికగా రిలీజ్ చేశారు రామ్‌చరణ్, అభిషేక్ అగర్వాల్. ఈ సినిమాలో శివ పాత్రలో నిఖిల్, సయామీ కృష్ణ వర్మగా అనుపమ్ ఖేర్ కనిపిస్తారు. ''లండన్‌లో స్వాతంత్ర్యానికి పూర్వం జరిగిన ఘటనల నేపథ్యంలో ఈ సినిమా ఉంటుంది'' అని యూనిట్ పేర్కొంది.

స్వాతంత్ర్యానికి పూర్వం...

హృదయాలను హత్తుకుంటుంది

– 'బన్నీ' వాసు


● టోవినో థామస్, బన్నీ వాసు

''గీతగోవిందం' సినిమాను కేరళలో విడుదల చేసి, వసూళ్లను అక్కడ విరాళంగా ఇచ్చాం(కేరళలో 2018 వచ్చిన వరదలను ఉద్దేశిస్తూ). బాహుశా.. అందుకేనేమో మలయాళ హిట్ మూవీ '2018' ని తెలుగులో విడుదల చేసే అవకాశం నాకు వచ్చింది. ఈ అవకాశం ఇచ్చిన ప్రొడ్యూసర్స్ వేణు, ఆంథోనీ, పద్మ కుమార్‌గార్లకు థ్యాంక్స్. హృదయాన్ని హత్తుకునే సినిమా '2018'' అని నిర్మాత 'బన్నీ' వాసు అన్నారు. టోవినో థామస్, అపర్ణ బాలమురళి ప్రధాన పాత్రల్లో నటించిన మలయాళ చిత్రం '2018'. జూడ్ ఆంథోనీ జోసెఫ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం మలయాళంలో ఈ నెల 5న రిలీజైంది. ఈ మూవీని ఈ నెల 26న తెలుగులో 'బన్నీ' వాసు విడుదల చేశారు. హైదరాబాద్‌లో జరిగిన '2018' సక్సెస్ సెలబ్రేషన్స్‌లో టోవినో థామస్ మాట్లాడుతూ–''ఇకపై నేను నటించే సినిమాలను తెలుగులోనూ విడుదల చేస్తాను'' అన్నారు. ''ఈ సినిమాని థియేటర్స్‌లో చూడండి'' అన్నారు జూడ్ ఆంథోనీ జోసెఫ్. ఈ కార్యక్రమంలో అపర్ణా బాలమురళి, నిర్మాత ఎస్‌కేఎన్ పాల్గొన్నారు.

క్రూరమైన ప్రపంచంలో...

విశ్వక్ సేన్ హీరోగా కృష్ణ చైతన్య దర్శకత్వంలో ఓ సినిమా 'వీఎస్ 11'(వర్కింగ్ టైటిల్) తెరకెక్కుతోంది. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్‌పై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. దివంగత నటుడు ఎన్టీఆర్ 100వ జయంతి సందర్భంగా 'వీఎస్ 11' నుంచి విశ్వక్ పోస్టర్‌ను విడుదల చేసింది చిత్ర బృందం. 'నైతికత లేని సమాజంలో ఓ గ్రే మ్యాన్ ప్రయాణాన్ని వర్ణించే చిత్రం ఇది. చీకటి, క్రూరమైన ప్రపంచంలో అట్టడుగు నుంచి ధనవంతుడిగా ఎదిగిన వ్యక్తి కథను ఈ సినిమా వివరిస్తుంది'' అని చిత్రయూనిట్ పేర్కొంది.


● విశ్వక్ సేన్

టైమ్ కూడా కలిసిరావాలి

– రాకేష్ ఉప్పలపాటి



''ఇండస్ట్రీలో దర్శకుడిగా అవకాశం రావాలంటే ప్రతిభతో పాటు సరైన టైమ్ కూడా కలిసిరావాలని నమ్ముతాను. ఎందుకంటే ఫిల్మ్‌నగర్, కృష్ణానగర్‌లో దర్శకులు కావాలనుకునే కొందరితో నేను మాట్లాడుతున్నప్పుడు వారిలో నా కన్నా ఎక్కువ ప్రతిభ ఉన్నట్లు అనిపిస్తుంటుంది'' అని డైరెక్టర్ రాకేష్ ఉప్పలపాటి అన్నారు. బెల్లంకొండ గణేష్, అవంతిక దాసాని జంటగా నటించిన చిత్రం 'నేను స్టూడెంట్ సర్!'. రాకేష్ ఉప్పలపాటిని దర్శకుడిగా పరిచయం చేస్తూ 'నాంది' సతీష్ వర్మ నిర్మించిన ఈ చిత్రం జూన్ 2న విడుదల కానుంది. ఈ సందర్భంగా రాకేష్ ఉప్పలపాటి మాట్లాడుతూ– ''నా స్వస్థలం భీమడోలు. నాన్నగారి వ్యాపారం నిమిత్తం తాటిపాకకు మారాం. డిగ్రీ పూర్తి చేసిన తర్వాత 'చుక్కలాంటి అమ్మాయి చక్కనైన అబ్బాయి' సినిమాకు దర్శకత్వ విభాగంలో పనిచేశాను. ఆ తర్వాత తేజగారి దగ్గర అసిస్టెంట్‌గా వర్క్ చేశాను. కృష్ణ చైతన్యగారి కథతో 'నేను స్టూడెంట్ సర్' సినిమా చేశాను. హీరోకి ఇష్టమైన ఫోన్, అవసరమైన ఐడెంటిటీ.. భయపెట్టే గన్.. ఈ మూడు అంశాల చుట్టూ ఈ కథ తిరుగుతుంది. హీరోకి, ఓ పోలీస్ కమిషనర్‌కు మధ్య ఎలాంటి యుద్ధం నెలకొంది? అనేది ఇందులో ఆసక్తిగా ఉంటుంది. నిర్మాత 'నాంది'సతీష్‌గారితోనే మరో సినిమా చేస్తాను'' అన్నారు.

మళ్ళీ పెళ్లి కృష్ణగారికి అంకితం

– వీకే నరేష్


● వీకే నరేష్, పవిత్రా లోకేష్

''రియల్ బోల్డ్ కపుల్ అంటే కృష్ణగారు, విజయ నిర్మలగారు. వాళ్ల రథం మళ్లీ ముందుకు వెళ్లాలని విజయ్ కృష్ణ మూవీస్‌ని మళ్లీ ప్రారంభించడం గర్వంగా ఉంది. సూపర్‌స్టార్ కృష్ణగారి 81వ జయంతి (మే 31) సందర్భంగా 'మళ్ళీ పెళ్లి' చిత్రాన్ని ఆయనకి అంకితం చేస్తున్నాను'' అని వీకే నరేష్ అన్నారు. ఎంఎస్ రాజు దర్శకత్వంలో వీకే నరేష్, పవిత్రా లోకేష్ జంటగా నటించిన చిత్రం 'మళ్ళీ పెళ్లి'. నరేష్ నిర్మించిన ఈ సినిమా గత శుక్రవారం (26) విడుదలైంది. ఈ సందర్భంగా నిర్వహించిన సక్సెస్‌మీట్‌లో వీకే నరేష్ మాట్లాడుతూ–'' నేను బతికున్నంత కాలం నటిస్తాను. అలాగే సమాజ సేవ చేస్తా'' అన్నారు. చిత్రపరిశ్రమలో వీకే నరేష్ 50 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా 'సెలబ్రిటీ వరల్డ్ రికార్డ్' నిర్వాహకులు ఆయన్ను సత్కరించారు. సంగీత దర్శకుడు సురేష్ బొబ్బిలి, నటి అన్నపూర్ణమ్మ పాల్గొన్నారు.

ఫ్యామిలీ ఎంటర్‌టైనర్


● పాయల్, దినేష్, హెబ్బా

దినేష్ తేజ్ హీరోగా, హెబ్బా పటేల్, పాయల్ రాధాకృష్ణ హీరోయిన్లుగా నూతన దర్శకుడు మారేష్ శివన్ తెరకెక్కించిన చిత్రం 'అలా నిన్ను చేరి'. కొమ్మాలపాటి శ్రీధర్ సమర్పణలో విజన్ మూవీ మేకర్స్‌పై కొమ్మాలపాటి సాయి సుధాకర్ నిర్మించిన ఈ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ జరుపుకుంటోంది. ''కుటుంబ సమేతంగా చూడదగ్గ లవ్ అండ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ చిత్రమిది. త్వరలోనే మూవీ విడుదల తేదీ ప్రకటిస్తాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: సుభాష్ ఆనంద్, కెమెరా: ఐ ఆండ్రూ.



అర్జున్ గేమ్ 'డ్రా'

దుబాయ్ ఓపెన్ అంతర్జాతీయ చెస్ టోర్నమెంట్‌లో తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్ ఖాతాలో తొలి 'డ్రా' చేరింది. మిఖేల్ మెచ్‌డ్లిష్‌విలి (జార్జియా)తో ఆదివారం జరిగిన రెండో గేమ్‌ను నల్లపావులతో ఆడిన అర్జున్ 28 ఎత్తుల్లో 'డ్రా' చేసుకున్నాడు. శనివారం జరిగిన తొలి రౌండ్ గేమ్‌లో అర్జున్ 77 ఎత్తుల్లో తెలంగాణకే చెందిన మరో గ్రాండ్‌మాస్టర్ రాజా రిత్విక్‌పై గెలుపొందాడు. తెలంగాణకు చెందిన మరో గ్రాండ్‌మాస్టర్ హర్ష భరతకోటి, ఆంధ్రప్రదేశ్ గ్రాండ్‌మాస్టర్ లలిత్ బాబు రెండో రౌండ్ గేముల్లో తమ ప్రత్యర్థుల చేతుల్లో ఓడిపోయారు.

జ్యోతి యర్రాజీకి స్వర్ణ పతకం



కుర్ప్‌ఫాల్జ్ గాలా ఈవెంట్ అంతర్జాతీయ అథ్లెటిక్స్ మీట్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించిన ఆంధ్రప్రదేశ్ అమ్మాయి జ్యోతి యర్రాజీ స్వర్ణ పతకంతో మెరిసింది. జర్మనీలో జరిగిన ఈ మీట్‌లో విశాఖపట్నం జిల్లాకు చెందిన జ్యోతి 100 మీటర్ల హర్డిల్స్‌లో విజేతగా నిలిచింది. జ్యోతి 12.84 సెకన్లలో గమ్యానికి చేరి తన కెరీర్‌లో రెండో అత్యుత్తమ సమయాన్ని నమోదు చేసింది. ఈ సీజన్‌లో జ్యోతికిదే తొలి అంతర్జాతీయ పతకం. గత ఏడాది జ్యోతి 12.82 సెకన్లతో జాతీయ రికార్డు నెలకొల్పింది.

వాన వచ్చె... వాయిదా పడె




ఐపీఎల్–2023 విజేత ఎవరో తేలేందుకు మరో రోజు వేచి చూడాల్సిందే. ఫైనల్ కోసం మైదానంలో లక్షకు పైగా ఉన్న అభిమాన సందోహం సరిపోదన్నట్లుగా నేనూ ఉన్నానంటూ వరుణ దేవుడు వచ్చేయడంతో అంతా మారిపోయింది. టాస్ సమయానికి అరగంట ముందు మొదలైన వాన నిరంతరాయంగా కురవడంతో ఆటకు ఏమాత్రం అవకాశం లేకుండా పోయింది. ఎంత ఎదురు చూసినా వర్షం తెరిపినివ్వలేదు. దాంతో ఆదివారం జరగాల్సిన తుది పోరును సోమవారానికి వాయిదా వేయక తప్పలేదు. రిజర్వ్ డే అయిన నేడు చెన్నై సూపర్ కింగ్స్, గుజరాత్ టైటాన్స్ ట్రోఫీ కోసం తలపడతాయి. అన్నట్లు సోమవారం కూడా 10 శాతం వర్ష సూచన ఉంది. అయితే ఏమాత్రం వర్షసూచన లేని ఆదివారమే ఇలా జరిగితే సోమవారం ఏం జరుగుతుందనేది ఆసక్తికరం!

- రిజర్వ్‌డేకు ఐపీఎల్ ఫైనల్
- నేడు జరగనున్న తుది సమరం
- ఆదివారం సాధ్యం కాని ఆట

అహ్మదాబాద్: ఐపీఎల్ తాజా సీజన్‌లో మొత్తం 73 మ్యాచ్‌లు జరిగాయి. ఒక మ్యాచ్ వర్షం బారిన పడి రద్దు కాగా, మరో మ్యాచ్‌లో వర్షం ఆటంకం కలిగించినా ఒక్క బంతి కూడా వృథా కాలేదు. కానీ అసలైన అంతిమ సమరం సమయానికి మాత్రం వరుణుడు పూర్తి ప్రతాపం చూపించాడు. అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూసిన ఫైనల్ పోరుకు అడ్డుగా నిలిచాడు. మండు వేసవిలో అహ్మదాబాద్‌లో వర్షం అంటే అలా కొద్దిసేపు వచ్చిపోయే చినుకుల్లా అందరూ భావించినా ఆదివారం మాత్రం అలా జరగలేదు. చివరకు ఫైనల్ మ్యాచ్ నేటికి వాయిదా పడింది. సాయంత్రం 6.30 సమయంలో స్వల్పంగా వాన మొదలైంది. ఆ తర్వాతి నుంచి తగ్గుతూ, పెరుగుతూ వచ్చింది. కవర్లు కప్పడం, తొలగించడం మళ్లీ మళ్లీ జరిగాయి. 9 గంటల సమయంలో మాత్రం వాన పూర్తిగా తగ్గిపోయింది. దాంతో అంపైర్లతో పాటు ఇరుజట్ల ఆటగాళ్లు, కోచ్‌లు మైదానంలోకి వచ్చారు. అంతా పిచ్‌ను, అవుట్‌ఫీల్డ్‌ను పరిశీలించడంతో పాటు వామప్ కూడా మొదలైంది. అయితే ఒక్కసారిగా వాన జోరందుకోవడంతో అంతా పరుగెడుతూ గ్రౌండ్ వీడారు. ఆ తర్వాత దాదాపు రెండు గంటల పాటు వేచి చూసినా ఫలితం కనిపించలేదు. రాత్రి 9.30కి ఆట ఆరంభమైతే పూర్తి ఓవర్లు సాగేవి. ఆపై ఓవర్ల కోతతోనైనా మ్యాచ్ నిర్వహించాలని అంపైర్లు ప్రయత్నించారు. కనీసం 5 ఓవర్ల మ్యాచ్ ఆడాలన్నా అర్ధరాత్రి 12.06కు ఆట ఆరంభం కావాలి. దానికి కనీసం గంట ముందుగా వాన ఆగిపోవాలి. అయితే అనుకున్న సమయానికి వర్షం తగ్గకపోవడంతో మ్యాచ్ వాయిదా పడింది. ఇరు జట్ల కోచ్‌లు స్టీఫెన్ ఫ్లెమింగ్, ఆశిష్ నెహ్రాల 'షేక్ హ్యాండ్'తో అధికారికంగా ఖాయమైంది.

నేడు వాన కురిస్తే...

ఐపీఎల్ నిబంధనల ప్రకారం ఎలాగైనా ఫైనల్ మ్యాచ్‌ను నిర్వహించేందుకు ప్రయత్నిస్తారు. 20 ఓవర్ల నుంచి 15 ఓవర్ల లేదా 10 ఓవర్ల లేదా 5 ఓవర్ల మ్యాచ్ అయినా జరపాల్సిందే. చివరకు అదీ సాధ్యం కాకపోతే రాత్రి. గం. 1.20 సమయంలో 'సూపర్ ఓవర్'తోనైనా ఫలితాన్ని తేలుస్తారు. అయితే దానికీ అవకాశం లేకపోతే



మాత్రం లీగ్ దశలో అత్యధిక పాయింట్లు సాధించిన జట్టునే విజేతగా ప్రకటిస్తారు. అప్పుడు గుజరాత్ టైటాన్స్ చాంపియన్‌గా నిలుస్తుంది.

రెజ్లర్లపై పోలీసుల ప్రతాపం

- నిరసన దీక్ష భగ్నం
- శిబిరాన్ని ఖాళీ చేసిన పోలీసులు
- కొత్త పార్లమెంట్ వైపు దూసుకెళ్తుండగా నిర్బంధించిన ఢిల్లీ పోలీసులు
- తీవ్రంగా ప్రతిఘటించిన రెజ్లర్లు
- అర్ధంతరంగా ఆగిన పోరాటం

న్యాయం కోసం రోడ్డెక్కిన భారత రెజ్లర్ల పోరాటం రోడ్డుపైనే అర్ధంతరంగా ముగిసింది. నెలరోజులపైగా నోరెత్తి నినదించిన మల్లయోధులకు ఊరట లేకుండా పోయింది. రెజ్లర్ల డిమాండ్లలో ఏ ఒక్కటీ నెరవేరకుండానే నిరసన దీక్ష శిబిరాన్ని ఢిల్లీ పోలీసులు ఎత్తేశారు. బాసటగా నిలిచిన రాజకీయ నేతల బలగానికి, మద్దతు తెలిపిన క్రీడాకారుల దళానికి, ప్రజాస్వామ్యవాదుల గళానికి నిరాశ తప్పలేదు.



కొత్త పార్లమెంట్ వద్ద బ్రిజ్‌భూషణ్



ప్రతిఘటిస్తున్న సాక్షి మలిక్



పోలీసుల అదుపులో బజరంగ్ పూనియా





సంగీత, వినేశ్ ఫొగాట్‌లపై ఖాకీల కాఠిన్యం

న్యూఢిల్లీ: న్యాయం కావాలంటూ జంతర్ మంతర్ వద్ద నిరసన దీక్ష చేపట్టిన భారత స్టార్ రెజ్లర్ల నిరసన పోలీసుల దమనకాండతో ముగిసింది. లైంగిక వేధింపులకు పాల్పడిన భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) అధ్యక్షుడు, బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్‌ను అరెస్టు చేయాలనే డిమాండ్ ఢిల్లీలో మూగబోయింది. అంతర్జాతీయ పతక విజేతలు వినేశ్ ఫొగాట్, సాక్షి మలిక్, బజరంగ్ పూనియా తదితరులు గత నెల 23 నుంచి చేస్తున్న దీక్షను ఢిల్లీ పోలీసులు భగ్నం చేశారు. కొత్త పార్లమెంట్ భవనం ప్రారంభోత్సవం సందర్భంగా అతిరథులు హాజరవుతున్న నూతన భవన ప్రాంగణం వైపు రెజ్లర్లు దూసుకెళ్తుండటంతో ఢిల్లీ పోలీసులు జులుం చూపించారు. ఒక్కో రెజ్లర్‌ను పదుల సంఖ్యలోని పోలీసులు ఉక్కుపాదంతో అడ్డుకున్నారు. దేశానికి పతకాలు తెచ్చిన క్రీడాకారులన్న కనీస మర్యాద కూడా పాటించకుండా సాధారణ నిరసనకారుల్ని ఈడ్చుకెళ్లినట్లు... మహిళా, పురుషుల పోలీసులు రెజ్లర్లను బలవంతంగా ఈడ్చుకెళ్లారు. తీవ్ర ప్రతిఘటనల మధ్య వారి న్యాయ పోరాటాన్ని అణచివేశారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్నరనే కారణంతోనే దీక్షను భగ్నం చేశామని ఢిల్లీ పోలీసులు చివరకు తమ దమనకాండను సమర్థించుకున్నారు. విచారణ జరిపిన అనంతరం రెజ్లర్లపై పలు సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు ఢిల్లీ పోలీసు కమిషనర్ దీపేంద్ర పాఠక్ వెల్లడించారు. కొత్త పార్లమెంట్ భవన ప్రారంభోత్సవం జరుగుతున్న ఈ చారిత్రక దినోత్సవాన ఎలాంటి కవ్వింపు చర్యలకు పాల్పడవద్దని రెజ్లర్లకు తెలిపామని, అయినా వారు వినిపించుకోకుండా దూసుకు రావడంతోనే ఇలా వ్యవహరించాల్సి వచ్చిందని పాఠక్ వివరణ ఇచ్చారు. జంతర్ మంతర్ వేదిక వద్ద టెంట్‌లు, కుర్చీలు, మంచాలు, కూలర్లే కాదు కనీసం చిన్న కాగితం ముక్కయిన కనపడకుండా తుడిచి పెట్టేశారు. తద్వారా మళ్లీ దీక్షలో కూర్చోకుండా, నిరసన ఇకపై కొనసాగకుండా కఠిన చర్యలు తీసుకున్నారు. అదుపులోకి తీసుకున్న రెజ్లర్లను, మద్దతుదారులను వేర్వేరు చోట్లకు తరలించారు. వినేశ్ ఫొగాట్ పోలీసు కాఠిన్యంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తింది. సాక్షి మలిక్ భర్త సత్యవర్త్ కడియాన్, జితేంద్ర కిన్హా 'ఇంక్విలాబ్ జిందాబాద్' అంటు గట్టిగా నినదించారు.

సిగ్గుచేటు... మండిపడిన నేతలు

కేంద్ర ప్రభుత్వం ఆధీనంలోని పోలీసుల దమన చర్యను కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్రంగా ఖండించారు. 'పట్టాభిషేకం జరిగింది. ప్రజల గొంతు నొక్కే చర్యలు మొదలయ్యాయి' అని అన్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే మాట్లాడుతూ దేశానికి కీర్తి ప్రతిష్టలు తెచ్చిన రెజ్లర్లను ఇలా బలవంతంగా ఈడ్చుకెళ్లడం సిగ్గుచేటన్నారు. మేటి రెజ్లర్ల పట్ల అధికార బీజేపీ ప్రభుత్వం దురహంకారం చూపింది అని కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా విమర్శించారు. పతకాలు సాధించిన రెజ్లర్లపై ఇలా ప్రవర్తించడం దారుణమని ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ దుయ్యబట్టారు. చాంపియన్లపై పోలీసు దమనకాండ సరికాదని బెంగాల్ సీఎం మమతా బెనర్జీ పేర్కొన్నారు. వామపక్షాలు, ఇతర పార్టీల నేతలు, మద్దతు దారులు బీజేపీ నిరంకుశత్వ శైలిని, పోలీసుల చర్యను ఖండించారు.

రాయుడు 'గుడ్‌బై'

- ఐపీఎల్ ఫైనల్ ఆఖరి మ్యాచ్‌గా ప్రకటన
- 'యు టర్న్' లేదని స్పష్టీకరణ



ఐపీఎల్‌లో రాయుడు ప్రదర్శన

మ్యాచ్‌లు: 203	అత్యధిక స్కోరు: 100 నాటౌట్
ఇన్నింగ్స్: 186	సెంచరీలు: 1
పరుగులు: 4329	అర్ధ సెంచరీలు: 22
సగటు: 28.29	ఫోర్లు: 358
స్ట్రయిక్‌రేట్: 127.28	సిక్సర్లు: 171

అహ్మదాబాద్: ఐపీఎల్ చరిత్రలో అత్యంత విజయవంతమైన బ్యాటర్లలో ఒకడిగా గుర్తింపు తెచ్చుకున్న తెలుగు తేజం అంబటి తిరుపతి రాయుడు ఈ లీగ్‌లో తన ఆటను ముగిస్తున్నాడు. చెన్నై, గుజరాత్ మధ్య నేడు జరిగే ఫైనల్ తనకు చివరి ఐపీఎల్ మ్యాచ్ అని 38 ఏళ్ల రాయుడు ప్రకటించాడు. తన నిర్ణయం విషయంలో ఎలాంటి పునరాలోచన ఉండదని అతను స్పష్టం చేశాడు. '2 గొప్ప జట్లు ముంబై, చెన్నై... 204 మ్యాచ్‌లు, 14 సీజన్‌లు, 11 ప్లే ఆఫ్స్, 8 ఫైనల్స్, 5 ట్రోఫీలు, ఆరవ ట్రోఫీ కూడా ఆశిస్తున్నా, ఇదో అద్భుత ప్రయాణం, ఈ ఫైనల్ మ్యాచ్ ఐపీఎల్‌లో నాకు చివరిది కానుంది. ఇంత గొప్పగా టోర్నీలో ఆడటాన్ని ఎంతో ఆస్వాదించా. థ్యాంక్యూ, ఇక ఎలాంటి యు టర్న్ ఉండదు' అని రాయుడు ఆదివారం ట్వీట్ చేశాడు. 2022లో కూడా చెన్నై జట్టు ప్లే ఆఫ్స్ అవకాశాలు కోల్పోయిన వెంటనే తాను ఐపీఎల్ నుంచి తప్పుకుంటున్నట్లు రాయుడు ప్రకటించాడు. అయితే సీఎస్‌కే యాజమాన్యం జోక్యంతో అర గంటలోనే ఆ ప్రకటనను అతను ఉపసంహరించుకొని తాజా సీజన్‌లోనూ బరిలోకి దిగాడు. అయితే ఈసారి రాయుడు ప్రదర్శన సంతృప్తికరంగా లేదు. 15 మ్యాచ్‌లలో 11 సార్లు బ్యాటింగ్ అవకాశం రాగా, 105 బంతులు ఎదుర్కొన్న రాయుడు 15.44 సగటుతో మొత్తం 139 పరుగులే చేయగలిగాడు. అత్యధిక స్కోరు 27 నాటౌట్ కాగా 9 ఫోర్లు, 7 సిక్స్‌లు కొట్టాడు.

ఘనమైన రికార్డు...

ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్‌ఎల్)లో భాగంగా ఉండటంతో తొలి రెండు ఐపీఎల్‌లలో రాయుడుకు అవకాశం దక్కలేదు. 2010లో అతడిని ముంబై ఇండియన్స్ తీసుకుంది. 2017 వరకు ఎనిమిది సీజన్ల పాటు జట్టుకు ప్రాతినిధ్యం వహించిన రాయుడు 114 మ్యాచ్‌లు ఆడాడు. మూడుసార్లు ముంబై టైటిల్ విజయాల్లో (2013, 2015, 2017) కీలక పాత్ర పోషించాడు. అనంతరం 2018 నుంచి ఆరు సీజన్లు చెన్నై సూపర్‌కింగ్స్ తరఫున 89 మ్యాచ్‌లు ఆడాడు. 2018, 2021లలో విజేతగా నిలిచిన చెన్నై టీమ్‌లో అతను సభ్యుడు. అత్యధిక ఐపీఎల్ టైటిల్స్ గెలిచినవారిలో రోహిత్ శర్మ (6 ట్రోఫీలు) అగ్రస్థానంలో ఉండగా, రాయుడు రెండో స్థానంలో (5 ట్రోఫీలు) నిలిచాడు. ఓవరాల్‌గా ఐపీఎల్‌లో అత్యధిక పరుగులు చేసిన జాబితాలో అతను 12వ స్థానంలో ఉన్నాడు. 2018 సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌పై రాయుడు తన ఏకైక సెంచరీ (100 నాటౌట్) సాధించాడు.

ప్రణయ్ నిరీక్షణ ముగిసె...

- మలేసియా మాస్టర్స్ టోర్నీ టైటిల్ నెగ్గిన భారత షట్లర్
- ఆరేళ్ల తర్వాత అంతర్జాతీయ టైటిల్



"ఈ విజయం వెనుక ఎన్నో భావోద్వేగాలు దాగి ఉన్నాయి. ఆరేళ్ల తర్వాత మళ్లీ టైటిల్ గెలుస్తానని అనుకోలేదు. కోచ్‌లందరికీ, సహాయక సిబ్బందికి, మరీ ముఖ్యంగా చీఫ్ కోచ్ గోపీచంద్ సర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు. నేను నిరుత్సాహంతో ఉన్నపుడల్లా ఆయన తన మాటలతో నాలో కొత్త ఉత్సాహం నింపారు. ఏదో ఒకరోజు తప్పకుండా గొప్ప విజయం దక్కుతుందని నాపై నమ్మకం ఉంచారు. గతేడాది కోచ్‌గా మారిన నా మాజీ సహచరుడు గురుసాయిదత్‌కు కూడా థాంక్స్. గత నాలుగు నెలలుగా మేమిద్దరం పడ్డ కష్టానికి ఫలితం దక్కింది. -హెచ్‌ఎస్ ప్రణయ్

కౌలాలంపూర్: అడపాదడపా తనకంటే ఎంతో మెరుగైన ర్యాంక్ ఉన్న ఆటగాళ్లను మట్టికరిపించడం... కీలక మ్యాచ్‌ల్లో తడబడటం... గాయాల బారిన పడటం... కొన్నేళ్లుగా భారత స్టార్ షట్లర్ హెచ్‌ఎస్ ప్రణయ్‌కు అలవాటుగా మారిపోయింది. ఒకవైపు ఎంతో నైపుణ్యమున్నా... మరోవైపు ఆశించినస్థాయిలో విజయాలు దక్కడంలేదనే అసంతృప్తి కూడా అతనిని వేధించింది. అయితేనేం పట్టుదల కోల్పోకుండా తనవంతు కృషి చేస్తూనే ఉన్నాడు. ఎట్టకేలకు టోర్నీ మొత్తం నిలకడగా రాణిస్తూ... ఆరేళ్ల నిరీక్షణను ముగిస్తూ ఈ కేరళ షట్లర్ తన కెరీర్‌లో గొప్ప విజయాన్ని అందుకున్నాడు. ఆదివారం ముగిసిన మలేసియా మాస్టర్స్ వరల్డ్ టూర్ సూపర్–500 టోర్నీలో 30 ఏళ్ల ప్రణయ్ చాంపియన్‌గా అవతరించాడు. 94 నిమిషాలపాటు హోరాహోరీగా సాగిన పురుషుల సింగిల్స్ ఫైనల్లో ప్రపంచ తొమ్మిదో ర్యాంకర్ ప్రణయ్ 21–19, 13–21, 21–18తో ప్రపంచ 34వ ర్యాంకర్ వెంగ్ హాంగ్ యాంగ్ (చైనా)పై గెలుపొందాడు. విజేతగా నిలిచిన ప్రణయ్‌కు 31,500 డాలర్ల (రూ. 26 లక్షలు) ప్రైజ్‌మనీతోపాటు 9,200 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. 2017లో యూఎస్ ఓపెన్ గ్రాండ్‌ప్రి గోల్డ్ టోర్నీలో విజేతగా నిలిచిన తర్వాత ప్రణయ్ ఖాతాలో చేరిన మరో అంతర్జాతీయ టైటిల్ ఇదే కావడం విశేషం. గత రెండేళ్లుగా అంతర్జాతీయస్థాయిలో నిలకడగా రాణిస్తున్న ప్రణయ్ గత ఏడాది స్విస్ ఓపెన్‌లో రన్నరప్‌గా నిలిచాడు. మలేసియా, ఇండోనేసియా సూపర్–1000 టోర్నీల్లో సెమీఫైనల్లో నిష్క్రమించాడు.

తాజాగా మలేసియా మాస్టర్స్ టోర్నీలో ప్రణయ్ అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకున్నాడు. తొలి రౌండ్‌లో ప్రపంచ ఆరో ర్యాంకర్ చౌ తియెన్ చెన్ (చైనీస్ తైపీ)పై, ప్రిక్వార్టర్ ఫైనల్లో ఈ ఏడాది ఆల్ ఇంగ్లండ్ చాంపియన్, 11వ ర్యాంకర్ లీ షి ఫెంగ్ (చైనా)పై, క్వార్టర్ ఫైనల్లో 13వ ర్యాంకర్ నిషిమోటో (జపాన్)పై నెగ్గిన ప్రణయ్ సెమీఫైనల్లో తొలి గేమ్‌లో 19–17తో ఆధిక్యంలో ఉన్న దశలో అతని ప్రత్యర్థి క్రిస్టియన్ అడినాటా (ఇండోనేసియా) గాయంతో వైదొలిగాడు. సెమీఫైనల్ మినహా మిగతా అన్ని మ్యాచ్‌ల్లో ప్రణయ్‌కు మూడు గేముల్లో విజయం దక్కింది. ఓవరాల్‌గా అతను 5 గంటల 46 నిమిషాలపాటు కోర్టులో గడిపాడు.

వెర్‌స్టాపెన్‌దే గెలుపు

సీజన్‌లో నాలుగో టైటిల్



మోంటెకార్లో: ఈ ఏడాది ఫార్ములావన్ సీజన్‌లో తన జోరు కొనసాగిస్తూ రెడ్‌బుల్ జట్టు డ్రైవర్ మాక్స్ వెర్‌స్టాపెన్ నాలుగో విజయం నమోదు చేశాడు. ఆదివారం జరిగిన సీజన్‌లోని ఆరో రేసు మొనాకో గ్రాండ్‌ప్రిలో వెర్‌స్టాపెన్ విజేతగా నిలిచాడు. 'పోల్ పొజిషన్' నుంచి రేసును ఆరంభించిన వెర్‌స్టాపెన్ నిర్ణీత 78 ల్యాప్‌లను అందరికంటే వేగంగా 1 గంట 48 నిమిషాల 51.980 సెకన్లలో ముగించి అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. ఫెర్నాండో అలోన్సో (ఆస్టిన్ మార్టిన్) రెండో స్థానంలో, ఎస్టెబన్ ఒకాన్ (అల్పైన్ టీమ్) మూడో స్థానంలో నిలిచారు. మెర్సిడెస్ జట్టు డ్రైవర్లు లూయిస్ హామిల్టన్, జార్జి రసెల్ వరుసగా నాలుగు, ఐదు స్థానాలను దక్కించుకున్నారు. ఈ సీజన్‌లో ఆరు రేసులు జరగ్గా ఆరింటిని రెడ్‌బుల్ డ్రైవర్లే గెల్చుకోవడం విశేషం. వెర్‌స్టాపెన్ బహ్రెయిన్, ఆస్ట్రేలియన్, మయామి, మొనాకో గ్రాండ్‌ప్రిలలో నెగ్గగా... సెర్జియో పెరెజ్ సౌదీ అరేబియా, అజర్‌బైజాన్ గ్రాండ్‌ప్రిలలో విజేతగా నిలిచాడు. ప్రస్తుతం 144 పాయింట్లతో వెర్‌స్టాపెన్ టాప్ ర్యాంక్‌లో, 105 పాయింట్లతో పెరెజ్ రెండో ర్యాంక్‌లో, 93 పాయింట్లతో అలోన్సో మూడో ర్యాంక్‌లో ఉన్నారు. సీజన్‌లోని తదుపరి రేసు స్పానిష్ గ్రాండ్‌ప్రి జూన్ 4న జరుగుతుంది.

ఐదో స్థానంతో ముగింపు

అల్మాటీ (కజకిస్తాన్): ప్రపంచకప్ షాట్‌గన్ షూటింగ్ టోర్నమెంట్‌లో భారత్‌కు ఐదో స్థానం లభించింది. ఆదివారం ముగిసిన ఈ టోర్నీలో భారత్ ఒక రజతం, ఒక కాంస్య పతకం సాధించింది. చివరిరోజు భారత్‌కు పతకం రాలేదు. మిక్స్‌డ్ ట్రాప్ ఈవెంట్‌లో భారత్ నుంచి రెండు జోడీలు బరిలోకి దిగాయి. పృథ్వీరాజ్–శ్రేయసి సింగ్ ద్వయం 136 పాయింట్లు స్కోరు చేసి ఐదో స్థానంలో నిలిచింది. జొరావర్ సంధూ–ప్రీతి రజక్ జోడీ 134 పాయింట్లు స్కోరు చేసి ఎనిమిదో స్థానంతో సరిపెట్టుకుంది.

సెమీస్‌లో భారత్

థాయ్‌లాండ్‌పై 17–0తో ఘనవిజయం



సలాలా (ఒమన్): ఆసియా కప్ జూనియర్ పురుషుల హాకీ టోర్నీలో డిఫెండింగ్ చాంపియన్ భారత జట్టు సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. థాయ్‌లాండ్ జట్టుతో ఆదివారం జరిగిన పూల్ 'ఎ' చివరి లీగ్ మ్యాచ్‌లో టీమిండియా 17–0 గోల్స్ తేడాతో ఘన విజయం సాధించింది. భారత్ తరఫున అంగద్‌బీర్ సింగ్ (13వ, 33వ, 47వ ని.లో) మూడు గోల్స్ చేయగా... అమన్‌దీప్ లాక్రా (26వ, 29వ ని.లో), ఉత్తమ్ సింగ్ (24వ, 31వ ని.లో) రెండు గోల్స్ చొప్పున సాధించారు. శ్రద్ధానంద్ తివారి (46వ ని.లో), యోగంబర్ రావత్ (17వ ని.లో), అమన్‌దీప్ (47వ ని.లో), రోహిత్ (49వ ని.లో), అరైజీత్ సింగ్ హుండల్ (36వ ని.లో) ఒక్కో గోల్ చేశారు. ఐదు జట్లున్న పూల్ 'ఎ'లో భారత్ మూడు విజయాలు, ఒక 'డ్రా'తో 10 పాయింట్లు సాధించి అగ్రస్థానంలో నిలిచింది. పూల్ 'ఎ'లో నేడు జపాన్, పాకిస్తాన్ మధ్య జరిగే మ్యాచ్ విజేతకు మరో సెమీఫైనల్ బెర్త్ దక్కుతుంది. మ్యాచ్ 'డ్రా' అయితే పాకిస్తాన్ ముందంజ వేస్తుంది.

సబలెంకా సులువుగా...



సబలెంకా

- రెండో రౌండ్‌లోకి రెండో సీడ్
- ఫ్రెంచ్ ఓపెన్ టోర్నీ

పారిస్: అంతా అనుకున్నట్లు జరిగే ప్రపంచ నంబర్‌వన్ ర్యాంక్ కూడా సొంతమయ్యే పరిస్థితుల్లో... ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నమెంట్‌లో రెండో ర్యాంకర్ సబలెంకా (బెలారస్) శుభారంభం చేసింది. ఆదివారం మొదలైన సీజన్ రెండో గ్రాండ్‌స్లామ్ టోర్నీలో సబలెంకా రెండో రౌండ్‌లోకి దూసుకెళ్లింది. ఉక్రెయిన్ ప్లేయర్ మార్టా కోస్టుక్‌తో జరిగిన మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో సబలెంకా 6–3, 6–2తో గెలిచింది. 71 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సబలెంకా తన ప్రత్యర్థి సర్వీస్‌ను నాలుగుసార్లు బ్రేక్ చేసింది. 19 విన్నర్స్ కొట్టిన సబలెంకా 21 అనవసర తప్పిదాలు కూడా చేసింది. మరోవైపు ఎనిమిదో సీడ్ మరియా సాకరి (గ్రీస్) తొలి రౌండ్‌లోనే ఇంటిముఖం పట్టింది. కరోలినా ముకోవా (చెక్ రిపబ్లిక్) 7–6 (7/5), 7–5తో సాకరిని ఓడించి రెండో రౌండ్‌లోకి అడుగు పెట్టింది. 2 గంటల 6 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో ముకోవా తన సర్వీస్‌ను మూడుసార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను నాలుగుసార్లు బ్రేక్ చేసింది.

పురుషుల సింగిల్స్ విభాగంలో ఐదో సీడ్ సిట్సిపాస్ (గ్రీస్), ఏడో సీడ్ రుబ్లెవ్ (రష్యా), 11వ సీడ్ ఖచనోవ్ (రష్యా), 13వ సీడ్ హుర్కాజ్ (పోలాండ్) తమ ప్రత్యర్థులపై కష్టపడి గెలిచి రెండో రౌండ్‌లోకి ప్రవేశించారు. తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో సిట్సిపాస్ 7–5, 6–3, 4–6, 7–6 (9/7)తో జిరీ వెసిలీ (చెక్ రిపబ్లిక్)పై, రుబ్లెవ్ 6–1, 3–6, 6–3, 6–4తో జెరె (సెర్బియా)పై, హుర్కాజ్ 6–3, 5–7, 4–6, 2–6, 6–4తో డేవిడ్ గాఫిన్ (బెల్జియం)పై, ఖచనోవ్ 3–6, 1–6, 6–2, 6–1, 6–3తో లెస్టిన్ (ఫ్రాన్స్)పై విజయం సాధించారు.

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	629	62,502
నిఫ్టీ ▲	178	18,499

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి


విదేశీ సూచీలు		
నాస్‌డాక్	12,976 ▲	278
డోజోన్స్	33,093 ▲	329
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,627 ▲	56
డాక్స్	15,984 ▲	190
షాంఘై	3,213 ▲	11
నికాయ్	30,916 ▲	115

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

భారతి సిమెంట్
అత్యుత్తమ నాణ్యతకు హామీ.
అల్ట్రాఫాస్ట్
ఫాస్ట్ సెట్టింగ్ సిమెంట్

నామినీ నమోదు చేశారా?

లేదంటే వారసులకు కష్టాలు • కోర్టుల చుట్టూ తిరగాల్సి వస్తుంది • నామినేషన్ ఉంటే క్లెయిమ్ వేగం, సులభం
ప్రతీ పెట్టుబడికీ దీన్ని ఇవ్వాలి • అప్పుడే ఆశించిన లక్ష్యం నెరవేరుతుంది • ఏటా సవరణ కూడా అవసరమే



ప్రతి ఒక్కరి జీవితంలో పెట్టుబడులకు ఎంతో ప్రాధాన్యం ఉంటుంది. తమ సంపదను వృద్ధి చేసుకునేందుకు ఎన్నో రూపాల్లో ఇన్వెస్ట్ చేస్తుంటారు. సొంతిల్లు సమకూర్చుకోవాలని, వారసులకు బంగారు భవిష్యత్తును ఇవ్వాలని.. ఇలాంటి ముఖ్యమైన ఎన్నో జీవిత లక్ష్యాల కోసం పలు రకాల సాధనాల్లో పెట్టుబడులు పెడుతుంటారు. స్టాక్స్, మ్యూచువల్ ఫండ్స్, డిపాజిట్లు, బాండ్లు, జీవిత బీమా ప్లాన్లు, పీపీఎఫ్ ఇలా ఎన్నో ఆర్థిక సాధనాలు వ్యక్తుల ఆర్థిక ప్రణాళికల్లో భాగంగా ఉంటాయి. అయితే, జీవితం ఎప్పుడు ఎలాంటి మలుపు తీసుకుంటుందో చెప్పలేం. దురదృష్టం కొద్దీ ఈ సాధనాల్లో ఇన్వెస్ట్ చేసిన వారికి ఏదైనా ప్రమాదం జరిగితే ఏంటి పరిస్థితి? ఆ పెట్టుబడులనేవి జీవిత భాగస్వామి లేదా వారసులకు సాఫీగా, సులభంగా, వేగంగా బదిలీ అవ్వాలి. అందుకు ఓ చిన్న పని చేయాల్సి ఉంటుంది. అదే నామినేషన్ నమోదు చేయడం. తమకు అత్యంత ఆప్తులైన వారిలో ఒకరి పేరును నామినీగా ప్రతి పెట్టుబడి సాధనంలోనూ నమోదు చేయాలి. నామినేషన్ లేని సందర్భాల్లో క్లెయిమ్ కోసం పడే ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. కనుక నామినేషన్ ప్రాధాన్యాన్ని ప్రతి ఒక్కరూ అర్థం చేసుకోవాలి.

నామినీ అంటే ఎవరు..?

పెట్టుబడిదారు మరణించిన సందర్భాల్లో వారి పేరిట ఉన్న పెట్టుబడులను క్లెయిమ్ చేసుకుని, వాటిని పొందే హక్కును కలిగిన వ్యక్తి నామినీ అవుతారు. ఎక్కువ మంది నామినీగా కుటుంబ సభ్యులనే ముందుగా నియమించుకుంటారు. జీవిత భాగస్వామి లేదా పిల్లలు లేదా తల్లిదండ్రులు నామినేషన్ విషయంలో ప్రథమ ఎంపికగా ఉంటారు. అవివాహితులై, తల్లిదండ్రులు, తోడబుట్టిన వారు కూడా లేని సందర్భాల్లో అత్యంత సన్నిహితులు, నమ్మకస్తులైన వారిని, స్నేహితులను నామినీగా నియమించుకోవచ్చు. నామినీకి ఎవరు అయినా అర్హులే. కాకపోతే అంతిమంగా దీని ప్రయోజనం నెరవేరేలా నామినేషన్ ఉండాలన్న అంశాన్ని మర్చిపోవద్దు. ఒకవేళ నామినీగా మైనర్‌ను పేర్కొంటే, సంబంధిత నామినీ సంరక్షకుడి పేరు, చిరునామా, కాంటాక్ట్ వివరాలు ఇవ్వాలి.



ఎంతో ప్రాధాన్యం..



నామినేషన్ నమోదు చేసిన వ్యక్తి మరణించిన సందర్భంలో.. అతని పేరిట ఉన్న పెట్టుబడులు నామినీకి చాలా సులభంగా బదిలీ అవుతాయి. నామినీని నమోదు చేయకపోతే.. అప్పుడు ఆ పెట్టుబడులను వారసులే క్లెయిమ్ చేయగలరు. చట్ట ప్రకారం తామే వారసులమని ధ్రువీకరణ పత్రం ఇవ్వాలి. వీటిని స్థానిక తహసీల్దార్ లేదా కోర్టు నుంచి తీసుకోవాల్సి ఉంటుంది. ఇందుకు సమయంతోపాటు, శ్రమ కూడా పడాలి. ముఖ్యంగా కోర్టు నుంచి లీగల్ హేర్ సర్టిఫికెట్ తీసుకుని సమర్పించాల్సి ఉంటుంది. నామినేషన్ రిజిస్టర్ చేస్తే ఇలాంటి ఇబ్బందులేమీ ఉండవు. పెట్టుబడిదారు డెత్ సర్టిఫికెట్ ఒక్కటి సరిపోతుంది. ఒక అప్లికేషన్, దానికితోడు కేవైసీ వివరాలు సమర్పిస్తే చాలు. ప్రక్రియ సులభంగా ముగుస్తుంది.

వేటికి?..: బీమా పాలసీ తీసుకోవడం వెనుక ఉద్దేశం తమకు ఏదైనా జరిగితే కుటుంబ సభ్యులు ఆర్థికంగా ఇబ్బంది పడకూడదనే. అంత ముఖ్యమైన బీమా ప్లాన్ దరఖాస్తులో నామినేషన్ నమోదు చేయకపోతే? అర్థమే ఉండదు. అలాంటప్పుడు పరిహారం దక్కించుకునేందుకు కుటుంబ సభ్యులు శ్రమ పడాల్సి వస్తుంది. అలాగే బ్యాంకు ఖాతాకు సైతం నామినేషన్ ఉండాలి. అప్పుడు ఖాతాలో బ్యాలన్స్ మొత్తాన్ని నామినీ సులభంగా పొందడానికి వీలవుతుంది. అకౌంట్ హోల్డర్ మరణ ధ్రువీకరణ పత్రంతోపాటు, నామినీ కేవైసీ వివరాలను బ్యాంకు శాఖలో సమర్పించడం ద్వారా వాటిని సొంతం చేసుకోవచ్చు. అలాగే, బ్యాంకు ఫిక్స్‌డ్ డిపాజిట్లలోనూ నామినేషన్ ఉండాలి. ఇంకా పీపీఎఫ్, మ్యూచువల్ ఫండ్స్, స్టాక్ ట్రేడింగ్, డీమ్యాట్ అకౌంట్, అన్ని పోస్టాఫీసు పథకాలకు నామినేషన్ నమోదు చేసుకోవచ్చు. ఇక్కడ గుర్తు పెట్టుకోవాల్సింది ఏమిటంటే నామినేషన్ నమోదు చేయడం తప్పనిసరి కాదు. అయినా కానీ, నమోదు చేయడం బాధ్యతగా భావించాలి. ప్రతి పెట్టుబడి దరఖాస్తులో నామినేషన్ కాలమ్‌ను తప్పకుండా పూరించాలి.

ఎంత మంది?



నామినీలు ఎంత మంది అనే విషయం ఆయా పెట్టుబడి సాధనాల్లో వేర్వేరుగా ఉంటుంది. ఉదాహరణకు జీవిత బీమా పాలసీ అయితే ఎంత మందిని అయినా నామినీలుగా నమోదు చేసుకోవచ్చు. ఒకరికి మించి నామినీగా పేర్లు ఇచ్చినప్పుడు, విడిగా ఒక్కొక్కరికీ ఎంత శాతం చొప్పున క్లెయిమ్‌కు అర్హత అనేది కూడా పేర్కొనాలి. ఉదాహరణకు ముగ్గురిని నామినీలుగా నమోదు చేశారనుకుందాం. అప్పుడు ఏకి 50 శాతం, బీకి 30 శాతం, సీకి 20 శాతం లేదా తమకు నచ్చిన విధంగా ఈ శాతాన్ని నిర్ణయించుకోవచ్చు. బ్యాంకు ఖాతాలకు అయితే సాధారణంగా ఒక్కటే నామినేషన్ ఉంటుంది. పీపీఎఫ్ ఖాతాకు కూడా ఒకటికి మించి నామినేషన్లు ఇవ్వొచ్చు. మ్యూచువల్ ఫండ్స్ పెట్టుబడులకు నామినేషన్ కింద ముగ్గురి పేర్లను నమోదు చేసుకోవచ్చు. కొందరు తమపై ఆధారపడిన ఒంటరి తల్లి లేదా తండ్రికీ కొంత పెట్టుబడుల మొత్తం వెళ్లాలని కోరుకుంటారు. అలాంటప్పుడు విల్లు రాసి అందులో ఎవరికి ఏమి చెందాలో పేర్కొనాలి. లేదంటే నామినేషన్‌లో తల్లిదండ్రులకూ ఇంత శాతం చొప్పున వాటా ఇవ్వాలి.

సవరణ..: నామినేషన్ ఇవ్వడంతో పని ముగిసిపోయిందని అనుకోవద్దు. ఏడాదికోసారి సంబంధిత నామినేషన్‌ను సమీక్షించుకోవాలి. అప్పటికే నామినీగా పేర్కొన్న వ్యక్తులతో తమకున్న అనుబంధాన్ని విశ్లేషించుకోవాలి. తమకు ఏదైనా జరిగితే వారు ఆస్తులను క్లెయిమ్ చేసుకునేందుకు సరైన వారేనా అని ప్రశ్నించుకోవాలి. ఎందుకంటే కొందరు వైవాహిక బంధం నుంచి వేరు పడుతుంటారు. మరొకరిని వివాహం చేసుకుంటారు. అవివాహితులు వైవాహిక జీవితంలోకి ప్రవేశించొచ్చు. లేదా నామినీగా పేర్కొన్న వ్యక్తి మరణించి ఉండొచ్చు. మరేదైనా కారణం ఉండొచ్చు. నామినీగా నమోదు చేసిన వ్యక్తి ఆచూకీ లేకుండా పోతే, అప్పుడు అసలు ఉద్దేశమే నెరవేరదు. అందుకే నామినేషన్‌ను ఏడాదికోసారి సమీక్షించి, సవరించుకోవాలి.

ఊహించని అనుభవం



2021లో మద్రాస్ హైకోర్టు ఓ సంచలనాత్మక తీర్పునిచ్చింది. తన భర్త మరణంతో జీవిత బీమా పాలసీ ప్రయోజనాలను క్లెయిమ్ చేసుకునే విషయమై ఒక మహిళకు తన మామతో విభేదాలు ఏర్పడ్డాయి. కోర్టును ఆశ్రయించగా, ఆమెకు వ్యతిరేకంగా తీర్పు వచ్చింది. కారణం ఆమె భర్త తీసుకున్న జీవిత బీమా పాలసీ ప్రీమియంలను తండ్రి (బాధితురాలి మామ) చెల్లించడమే. పైగా మరణించిన వ్యక్తి తన జీవిత బీమా పాలసీలో నామినీని నమోదు చేయలేదు. విల్లు కూడా రాయలేదు. ప్రీమియంలను పాలసీదారు సొంతంగా చెల్లించనప్పుడు, ఆ పాలసీ ప్రయోజనాలకు జీవిత భాగస్వామి వారసురాలని తేల్చడం కుదరదని కోర్టు స్పష్టం చేసింది. నామినీని నమోదు చేయకపోవడంతో, ప్రీమియం చెల్లించిన తండ్రికి ఆ పాలసీ ప్రయోజనాలపై అధికారాలు ఉంటాయని ఈ ఘటన స్పష్టం చేసింది.

సరైన నిర్ణయం



మనలో కొందరు తమ పిల్లల పేరిట జీవిత బీమా పాలసీలను తీసుకుని తొలుత వారే ప్రీమియం చెల్లిస్తుంటారు. కనుక పెళ్లయిన వ్యక్తులు వెంటనే జీవిత బీమా పాలసీల్లో తమ జీవిత భాగస్వామిని నామినీగా నమోదు చేయాలి. లేదంటే ఆశించిన ప్రయోజనం నెరవేరదు. అందుకే సరైన వ్యక్తిని నామినీగా నమోదు చేసుకోవాలి. లేదంటే విల్లు రాసి రిజిస్టర్ చేసుకోవాలి. ముఖ్యంగా జీవిత బీమా పాలసీల ఉద్దేశం నెరవేరాలంటే అందుకు నామినేషన్ మెరుగైన మార్గం. చాలా కేసుల్లో వ్యక్తి మరణంతో జీవిత భాగస్వామిపైనే ఆర్థిక బాధ్యతల భారం పడుతుంది. కనుక జీవిత భాగస్వామినే నామినీగా నమోదు చేసుకోవాలి. కుటుంబం కోసం ఒక పాలసీ, ఒంటరి తల్లి లేదా తండ్రి లేదా తనపై ఆధారపడిన తల్లిదండ్రుల కోసం విడిగా మరో పాలసీ తీసుకునే వారు.. ఆయా పాలసీల్లో తప్పనిసరిగా నామినీని పేర్కొనాలి.

నామినేషన్ గడువు



మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులు కలిగిన వారు, ట్రేడింగ్, డీమ్యాట్ ఖాతా కలిగిన వారు తప్పనిసరిగా నామినీ విషయంలో ఆప్షన్ ఇవ్వాలని సెబీ ఆదేశాలు తీసుకొచ్చింది. 2023 మార్చి 31 వరకే ఉన్న గడువును, సెప్టెంబర్ 30 వరకు పొడిగించింది. కనుక ఇన్వెస్టర్లు వచ్చే సెప్టెంబర్ 30 నాటికి నామినేషన్ ఇవ్వాలి. నామినేషన్ ఇవ్వడం ఇష్టం లేకపోతే 'ఆప్ట్ అవుట్ ఆఫ్ నామినేషన్'ను ఎంపిక చేసుకోవాలన్నది నిబంధన. అంటే నామినేషన్ నుంచి వైదొలగడం. కానీ, సెబీ ఆదేశాల ఉద్దేశం అది కాదు. నామినేషన్ విలువ తెలియజేసి, ప్రతి ఒక్కరూ నమోదు చేసుకునేలా చేయడమే. ఇక జీవిత బీమా ప్లాన్లు, బ్యాంకు ఖాతాలకు సంబంధించి నామినేషన్ నమోదు తప్పనిసరి కాదు. అయినా కానీ, నామినేషన్ ఇవ్వడం తన బాధ్యతగా ఇన్వెస్టర్ గుర్తించాలి.

ఆభరణాల మార్కెట్లో సంఘటిత రంగం పట్టు!

- 2023–24 ఆదాయంలో 15% వృద్ధి
- రేటింగ్ ఏజెన్సీ ఇక్రా అంచనా



ముంబై: ఆభరణాల మార్కెట్లో సంఘటిత రంగం వాటా ఆదాయం ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 12–15 శాతం మేర పెరగొచ్చని పరిశ్రమ అంచనా వేస్తోంది. పెద్ద సంస్థలన్నీ విస్తరణ ప్రణాళికలతో ముందుకు వెళుతున్న విషయాన్ని రేటింగ్ ఏజెన్సీ ఇక్రా గుర్తు చేసింది. దీంతో స్థూల ఆర్థిక సవాళ్లతో కూడిన వాతావరణంలోనూ సంఘటిత రంగం వాటా పెంచుకోగలదని ఇక్రా అంచనా వేస్తోంది. ఆభరణాల మార్కెట్ 2023–24లో విలువ పరంగా 8–10 శాతం వృద్ధిని నమోదు చేయవచ్చని తెలిపింది. బంగారం ధరల్లో అస్థిరతల నేపథ్యంలో పరిమాణాత్మకంగా మార్కెట్‌లో పెద్ద వృద్ధి నమోదు కాకపోవచ్చన్న అంచనాతో ఉంది. కాకపోతే బంగారానికి ఉన్న బలమైన సాంస్కృతిక అనుబంధం నేపథ్యంలో పండుగలు, వివాహాల సందర్భంగా బంగారం ఆభరణాలకు డిమాండ్ మద్దతుగా నిలుస్తుందని వివరించింది. ''చాలా మంది జ్యుయలరీ రిటైలర్లు 2023 అక్షయ తృతీయ సందర్భంగా ఆదాయంలో 15 శాతానికి పైగా వృద్ధిని చూసినట్టు పేర్కొన్నారు. బంగారం ధరలు పెరగడం, ఎక్కువ సంస్థలు దూకుడుగా రిటైల్ స్టోర్లను పెంచడం ఆదాయ వృద్ధికి మద్దతునిస్తుంది''అని ఇక్రా వైస్ ప్రెసిడెంట్ కౌశిక్ దాస్ పేర్కొన్నారు. జ్యుయలర్ల ఆపరేటింగ్ మార్జిన్ సౌకర్య స్థాయిలో 7.5–8 శాతం మేర వచ్చే రెండేళ్లు ఉంటుందని ఇక్రా అంచనా వేసింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)	
29-5-2023	
విశాఖ	500–00
చిత్తూరు	533–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	495–00
విజయవాడ	495–00
రిటైల్ ధర (డజను)	72.00
28-5-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	465–00
వరంగల్	467–00
రిటైల్ ధర	5.25

స్టాక్స్ వ్యూ

టాటా పవర్
ఆనంద్ రాఠీ రీసెర్చ్ — కొనొచ్చు


ప్రస్తుత ధర: రూ. 212
టార్గెట్: రూ. 256



ఎందుకంటే: గతేడాది(2022–23) చివరి త్రైమాసికం(జనవరి–మార్చి)లో టాటా పవర్ కన్సాలిడేటెడ్ నికర లాభం 48 శాతం జంప్‌చేసి రూ. 939 కోట్లను తాకింది. కంపెనీకి చెందిన అన్ని విభాగాలూ వృద్ధి చూపడం ఇందుకు దోహదపడింది. నిర్వహణ లాభం(ఇబిటా) 38 శాతం ఎగసి రూ. 3,101 కోట్లకు చేరింది. ముంద్రా ప్లాంటులో తక్కువ అండర్‌రికవరీ, సోలార్ ఈపీసీ ప్రాజెక్టుల ఎగ్జిక్యూషన్ వంటి అంశాలు ఇందుకు కారణమయ్యాయి. మొత్తం ఆదాయం 4 శాతం మెరుగుపడి రూ. 12,454 కోట్లయ్యింది. ఇందుకు వివిధ పంపిణీ సంస్థల అమ్మకాలు, పునరుత్పాదక విభాగంలో సామర్థ్య విస్తరణ సహకరించాయి. ప్రధానంగా రూఫ్‌టాప్ విభాగం బిజినెస్ పటిష్ట వృద్ధిని సాధించింది. క్యూ4లో 300 మెగావాట్ల అదనపు సామర్థ్యాన్ని జత కలుపుకుంది. రూఫ్‌టాప్ విభాగం ఆర్డర్‌బుక్ అత్యంత పటిష్టంగా రూ. 1,900 కోట్ల విలువైన 468 మెగావాట్లకు చేరింది. ఈ బాటలో సోలార్ రూఫ్‌టాప్ బిజినెస్ సైతం 1,600 మెగావాట్లకుపైగా విస్తరించింది. గ్రీన్ మొబిలిటీ విభాగంలో కోయంబత్తూర్ మున్సిపల్ కార్పొరేషన్‌తోపాటు, గెయిల్‌తో సైతం ఇటీవలే ఒప్పందాలు కుదుర్చుకుంది. క్యూ4లో నికర రుణ భారాన్ని రూ. 2,800 కోట్లమేర తగ్గించుకుంది. వెరసి మొత్తం రుణ భారం రూ. 35,328 కోట్లకు పరిమితమైంది. ఆకర్షణీయ ఆర్థిక పనితీరు, వ్యూహాత్మక భాగస్వామి నుంచి ఈక్విటీ పెట్టుబడులు తదితర అంశాలు రుణ భార తగ్గింపునకు దారిచూపాయి. ఆయా అంశాలు కంపెనీకి ప్రయోజనం చేకూరుస్తాయి.

మ్యాట్రిమోనీ.కామ్
ఐసీఐసీఐ సెక్యూరిటీస్ — కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 586
టార్గెట్: రూ. 700



ఎందుకంటే: గతేడాది(2022–23) చివరి త్రైమాసికం(జనవరి–మార్చి)లో మ్యాట్రిమోనీ.కామ్ ఆదాయం త్రైమాసిక ప్రాతిపదికన పురోభివృద్ధి సాధించింది. వెరసి రెండు వరుస త్రైమాసికాల తదుపరి తిరిగి జనవరి–మార్చి(క్యూ4)లో టర్నోవర్‌లో వృద్ధిని సాధించింది. మ్యాచ్‌మేకింగ్ బిల్లింగ్స్‌లో దాదాపు 9 శాతం వృద్ధిని అందుకుంది. వార్షికంగా అయితే మరింత అధికంగా 77 శాతం పురోగతిని సాధించింది. వార్షిక ప్రాతిపదికన పెయిడ్ సబ్‌స్క్రైబర్స్ 12 శాతం పెరిగారు. ఇది సెంటిమెంటును మెరుగుపరచనుంది. తద్వారా ప్రస్తుత ఏడాది(2023–24)లో ఆదాయ వృద్ధికి మార్గాన్ని చూపనుంది. కంపెనీ యాజమాన్యం సైతం ఇదే అంశంపై ఆశావహంగా స్పందిస్తోంది. యాజమాన్యం ఈ ఏడాది ఆదాయంలో 10 శాతం వృద్ధిని అంచనా వేస్తోంది. నిర్వహణ(ఇబిటా) మార్జిన్లు 3 శాతంమేర బలపడవచ్చని అభిప్రాయపడింది. ఫలితాల సాధనపై ఆశావహ అంచనాలు, షేరు ప్రస్తుత ధర కంపెనీపట్ల ఆకర్షణకు కారణమవుతున్నాయి. ప్రధానంగా మధ్యకాలానికి మ్యాచ్‌మేకింగ్ క్లాసిఫైడ్స్ విభాగంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించే అవకాశముంది. పెళ్లిళ్ల సంబంధ సర్వీసులలోకి ప్రవేశించడం కంపెనీకి మరింత బలాన్నివ్వనుంది. ప్రస్తుత త్రైమాసికంలో పటిష్ట బిల్లింగ్స్‌ను సాధించడం ద్వారా కంపెనీ రానున్న రెండేళ్లలో రెండంకెల వృద్ధిని అందుకునే అంచనాలకు దారిచూపుతోంది. కొత్తగా ప్రవేశించిన పెళ్లిళ్ల సర్వీసుల విభాగం ఆశించిన స్థాయిలో ఊపందుకోకపోవడం, యాక్టివ్ ప్రొఫైల్స్.. పెయిడ్ సబ్‌స్క్రిప్షన్లకు మార్పు చెందడంలో మందగమనం వంటి అంశాలు కీలక రిస్కులుగా పరిగణించవచ్చు.

గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు, సూచనలు, వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

అందరికీ బీమా కోసం మూడంచెల విధానం

ఐఆర్‌డీఏఐ చైర్మన్ దేవాశిష్ పాండా



న్యూఢిల్లీ: దేశంలో 2047 నాటికి బీమాను అందరికీ చేరువ చేసేందుకు.. లభ్యత, పొందడం, అందుబాటు అనే మూడంచెల విధానాన్ని అనుసరిస్తున్నట్టు బీమా రంగ నియంత్రణ సంస్థ (ఐఆర్‌డీఏఐ) చైర్మన్ దేవాశిష్ పాండా తెలిపారు. 2047 నాటికి స్వాతంత్ర్యం సిద్ధించి నూరేళ్లు అవుతున్నందున అప్పటికీ, బీమాను అందరికీ చేరువ చేయాలని ఐఆర్‌డీఏఐ లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకు సంబంధించి గడిచిన ఏడాది కాలంలో పలు చర్యలు కూడా తీసుకుంది. సీఐఐ నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా పాండా ఈ అంశంపై మాట్లాడారు. ''బీమా రంగంలో యూపీఐ తరహా విప్లవాన్ని తీసుకొచ్చేందుకు లైఫ్ ఇన్సూరెన్స్, జనరల్ ఇన్సూరెన్స్ కౌన్సిళ్లతో కలసి పనిచేస్తున్నాం. ఇందుకు సంబంధించి ఓ ఊహాత్మక కార్యాచరణ గురించి ఆలోచించాం''అని పాండా తెలిపారు. దేశంలో బీమా వ్యాప్తి తక్కువగా ఉండడం, పెద్ద మార్కెట్ కావడంతో ఈ రంగంలో పెట్టుబడులకు అపార అవకాశాలున్నట్టు చెప్పారు.

వృద్ధులకు మెరుగైన పెట్టుబడి సాధనం?

వేర్వేరు మ్యూచువల్ ఫండ్స్‌కు విడిగా కేవైసీ ఇవ్వకుండా, ఏదైనా కేంద్రీకృత ప్లాట్‌ఫామ్ ఉందా?
– సమీర్ పటేల్

కేవైసీ (కస్టమర్ గురించి తెలుసుకోవడం) అనేది ఇన్వెస్టర్ల గుర్తింపు, చిరునామాకు సంబంధించినది. నల్లధన నిరోధక చట్టం కింద ఇన్వెస్టర్ విధిగా కేవైసీ వివరాలు ఇవ్వాల్సిందే. ప్రస్తుతం కేంద్రీకృత కేవైసీ (సీకేవైసీ) ప్లాట్‌ఫామ్ ఒకటి పనిచేస్తోంది. ఇది కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చినది. ఇన్వెస్టర్ తన కేవైసీ ప్రక్రియను ఒక్కసారి పూర్తి చేస్తే చాలు. ఇన్వెస్టర్ కొత్త మ్యూచువల్ ఫండ్ పథకంలో ఇన్వెస్ట్ చేయాల్సిన ప్రతి సందర్భంలోనూ కేవేసీ సమర్పించాల్సిన అవసరం ఉండదు. అలాగే, ఇన్వెస్టర్లు పాన్, చిరునామా ధ్రువీకరణ పత్రాలను మ్యూచువల్ ఫండ్ డిస్ట్రిబ్యూటర్ లేదా సెబీ వద్ద నమోదైన క్యాపిటల్ మార్కెట్ మధ్యవర్తి (స్టాక్ బ్రోకర్, డీపీ)కి సమర్పించొచ్చు. ఆ సమాచారం కేవైసీ రిజిస్ట్రేషన్ ఏజెన్సీల ద్వారా కేంద్రీకృత వ్యవస్థలో నమోదు అవుతుంది.

Q & A



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

నా వయసు 62 ఏళ్లు. నేను ఏక మొత్తంలో పెట్టుబడి పెట్టాలని అనుకుంటున్నాను. నా మాదిరి వృద్ధులు ఒకే విడత ఇన్వెస్ట్ చేసుకునేందుకు డెట్ ఫండ్ లేదా ఈక్విటీ ఫండ్ ఏది అనుకూలం? – శర్వానంద్ శివమ్

వృద్ధులు కేవలం డెట్‌లోనే ఇన్వెస్ట్ చేయాలని అనుకుంటే అది పొరపాటు అవుతుంది. ముందు కొంత సమయం తీసుకుని పెట్టుబడిపై మరింత స్పష్టతను తెచ్చుకోవాల్సి ఉంటుంది. మీ పెట్టుబడి ఉద్దేశాలు, పెట్టుబడి కాలం ఎంతన్నది తేల్చుకోవాలి. మీకు దీర్ఘకాల లక్ష్యం ఉందా? లేక ఐదేళ్ల అంతకంటే ఎక్కువ కాలం తర్వాతే పెట్టుబడి అవసరం ఉందా? వీటికి అవును అనేది సమాధానం అయితే అందుకు ఈక్విటీ మ్యూచువల్ ఫండ్ సరైన ఎంపిక అవుతుంది. సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్/క్రమానుగత పెట్టుబడి) లేదా లంప్సమ్ (ఒకే విడత) పెట్టుబడిలో ఏది మంచిది? అని అడిగితే.. మేము అయితే సిప్‌కు అనుకూలం. ఎందుకంటే ఇది కొనుగోలు ధరను సగటుగా మారుస్తుంది. మార్కెట్లు పడిపోయినప్పుడు తక్కువ ధరల్లోనూ సిప్ ద్వారా కొనుగోలు చేస్తారు. అలాగే, మార్కెట్లు గరిష్టాల్లో ఉన్నప్పుడు కూడా క్రమశిక్షణతో పెట్టుబడులు కొనసాగుతాయి. డెట్ ఫండ్స్ అన్నవి స్థిరంగా ఉంటాయి. పెట్టుబడికి రక్షణ ఉద్దేశంతో కొనసాగుతాయి. మీ పెట్టుబడి ఉద్దేశాలకు అనుకూలం అనుకుంటే డెట్ ఫండ్స్‌లో ఒకే విడత ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. ఈక్విటీ పథకాలు స్వల్పకాలంలో తీవ్ర అస్థిరతలతో ఉంటాయి. కనుక ఈక్విటీ పథకాల్లో ఒకే విడత పెద్ద మొత్తంలో ఇన్వెస్ట్ చేసుకోవాలని అనుకుంటుంటే, అప్పుడు ఆ మొత్తాన్ని డెట్ ఫండ్‌లో ఇన్వెస్ట్ చేసుకోండి. అక్కడి నుంచి సిస్టమ్యాటిక్ విత్ డ్రాయల్ ప్లాన్ ద్వారా ఈక్విటీ పథకాల్లోకి నిర్ణీత కాలంలోపు పెట్టుబడులను బదిలీ చేసుకోండి.



నా సోదరుడు ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసి ఉన్నాడు. దురదృష్టంకొద్దీ అతడు ఇటీవలే మరణించాడు. నామినీగా మా వదిన ఉండడంతో, ఆమె పేరు మీదకు ఫండ్ యూనిట్లు బదిలీ అయ్యాయి. ఇప్పుడు మా ఒదిన వాటిని విక్రయించాల్సి ఉంటుందా? –వరుణ్

యూనిట్ హోల్డర్ మరణిస్తే, వారి పేరుమీద ఉన్న యూనిట్లను నామినీ క్లెయిమ్ చేసుకోవాలి. అప్పుడు ఆ యూనిట్లు నామినీకి బదిలీ అవుతాయి. సాధారణంగా బ్యాంకు డిపాజిట్లు, బీమా ప్లాన్లలో ఆ మొత్తం నామినీ బ్యాంకు ఖాతాకు జమ అవుతుంది. కానీ, మ్యూచువల్ ఫండ్స్‌లో అలా కాకుండా యూనిట్లను నామినీకి బదిలీ చేస్తారు. ఒకసారి ఇలా బదిలీ అయిన యూనిట్లకు నామినీయే యజమాని అవుతారు. కనుక వారు కోరుకున్నంత కాలం ఆ యూనిట్లను కొనసాగించుకోవచ్చు. విక్రయించడం తప్పనిసరి కాదు.

క్లుప్తంగా...



ఆదివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న అనంతరం ఆలయం వెలుపల తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రావణ్ కుమార్, ఆయన కుటుంబ సభ్యులు

వేడుకగా ప్రత్యేక సహస్రకలశాభిషేకం

తిరుమల: శ్రీవారి పంచ బేరాలలో ఒకటైన శ్రీ భోగ శ్రీనివాసమూర్తిని శ్రీవారి ఆలయంలో పల్లవరాణి సామవై ప్రతిష్ఠించిన రోజును పురస్కరించుకుని ఆలయంలో ఆదివారం ప్రత్యేక సహస్రకలశాభిషేకాన్ని నిర్వహించారు. ఔటర్ రింగ్ రోడ్డు, కృష్ణ తేజ గెస్ట్ హౌస్ వరకు క్యూలైన్లు చేరాయి. శనివారం శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.53 కోట్లు వచ్చినట్లు టీటీడీ తెలిపింది.

కలకలం రేపిన ‘విమాన’ డ్రోన్

నల్లగొండ జిల్లా పంటపొలాల్లో పడిన డ్రోన్



శాలిగౌరారం: నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలంలోని ఆకారం గ్రామంలోని పంటపొలాల్లో ఆదివారం విమానం ఆకారంలో ఉన్న డ్రోన్ పడిపోయింది. అదే సమయంలో ఆప్రాంతంలో మేకలు మేపుతున్న ఓ మేకల కాపరి కొంత భయాందోళనకు గురయ్యాడు. కాసేపటి తర్వాత దగ్గరకు వెళ్లి చూసి ఆ విషయాన్ని తన కుమారుడికి ఫోన్‌చేసి చెప్పాడు. దీంతో ఘటనా స్థలానికి వచ్చిన కొంతమంది యువకులు డయల్ 100కు ఫోన్ చేసి విషయం చెప్పగా, ఎస్ఐ సతీష్ అక్కడికి వచ్చి డ్రోన్‌ను పరిశీలించారు. ఈ డ్రోన్‌లో ఎయిర్‌టెల్ సిమ్, సీసీ కెమెరాలు, జీపీఎస్, బ్యాటరీ ఉన్నట్లు గుర్తించారు. 76 నంబర్‌తో ఉన్న ఈ డ్రోన్ రెక్కలపై ఎఫ్ఎల్216020220415099 నంబర్ ఉన్నట్లు ఎస్ఐ చెప్పారు. ఐదడుగుల పొడవు, ఐదడుగుల వెడల్పుతో ఉన్న ఈ డ్రోన్ 15 కిలోల బరువు ఉందన్నారు. పంటపొలాల్లో పడిపోయిన ఈ డ్రోన్‌పై అనేక అనుమానాలు ఉన్నాయని, ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. తర్వాత బాంబ్ స్క్వాడ్ ఘటనాస్థలానికి చేరుకొని క్షుణ్ణంగా పరిశీలించింది. ఇందులో ఎలాంటి బాంబుల ఆనవాళ్లు లేవని నిర్ధారించింది. డ్రోన్‌లోని సిమ్‌కార్డును తీసి కనెక్ట్ చేసేందుకు యత్నించగా, సిమ్‌కార్డు కనెక్ట్‌కాలేదు. అనంతరం డ్రోన్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

అనాలోచితంగా డౌన్‌లోడ్ చేస్తే ఇబ్బందులే..

ఆకర్షణీయంగా తయారు చేస్తున్న సైబర్ నేరగాళ్లు

ఓటీపీలు సైతం తస్కరించేందుకు అవకాశం

అందినకాడికి దండుకుంటున్న సైబర్ క్రిమినల్స్



మోసాల్లో ‘రాట్’ దేలుతున్నారు!

సాక్షి, హైదరాబాద్

ఆకర్షణీయ సౌకర్యాలు, ముఖ్యమైన అంశాలకు సంబంధించినవి అంటూ అనేక యాప్స్‌కు సంబంధించిన యాడ్స్ ఇంటర్‌నెట్, సోషల్‌మీడియాల్లో రాజ్యమేలుతున్నాయి. వీటితో అవసరం ఉన్నా లేకపోయినా ఉచితం కదా అని అనేక మంది తమ స్మార్ట్‌ఫోన్స్‌లో డౌన్‌లోడ్ చేసుకుంటున్నారు. దీన్నే ఆసరాగా చేసుకుని సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారని సైబర్ క్రైమ్ పోలీసులు చెబుతున్నారు. ప్రస్తుతం ఈ–నేరగాళ్లు ప్రయోగిస్తున్న ఆయుధం ‘రాట్’గా పిలిచే రిమోట్ యాక్సెస్ ట్రోజన్. యాప్స్ మాటున నేరగాళ్లు ఈ ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను చొప్పించడం ద్వారా డౌన్‌లోడ్ చేసుకున్న వారి సెల్‌ఫోన్‌ను తమ అధీనంలోకి తీసుకుని చేయాల్సిన నష్టం చేసేస్తున్నారు.

అడుగడుగునా యాప్స్ వినియోగమే...

➤ స్మార్ట్‌ఫోన్ల వినియోగం ఎంతగా పెరిగిందో... వివిధ రకాలైన యాప్స్ వాడకం అంతకంటే ఎక్కువైంది. నిద్ర లేవడం నుంచి ఆహారం తీసుకోవడం, ఉష్ణోగ్రతలు తెలుసుకోవడం, వినోదం ఇలా... ఒక్కో ఫోన్‌లో కనీసం 10–15 యాప్స్ ఉంటున్నాయి. వినియోగదారుడి ‘యాప్ మేనియా’ను క్యాష్ చేసుకునేందుకు సైబర్ క్రిమినల్స్ కొత్త ఎత్తులు వేస్తున్నారు. వీరు తొలుత దేశవ్యాప్తంగా ఉన్న మొబైల్ నంబర్ల డేటాను వివిధ మార్గాల్లో సేకరిస్తున్నారు. ఇలా నంబర్లు తమ చేతికొచ్చాక అసలు కథ మొదలవుతుంది.

సందేశాలతో ప్రారంభమయ్యే ప్రక్రియతో..

➤ తాము ఉచితంగా ఇస్తున్న ఫలానా యాప్‌లో ఇన్ని ఆకర్షణలు ఉన్నాయంటూ ఎస్సెమ్మెస్, వాట్సాప్ లేదా సోషల్‌మీడియాల్లో యాడ్స్ పంపిస్తారు. ఈ ‘ప్రకటన’ను చూసి ఆకర్షితులైన వారు అందులో ఉన్న లింక్‌ను క్లిక్ చేస్తే సదరు యాప్ డౌన్‌లోడ్ అవుతుంది. వినియోగదారుడికి తెలియకుండా, అతడి ప్రమేయం లేకుండా దీంతోపాటే సదరు క్రిమినల్ పంపిచే ట్రోజన్ కూడా అదే మొబైల్ ఫోన్‌లోకి దిగుమతి అయిపోతుంది. అలా జరిగిన మరుక్షణం నుంచి ఫోన్ మన దగ్గర ఉన్నప్పటికీ.. అది సైబర్ క్రిమినల్ ఆధీనంలోకి వెళ్లిపోతుంది. దూరంగా ఉన్న ఓ వ్యక్తి అక్కడ నుంచి మన దగ్గరున్న సెల్‌ఫోన్‌ను యాక్సెస్ చేస్తూ అవసరమైన విధంగా వాడగలుగుతాడు. అందుకే ఈ వైరస్‌ను రిమోట్ యాక్సెస్ ట్రోజన్ (రాట్) అంటారు.

నేరగాడి ఆధీనంలోకి వెళ్తే ఖాతా ఖాళీ

➤ మన ఫోన్ సైబర్ నేరగాడి ఆధీనంలోకి వెళ్లిపోయాక మనం ఫోన్‌లో చేసే ప్రతి చర్యనూ అతడు పర్యవేక్షించగలడు. కాల్స్, ఎస్సెమ్మెస్‌లతోపాటు సెల్‌ఫోన్‌లో ఉన్న సమాచారం, దాని కెమెరాలను సైతం సైబర్ నేరగాడు తన ఆధీనంలోకి తీసుకోగలడు. ఇటీవల సినిమా టికెట్లు మొదలుకుని కొన్ని రకాలైన బిల్లుల చెల్లింపు వరకు అన్నీ అత్యధిక శాతం సెల్‌ఫోన్ ద్వారా జరుగుతోంది. వీటి కోసం కోసం మొబైల్ వినియోగదారులు నెట్ బ్యాంకింగ్ వాడటం లేదా తమ డెబిట్/క్రెడిట్ కార్డు వివరాలను నమోదు చేస్తుంటారు. దీంతోపాటు లావాదేవీలకు సంబంధించి బ్యాంకు పంపే వన్ టైమ్ పాస్‌వర్డ్స్ సైతం సెల్‌ఫోన్‌కే వస్తుంటాయి. ఎవరైనా క్రెడిట్/డెబిట్ కార్డు వివరాలు, నెట్‌బ్యాంకింగ్ యూజర్ ఐడీ, పాస్‌వర్డ్స్‌లను వినియోగదారుడికి తెలియకుండా తీసుకున్నా... ఓటీపీ నమోదు చేయనిదే లావాదేవీ పూర్తికాదు.

వినియోగదారుడి ప్రమేయం లేకుండానే..

➤ ఈ ఓటీపీని సంగ్రహించడానికీ సైబర్ నేరగాళ్లు ముందు పంపే యాప్‌లోని రాట్ ద్వారానే ఏర్పాట్లు చేసుకుంటున్నారు. బ్యాంకుల నుంచి వచ్చే ఓటీపీలను ఈ యాప్ నుంచే సంగ్రహిస్తున్నారు. కార్డుల వివరాలు అప్పటికే సిద్ధంగా ఉంటాయి కాబట్టి ఓటీపీ నమోదుచేసి అందినకాడికి స్వాహా చేస్తున్నారు. ఓటీపీ అవసరమైన లావాదేవీలను సైబర్ క్రిమినల్స్ అర్ధరాత్రి దాటిన తర్వాత చేస్తున్నట్లు పోలీసులు చెబుతున్నారు. ఆ సమయంలో వినియోగదారులు నిద్రలో ఉంటారని, అతడి ప్రమేయం లేకుండానే వచ్చిన ఓటీపీని గుర్తించరని అంటున్నారు. ఉదయం లేచి జరిగింది తెలుసుకునే సరికే జరగాల్సిన నష్టం జరిగిపోతోంది. ఇలాంటి ఘటనలు ఇటీవలి కాలంలో పెరిగిపోతున్నట్లు పోలీసులు చెబుతున్నారు. సైబర్ నేరగాళ్లు ఎక్కువగా బోగస్ వివరాలతో తెరిచిన ఖాతాలనో, బోగస్ చిరునామాలను పెట్టడమో చేస్తుంటారని వివరిస్తున్నారు. దీనివల్ల జరిగిన నష్టంపై ఫిర్యాదులు వచ్చినా నేరగాళ్లను పట్టుకోవడం సాధ్యం కాదంటున్నారు. సరైన గుర్తింపులేని సంస్థలు/వ్యక్తులు రూపొందించే యాప్స్‌కు దూరంగా ఉండటం ఉత్తమమని నిపుణులు సూచిస్తున్నారు.



రూ.2 వేల నోట్ల మార్పిడి పేరిట మోసాలు..

అప్రమత్తంగా ఉండాలని పోలీస్‌శాఖ హెచ్చరిక

సాక్షి, హైదరాబాద్: రూ.2వేల నోట్లను మార్పిడి చేసి ఇస్తామని కొందరు మోసాలకు పాల్పడుతున్నట్టు పోలీసులు హెచ్చరిస్తున్నారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) రూ.2వేల నోట్లను ఉపసంహరించడం తెలిసిందే. రూ.2వేల నోట్లను బ్యాంకులలో జమ చేసి ఇతర కరెన్సీ నోట్లు పొందాలని ఇప్పటికే సూచించింది. దీంతో కొన్ని రోజులుగా రూ.2వేల నోట్ల మార్పిడి పెరిగింది. ఇదే అదనుగా రూ.2వేల నోట్లను కమీషన్లకు మార్చి ఇస్తామని మోసగిస్తున్న వారి వలలో పడవద్దని తెలంగాణ పోలీస్ శాఖకు చెందిన తెలంగాణ స్టేట్ సైబర్ సెక్యూరిటీ బ్యూరో హెచ్చరించింది. ప్రజల్లో ఈ తరహా మోసాలపై అవగాహన పెంచేందుకు ట్విట్టర్ ద్వారా పోలీస్ అధికారులు ప్రచారం చేస్తున్నారు. రూ.2వేల నోట్ల మార్పిడి పేరిట మోసగించే వారిపై అప్రమత్తంగా ఉండాలని, అనుమానం ఉంటే వెంటనే 1930 హెల్ప్‌లైన్ నంబర్‌కు సమాచారం ఇవ్వాలని వారు సూచిస్తున్నారు. నోట్ల మార్పిడికి బ్యాంకులకే వెళ్లాలని, కొత్త వారిని నమ్మి మోసపోవద్దని వారు సూచించారు.

గిన్నిస్‌లోకి భాగ్య‘నగ’లు!

హైదరాబాద్ జ్యువెలరీ సంస్థ రూపొందించిన ఆభరణాలకు 8 గిన్నిస్ రికార్డులు



గిన్నిస్‌కెక్కిన ఆభరణాలతో దిశా పటాని, నగల సంస్థ ప్రతినిధులు

సాక్షి, హైదరాబాద్: నగరానికి చెందిన ఓ ఆభరణాల సంస్థ రూపొందించిన ఆభరణాలకు ఏకంగా 8 గిన్నిస్ రికార్డులు లభించాయి. 11,472 వజ్రాలతో పొదిగిన, అత్యంత బరువైన (1,011.150 గ్రాములు) బంగారు గణేశ్ పెండెంట్, అత్యధికంగా 54,666 వజ్రాలతో పొదిగిన, అత్యంత బరువుగల (1,681.820 గ్రాములు) బంగారు రామ్‌దర్బార్ పెండెంట్, 315 పచ్చలు, 1,971 వజ్రాలతో పొదిగిన ద సెవన్ లేయర్ నెక్లెస్, 63.65 క్యారట్ల పచ్చలు, 29.70 క్యారట్ల వజ్రాలు ఉపయోగించి తయారు చేసిన అత్యంత ఖరీదైన (సుమారు రూ. 90 లక్షల) భూతద్దం గిన్నిస్‌లో చోటుదక్కించుకున్నాయి. ఆదివారం ఫలక్‌నుమా ప్యాలెస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శివ్‌నారాయణ్ జ్యుయలర్స్ ఎండీ తుషార్ అగర్వాల్ ఈ విషయాన్ని వెల్లడించారు. దేశంలో మరే ఆభరణాల సంస్థకు ఈ ఘనత లభించలేదన్నారు. హైదరాబాద్ నిజాం ఆభరణాల వైభవంలో కీలకపాత్ర పోషించిన తమ పూర్వీకుల వారసత్వాన్ని కొనసాగిస్తూ నగర ప్రతిష్ఠను ఇనుమడింపజేసినందుకు సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ బాలీవుడ్ నటి దిశాపటాని ఆయా ఆభరణాలను ధరించి ప్రదర్శించింది.

ప్రత్యేక రైళ్లకు భారీ డిమాండ్

పెరిగిన వేసవి రద్దీ

- డిమాండ్ మేరకు అందుబాటులో లేని రైళ్లు
- పర్యాటక కేంద్రాలు, ఆధ్యాత్మిక క్షేత్రాలకు ఎక్కువ మంది ప్రయాణం
- భారత్ గౌరవ్ రైళ్లలో వంద శాతం ఆక్యుపెన్సీ నమోదు



సాక్షి, హైదరాబాద్: రైళ్లలో వేసవి రద్దీ పెరిగింది. పర్యాటక ప్రాంతాలు, ఆధ్యాత్మిక క్షేత్రాలకు జనం పెద్ద సంఖ్యలో తరలి వెళ్తున్నారు. దీంతో హైదరాబాద్ నుంచి వివిధ మార్గాల్లో నడిచే రైళ్లకు భారీ డిమాండ్ ఏర్పడింది. పలు మార్గాల్లో ప్రత్యేక రైళ్లు ఏర్పాటు చేసినప్పటికీ అవి ప్రయాణికుల డిమాండ్‌ను భర్తీ చేయలేకపోతున్నాయి. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా జూన్ నెలాఖరు వరకు అందుబాటులో ఉండేవిధంగా వివిధ రూట్లలో ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేశారు. ఆ రైళ్లలోనూ వెయిటింగ్ లిస్టు వందల్లోకి చేరడం గమనార్హం. హైదరాబాద్ నుంచి కటక్, బికనేర్, రెక్సాల్, పట్నా తదితర ప్రాంతాలకు ప్రయాణికుల డిమాండ్ మేరకు అదనపు రైళ్లు అందుబాటులో లేకపోవడంతో జనం పడిగాపులు కాయాల్సి వస్తుంది. సాధారణంగా ప్రతి రోజు సుమారు 80 ఎక్స్‌ప్రెస్ రైళ్లు, మరో 100 వరకు ప్యాసింజర్ రైళ్లు సికింద్రాబాద్ నుంచి రాకపోకలు సాగిస్తాయి. ఈ స్టేషన్ నుంచి రోజుకు 1.85 లక్షల మంది ప్రయాణంచేస్తారు. మరో 60 వేల మంది వరకు కాచిగూడ, నాంపల్లి, లింగంపల్లి తదితర స్టేషన్‌ల నుంచి ప్రయాణిస్తారు. వేసవి సందర్భంగా గత నెల రోజులుగా ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరిగింది. ఈ నేపథ్యంలో ఈ స్టేషన్ల నుంచి సుమారు 3 లక్షల మంది రాకపోకలు సాగిస్తున్నట్లు అంచనా. సొంత ఊళ్లకు వెళ్లేవారికంటే ఆధ్యాత్మిక, పర్యాటక ప్రాంతాలకు వెళ్లే వారి సంఖ్యే ఎక్కువగా ఉందని సమాచారం. దీంతో తిరుపతి, విశాఖ, ముంబై, షిరిడీ, ఢిల్లీ, వారణాసి, జైపూర్, కోల్‌కతా, బెంగళూరు, చెన్నై తదితర నగరాలకు తాకిడి పెరిగింది.గతంలో ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా 50 నుంచి 70 ప్రత్యేక రైళ్లను నడిపితే ఇప్పుడు వాటి సంఖ్య సగానికిపైగా తగ్గడం గమనార్హం.

అన్ని సదుపాయాలతో భారత్ గౌరవ్ రైళ్లు

ఐఆర్‌సీటీసీ ఆధ్వర్యంలో నడుస్తున్న భారత్ గౌరవ్ పర్యాటక రైళ్లలో వందశాతం ఆక్యుపెన్సీ నమోదు కావడం గమనార్హం. ఈ వేసవి సీజన్‌లో సికింద్రాబాద్ నుంచి ఇప్పటి వరకు 8 రైళ్లు బయలుదేరాయి. తెలుగు రాష్ట్రాలకు చెందిన యాత్రికులు ఉత్తర, తూర్పు ప్రాంతాల్లోని ఆధ్యాత్మిక క్షేత్రాలను సందర్శించేందుకు ఈ రైళ్లలో వెళుతున్నారు. ‘పూరీ– కాశి– అయోధ్య’పేరుతో ఐఆర్‌సీటీసీ ఇటీవల భారత్ గౌరవ్ రైలును ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. ఈ రైలులో ప్రయాణించే వారికి ఐఆర్‌సీటీసీయే అన్ని రకాల సేవలను అందజేస్తోంది. ఈ పర్యటనలో రైలు ప్రయాణంతో పాటు రోడ్డు రవాణా, వసతి, భోజనం తదితర అన్ని ఏర్పాట్లు ఉంటాయి. రైలులో సీసీ కెమెరాలతో భద్రతను ఏర్పాటు చేశారు. ఈ ప్యాకేజీలో పూరీ జగన్నాథ ఆలయం, కోణార్క్ సూర్య దేవాలయం, గయా విష్ణు పాద ఆలయం, వారణాసి కాశీ విశ్వనాథ ఆలయం, కాశీ విశాలాక్షి, అన్నపూర్ణ దేవాలయం, అయోధ్య రామజన్మ భూమి, ప్రయాగ్ రాజ్ తదితర ప్రాంతాలను సందర్శించ వచ్చు.8 రాత్రులు, 9 పగళ్లు ఈ పర్యటన కొనసాగుతుంది. ఈ ట్రైన్‌లో ఏసీ, నాన్ ఏసీ కోచ్‌లు ఉన్నాయి. తెలుగు రాష్ట్రాల్లోని 9 ప్రధాన స్టేషన్‌లలో హాల్టింగ్ సదుపాయం ఉంది. ఇప్పటి వరకు నడిచిన 8 ట్రిప్పుల్లో రైలులోని మొత్తం 700 సీట్లు రిజర్వ్ కావడం విశేషం.

రక్షణరంగ ఎగుమతిదారుగా భారత్‌ను నిలపాలి

- అందుకు డీఆర్‌డీఓ తరఫున సహకారం అందిస్తాం
- డీఆర్‌డీఓ చైర్మన్ సమీర్ వి కామత్



సాక్షి, హైదరాబాద్: భారత దేశాన్ని రక్షణరంగ ఉత్పత్తుల ఎగుమతిదారుగా నిలపాలని, అందుకు డీఆర్‌డీఓ పూర్తి సహకారం అందిస్తుందని రక్షణశాఖ ఆర్‌అండ్‌డీ విభాగం కార్యదర్శి, డీఆర్‌డీఓ చైర్మన్ డా.సమీర్ వి కామత్ చెప్పారు. ఆదివారం హైదరాబాద్‌లోని రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఓ)లోని రీసెర్చ్ సెంటర్ ఇమారత్ (ఆర్‌సీఐ)లో మేథోమథన సదస్సు నిర్వహించారు. ఎంఎస్‌ఎంఈ (మినిస్ట్రీ ఆఫ్ మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్), స్టార్టప్‌లతో సహా అన్ని రక్షణ పరిశ్రమలను ఏకతాటిపైకి తెచ్చే ఉద్దేశంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో 180కి పైగా పరిశ్రమలు పాల్గొన్నాయి. సదస్సుకు అధ్యక్షత వహించిన కామత్ మాట్లాడుతూ, పరిశ్రమలకు డీఆర్‌డీఓ అన్ని విధాలా సహకారం అందిస్తుందని, దేశాన్ని నికర రక్షణ ఎగుమతిదారుగా మార్చేందుకు మార్గదర్శక పాత్రను పోషిస్తుందని హామీ ఇచ్చారు. భారత రక్షణ తయారీ రంగం పూర్తిస్థాయిలో స్వావలంబన సాధించేందుకు ఈ కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. రక్షణరంగ పరిశ్రమలకు మద్దతు ఇచ్చేందుకు డీఆర్‌డీఓ నిర్వహిస్తున్న కార్యక్రమాలు, విధానాలను డైరెక్టరేట్ ఆఫ్ ఇండస్ట్రీ ఇంటర్‌ఫేస్, టెక్నాలజీ మేనేజ్‌మెంట్ డైరెక్టర్ అరుణ్ చౌదరి తెలిపారు. అదేవిధంగా డీఆర్‌డీఓ మౌలిక సదుపాయాల పరీక్ష సదుపాయం, పేటెంట్ల వినియోగంపై వివరించారు. కార్యక్రమంలో మిస్సైల్స్, స్ట్రాటజిక్ సిస్టమ్స్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ నారాయణ మూర్తి, ప్రొడక్షన్ కోఆర్డినేషన్, సర్వీసెస్ ఇంటరాక్షన్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ చంద్రికా కౌశిక్, ఇతర శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.



Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G., Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.
Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.